శ్రీమతే రామానుజాయ నమః

శ్రీపరాశరభట్టర్ అనుగ్రహించిన

శ్రీరంగరాజస్తవము

పూర్వశతకము, ఉత్తరశతకము

(తాత్పర్యంతో, విశేషాలతో)

వ్యాఖ్యాత

పండితరత్న, ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

11వ ఉభయవేదాంత పండితసభల జ్ఞాపిక

జనవరి, 2016

సమర్పకులు

శ్రీమతి పి. అలుమేలు మంగ, శ్రీమాన్ పి. గోపాలకృష్ణమూర్తి దంపతులు

(హైదరాబాద్)

శ్రీరంగరాజస్తవం - శ్రీపరాశరభట్టర్

(పూర్వశతకం, ఉత్తరశతకము)

తాత్పర్యం,విశేషాలు- పండితరత్న- **ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామి**

ప్రతులు : **500**

ప్రకాశకులు : శ్రీమతి పి. అలుమేలు మంగ, శ్రీమాన్ పి.గోపాలకృష్ణమూర్తి

అన్నిహక్కులు : రచయితవే.

ఆవిష్కరణ
సందర్భము : **11వ ఉభయవేదాంత పండితసభలు**

వేదిక : అహోబిలమఠం, కాంచీపురం

ముఖచిత్రం : శ్రీరంగమంగళమణి శ్రీరంగనాథుడు, శ్రీపరాశరభట్టర్

ఈ గ్రంథం, హైదరాబాద్ వాస్తవ్యులు,
భగవద్భాగవతాచార్య కైంకర్యనిష్ములు శ్రీమాన్ పి.గోపాలకృష్ణ మూర్తి
గారు భక్తితో సమర్పించిన పవిత్ర ద్రవ్యంతో ముద్రింపబడింది.

ప్రతులకు : ఈ.ఏ. శింగరాచార్యులు,
18-3-58/7, శాంతినగర్, కె.టి.రోడ్
తిరుపతి-517 507, ఫోన్ : 9885003420

అక్షరయోజనము : శ్రీమతి జయలక్ష్మి మరియు
శ్రీచంద్రశేఖర్

ముద్రణ : సి.యన్. ప్రింటర్స్, తిరుపతి

విన్నపం

భగవద్రామానుజులు తమ శిష్యులలో 74 మందిని సింహాసనాధిపతులుగా చేసి విశిష్టాద్వైత సిద్ధాంతప్రచారం కోసం వారిని నియమించారు. వారంతా ఆసేతు హిమాచలం భారతావనిలో వ్యాపించి తరతరాలుగా సిద్ధాంతప్రచారాన్ని తమ కర్తవ్యంగా భావించి నిర్వహిస్తున్నారు. దీనితోపాటుగా గత శతాబ్దిలో పెంటపాడు (ప.గో.జిల్లా), కోరుకొండ (తూ.గో.జిల్లా), విజయనగరం, విశాఖపట్టణం, గుంటూరు, విజయవాడ, తెనాలి, చీరాల, బందరు, పాలకొల్లు, వరంగల్లు మొదలైన పలుచోట్ల పలువురు ధార్మికులు, ధార్మికసంస్థలు ముందుకువచ్చి సంప్రదాయ ప్రచారం కోసం ఉభయవేదాంత పండిత సభలను నిర్వహించారు. వీటిలో కొన్నిచోట్ల ఇపుడు సభలు జరుగకపోయినా, కోరుకొండ, విజయనగరం వంటి పలుచోట్ల ఇంకా కొనసాగడం హర్షణీయం. విజయవాడలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయరుస్వామివారు, కులపతులు శ్రీమాన్ గోపాలాచార్యస్వామివారు కలసి ప్రారంభించిన ఉభయవేదాంత పండిత సభలు సంప్రదాయ ప్రచారానికి ఎనలేని దీప్తిని కల్గించాయి, కల్గిస్తున్నాయి. ఈ సభలు ఈనాటికీ శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో కొనసాగుతున్నాయి.

ఇవి అన్నీ ఒకఎత్తు అయితే, హైదరాబాద్ వాస్తవ్యులు, భాగవత శేఖరులైన శ్రీమాన్ పి. గోపాలకృష్ణమూర్తిగారు గత పది సంవత్సరాలుగా చేసే సంప్రదాయ సేవ నిరుపమానమైనది. నిస్స్వార్థమైనది. వీరు 2008వ సం॥ నుండి ప్రతియేడు పలుచోట్ల ఉభయవేదాంత పండిత సభలను పెద్దల, విజ్ఞుల సహాయ సహకారాలతో, మంగళాశాసనాలతో వారు మెచ్చే రీతిలో నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయలను వెచ్చించి సత్‌గ్రంథాలను కొని వితరణ చేస్తున్నారు. ఎన్నో గ్రంథాలను ముద్రించడంలో ఆర్థికంగా తోడ్పడుతున్నారు. ఇప్పటికి పదిచోట్ల వీరు ఒంటిచేతితో ఎవ్వరి సహకారం తీసుకోకుండా విజయవంతంగా పండితసభలు నిర్వహించారు. వీరి ఈ సేవ సర్వదా సర్వథా శ్లాఘ్యమైనది.

ఈ ప్రయత్నంలో భాగంగా శ్రీమాన్ గోపాలకృష్ణమూర్తిగారు ఈ యేడు జనవరి 23వ తేది నుండి 25వ తేదీ వరకు పెరుమాళ్ కోయిల్ అనే పేరుతో సంప్రదాయంలో పిలువబడే కంచిలో 11వ ఉభయవేదాంత పండిత సభలను జరుపుతున్నారు. వీరు జరిపే ఈ పండితసభలలో ఒక సంప్రదాయగ్రంథం చిహ్నికగా ప్రచురింపబడడం విధిగా కాకపోయినా అలవాటుగా వస్తున్నది. ఆ రీతిలోనే ఇపుడు కంచిలో జరుగపోయే

సభల స్మారకంగా శ్రీపరాశరభట్టర్ అనుగ్రహించిన శ్రీరంగరాజస్తవం – పూర్వశతక, ఉత్తర శతకాలు తాత్పర్య, సంగ్రహ విశేషాలతో ముద్రింపబడుతున్నది.

భగవద్రామానుజులు తిరుమలలో వేంచేసియున్న సమయంలో వేదార్థ సంగ్రహాన్ని రచిస్తూ "అశేష చిదచిద్వస్తు శేషిణే శేషశాయినే" అని అంటూ శ్రీరంగ నాథుని స్మరించారు. అదేవిధంగా శ్రీరంగంలో శ్రీభాష్యరచన చేసేటప్పుడు "బ్రహ్మణి శ్రీనివాసే భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా హనాజీ" అని శ్రీనివాసుని స్మరించారు. తిరుమలలో ఉండగా శ్రీరంగనాథుని స్మరణ, శ్రీరంగంలో ఉండగా వేంకటేశ్వరుని స్మరణ – అనే ఇది అర్చారూపంలోని ధర్మైక్యభావన. ఇటువంటి భావనతోనే ఇపుడు వరదరాజస్వామి సన్నిధిలో పండితసభలు జరిగే ఈ సమయంలో శ్రీరంగనాథుని స్తుతి అయిన శ్రీరంగరాజస్తవం ముద్రింపబడి భక్తులకు సమర్పింబడుతున్నది.

అత్యంత స్వల్పకాలంలో సిద్ధంచేయబడి ముద్రింపబడిన ఈ గ్రంథంలో నా అనవధానత వల్ల, అజ్ఞానం వల్ల చోటుచేసుకున్న దోషాలను సహృదయ పాఠకులు క్షమించి ఈ గ్రంథాన్ని ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఈ గ్రంథ ముద్రణకు ఆర్థికంగా సహాయపడిన, మిత్రులు శ్రీమాన్ పి.గోపాలకృష్ణమూర్తిగారికి నా హార్దిక కృతజ్ఞతలను సమర్పించు కుంటున్నాను. వారి సంప్రదాయ కైంకర్యం నిరంతరం కొనసాగాలని మనసారా ఆశిస్తూ, ఆవిధంగా వారిని కటాక్షించవలసినదిగా అస్మత్ కులదైవం వేంకటాచల పతిని ప్రార్థిస్తున్నాను. స్వస్తి.

జయతు జయతు రంగీ వేదవేద్యో రమేశః
జయతు జయతు భవ్యం దర్శనం శ్రీయతీందోః ।
జయతు జయతు ధీమాన్ భట్టపాదో మహాత్మా
జయతు కృతిరియం శ్రీరంగరాజస్తవాఖ్యా ॥

యతివరమతప్రచారే కృతదృఢదీక్షో జయతు తరామ్ శ్రీమాన్ ।
గోపాలకృష్ణమూర్తిః సకుటుంబోయం కృతీ ధన్యః ॥

ఇట్లు నివేదించు భాగవతదాసుడు

ఈ.ఏ. శింగరాచార్యులు

తిరుపతి
21-1-2016

శ్రీపరాశరభట్టర్ జన్మాదికములు

భగవద్రామానుజుల శిష్యులలో అగ్రగణ్యులు, వారికి పవిత్రస్థానీయులు, ''నడచునట్టి పతంజలి''గా పేరుపొందిన కూరేశులకు శ్రీరంగనాథుని అనుగ్రహమువలన జన్మించిన కవలలు అగు పుత్రులు ఇరువురిలో శ్రీపరాశరభట్టర్ మొదటివారు. రెండవ కుమారులు వేదవ్యాసభట్టర్‌గా ప్రసిద్ధులగు శ్రీరామప్పిళ్ళై, వీరిద్దఱుకు ఈ పేర్లను శ్రీరామానుజులు అనుగ్రహించిరని, ఇట్లు ఆ పేర్లను వారికి పెట్టుట ద్వారా తమ ఆచార్యులగు యామునుల కోరికను తీర్చిరను ఐతిహ్యము చరిత్ర ప్రబంధములలో ప్రసిద్ధము. కూరేశులు కాంచీపురమునకు దగ్గరలోగల ''కూర''మను అగ్రహారమునకు అధిపతులు. అపారమైన తమ సంపదను అంతటిని తృణప్రాయముగా త్యజించి, రామానుజుల పాదములను ఆశ్రయించిరి. వారికి ఏమాత్రము తీసిపోని ఆత్మగుణసంపదను కల్గిన ''ఆణ్డాళ్'' అను సతీమణి వారి ధర్మపత్ని. కూరేశుల తండ్రిపేరు దామోదరులని, శ్రీరామమిశ్రులని, అనంతసూరి అని పలు విధములుగా గ్రంథములలో కనుపించుచున్నది. భట్టరు హరీత గోత్రులు, ఆపస్తంబసూత్రులు, తైత్తిరీయశాఖకు చెందినవారు. వీరిది వడమకులము.

శ్రీభట్టర్ జన్మించిన సంవత్సరము శుభకృత్ అని పలుచోట్ల కనుపించుచున్నది. విరోధికృత్ అని కొందఱు తలచుచున్నారు. శుభకృత్ నామ సంవత్సరమని తలచిన, ఆ సంవత్సరము క్రీ. శ. 1062వ సం॥ముతో కాని, 1122వ సం॥ము తో కాని సమానమగును. భగవద్రామానుజులు 1017 నుండి 1137 వరకు అనగా 120 సం॥లు జీవించిరని సంప్రదాయజ్ఞులతోపాటు పలువురు చరిత్రకారులును అంగీకరించుచున్నారు. శ్రీరామానుజులు పరమపదించు సమయమునకు భట్టరు వయస్సు యౌవనదశకు మించి యుండుటకు అవకాశము కన్పించుటలేదు. కావున భట్టరు జన్మించిన సంవత్సరము క్రీ.శ. 1122గా అంగీకరించుటయే తగినదని తోచుచున్నది. భట్టరు వృషభమాసము (వైశాఖమాసము) అనూరాధానక్షత్రమున జనించిరని పలువురు అభిప్రాయపడుచున్నారు. వీరి జీవితకాలమునుగూర్చి పండిత పరిశోధకులలో భిన్నాభిప్రాయములు కలవు. వెక్కు ఆధారములనుబట్టి ఈ ఆచార్యులు సుమారు 60 సం॥ల కాలము జీవించియుండిరని తోచుచున్నదని ఉ.వే. శ్రీమాన్ డా॥ M.A. వేంకటకృష్ణన్‌గారు, ఉ.వే.S.శ్రీమాన్ కృష్ణస్వామి అయ్యంగార్ మొదలగు పండితుల అభిప్రాయము.

బాల్యమునుండి భట్టర్ ప్రదర్శించిన మేధావిలాసము అనితరసాధారణము. చిన్నతనములోనే ప్రసిద్ధపండితుడగు సర్వజ్ఞభట్టును ఓడించుట, ''శిఱుమామనిశర్'' అను తిరువాయ్‌మొళి సూక్తినిగూర్చి కూరేశులను ప్రశ్నించుట, (ఈ విషయము పరివస్య రెండవ పేజీలో వివరింపబడినది.) శ్రీరామానుజుల ఆజ్ఞను అనుసరించి, మేల్‌నాట్టులోని మాధవసూరి అను పేరుకల (తరువాతి కాలము నఞ్జీయర్‌గా ప్రసిద్ధులు) వేదాంతిని పరాజితుని చేయుట, శ్రీరామానుజులు తమకు పిమ్మట దర్శననిర్వాహకులు భట్టరేనని తెలుపుట మొదలగు సందర్భములు ఈ ఆచార్యుల జ్ఞానాధిక్యమును, బుద్ధివైశద్యమును నిరూపించుచున్నవి.

శ్రీరంగనాథుడు, శ్రీరంగనాయకియు భట్టర్‌ను తమ పుత్రునిగా స్వీకరించిరని గురు పరంపరాప్రభావాది గ్రంథములలో కలదు. వీరికి కూరేశులు పెట్టినపేరు శ్రీరంగనాథుడు. ఈవిషయము భగవద్గుణదర్పణములోని మొదటి శ్లోకమువలన తెలియుచున్నది. వీరు తిరువరంగప్పెరుమాళ్ భట్టర్, పెరియభట్టర్, భట్టర్ మొదలగుపేర్లతో కూడ ప్రసిద్ధులు. శ్రీరంగేశపురోహితులు, వేదాంతాచార్యభట్టర్, పరవాదిమదహస్తిపంచాననులు, మొదలగు బిరుదములు వీరికి కలవు. వీరి భార్య మన్నియమ్మాళ్. కుమారులు ఉద్దండభట్టు. ఇష్టదైవము అழకియ శిఙ్గర్ (నృసింహమూర్తి). వీరికి రామావతారమున పక్షపాతము మెండు. భట్టరు ఆచార్యులు ఎమ్బార్, కూరేశులును. ఎమ్బార్ పంచసంస్కారములనొనర్చిరి. శ్రీరామానుజులు సాక్షాత్ ఆచార్యులు కాకున్నను, తమను వారి శిష్యులుగా భట్టరు తలచిరి. వీరిని ఆశ్రయించిన వారిలో నఞ్జీయర్, అమ్మణ్ణి ఆழ్వాన్, వీరశిఖామణి పల్లవరాయలు, నమ్బిగోవర్ధనదాసు మొదలగువారు.

శ్రీరంగరాజస్తవమును భట్టర్ రచించిన సందర్భము :-

ఆ కాలమున చోళదేశమును పాలించు వీరసుందరబ్రహ్మరాయుడు (అకలంక బ్రహ్మరాయుడు) కూరేశుల శిష్యుడు. శ్రీరంగములోని ప్రాకారమొకటి జీర్ణమగుటచే, తిరిగి నిర్మింపనెంచిన అందులకు అడ్డముగానున్న పిళ్లైప్పిళ్లై ఆழ్వాన్ అను ఆచార్యుల గృహమును తొలగింపనెంచెను. అట్లు చేయుట తగదని భట్టరు తెలిపినను, ఆచార్యుల పుత్రులను గౌరవమునుకూడ బ్రహ్మరాయుడు చూపక వారి మాటలను ధిక్కరించెను. అతడొనర్చిన అసహ్యమైన భాగవతాపచారమునకు క్లేశపడిన భట్టరు శ్రీరంగమున నివసింపలేక, తిరుక్కోట్టియూర్‌కు (గోష్ఠీపురమునకు) చేరిరి. కొంతకాలమైన పిదప బ్రహ్మరాయుడు మరణించెనని తెలిసి, తిరిగి శ్రీరంగమునకు వచ్చుచు, ఆ సమయమున తమకు కల్గిన అనుభవమును శ్రీరంగరాజస్తవరూపమున ప్రకటించిరట. ఈ వృత్తాంతమును శ్రీ. ప్ర. భ. అణ్ణంగరాచార్యస్వామి తమ వ్యాఖ్యానప్రారంభమున ''శ్రీగోష్ఠీనగరాత్ నివృత్తిసమయే సంతోషవైశద్యతః శ్రీభట్టార్యగురూత్తమో గుణనిధిః శ్రీరంగరాజస్తవమ్, దివ్యం యం రచయాంబభూవ'' అనుచు పేర్కొనిరి.

శ్రీరంగరాజస్తవము :-

పూర్వోత్తర శతకములుగా విభాగింపబడిన ఈ స్తోత్రము ద్వయమంత్రమునకు వివరణమని ఆచార్యుల తలంపు. అర్చామూర్తులన్నిటిలో అతిప్రాచీనమైనదిగా, మూలకందముగా భావింపబడు శ్రీరంగనాథుని అర్చామూర్తిని స్తుతించుచు రచింపబడిన ఈ స్తోత్రము శ్రీవైష్ణవస్తోత్రవాఙ్మయమున ప్రధానస్థానమును అలంకరించుటలో ఆశ్చర్యమేమున్నది! శ్రీయామునుల స్తోత్రరత్నము శ్రీరంగనాథునిగూర్చియేనని (''కులధనం, కులదైవతం'' అని యుండుటను బట్టి) ఆచార్యులు తలంచినను, అందు స్పష్టముగా శ్రీరంగనాథుని పేరు ఉట్టంకింపబడలేదు. అట్లు శ్రీరంగనాథుని నామము ఉట్టంకింపబడిన స్తోత్రములలో ఇది

మొట్టమొదటిది. కూరేశులు మొదటగా శ్రీరంగనాయకీ స్తుతిని (శ్రీస్తుతిని) రచింపగా, వారి కుమారులగు భట్టరు శ్రీరంగనాథుని మొదటి స్తోత్రమును రచించిరి.

పూర్వశతకమున 127 శ్లోకములు, ఉత్తరశతకమున 105 శ్లోకములను కలవు. ఇందలి ప్రమేయమును ఈ క్రింది విధముగా విభాగింపవచ్చును.

పూర్వశతకము

శ్లోకసంఖ్య		పరిమితి	విషయము
1-12	=	12	గురుపరంపరావందనము
13-19	=	07	స్తుతిని రచించుటలో తమకు శక్తి లేదనుచు భట్టరు వినయమును ప్రదర్శించుట
20-24	=	05	కావేరీనది వర్ణన
25-32	=	08	శ్రీరంగద్వీపము, ఉద్యానవనములు, శ్రీరంగనగరముల వర్ణన, నగరపాలకుల వందనము.
33-62	=	30	శ్రీరంగములోని మంటపము, వేయికాళ్లమండపము, చంద్రపుష్కరిణి, పున్నాగవృక్షముల వర్ణన, పరమపదనాథుని సన్నిధిలోని పదిమంది ఆழ్వార్లను, శ్రీరంగవిమానమును, విష్వక్సేనులను, సూత్రవతిని, ద్వారపాలకులను, గరుడుని, తత్పత్నులను, పంచాయుధములను, సుదర్శనమును, హనుమద్విభీషణులను, వేత్రవరమును, ఆమోదస్తంభములను, చామరగ్రాహిణులను ఆశ్రయించుట.
63-76	=	14	శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి వర్ణన.
77-127	=	51	మూలమూర్తి వర్ణన
మొత్తం	=	127	

శ్రీరంగరాజస్తవము - ద్వయమంత్ర వివరణము :-

నమ్మాழ్వార్లుచే ప్రణీతమైన తిరువాయ్‌మొழికి తనియన్ (ప్రార్థనా పాశురము)ను అనుగ్రహించు భట్టరు ''వాన్ తిక్ఖుమ్ శోలై మదిళరఙ్గర్ వణ్‌పుక్ఖ్‌మేల్ ఆన్ఱతమిఴ్ మఱైక ళాయిరముమ్'' అనుచు ఆ ప్రబంధము శ్రీరంగనాథుని గూర్చి రచింపబడినదనిరి. తిరువాయ్‌మొழి ప్రబంధము ద్వయమంత్రమును వివరించుచున్నదని పూర్వాచార్యు లందఱి అభిప్రాయము. మొదటి మూడు శతకములలో ఉత్తరఖండార్థము, పిమ్మట మూడు శతకము

లలో పూర్వ ఖండార్థమును వివరింపబడినదని సంప్రదాయము. శ్రీరంగనాథుని స్తుతించు ఈ స్తోత్రమును భట్టరు ద్వయమంత్ర వివరణరూపముగా రచించిరని అభిజ్ఞులగు ఆచార్యులు, వ్యాఖ్యాతలును అభిప్రాయపడిరి. దీని వివరణము శ్రీ వేంకటాచార్యవ్యాఖ్యానమున తెలుపబడినది. భట్టరు అష్టశ్లోకిలో ''నేతృత్వం'' అను శ్లోకమున ద్వయమంత్రమున పది జ్ఞాతవ్యార్థములు కలవని పల్కిరి. ఆ అర్థములు శ్రీరంగరాజస్తవమున వివరింపబడుటను ఈ క్రింది విధముగా చూపవచ్చును.

పూర్వశతకము - పూర్వఖండార్థము :-

(1) శ్రీ :- నేతృత్వం - అనగా లక్ష్మీపురుషకారత్వము - ఈ అర్థము ''యద్భ్రూవిభ్రమ భేదతః ఈశేశితవ్యం'', ''స్తనస్తబకచంచలః శ్రీరంగరాజభృంగః'' ఇత్యాదులచే సూచింపబడినది.

(2) మత్ :- (దివ్యదంపతుల) నిత్యయోగం - ''లక్ష్మీపదలాక్షాకలక్షణమ్'', ''శ్రీస్తనకస్తూరీమకరీముద్రితోరసః'' - ఇత్యాదులచే ఈ అర్థము తెలుపబడినది.

(3) నారాయణ :- సముచితగుణజాతం - అనగా వాత్సల్య, స్వామిత్వ, సౌశీల్య, జ్ఞానశక్త్యాదులు - 87, 88, 90 మొదలగు శ్లోకములలో వివరింపబడినవి.

(4) చరణౌ :- తనుఖ్యాపనం - దివ్యమంగళవిగ్రహప్రకాశనము - పూర్వశతకములోని 63వ శ్లోకమునుండి - 123వ శ్లోకము వఱకు తెలుపబడినది.

(5) శరణం :- ఉపాయం - ''పాదపద్మౌ మనవై నవై చ'', ''పాదపంకజయుగం వందామహే'', ''శ్రీరంగేందోః పదకిసలయే వందే'' అనుటచే సూచింపబడినది.

(6) ప్రపద్యే :- కర్తవ్యభాగం - అనగా చేతనుని అధ్యవసాయము - ''శ్రీరంగిణః పదం నః మంగళం వహతు'', ''శ్రీరంగేశయ మాశ్రయే'' ఇత్యాదులచే తెలుపబడినది.

ఉత్తరశతకము - ఉత్తరఖండార్థము :-

(1) శ్రీమతే :- ప్రాప్యం మిథునపరం - ''లక్ష్మీనేత్రా త్వయా'', ''స్యముద్ధిశ్య శ్రీమాన్ ఇతి నదతి వాగౌపనిషదీ'', ''లక్ష్మా సహ త్వాం పశ్యేమ'' ఇత్యాదులయందు సూచింపబడినది.

(2) నారాయణ :- స్వామిత్వం (తన్మూలకములగు వాత్సల్య సౌశీల్యసౌలభ్యాదులు) - అవతారములను వర్ణించు శ్లోకములు. 45నుండి 73వ శ్లోకము వరకు.

(3) ఆయ (చతుర్థీ) :- ప్రార్థనాం (కైంకర్యప్రార్థన) ''త్వాం శరద శ్శతం పశ్యేమ'', ''శ్రీరంగనాథం త ముపాసిషీయ'', ''స సన్ యజే జ్ఞానమయైః మఖైః'', ''పరస్మై బ్రహ్మణే ఏనం ప్రత్యంచం యునజై'' ఇత్యాదులచే ఈ అర్థము సూచింపబడినది.

(4) నమః - ప్రబలతరనిరోధిప్రహాణం :- (ప్రాప్యనిరోధినిరసనము) ''అసౌ దుఃఖం సుఖయతి ఇతి మాం దయస్వ'', ''భృశనిమ్న మిమం జన మున్నమయ'' ఇత్యాదులచే తెలుపబడినది.

శ్రీరంగరాజస్తవము - అర్థపంచకము :-

భట్టరు తిరువాయ్‌మొళికి తనియన్‌గా రచించిన ''మిక్కవిఱై నిలైయుమ్ మెయ్యా ముయర్ నిలైయుమ్ ...'' అను పాశురమున ఆ ప్రబంధమున అర్థపంచక నివరణము ప్రమేయ మనిరి. శ్రీరంగనాథుని గూర్చి సాయింపబడిన తిరువాయ్‌మొళి అర్థపంచకమును నివరించునట్లే, ఆ స్వామి విషయమున భట్టరుచే రచింపబడిన ప్రస్తుతస్తవమున కూడ అర్థపంచకము ప్రతిపాదింపబడినదనుటలో సందేహములేదు. ఆ విషయ మిచట స్థాలీపులాకముగా తెలుపబడుచున్నది.

(A) స్వస్వరూపము :- (జీవాత్మస్వరూపము)

(a) ''వపుః అవయవితయా ఇదంకుర్వాణైః బహిష్కరణైః నిరవయవకః అహంకార్హాః కరణాతిగః పుమాన్ స్ఫురతి హి'' (4వ శ్లో.ఉ.శ.) (శరీరము అవయములను కల్గినదగుటచే, ఇది అని వేరుచేయు బాహ్యేంద్రియములచే అవయవములులేని, అహం అను ప్రతీతికి అర్హుడగు, ఇంద్రియాతీతుడగు పురుషుడు తోచుచున్నాడు కదా!)- అనుటచే ఆత్మదేహము కంటె వేరయినది, అణువు, బాహ్యేంద్రియములకు గోచరము కానిది.

(b) ''అహ మిద మభి వేద్మీతి ఆత్మనిత్యోః నిభేదే స్ఫురతి'' (10వ శ్లో) - (నేను దీనిని తెలిసికొనుచున్నాను అని ఆత్మ-జ్ఞానముల భేదము తోచుచుండగా) అనుటచే ఆత్మ-జ్ఞానముకన్న నిలక్షణమయినది.

(c) ''ప్రళయసీమని అచిదవిశేషితాన్'' (41వ శ్లో) - (ప్రళయమున అచిత్తుకంటె విశేషములేని పలుజీవులను) - అనుటచే ఆత్మల అనేకత్వము,

(d) ''యస్యాస్మి పత్యుః'' (81వ శ్లో) - (ఏ స్వామికి దాసుడనైతినో) అనుటవలన అనన్యార్హశేషత్వము,

(e) ''రంగనిధే త్వమేవ పాహి'' (88వ శ్లో) (శ్రీరంగనాథా ! నీవే రక్షింపుము) - అనుటచే అనన్యశరణత్వము,

(f) ''పరస్మై బ్రహ్మణే మహసే అస్మై తదర్థం ప్రత్యంచం మాం ఏనం యునజై'' (82వ శ్లో.) (పరబ్రహ్మయు, తేజోరూపియు అగు శ్రీరంగనాథుని కొఱకు ప్రత్యగాత్మ అగు ఈ నన్ను కూర్చుకొనుచున్నాను) అనుటచే అనన్యభోగ్యత్వము,

(g) ''జ్ఞానక్రియాభజనసంపదకించనోఽహమ్'' (89వ శ్లో) - (జ్ఞానకర్మభక్తిసంపదలను ఏమియు లేని నేను) అనుటవలన ఆకించన్యము,

(h) ''స్వభావదాస్యేన చ'' (81వ శ్లో) (సహజదాస్యముచే) అనుటచే ఆత్మల సహజదాస్యము,

(i) ''తే శేషోఽశేషః ప్రపంచః వపుః'' (24వ శ్లో) (''ఈ సమస్త ప్రపంచము నీకు శేషము, శరీరమును'') అనుటచే ఆత్మలు భగవానునకు శరీరము,

(j) ''అహృతసహజదాస్యాః'' అను శ్లోకమున నిత్య-ముక్త-ముముక్షు (బద్ధ) భేదము. ఇట్లు పలువిధములుగ జీవస్వరూపము వివరింపబడినది.

(B) పరస్వరూపము :- (పరమాత్మస్వరూపము)

(a) ''స్వ ముద్ధిశ్య శ్రీమాన్'', (87వ శ్లో) ''లక్ష్మీపదలాక్షైక లక్షణమ్'', ''శ్రీస్తనకస్తూరీ మకరీముద్రితోరసః'' - ఇత్యాదులచే శ్రియఃపతిత్వము,

(b) పూర్వోత్తర శతకములలోని పలుశ్లోకములు భగవానుని కల్యాణగుణాకరత్వము,

(c) ''త్వాం పుండరీకేక్షణ మామనంతి'' - అనుటచే పుండరీకాక్షత్వము,

(d) ''శ్రీరంగకక్రమ కలభం'' - అనుటచే నిరంకుశస్వాతంత్ర్యము (కలభసామ్యముచే),

(e) ''ఉపాయోపేయత్వే తదిహ తత్వం'', ''త్వయి సతి పురుషార్థే''- ఇత్యాదులచే ఉపాయత్వము, ఉపేయత్వమును,

(f) ''ఆత్మా ఉస్యగంతుః పరితస్థుష శ్చ'' (స్థావరజంగమములకు ఆత్మ)-అనుటచే జగచ్ఛరీరకత్వము,

(g) ''ప్రళయసమయనుస్తం... క్రీడసి శ్రీసమక్షం''- అను శ్లోకమున సృష్టి స్థితిలయకారకత్వము,

(h) ''ఆర్తిం తితీర్షు రథ రంగపతే ధనాయన్''-అను శ్లోకమున చతుర్విధపురుషార్థ-ప్రదాయకత్వము,

(i) ''రత్నమివ'' (27), ''మహాసే'' (82) - అనుటచే స్వయంప్రకాశకత్వమును తెలుపబడినవి.

(j) ప్రరత్వాదిపంచకము :-

(1) ''యద్విష్ణోః పదం (పూ.శ.-26), పరము,
శ్రీమద్వ్యోమ న సీమ వాఙ్మనసయోః''

(2) ''షాడ్గుణ్యాత్ వాసుదేవః'' (ఉశ - 39) - వ్యూహము,

(3) ''స్థిత్యుత్పత్తిప్రవృత్తిగ్రహననియమన - అంతర్యామిత్వము, వ్యాపై రాత్మన స్థే''

(4) ఉత్తరశతకములోని 60వ శ్లోకమునుండి - 73వ శ్లోకము వరకు - అవతారములు (విభవము),

(5) ''అర్చ్యః సర్వసహిష్ణుః'' - (ఉ.శ. 74) - అర్చారూపములు తెలుపబడినవి.

(C) ఉపాయస్వరూపము :- ''తన భరోఽహ మకారిషి ధార్మికైః శరణ మిత్యపి వాచ ముదైరిరమ్'' (102) (నేను ధార్మికులగు ఆచార్యులచే నీకు భారమై చేయబడితిని, శరణమను మాటను పలికితిని) ఇత్యాదులచే ఆచార్యముఖముగా సమాశ్రయణము, ''రంగేశ్వర త్వాం శరణం ప్రపద్యే'' ఇత్యాదులచే శరణవరణము.

(D) ఉపేయస్వరూపము :- ''యోఽహ మస్మి స సన్ యజే జ్ఞానమయైః మఖైః'', ''ప్రత్యంచ మేనం యునజై పరస్మై'', ''లక్ష్మా సహ త్వాం శరదశ్శతం పశ్యేమ'' - ఇత్యాదులచే భగవానుని నిత్యకైంకర్యము ఉపేయమని తెలుపబడినది.

(E) విరోధిస్వరూపము :-

(a) దేహాత్మాభిమానస్వస్వాతంత్ర్యరూపస్వరూపవిరోధి-''జనమఖిల మహంయుః''(90), ''అహం భవామి'' (101) అనుటచే తెలుపబడినది.

(b) ''త్వా మపి విస్రంభివేకరేకాత్ అపాస్య'' అనుటచే అర్చావతారమున అశక్తియోగప్రతిపత్తి అనబడు పరత్వవిరోధి సూచింపబడినది.

(c) ''ప్రకుపితభుజగఫణానా మివ విషయాణా మహం ఛాయామ్'' అనుటవలన పురుషాంతరములలోని ఇచ్ఛ అను పురుషార్థవిరోధి తెలుపబడినది.

(d) ''మయి గుణపరమాణూదంతచింతాభిజ్ఞే'' (97) ఇత్యాదులచే విరోధిబాహుళ్యము అను ఉపాయవిరోధి,

(e) ''అతిక్రామన్ ఆజ్ఞాం తవ విధినిషేధేషు, భవతేఽపి భక్తాయ అభిద్రుహ్యన్'' (91)-ఇత్యాదులచే భగవద్భాగవతాపచారమనబడు ప్రాప్తి (అనుభవ) విరోధియు సూచింపబడినవి.

ఇట్లు శ్రీరంగరాజస్తవమున అర్థపంచక ప్రతిపాదకము.

శ్రీరంగనాథుని పలువిధములుగా రూపణము చేయుట :

భట్టరు శ్రీరంగరాజస్తవమున శ్రీరంగనాథుని పలువిధముగా రూపణము చేసిరి. ఇవి అన్నియు చాల వరకు ఆళ్వార్ల దివ్యసూక్తులను అనుసరించియే చేయబడినవనుట వివస్యలో ఆయా శ్లోకముల వివరణలో నిరూపింపబడినవి. భట్టరు చేసిన రూపణముల వివరము ఈ క్రింద చూపబడినవి.

(1)	చంద్రుడు	-	11, 14 50వ శ్లో. (పూ.శ.)
(2)	భృంగము	-	10వ శ్లో. (పూ.శ.)
(3)	కలభము (గున్న ఏనుగు)	-	16వ శ్లో. (పూ.శ.)
(4)	ధనము	-	76వ శ్లో. (పూ.శ.)

(5)	వషట్కృతము	-	99వ శ్లో. (పూ.శ.)
(6)	తటాకము	-	63, 64, 65వ శ్లో. (పూ.శ.)
(7)	కాందిశీకుడు	-	58వ శ్లో. (పూ.శ.)
(8)	కల్పవృక్షము	-	76వ శ్లో. (పూ.శ.)
(9)	కామధేనువు	-	76వ శ్లో. (పూ.శ.)
(10)	వర్తకుడు	-	88వ శ్లో. (ఉ.శ.)
(11)	క్ష్మాతలము	-	76వ శ్లో. (పూ.శ.)
(12)	రత్నాపణము	-	36వ శ్లో. (ఉ.శ.)
(13)	సముద్రము	-	80, 102, 117వ శ్లో. (ఉ.శ.)
(14)	ఊర్ణనాభి	-	31వ శ్లో. (ఉ.శ.)
(15)	కుంజరము	-	80, 118వ శ్లో. (ఉ.శ.)
(16)	అర్ణవతర్ణకము	-	81, 54వ శ్లో. (ఉ.శ.)
(17)	నందనవనము	-	84వ శ్లో. (పూ.శ.)
(18)	మరకతమణి	-	86వ శ్లో. (పూ.శ.)
(19)	కాలమేఘము	-	82వ శ్లో. (పూ.శ.)
(20)	జనని	-	45వ శ్లో. (ఉ.శ.)
(21)	రత్నము	-	27వ శ్లో. (ఉ.శ.)
(22)	కస్తూరి	-	33వ శ్లో. (ఉ.శ.)
(23)	శిఖి	-	44వ శ్లో. (ఉ.శ.)
(24)	సుహృత్	-	47వ శ్లో. (ఉ.శ.)
(25)	చింతామణి	-	8వ శ్లో. (పూ.శ.)
(26)	అమృతప్రవాహము	-	75, 83వ శ్లో. (పూ.శ.)
(27)	నేత్రము	-	75వ శ్లో. (పూ.శ.)
(28)	జీవితము (అసువులు)	-	75వ శ్లో. (పూ.శ.),66వ శ్లో. (పూ.శ.)

ఈ స్తోత్రములోని పాఠభేదములకు, అలంకారములకు, ఛందస్సునకు, పదప్రయోగములకు సంబంధించిన విశేషములు ఆయా శ్లోకముల వ్యాఖ్యలో వివరింపబడుటచే ఇచట మరల ప్రస్తావింపబడుటలేదు.

శ్రీరంగరాజస్తవములోని వృత్తవైవిధ్యము :-

శ్రీరంగరాజస్తవమునకు సంస్కృత వ్యాఖ్యానమును రచించిన శ్రీరామానుజాచార్యులు తమ వ్యాఖ్యాప్రారంభమున ''నానావృత్త శ్లోకభంగ్యా ప్రవృత్తం'' అనుచు భట్టర్ చూపిన వృత్తవైవిధ్యమునుగూర్చి ప్రస్తుతించిరి. ఈ స్తోత్రమున ప్రయోగింపబడిన పలు వృత్తములు సందర్భోచితిని కల్గియున్నవను అంశము ఆయా శ్లోకవ్యాఖ్యానమున వివరింపబడినది. ప్రస్తుతము మఱికొన్ని ఛందోవిశేషములు తెలుపబడుచున్నవి. శ్రీరంగరాజస్తవ పూర్వోత్తరశతకములలోని వృత్తములను పరిశీలించిన, భట్టరు అన్ని విధములైన వృత్తములను- అనగా, మాత్రా, సమ, అర్ధసమ, విషమ వృత్తములను ఉపయోగించినట్లు వ్యక్తమగును. మొత్తము మీద రెండు శతకములలో 41 విధములైన వివిధ వృత్తములు ఉపయోగింపబడినవి. వీనిలో కొన్ని అపూర్వములైనవి. ఉత్తరశతకములోని 60వ, 61వ శ్లోకములలో బోసిపాదములు రుక్మవతీ వృత్తమున (అనగా భ, మ, స, గ అను గణములతో), సరిపాదములలో మణిగణకిరణవృత్తమున (అనగా న, న, న, న, స అను గణములతో) రచింపబడినవి. అనగా ఇది అర్ధసమవృత్తభేదము. ఈ వృత్తము వృత్తరత్నాకరాదిగ్రంథములలో కన్పించుటలేదు. ఉత్తరశతకములోని 50వ శ్లోకము ''య, భ, త, గగ'' అను గణములతోకూడిన సమవృత్తభేదము. ఇదియు ఛందోగ్రంథములలో కానవచ్చుటలేదు. ఇట్లే, పుష్పితాగ్ర, మాలభారిణివంటి మఱికొన్ని సమవృత్తభేదములును కలవు. ఉత్తరశతకములోని 34వ శ్లోకము ''ఉద్గత'' అను విషమవృత్తజాతికి చెందినది. ఈ వృత్తమున మొదటిపాదమున ''స, జ, స, ల'' అను గణములు, రెండవపాదమున ''న, స, జ, గ'' అను గణములు, మూడవపాదమున ''భ, న, జ, ల గ'' అను గణములు, నాల్గవపాదమున ''స,జ, స, జ, గ'' అను గణములు ఉండును. పూర్వశతకములోని 86వ శ్లోకము ''మణిగణకిరణ''మను వృత్తభేదము. ఇందు ఈ వృత్తము పేరు ముద్రాలంకారపద్ధతిలో సూచింపబడినది. అరుదుగా కన్పించు మత్త, ద్రుత మధ్య, వియోగిని, కుసుమలతావేల్లిత, కోకిలకము ప్రమాణిక, రుచిర, ప్రమితాక్షర వంటి వృత్తములును ఈ స్తోత్రమున ప్రయోగింపబడినవి. వాణి, బాల, ఆర్ద్ర, కీర్తి, బుద్ధి, రామ, మాల వంటి ఉపజాతివిశేషములు, మాత్రా ఛందస్సునకు చెందిన ఆర్యావృత్తమును కలవు. ఇట్లు శ్రీరంగరాజస్తవమున భట్టరు ప్రదర్శించిన ఛందోవిషయకవైశిష్ట్యము అనితరసాధారణమైనది. ప్రస్తుతము ఈ స్తవమున ప్రయోగింపబడిన వృత్తముల వివరములు ఈ క్రింద చూపబడుచున్నవి.

(1)	ఆర్య	-	59, 61, 101, 122 - పూ.శ. 92, 100 ఉ.శ.
(2)	అనుష్టుప్	-	1-12 పూ.శ., 99 ఉ.శ.
(3)	ప్రమాణిక	-	91 పూ.శ.
(4)	మంజుభాషిణి	-	13, 14, 94 పూ.శ.

(5) వసంతతిలక (ఉద్ధర్షిణి, సింహోన్నత) - 15, 17, 18, 34, 37, 42, 48, 49, 50, 63, 65, 66, 67, 69, 71, 73, 82, 83, 85, 87, 120. - పూ.శ. 1, 27, 42, 51, 71, 83, 89. - ఉ.శ.

(6) ఇంద్రవజ్ర - 16, 35, 38, 123 పూ.శ., 2, 79, 80, 82, 93, 95, 105 - ఉ.శ.

(7) శార్దూలము - 20, 21, 22, 70, 72, 74, 76, 108, 112, 124, 125 - పూ.శ. 5, 12, 17, 21, 23, 38, 43, 55, 70, 72, 74, 75, 76 - ఉ.శ.

(8) హరిణి - 23, 39, 52, 79, 103, 104, 106, 115-పూ.శ. 4, 63, 64, 69, 77 - ఉ.శ.

(9) మాలిని - 24, 25, 28, 33, 45, 47, 53, 64, 68, 80, 102, 111 - పూ.శ. 6, 10, 13, 28, 44, 47, 48, 86, 90, 97 - ఉ.శ.

(10) ప్రహర్షిణి - 26, 27, 81 - పూ.శ. - 3, 22, 59 - ఉ.శ.

(11) పుష్పితాగ్ర - 29, 30, 31, 32, 62, 118-పూ.శ. 49, 54-ఉ.శ.

(12) తోటకము - 36 - పూ.శ. 104 - ఉ.శ.

(13) స్వాగత - 46, 88 - పూ.శ. 53 - ఉ.శ.

(14) రుక్మవతి - 51 - పూ.శ.

(15) శిఖరిణి - 44, 90, 92, 99, 105, 109, 110, 116-పూ.శ. 7, 20, 37, 62, 65, 66, 68, 87, 91, 103-ఉ.శ.

(16) ఉపజాతి - 40, 41, 43, 58 - పూ.శ. 78, 81, 101 - ఉ.శ.

(17) రథోద్ధత - 54 - పూ.శ.

(18) స్రగ్విణి - 55 - ఉ.శ.

(19) శాలిని - 56, 60, 121 పూ.శ. - 85, 94 - ఉ.శ.

(20) మేఘవితానము - 57 పూ.శ.

(21) స్రగ్ధర - 19, 75 - పూ.శ. 14, 15, 18, 19, 24, 26, 30, 35, 39, 56, 58, 67 - ఉ.శ.

(22) నర్కుటకము - 77, 78, 107, - పూ.శ., 41 ఉ.శ.

(23) మాలభారిణి - 84, 98, 100 పూ.శ. - 16, 88 - ఉ.శ.

(24) మందాక్రాంత - 89, 113, 127-పూ.శ. 8, 31, 45, 46-ఉ.శ.

(25) ప్రముదితవదన - 93, 97-పూ.శ.

(26) ప్రమితాక్షర - 95, 96 పూ.శ.

(27) రుచిర - 114 పూ.శ. - 98 - ఉ.శ.

(28) మత్తమయూరము - 117 పూ.శ.

(29) భుజంగప్రయాతము - 119 పూ.శ. - 9, 52, 96 - ఉ.శ.

(30) మణిగణకిరణము - 86 - పూ.శ.

(31) పృథ్వి - 126 పూ.శ. 25, 36, 57- ఉ.శ.

(32) కుసుమలతావేల్లిత - 11 - ఉ.శ.

(33) ద్రుతవిలంబితము - 32, 102 - ఉ.శ.

(34) కలహంస - 33 - ఉ.శ.

(35) ఉద్గత - 34 - ఉ.శ.

(36) మత్త - 40 - ఉ.శ.

(37) ద్రుతమధ్య - 73 - ఉ.శ.

(38) భ్రమరవిలసితము - 84 - ఉ.శ.

(39) లలిత (వియోగిని, సుందరి) - 29 - ఉ.శ.

(40) అర్ధసమవృత్తము (రుక్మవతి+ మణిగణకిరణము) - 60, 61 ఉ.శ.

(41) అనామకము (?) - 50 ఉ.శ.

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీపరాశరభట్టర్ అనుగ్రహించిన

శ్రీరంగరాజస్తవము – పూర్వశతకము

శ్రీపరాశరభట్టర్ తనియన్

శ్రీపరాశరభట్టార్యః శ్రీరంగేశపురోహితః ।
శ్రీవత్సాంకసుతః శ్రీమాన్ శ్రేయసే మేఽస్తు భూయసే ॥

శ్రీవత్సాంకులనెడి కూరేశులకు పుత్రులు, భగ వత్కైంకర్య లక్ష్మిని కలవారు, శ్రీరంగనాథుని పురోహితులు అయిన శ్రీపరాశరభట్టర్ నాకు గొప్ప శ్రీయస్సును కల్గించాలి.

1. ఆచార్య ముఖముగా భగవానుని ఆశ్రయించుట సత్సంప్రదాయము. నిరపాయమైన విధానము. ఆ పద్ధతిలో భట్టరు మొదటి అయిదు శ్లోకములలో ఆచార్యవందనమును చేయుచున్నారు. వానిలోనే కాక, ప్రబంధమునకే మొదటిది అగు ఈ శ్లోకమున కవి తనకు జన్మచే తండ్రి, విద్యచే ఆచార్యులగు శ్రీవత్సాంకమిశ్రులకు నమస్కరించుచున్నారు.

శ్రీవత్సచిహ్నమిశ్రేభ్యో నమ ఉక్తి మధీమహే ।
యదుక్తయ స్త్రయీకంఠే యాంతి మంగళసూత్రతామ్ ॥

కూరేశుల వచనములు వేదమను వధువుయొక్క కంఠమున మంగళ సూత్రమగు స్థితిని పొందుచున్నవి. అట్టి పూజ్యులైన శ్రీవత్సచిహ్నులకు నమస్కార వచనమును పలుకుచున్నాము.

2. తమకు పంచ సంస్కారములను, మంత్ర రత్నమును (ద్వయ మంత్రమును) ఉపదేశించిన గోవింద భట్టర్ (ఎమ్బార్) అను ఆచార్యవర్యులను ఈ శ్లోకమున కవి స్తుతించుచున్నారు.

రామానుజపదచ్ఛాయా గోవిందాహ్వోఽనపాయినీ ।
తదాయత్తస్వరూపా సా జీయాత్ మద్విశమస్థలీ ॥

ఎన్నడును విడువనిది (ఎల్లప్పుడు కూడియుండునది), భగవద్రామానుజులయొక్క పాదముల నీడయై ఆ పాదములకు అధీనమైన స్వరూపమును కల్గినది, గోవింద

భట్టర్ అను పేరును కల్గినది అయిన, (దాసుడనైన) నా ఆ విశ్రాంతి స్థానము సర్వథా వర్ధిల్లునుగాక!

3. ఈ శ్లోకమున కవి తమకు పరమాచార్యులును, జగదాచార్యులును అగు భగవద్రామానుజులకు మంగళాశాసనమును చేయుటద్వారా ప్రణమిల్లుచున్నారు.

రామానుజమునిర్జీయాత్ యో హరేర్భక్తియంత్రతః ।
కలికోలాహలక్రీడాముధాగ్రహ మపాహరత్ ॥

శ్రీరామానుజులు విష్ణువుయొక్క భక్తి అను యంత్రము ద్వారా కలిపురుషుని కోలాహలము అనెడి మొండి పిశాచమును దూరముగా పారద్రోలిరి. అట్టి భగవద్రామానుజమునులు చిరకాలము వర్ధిల్లుదురు గాక!

4. శ్రీరామానుజులకు ఆచార్యులగు మహాపూర్ణులను (పెరియనమ్బి) మనస్సున ప్రణమిల్లిన భట్టరు అనంతరము ఆ మహాపూర్ణులకు ఆచార్యులగు యామునులను ఈ శ్లోకముద్వారా స్తుతించుచున్నారు.

విధాయ వైదికం మార్గ మకౌతస్కుతకంటకమ్ ।
నేతారం భగదభక్తేః యామునం మనవామహై ॥

వేదమునకు సంబంధించిన మార్గము (దారి) దుర్వాదములను చేయువారు అనెడి కంటకములను లేనిదిగా చేసినవారు, భగవానుడైన హరియొక్క భక్తికి నాయకులు అగు యామునాచార్యుల వారిని ధ్యానింతుము.

5. యామునులకు ఆచార్యులగు శ్రీరామమిశ్రులను (మణక్కాల్‌నమ్బి), వారి ఆచార్యులగు పుణ్డరీకాక్షులను (ఉయ్యక్కొణ్డార్) మనసున ప్రణమిల్లిన భట్టరు ఈ శ్లోకమున తత్త్వవిదులలో అగ్రగణ్యులు, పూర్వాచార్యులలో ప్రథములు అగు నాథమునులను స్తుతించు చున్నారు.

నౌమి నాథమునిం నామ జీమూతం భక్త్యవగ్రహే ।
వైరాగ్యభగవత్తత్త్వ జ్ఞానభక్త్యభివర్షుకమ్ ॥

భక్తి అనెడి తీర్థము (పవిత్రజలం) దుర్లభమైన వానకఱవు కాలమున లౌకిక విషయములందు ఆసక్తి లేకుండుట అనెడి వైరాగ్యము, భగవానుని స్వరూప రూపగుణ విభూతుల జ్ఞానము, భగవద్భక్తి – అను వీనిని (నీటిని) అంతటను నిరంతరము వర్షించునట్టి (పుష్కలముగా కల్గించునట్టి) నాథముని అని ప్రసిద్ధి చెందిన మేఘమును నమస్కరించుచున్నాను.

6. ప్రపన్నజనకూటస్థులుగా స్తుతింపబడు నమ్మాళ్వార్లను ఇందు స్తోత్రము చేయుచున్నారు. ఆళ్వార్లు అందరిలోను నమ్మాళ్వార్లు అంగి అని, మిగిలిన ఆళ్వార్లు అందరూ వారికి అంగభూతులు అని శ్రీవైష్ణవ సంప్రదాయము కావున నమ్మాళ్వార్లను స్తుతించిన మిగిలిన ఆళ్వార్ల అందరిని స్తుతించినట్లగును.

ఋషిం జుషామహే కృష్ణతృష్ణాతత్త్వ మివోదితమ్ ।
సహస్రశాఖాం యోఽద్రాక్షీత్ ద్రావిడీం బ్రహ్మసంహితామ్ ॥

నమ్మాళ్వార్లు వేయి శాఖలను కల్గిన, ద్రావిడభాషామయమైన (తిరువాయ్‌మొళి అను) ఉపనిషత్తును దర్శించిరి. అటువంటివారు, ఉదయించిన శ్రీకృష్ణుని యందుగల ప్రేమయొక్క రూపమువలె ఉన్నవారైన ఆ నమ్మాళ్వార్లు అను మహర్షిని సేవించెదము.

7. నమ్మాళ్వార్లను స్తుతించిన పిదప గురుపరంపరాక్రమమును బట్టి శ్రీరామమిశ్రపుండరీకాక్ష విష్ణుక్షేనులను స్తుతింపవలసియున్నది. ఇచట ఆ స్తుతి లేకుండుటచే, దానిని కవి మానసికముగా నిర్వర్తించిరని చెప్పనగును. పిమ్మట కవి శరణాగతుల కందరకు పురుషకారమును చేయు సకల జగన్మాత అగు శ్రీరంగనాయకిని ఈ శ్లోకమున నమస్కరించుచున్నారు. సేనాపతి వందనము 50 వ శ్లోకమున చేయబడుచున్నది.

నమః శ్రీరంగనాయక్యై యద్భ్రూవిభ్రమభేదతః ।
ఈశేశితవ్యవైషమ్య నిమ్నోన్నత మిదం జగత్ ॥

ఈ ప్రపంచము శ్రీరంగనాయకియొక్క కనుబొమల విలాసములయొక్క తారతమ్యముచే (మార్పుచే) పాలించువాడు పాలింపబడవలసినవాడు – అను వ్యత్యాసముచే పల్లముగా మిట్టగా అగుచున్నది, అట్టి శ్రీరంగనాయకికి నమస్కారము (చేయుచున్నాను).

8. గురుపరంపరకు నాయకుడును, అందు చివరిగా అనుసంధింపబడు వాడును అగు శ్రియఃపతిని కవి ఈ శ్లోకమున స్తోత్రముచేయుచు ఆశ్రయించుచున్నారు.

శ్రీస్తనాభరణం తేజః శ్రీరంగేశయ మాశ్రయే ।
చింతామణి మివోద్యాంత ముత్సంగేఽనంతభోగినః ॥

శ్రీదేవిస్తనములకు అలంకారము, ఆదిశేషులయొక్క ఒడిలో వెడల గ్రక్కబడిన చింతామణివలె నున్నవాడును, శ్రీరంగమున పవళించినవాడును అగు పరంజ్యోతిని శ్రీరంగనాథుని ఆశ్రయింతును.

9. ఈ శ్లోకమునుండి మూడు శ్లోకములలో ద్వయమంత్రములోని పూర్వార్థములో గల శ్రీమత్‌పదార్థము వివరింపబడుచున్నది. అందు మొదటగా శ్రీమత్త్వము పరత్వచిహ్నమనుట తెలుపబడుచున్నది.

అస్తి వస్త్విదమిత్థంత్వ ప్రసంఖ్యానపరాఙ్ముఖమ్ ।
శ్రీమత్యాయతనే లక్ష్మీపదలాక్షైకలక్షణమ్ ॥

ఇట్టి రూపమును కల్గినదని, ఇట్టి స్వభావము కల్గినదని తెలియుటకు వీలు కానిదియై, లక్ష్మీదేవియొక్క పాదములకు అలంకరింపబడిన లత్తుకయే గుర్తుగా కల్గినదై యున్న పరమాత్మ రూపమైన వస్తువు (శ్రీరంగనాథుడు), సంపదను (శోభను) నిండుగా కల్గిన శ్రీరంగాలయములో ఉన్నది.

10. ఈ శ్లోకమున శ్రీరంగనాథుని తుమ్మెదగా, శ్రీదేవిని కల్పలతగా, ఆమె స్తనములను మొగ్గల గుత్తులుగా రూపించు చున్నారు.

లక్ష్మీకల్పలతోత్తుంగ స్తనస్తబకచంచలః ।
శ్రీరంగరాజభృంగో మే రమతాం మానసాంబుజే ॥

లక్ష్మీదేవి అనెడి కల్పలతయొక్క, మిక్కిలి ఉన్నతములయిన స్తనములనెడి గుత్తులయందు మిక్కిలి చలించునట్టి రంగనాథుడు అను తుమ్మెద నా మనస్సు అనెడు పద్మమున క్రీడించుగాక!

11. ద్వయమంత్రము పూర్వఖండములో మొదటి పదము గు ''శ్రీమత్'' యొక్క అర్థమును విశదీకరించు మూడుశ్లోకములలో ఇది చివరిది. ఇంతకుముందుశ్లోకములలో దివ్యదంపతులు వేరువేరుగా స్తుతింపబడిరి. ఇందు కవి ఆ ఇద్దరివలన ఆశీస్సును అభిలషించుచున్నారు.

స్వస్తి శ్రీస్తనకస్తూరీ మకరీముద్రితోరసః ।
శ్రీరంగరాజాత్ శరదశ్శత మాశాస్మహే తరామ్ ॥

మకరి (ఆడు చేప) ఆకారమున కస్తూరితో అలదబడిన, లక్ష్మీదేవి వక్షోజముల యందు పత్రరేఖచే అంకితమైన వక్షఃస్థలమును కలవాడగు శ్రీరంగనాథునివలన మాకు నూఱేండ్లు (చిరకాలము) శుభము కలుగవలెనని మిక్కిలి ఆశింతుము.

12. భగవానుని స్తుతించు శ్లోకపంచకములో ఇది చివరి శ్లోకము. ఇందు భగవానుని ప్రణత రక్షణలోని ఆదరాతిశయమును రమణీయమైన ఉత్ప్రేక్షతో భట్టరు వర్ణించుచున్నారు.

పాతు ప్రణతరక్షాయాం విలంబ మసహన్నివ ।
సదా పంచాయుధీం బిభ్రత్ స నః శ్రీరంగనాయకః ॥

తననే ప్రాప్యముగ, ప్రాపకముగ తలచి ఆశ్రయించినవారి రక్షణయందు ఆలస్యమును సహింప లేనివానివలె ఎల్లప్పుడు అయిదు విధములైన ఆయుధములను ధరించునట్టి ఆ శ్రీరంగనాథుడు మనలను రక్షించుగాక!

13. అనంతరము నారాయణ పదార్థమును వివరింపగోరిన భట్టరు భగవానుని స్తుతించుటలో తమ అయోగ్యతను, అశక్తిని ఈ శ్లోకమునుండి ఏడు శ్లోకములలో అనుసంధించుచున్నారు.

అమతం మతం మత మథామతం స్తుతం పరినిందితం భవతి నిందితం స్తుతమ్ ।
ఇతి రంగరాజ ముదజూఘుషత్ త్రయీ స్తుమహే వయం కిమితి తన్న శక్నుమః ॥

పరబ్రహ్మము ఎఱుగరానిదని తెలిసినచో అపుడు ఆ బ్రహ్మము తెలిసికొన బడినదగును; మఱియు, పరబ్రహ్మము స్తుతింప సాధ్యమైనదని తలంపబడినచో అది తెలిసికొనబడనిదే అగును; స్తుతింపబడినదయినచో అపుడా బ్రహ్మము నిందింపబడినదే అగును; ఉన్నది ఉన్నట్లు స్తుతింప సాధ్యము కానిదని చెప్పబడినచో అపుడది నిజముగా స్తుతింపబడినదగును - అని వేదము ఉద్ఘోషించెను. కావున అట్టి శ్రీరంగనాథుని మనము ఏమని స్తుతింతుము? స్తుతింపలేము.

14. ముందుశ్లోకమున కవి ''నేను భగవానుని స్తుతింపలేను'' అనిరి. ఆ మాటను పల్కుటకు కూడ తనకు యోగ్యత లేదని ఈ శ్లోకమున తెలుపుచున్నారు.

యది మే సహస్రవదనాదివైభవం నిజ మర్పయేత్ స కిల రంగచంద్రమాః ।
అథ శేషవత్ మమ చ తద్వదేవ వా స్తుతిశక్త్యభావవిభవేఽపి భాగితా ॥

ఆ శ్రీరంగనాథుడు అను చంద్రుడు తనదైన వేయి ముఖములను కల్గియుండుట మొదలగు (మహిమను) గొప్పతనములను నాకును అనుగ్రహించినచో, అపుడు ఆదిశేషునకువలెనో, (లేక) ఆ భగవానునకువలెనో నాకును స్తుతించుటలో శక్తి లేకుండుట అను గొప్పతనమునందును భాగస్వామ్యము ఉండును.

15. ముందు శ్లోకమున కవి భగవానుని గొప్పతనమును స్తుతించుట ఆ భగవానునకును సాధ్యము కాదని పల్కెను. తాను అట్లనుటకు తగిన ప్రమాణమును ఇందు కవి ఉట్టంకించుచున్నారు.

సో అంగ వేద యది వా న కిలేతి వేదః సందేగ్ధ్యనర్ఘవిద మాత్మని రంగనాథమ్ ।
స్థానే తదేష ఖలు దోషమలీమసాభిః మద్వాగ్భి రైశ మతిశాయన మావృణోతి ॥

శ్రీరంగనాథుడును తన గొప్పతనమును తెలిసికొనెనా? లేక, తెలియడా? అని గొప్ప జ్ఞానమును కల్గిన శ్రీరంగనాథునిగూర్చి వేదము తనలో సందేహించుచున్నది.

అది అట్లు సందేహించుట యుక్తమే కదా! నా మాటలతో ఇపుడు ఈశ్వర సంబంధమైన (తన సర్వేశ్వరత్వమునకు తగిన) గొప్పతనమును స్వామి మఱుగుపఱచు కొనగోరుచు నేనతనిని స్తుతింపవలెనని భావించుచున్నాడు (కాబోలు). అందువలన అతనిని నేను స్తుతింతును.

16. భగవానుని స్తుతించుటకు వేదపురుషునికే సాధ్యపడనిచో ఇక మీకు ఈ స్తుతి ప్రయత్నమేల? అను ప్రశ్నకు కవి చమత్కారముగా ఈ శ్లోకమున సమాధానమిచ్చుచున్నారు.

స్వం సంస్కృతద్రావిడవేదసూక్తైః భాంతం మదుక్తైః మలినీకరోతి ।
శ్రీరంగకమ్రః కలభం క ఏవ స్నాత్వాఽపి ధూలీరసికం నిషేద్ధా ॥

శ్రీరంగమునందు ఆసక్తి కల్గిన (లేదా, శ్రీరంగమందు ఆకర్షణీయుడైన) శ్రీరంగనాథుడు సంస్కృత వేదముల, ద్రావిడవేదముల సూక్తములచే ప్రకాశించునట్టి తనను ఇపుడు అల్పమైన నా మాటలచే మలిన పఱచుకొనుచున్నాడు. స్నానము చేసిన పిమ్మట కూడ బూడిదను (దుమ్మును) పూసి కొనుటలో ఆసక్తికల గున్న ఏనుగును ఎవడైనను నివారింపకలడా? (నివారింపలేడు).

17. నిరంకుశ స్వతంత్రుడైన శ్రీరంగనాథుడు తమను గైకొని ఈ స్తోత్రమును పల్కించు చున్నాడని ముందు శ్లోకమున పల్కిన భట్టరు ఈ శ్లోకమున తానట్లు స్తుతించుటకు మరి రెండు హేతువులను ఈ శ్లోకమున తెలియజేయుచున్నారు.

కిం తు ప్రపత్తిబలతారితవిష్ణుమాయా-మద్వంశ్యరాజకులదుర్లలితం కిలైవమ్।
శ్రీరంగరాజ కమలాపదలాలితత్వం యద్వాఽపరాద్ధృతి మమ స్తుతిసాహసేఽస్మిన్॥

కాని (అట్లయినను), ప్రపత్తి బలముచే భగవానుని మాయను దాటినవారగు నా వంశమునందలి పూర్వులయొక్క రాజకులమున జన్మించినందువలన నాకు కల్గిన గర్వము ఇట్టిది కదా! (ఇట్లు స్తుతించునట్లు నన్ను చేయుచున్నది కదా!) లేక, శ్రీరంగనాథునియొక్క, శ్రీరంగనాయకి యొక్క పాదములచే (పాదసన్నిధియందు) లాలింపబడుట(యే) నేను చేయు ఈ, స్తుతి అనెడి సాహసము నందు నన్ను ప్రేరేపించుచున్నది.

18. ముందుశ్లోకములలో భగవానుని మహిమను స్తుతించుటకు తనకు అధికారములేదనిన కవి ఇందు తనకు సాపేక్షమైన శక్తి కలదనుచున్నారు.

నాథస్య చ స్వమహిమార్ణవపారదృశ్వ - విజ్ఞానవాగ్విలసితం సహతే న వేదః ।
ఆపేక్షికం యది తదస్తి మమాపి తేన శ్రీరంగిణః స్తుతివిధా వహ మధ్యకార్షమ్॥

వేదముకూడ సముద్రమువలె అపారమైన భగవానుని మహిమను ఎవడైనను తెలిసికొన్నాడను మాటను సహింపదు. అనెడు సముద్రముయొక్క అంతమును చూచిన గొప్ప జ్ఞానముయొక్క మాటల విలాసమును సహించుట లేదు. లోకమున స్తుతించుట అనునది సాపేక్షమైనచో, (స్తుతించుటలో అతనికంటె ఇతడు సమర్థుడు - అను సాపేక్షత ఉన్నదనిన) నేనుకూడ లోకములో ఎవరో ఒకరి కంటే స్తుతించుటలో ఎక్కువ సామర్థ్యమును కలవాడను. ఆ కారణముచే శ్రీరంగనాథునియొక్క స్తోత్రము చేయుటలో నేను కూడా అధికారమును కల్గినవాడనైతిని.

19. ప్రస్తుత శ్లోకమున లోకమునందలి ఆయా జనులు తమ శక్తి కొలది భగవద్వైభవమును పొగడుట తమ పలుకులకు విలువ కల్గుట కొఱకే గాని, తాము ఆ వైభవమును పూర్ణముగా స్తుతింపకల్గుటచేకాదు; కావున వారివలెనేనేను నా శక్తికొలది భగవానుని స్తుతించి సత్తా లాభమును పొందవచ్చును కదా ! అందుచే నేనుచేయు ఈ స్తుతి పరిహాస్యాస్పదము కానేరదు అని కవి పల్కుచున్నారు.

అన్యత్రాతద్గుణోక్తిర్భగవతి న తదుత్కర్షచౌర్యైః పరేషాం
స్తుత్యత్వాత్ యావదర్థా ఫణితిరపి తథా తస్య నిస్సీమకత్వాత్ ।
ఆమ్నాయానా మసీమ్నా మపి హరివిభవే వర్షధిందో రివాబ్ధౌ
సంబంధాత్ స్వాత్మలాభో న తు కబలనతః స్తోతు రేవం న కిం మే ॥

స్తుతింపదలచిన వ్యక్తి యందు లేని గుణములను ఆరోపించి చేయు స్తోత్రము అనునది సర్వేశ్వరుని విషయమునకాక వేఱొక చోట (వ్యక్తి) యందే కలదు. భగవానుని యందు లేని గుణములను ఆరోపించి స్తుతించుట అనునది అసంభావితము. ఆ భగవానునియొక్క గొప్పతనమును దొంగిలించుటద్వారా ఇతరులయొక్క స్తుతిని చేయవలసి వచ్చుటవలన ఉన్న గొప్పతనము నంతటిని స్తుతించునట్టి మాటల పద్ధతి కూడ ఆ సర్వేశ్వరుని గొప్ప తనముయొక్క అవధిలేనితనముచే అట్టిదే (భగవానుని విషయమున అసంభావితమే). వర్షపు చినుకునకు సముద్రము నందు సంబంధమును పొందుటచే దానికి సత్త కల్గును. అట్లే, అవధి లేని వేదములు సైతము, సర్వేశ్వరుని గొప్పతనము నందు సంబంధమును పొందుటవలన (సర్వేశ్వరుని వైభవమును స్తుతించుటలో అన్వయించుట వలన) మాత్రమే తన సత్తను పొందును. కాని, భగవద్వైభవమును పూర్తిగా కబళించుట వలన (వర్ణించుటవలన) మాత్రము కాదు. కావున సర్వేశ్వరుని స్తుతించు నాకు ఇట్లు సంబంధమును కల్గియుండుట (సత్తాలాభమును పొందుట) సంభవించినది కదా?

20. ఈ శ్లోకమునుండి కవి అయిదు శ్లోకములలో కావేరీవర్ణనను చేయుచున్నారు. ఇందు కవి కావేరీనదిలో స్నానమాడవలెనను తన కోరికను ప్రకటించిరి.

కావేరీ మవగాహిషీయ భగవద్భోగాంతరాయాభవత్ -
కర్మక్లేశఫలాశయ ప్రశమనోద్వేలామలస్రోతసమ్ ।
జంతోఃసంసరతోఽర్చిరాదిసరణివ్యాసంగభంగాయ యా
లోకేఽస్మిన్ విరజేవ వేల్లితజలా శ్రీరంగ మాలింగతి ॥

కావేరీనది, సంసారి అయిన ప్రాణికి అర్చిరాది మార్గమున కల్గు అలసటను (ఆటంకములను) పోగొట్టుటకై ఈ లోకమున (మిక్కిలి వేగముగా సుడులు తిరుగుచూ ప్రవహించు) గొప్ప నీటిని కల్గిన విరజానది వలె శ్రీరంగక్షేత్రమును చుట్టుకొని యున్నది. (అట్టి) భగవానుని అనుభవమునకు ఆటంకములైయున్న పుణ్యపాప రూపకర్మలు, అవిద్య మొదలగు కష్టములు, కర్మఫలములు, వాసన - అను వీనిని పోగొట్టునది, గట్టును తాకుచు ప్రవహించు (అధికమైన) నిర్మలమైన ప్రవాహమును కల్గినదగు కావేరీనదిని ప్రవేశింతును (స్నానమాడెదను).

21. ''తేటపడని కలగిన నీటితో చుట్టబడిన శ్రీరంగము'' అని తొండరడిప్పొడియాళ్వార్లు (విప్రనారాయణులు) తిరుమాలై దివ్యప్రబంధమున కావేరిని కీర్తించిరి. కావేరీనదిలో నీరు అట్లు కలగియుండుటకు ఈ శ్లోకమున ఒక హేతువును భట్టరు చమత్కారపూర్వకముగా ఉత్ప్రేక్షించుచున్నారు.

దుగ్ధాబ్ధి ర్జనకో జనన్యహ మియం శ్రీ రేవ పుత్రీ వరః
శ్రీరంగేశ్వర ఏతదర్హ మిహ కిం కుర్యా మితీవాకులా ।
చంచచ్చామరచంద్రచందనమహామాణిక్యముక్తోత్కరాన్
కావేరీ లహరీకరై ర్విదధతీ పర్యేతి సా సేవ్యతామ్ ॥

పాలసముద్రము తండ్రి; నేను తల్లి; ఈ లక్ష్మీదేవియే (శ్రీరంగనాయకియే), (వధువు) కుమార్తె; శ్రీరంగనాథుడు వరుడు; (ఇట్లుండగా) ఈ కుమార్తెకు, వరునకు తగినట్లు ఏమి కానుకలను ఇచ్చెదను? అని కావేరీనది కలతచెందినది వలె ప్రకాశించు చామరముల, పచ్చకర్పూరముల, చందనఖండముల, గొప్ప గొప్ప రత్నముల, ముత్యముల సమూహములను కెఱటములనెడి చేతులతో సమర్పించుచున్నదై, శ్రీరంగము చుట్టును ప్రవహించుచున్నది (ప్రదక్షణము చేయుచున్నది). అట్టి కావేరి (జనులచే) సేవింప బడుగాక!

22. తొండరడిప్పొడియాళ్వార్లు తిరుమాలై దివ్యప్రబంధమున కావేరీనదిని ''గంగకన్న పూతమగు కావేరీ'' అనుచు ప్రస్తుతించిరి. అట్లు పల్కుటకు భట్టరు ఒక చక్కని హేతువును ఈ శ్లోకమున ఉత్ప్రేక్షించుచున్నారు.

తీర్థం శుంధతి పాతి నందనతరూన్ రథ్యాంగణాన్యుక్షతి
స్నానీయార్ఘ్యపానవారి వహతి స్నాతః పునీతే జనాన్ ।
శ్యామం వేదరహో వ్యనక్తి పులినే ఫేనై ర్హసంతీవ తత్
గంగాం విష్ణుపదీత్వమాత్రముఖరాం హేమాపగా హంత్వఘమ్ ॥

"పొన్ని" అను పేరును కల్గిన కావేరీనది తీర్థమని పేరు పడిన పుణ్యజలములను పరిశుద్ధము చేయుచున్నది. ఉద్యానవనమునందలి వృక్షములను రక్షించుచున్నది. వీథులను, నాల్గు వీథుల కూడలులను (ముంగిళ్లను) తడపుచున్నది. స్నానమునకు తగిన దేవతారాధనకు తగిన త్రాగుటకు తగిన నీటిని కల్గియున్నది. తనలో స్నానము చేయు జనులను పావనము చేయుచున్నది. నల్లని వర్ణము కల్గిన వేదరహస్యమును (శ్రీరంగ నాథుని) తీరప్రాంతమున ఇసుకతిన్నెయందుగల శ్రీరంగక్షేత్రములో అందఱకు కనబడునట్లు వ్యక్తము చేయుచున్నది. ఇట్టి వైభవమును కలిగియుండుటచే కావేరి నది, విష్ణువు పాదమునుండి పుట్టుట అను ఒక్క కారణము చేతనే మిక్కిలి ఘోషపెట్టు (గర్వించు) గంగానదిని తన నుఱుగుతో పరిహాసము చేయుచున్నట్లున్నది. ఆ నది మన పాపమును పోగొట్టునుగాక!

23. శ్రీరంగనాథుని కరుణయే కావేరీనదిగా రూపొందినదనుచు కవి ఈ శ్లోకమున తన కవితాచాతుర్యమును ప్రకటించుచున్నారు.

అగణితగుణావద్యం సర్వం స్థిరత్రసమప్రతి -
క్రియమపి పయఃపూరై రాప్యాయయంత్యనుజాగ్రతీ ।
ప్రవహతి జగద్ధాత్రీ భూత్వేవ రంగపతే ర్దయా
శిశిరమధురా॒ గాధా సా నః పునాతు మరుద్వృధా ॥

కావేరీనది, ప్రాయశ్చిత్తముకూడ లేని స్థావరజంగమములను అన్నిటిని వారి గుణ దోషములను పరామర్శించి చూడకుండ, తన జలప్రవాహములతో తృప్తి పఱచుచున్నదై, తోడుగా మేల్కొని యున్నందున శ్రీరంగనాథుని దయవలె ఉన్నది. లోకమున కంతటికి పెంపుడు తల్లియై ప్రవహించుచున్నది. చల్లనిది, తీయనిది, లోతైనది అగు ఆ కావేరీనది మనలను పవిత్రము చేయుగాక!

24. ముందుశ్లోకమున కవి కావేరీనదిని స్తుతించిరి కదా! కావేరీనదీజలములు సహజముగా అత్యంతమధురములు. దానితో పాటు ఆ జలములు మాధుర్యము ద్విగుణీకృతమగుటకు కవి ఇందు ఒక హేతువును ఉత్ప్రేక్షించుచున్నారు.

తరళతనుతరంగైః మంద మాందోళ్యమాన-
స్వతటవిటపిరాజీ మంజరీసుప్తభృంగా ।
క్షిపతు కనకనామ్నీ నిమ్నగా నాళికేర -
క్రముకజమకరందైః మాంసలాపా మదంహః ॥

మిక్కిలి చలించునవి, చిన్నవి అగు కెరటములచే కావేరీ నది తీరములో వృక్షసమూహములలోని పూలగుత్తులు మెల్లగా ఊగుచున్నవి. ఆ పూలగుత్తులలో తుమ్మెదలు హాయిగా నిద్రించుచున్నవి. కొబ్బరి చెట్లనుండి, పోకచెట్లనుండి పుట్టిన తేనెలతో అభివృద్ధి చెందిన నీటిని కల్గిన, **"పొన్ని"** అను పేరును కల్గిన ఈ కావేరీ నది నా పాపమును పోగొట్టు గాక!

25. భట్టరు ఈ శ్లోకమున, తరువాతి శ్లోకమున ఆరామపరివేష్ఠితమైన శ్రీరంగక్షేత్ర ద్వీపముయొక్క భోగ్యతను కీర్తించుచున్నారు.

కదళవకుళజంబూ పూగమాకందకంఠ-
ద్వయసరసనీరా మంతరా సహ్యకన్యామ్ ।
ప్రబలజలపిపాసా లంబమానాంబుదౌఘ-
భ్రమకరతరుబృందం వంద్యతా మంతరీపమ్ ॥

అరటిచెట్లయొక్క, పొగడచెట్లయొక్క, నేరేడు చెట్లయొక్క, పోకచెట్లయొక్క, తీయమామిడిచెట్లయొక్క కంఠమువరకు గల మధురమైన నీటిని కల్గినదగు కావేరీనది మధ్యలో శ్రీరంగద్వీపమున్నది. గొప్పదైన నీటిని త్రాగవలెనను కోరికచే క్రిందకు వ్రేలాడు మేఘముల (యొక్క) సమూహమా? అను భ్రమను కల్గించు వృక్ష సమూహమును ఆ దీవి కల్గియున్నవి. అట్టి దీవి మనచే నమస్కరింప బడుగాక!

26. విరజానదీతీరమునగల పరమపదమును ముక్తులకు మాత్రమే దర్శింప సాధ్యమగును. ఈ శ్రీరంగద్వీపము సంసారులకు సైతము అందుబాటులో ఉన్నది అనుచు కవి ఈ శ్లోకమున శ్రీరంగక్షేత్రద్వీపముయొక్క సౌలభ్యము కీర్తించుచున్నారు.

యద్విష్ణోః పద మపరం పరో రజోఽగ్ర్యం
ముక్తానా మనువిరజం విదీప్ర మాహుః ।

తత్పుణ్యం పులిన మిదంతయాఽద్య మధ్యే-
కావేరి స్ఫురతి తదీక్షిషీయ నిత్యమ్ ॥

విరజానదీసమీపమున నున్నది, తమోగుణము లేనిది, రజోగుణమునకు దూరమైనది, గొప్పది అగు పరమపదమును ముక్తులకు (మాత్రమే) మిక్కిలి ప్రకాశించునది అని పల్కుదురు. ఇపుడు ఆ పరమపదము, పవిత్రమైన విరజానదీ సైకతములో ఈ సంసారదశలో కూడ అందరిచే స్పష్టముగా తమ కన్నులతో దర్శింప సాధ్యమగునట్లు కావేరీ నది మధ్యలో శ్రీరంగ నగర రూపమున ప్రకాశించుచున్నది. ఆ సైకతమును (శ్రీరంగ నగరమును) ఎల్లప్పుడును దర్శింతును.

27. శ్రీరంగక్షేత్రము చుట్టును విస్తరించిన ఆరామముల నిత్యప్రాప్యత్వమును కవి ఇందు ప్రస్తుతించుచున్నారు.

త్రయ్యంతప్రహితిమతీషు వైష్ణవానాం ప్రాప్యాసు ప్రచురభవశ్రమాపహాసు ।
కావేరీపరిచరితాసు పావనీషు శ్రీరంగోపవనతటీషు వర్తిషీయ ॥

ఉభయవేదాంతముల నిరంతరాభ్యాస ఘోషను కల్గినవియు, ప్రబలమైన సంసారమునందలి తాపమును పోగొట్టునవియు, పవిత్రములైనవియును శ్రీవైష్ణవు లకు పొందదగినవియును, కావేరీ నదిచే చల్లని గాలులతో సేవింపబడినవియును అగు శ్రీరంగక్షేత్రమునందలి ఆరామస్థలములయందు నివసింతును.

28. శ్రీరంగక్షేత్రము చుట్టునుగల దివ్యారామముల భోగ్యత్వము వాని ప్రాప్యతకు తగినదను విశేషమును కవి ఇందు వర్ణించుచున్నారు.

స్ఫురితశఫరదీర్ఘ న్నాలికేరీగుళుచ్ఛ ప్రసృమరమధుకుల్యా వర్ధితానోకహాని ।
రతి మవిరతి రంగారామరమ్యస్థలాని క్రముకపనసమోచా మేచకాని క్రియాసుఃఽ ॥

ఎగసి త్రుళ్లిపడు చేపలచే పగులగొట్టబడుచున్న నారికేళముల గుత్తులనుండి మిక్కిలిగా స్రవించు తేనె కాలువలచే (ప్రవాహములచే) పెంపొందింపబడిన వృక్షములను కల్గినవి, పోకచెట్లు, పనసచెట్లు, అరటిచెట్లు – అను వీనితో దట్టమైన శ్యామల వర్ణమును కల్గినవి అగు శ్రీరంగక్షేత్రములోని తోటలలోని మనోహరములైన ప్రదేశములు మనకు ఆనందమును ఎడతెగక కలుగజేయునుగాక!

29. ఈ శ్లోకమునుండి మూడు శ్లోకములలో భట్టరు శ్రీరంగనగరమును స్తుతించుచున్నారు.

అధిపరమపదం పురీ మయోధ్యా మమృతవృతా మపరాజితా ముశంతి ।
పులిన ముపరి రంగరాజధానీ పిశితదృశా మపి సా పుర శ్చకాస్తి ॥

పరమపదమునందు అమృతమయములైన జలములను కల్గిన విరజానదిచే చుట్టబడినది, (లేదా, నిత్యులచే, ముక్తులచే నిండినది), అయోధ్య అను పేరు కల్గినది, అపరాజిత అను పేరును కల్గినది అగు వైకుంఠనగరమును ఉన్నదని వైదికులు పేర్కొనుచున్నారు. ఆ దివ్యనగరము ఇపుడు శ్రీరంగనాథుని రాజధానిగా (కావేరీ నదీ) సైకతముపై మాంసచక్షువులను కల్గినవారికికూడ కట్టెదుట ప్రకాశించుచున్నది.

30. ఇందు శ్రీరంగనగరములోని దివ్య భవనములను కవి వర్ణించుచున్నారు. శ్రీరంగక్షేత్రమునకు పరమపదత్వమును, అంతకంటె విశేషమును ఉపపాదించుట ఈ శ్లోకములోని విశేషము.

భవపద మపి దివ్యధామ కర్తుం తదుభయతంత్రితహర్మ్యమాలికేవ ।
భవనమణితలైః విజృంభమాణా జయతి తరా మిహ రంగరాజధానీ ॥

సంసారమునుకూడ నిత్యవిభూతిగా చేయుటకువలె, ఆ నిత్యవిభూతి, లీలా విభూతుల మధ్య, సంఘటితమైన మేడల, మిద్దెల వరుసలను కల్గినదై, గృహముల యందు మణులు పొదగబడిన వేదికలచే (ఉపరిభాగములచే) వృద్ధి చెందుచున్నదగు శ్రీరంగనాథుని రాజధాని (శ్రీరంగము) ఈ లోకమున మిక్కిలి ఉత్కర్షతో ప్రకాశించు చున్నది.

31. శ్రీరంగనగరము శ్రీరంగనాథుని రాజధాని అనుటకు తగినట్లు మకరాలంకృతమైన ధ్వజస్తంభములను కవి ఇందు వర్ణించుచున్నారు.

మణిమకరరుచీః వితత్య పాశాన్ విసృమరకేతుకరై ర్మృగం హిమాంశోః ।
శ్రియ ఇవ నవకేళయే జిఘృక్షుః సుఖయతి రంగపురీ చకాసతీ నః ॥

రత్నములచే చేయబడిన తోరణముల కాంతులే పాశములుగా (త్రాళ్లుగా, వలలుగా) విస్తరించగా, పైపైకి ప్రసరించు ధ్వజములనెడి చేతులతో చంద్రుని లోగల జింకను, లక్ష్మీదేవియొక్క అపూర్వమైన లీలకొఱకు పట్టుకొన గోరుచున్నట్లు శ్రీరంగ నగరము తోచుచున్నది. అట్టి నగరము మనలను సంతోషింప జేయుచున్నది.

32. శ్రీరంగనగరము వైకుంఠపురికి ప్రతిరూపము. కావున, శ్రీరంగములోగల నగర పరిపాలకులకును అవియే పేర్లు. భట్టరు ఈ శ్లోకమున ఈ ఎనిమిదిమంది నగరరక్షకులను నమస్కరించుట ద్వారా వారి అనుజ్ఞను ప్రార్థించి, పొందుగున్నారు.

జనపదసరిదంతరీప పుష్పత్ పురపరిపాలన నిత్యజాగరూకాన్ ।
ప్రహరణపరివార వాహనాఢ్యాన్ కుముదముఖాన్ గణనాయకాన్ నమామి ॥

జనులకు నివాసస్థానమై, కావేరీనదిమధ్య గల ద్వీపమున వర్ధిల్లుచున్న శ్రీరంగ నగరమును రక్షించుటలో ఎల్లప్పుడు మెలకువగా నుండువారు, ఆయుధములతో, పరిజనములతో, వాహనములతో కూడినవారును అగు కుముదుడు మొదలగు గణనాథు లను నమస్కరించెను.

33. శ్రీరంగమున మానవులుగా, తిర్యక్కులుగా, స్థావరములుగా నైన కావలయునని నిత్యసూరులు, ముక్తులు, ముముక్షువులు అభిలషించి ఆ రూపములను పొందుదురు. కాపున అచటి వారిని సామాన్యులని తలపక, వారికి భక్తితో నమస్కరింపతగునను విశేషమును కవి ఈ శ్లోకమున తెలియజేయుచున్నారు.

అహృతసహజదాస్యాః సూరయః ప్రస్తబంధాః
విమలచరమదేహా ఇత్యమీ రంగధామ ।
మహితమనుజతిర్యక్స్థావరత్వాః శ్రయంతే
సునియతమితి హ(యే)స్మ ప్రాహు రేభ్యో నమః స్తాత్ ॥

ఏనాడు హరింపబడని (అప్రతిహతమైన) సహజమైన దాస్యమును (శేషవృత్తిని) కలవారగు నిత్యసూరులు, సంసారబంధమును వీడిన ముక్తులు, (సమస్త పాపములు తీరుటచే) పవిత్రమైన చివరిదైన దేహమును కల్గినవారగు ముముక్షువులును- అను వీరు, గొప్పవైన, మానవులయొక్క పక్షులయొక్క, స్థావరములయొక్క స్థితిని కోరువారై, శ్రీరంగమును ఎల్లప్పుడును ఆశ్రయించుచున్నారు - అని కదా పౌరాణికులు పల్కుదురు. వీరికి (ఇట్లు మానవ-తిర్యక్-స్థావర జన్మలను పొందిన నిత్య-ముక్త- ముముక్షువులకు) నమస్కారము అగుగాక!

34. ఉన్నతములైన గోపురములతో విరాజిల్లు శ్రీరంగమందిరమును ఈ శ్లోకమున భట్టరు అద్భుతమైన ఉత్ప్రేక్షతో స్తుతించుచున్నారు.

శ్రీరంగదివ్యభవనం భువి గోపురాణాం ప్రాకారితేన నికరేణ గరుత్మతేవ ।
పార్శ్వప్రసారితపతత్రపుటేన భక్త్యా నానాతనూభి రుపగూఢ ముపహ్వయామః ॥

రెండు వైపుల ప్రాకారములను కల్గిన గోపురముల సమూహముచే శ్రీరంగ మందిరము చుట్టబడియుండుటను చూడగా, రెండు ప్రక్కల విస్తరింపబడిన, పుటాకార ములోనున్న రెక్కలను కల్గిన గరుత్మంతునిచే భక్తితో భూలోకమున బహువిధములైన రూపములతో కప్పి కాపాడబడుచున్నట్లున్నది. అట్టి శ్రీరంగదివ్యమందిరమును ఆశ్రయముగా పొందెదము.

35. ముందుశ్లోకమున వర్ణించిన విషయమునే కవి మరల వేరొక దృష్టాంతముతో ఇందు వర్ణించుచున్నారు. శ్రీరంగమందిరము మూర్తీభవించిన భూదేవి వలె ఉన్నదనుట ఈ శ్లోకములోని సారాంశము.

ప్రాకారమధ్యాజిరమండపోక్త్యా సద్వీపరత్నాకరరత్నశైలా ।
సర్వంసహా రంగవిమానసేవాం ప్రాప్తేవ తన్మందిర మావిరస్తి ॥

ప్రాకారములు, ఆ ప్రాకారముల మధ్యగల ముంగిళ్లు, మండపములు - అను వీనితో శ్రీరంగమందిరము, సప్తద్వీపములతో, సప్తసముద్రములతో, మేరుపర్వతముతో కూడిన భూదేవి శ్రీరంగవిమానసేవను పొందినదివలె ఉన్నది. ఆ శ్రీరంగమందిరము మన కట్టెదుట సాక్షాత్కరించుచున్నది.

36. ఆళ్వార్ల అవతారప్రయోజనములు అనేకములు. వానిలో ముఖ్యమైన ప్రయోజనము అవైదికులను వైదికులుగా మార్చుట. ఆ మార్పు చేతనములలోనే కాక అచేతనములలో సైతము సంభవించెనని భట్టరు ఈ శ్లోకమున తెలియజేయుచున్నారు.

జితబాహ్యజినాదిమణిప్రతిమా అపి వైదికయన్నివ రంగపురే ।
మణిమండప పవప్రగణాన్ విధధే పరకాలకవిః ప్రణమేమహి తాన్ ॥

తిరుమఙ్గైయాళ్వార్లు, వేదబాహ్యులైన జినులు మొదలగువారిని జయించుట కాక, వారి రత్నప్రతిమలను కూడ వైదికముగా చేయువారువలె (వానిని ఉపయోగ పఱచి) శ్రీరంగమున మణులతో కూడిన మండపముల, ప్రాకారముల సమూహము లను నిర్మించిరి. ఆ మణిమండపములను, ప్రాకారములను నమస్కరింతుము కదా.

37. భగవదాలయమునకు పూర్వద్వారమున చండ - ప్రచండులు, దక్షిణమున భద్ర - సుభద్రులు, పశ్చిమమున జయ - విజయులు, ఉత్తరమున ధాత - విధాతలు రక్షణభారమును నిర్వహింతురు. కవి వారిని ఈ శ్లోకమున ప్రణమిల్లుచున్నారు.

స్మేరాననాక్షికమలైః నమతః పునానాన్ దంష్ట్రాగదాభ్రుకుటిభిః ద్విషతో ధునానాన్।
చండప్రచండముఖతః ప్రణమామి రంగద్వారావలీషు చతసృష్వధికారభాజః ॥

తమ వికసించిన ముఖములు, కన్నులు అనెడి కమలములతో (కమలములవంటి ముఖములతో, కన్నులతో) నమస్కరించువారిని పవిత్రులుగా చేయువారు, కోఱలతో, గదలతో, కనుబొమల కుటిలగతులతో (కదలికలతో) శత్రువులను (భగవద్భాగవత విరోధులను) భయపెట్టువారును, నాలుగు ద్వారములవరుసయందు రక్షణాధికారమును కల్గినవారును అగు చండుడు, ప్రచండుడు మొదలగు శ్రీరంగనగర ద్వారపాలకులను నమస్కరింతును.

38. తూర్పుద్వారముద్వారా శ్రీరంగమందిరమును ప్రవేశించిన భట్టరు మొదటగా వేయికాళ్లమండపమును ఈ శ్లోకమున కీర్తించుచున్నారు.

సర్వాత్మసాధారణనాథగోష్ఠీ పూరేఽపి దుష్పూరమహావకాశమ్ ।
ఆస్థాన మానందమయం సహస్రస్థూణాదినామ్నా తమవాప్నవాని ॥

ఆత్మలన్నిటికి సమానుడైన ప్రభువగు శ్రీరంగనాథుని భక్తుల గోష్ఠి, ప్రవాహముగా వచ్చినను నిండించుటకు సాధ్యము కాని గొప్ప ప్రదేశమును కల్గినది, **'సహస్రస్థూణా'** అను పదమును మొదట కల్గిన ఉపనిషత్ వాక్యముచే నిర్దేశింపబడినది, ఆనందమే మూర్తీభవించినట్లున్నది అగు ఆ వేయికాళ్ళమండపమును సేవింతును (పొందెదను).

39. ఈశ్లోకమున, తదుపరిశ్లోకమున కవి చంద్రపుష్కరిణిని స్తుతించుచున్నారు. ఈ పుష్కరిణి శ్రీరంగాలయమున ఉత్తరదిక్కున కలదు.

విహరతి హరౌ లక్ష్మ్యా లీలాతపత్రపరిష్క్రియా –
వినిమయవిధౌ సూనాసూనిక్రియాసఫలోత్పలామ్ ।
అథ మునిమనఃపద్మేష్వబ్జా సహాయవిహారజ –
శ్రమహరతటీం యామ స్తా మైందవీ మరవిందినీమ్ ॥

శ్రీరంగనాథుడు శ్రీరంగనాయకితో పాటు విహారమును చేయునపుడు, వారి క్రీడలలో గొడుగులుగా అగుటచే, కర్ణభూషణము మొదలగు అలంకారములుగా అగుటచే, వారు ఒకరికొకరు మాలికలను మార్చుకొనుటకు తగినట్లు ఉపయోగపడుటచే, వారు పుష్పయుద్ధమును చేయుటకు సాధనములుగా అగుటచే జన్మసాఫల్యమును పొందిన పద్మములను కల్గినది, మఱియు, మహర్షులయొక్క హృదయ పుండరీకములలో సలక్ష్మీకుడైన భగవానునకు విహరించుటవలన కల్గిన అలసటను తీర్చు చల్లని తీరమును కల్గినది అగు ఆ ప్రసిద్ధమైన చంద్రపుష్కరిణిని పొందెము (చేరెదము).

40. ముందు శ్లోకమున చంద్రపుష్కరిణిని సమీపింతుము అని పల్కిన కవి ఇందు తాము ఆ పుష్కరిణిలో స్నానమొనర్చి, పాపములను పోగొట్టుకొందునను విషయమును తెలుపు చున్నారు.

తాపత్రయా మైందవపుష్కరిణ్యాం నిమజ్య నిర్వాపయితాఽస్మి యస్యాః ।
అభ్యాసతోఽపా మఘమర్షణీనాం చంద్రః సుధాదీధితితా మవాప ॥

పాపమును పోగొట్టు చంద్రపుష్కరిణిలోని నీటిలో మాటి మాటికి స్నానము చేయుటచే చంద్రుడు అమృతకిరణములను కల్గినవాడయ్యెను. అట్టి చంద్రపుష్కరిణిలో స్నానమొనర్చి, మూడు విధములైన తాపములను పోగొట్టుకొనువాడనై ఉన్నాను.

41. చంద్రపుష్కరిణికి తూర్పుదిశలో ప్రతిష్ఠింపబడిన పదిమంది ఆళ్వార్లను కవి ఈ శ్లోకమున స్తుతించుచు, వారి అనుగ్రహమును ప్రార్థించుచున్నారు.

పూర్వేణ తాం తద్వదుదారనిమ్న ప్రసన్నశీతాశయమగ్ననాథాః ।
పరాంకుశాద్యాః ప్రథమే పుమాంసో నిషేదివాంసో దశ మాం దయేరన్ ॥

ఆ చంద్రపుష్కరిణికి తూర్పున ప్రతిమల రూపమున అధివసించియున్నవారు, ఆ పుష్కరిణివలెనే గొప్పదైన, గంభీరమైన, స్వచ్ఛమైన (తేటగానున్న), చల్లనైన తమ హృదయమునందు (తీర్థము నందు) మునిగిన (స్థిరముగా నిలచిన) భగవానుని కల్గినవారగు నమ్మాళ్వార్లు మొదలగు పదిమంది ఆళ్వార్లు నన్ను దయజూపుదురు గాక!

42. ఈ శ్లోకమునుండి నాలుగు శ్లోకములలో శ్రీరంగవిమానమును, కవి స్తుతించుచున్నారు. భగవద్రామానుజులు నిత్యగ్రంథమున పీఠార్చనమును గూర్చి తెలుపుచు ''ఓం ఆధారశక్త్యై నమః, ఓం ప్రకృత్యై నమః'' అని ప్రారంభించి రచించిన క్రమమును అనుసరించి ప్రస్తుతశ్లోకము రచింపబడినది.

ఆధారశక్తి ముపరి ప్రకృతిం పరేణ తాం కూర్మమత్ర ఫణినం పృథివీం ఫణాసు ।
పృథ్వ్యాం పయోధి మథితన్నళినం విధాయ శ్రీరంగధామ సునివిష్ట మభిష్టవాని ॥

ఆధారశక్తికి పైన (భగవచ్ఛక్తికి పైన) ఆదికూర్మమును, ఆ కూర్మముపై ఆదిశేషుని, ఆదిశేషుని పడగలపై భూమిని, భూమిపై సముద్రమును, ఆ సముద్రముపై అష్టదళపద్మమును నిలిపి, దానిపై సుప్రతిష్ఠితముగానుండు శ్రీరంగవిమానమును స్తుతింపగోరెదను.

43. పరమపదములోని 'అపరాజిత' అను పరబ్రహ్మస్థానమే భూలోకమున శ్రీరంగ విమానముగా అవతరించినదని కవి ఈ శ్లోకమున తెలుపుచున్నారు.

పరేణ నాకం పురి హేమమయ్యాం యో బ్రహ్మకోశోఽస్త్యపరాజితాఖ్యః ।
శ్రీరంగనామ్నా తమపౌరుషేయం విమానరాజం భువి భావయామి ॥

స్వర్గలోకమునకు పైనగల (ప్రకృతిమండలమునకు ఆవల గల) హిరణ్మయమైన, వైకుంఠ నగరమున అపరాజిత అను పేరును కల్గిన పరబ్రహ్మస్థానము కలదు. మానవులచే నిర్మింపబడనిది (పురుషప్రయత్నమునకు గోచరము కానిది) అగు ఆ గొప్ప విమానమును, భూలోకమున శ్రీరంగవిమానమను పేరుతో అవతరించినదిగా భావింతును.

44. ముందుశ్లోకమున 'అపరాజిత' అనబడు బ్రహ్మనివాస స్థానమే శ్రీరంగవిమానముగా అవతరించెనని పల్కిన కవి ఇందు ఆ విమానముయొక్క ఆశ్రయణీయతను, తరువాతి శ్లోకమున భోగ్యతను స్తుతించుచున్నారు.

అనాద్యామ్నాతత్వాత్ పురుషరచనాదోషరహితం
జనే తాంస్తాన్ కామాన్ విదధపి సాయుజ్యహృదయమ్ ।
అసందేహాధ్యాసం భగవదుపలంభస్థల మమీ
ప్రతీమః శ్రీరంగం శ్రుతిశతసమానర్ధి శరణమ్ ॥

అనాదిగా (స్వయంవ్యక్తముగా) వ్యవహరింపబడుటచే మానవులు చేయు నిర్మాణములో సంభవించు దోషములు లేనిది, జనమునకు ఆయా (వారు వారు కోరిన) కోరికలను (పురుషార్థములను) ఇచ్చునది, అయినను మోక్షము నిచ్చుట యందే (అభిప్రాయమును) ఆశయమును కల్గినది, సందేహము, విపర్యయము - అను దోషములను లేనిది, భగవానుడు ప్రకాశించు చోటు (కావుననే) అనేక వేదములతో సమానమైన అతిశయ మును కల్గినది అగు శ్రీరంగవిమానమును మేము శరణముగా విశ్వసింతుము.

45. శ్రీరంగవిమానము తెల్లగాయుండియుండవలెనుకదా! కాని, అది నల్లని వర్ణములో కన్పడుచున్నదే ? అనినచో, అందులకు కవి సమాధానమును తెలుపుచున్నారు.

అపి ఫణిపతిభావాత్ శుభ్ర మంతశ్శయాళోః
మరకతసుకుమారైః రంగభర్తు ర్మయూఖైః ।
సకలజలధిపానశ్యామ జీమూతజైత్రం
పులకయతి విమానం పావనం లోచనే నః ॥

శ్రీరంగవిమానము ఆదిశేషుని రూపమగుటచే తెల్లనిదైనను, తన లోపల పరుండి యున్న శ్రీరంగనాథుని, మరకతమణియొక్క నల్లని కాంతులవలె, అందమైన కాంతులచే కూడినదై, సమస్తమైన సముద్రమును త్రాగుటచే నల్లనిదైన మేఘమును కూడా జయించునట్లున్నది. (మేఘము కంటే నల్లగా ఉన్నది) అట్టి పవిత్రమైన శ్రీరంగ విమానము మనయొక్క రెండు కన్నులకు గగుర్పాటును (ఆనందము) పొందించు చున్నది.

46. శ్రీరంగవిమానమునకు ఉత్తరభాగమునగల గోపురశిఖరముపై విరాజిల్లు నృసింహమూర్తిని రెండు శ్లోకములలో భట్టరు స్తుతించుచున్నారు.

వ్యాపి రూపమపి గోప్పదయిత్వా భక్తవత్సలతయోజ్జితవేలమ్ ।
తద్ద్విషంతపనృకేసరిరూపం గోపురోపరి విజృంభిత మీడే ॥

అంతట వ్యాపించియుండు (గొప్పదైన) తన రూపమునుకూడ (ఆవుపాదమంత చిన్నదిగా) సంకోచింపజేసికొని, గోపురముపై ప్రకాశించునది, భక్తుడైన ప్రహ్లాదునిపై గల ప్రేమచే అవధిని దాటి అవతరించినది, (విలక్షణమైన) భాగవతశత్రువగు హిరణ్యకశిపునకు తాపమును కలుగజేయునది అగు ఆ నరసింహరూపమును స్తుతింతును.

47. మిగిలిన భగవన్మూర్తులవలె భూమిపై అధివసింపక, ఎల్లప్పుడును ఉన్నతమైన స్థలములలో నివసించు నృసింహమూర్తిని దర్శించినపుడు కల్గిన భావమును కవి ఇందు అందమైన ఉత్ప్రేక్షతో వ్యక్తము చేయుచున్నారు.

అహ మల మవలంబ స్సీదతా మిత్యజస్రం నివసదుపరిభాగే గోపురం రంగధామ్నః।
క్వచన నృపరిపాటీవాసితం క్వాపి సింహ-క్రమసురభిత మేకం జ్యోతి రగ్రే చకాస్తి ॥

"ఈ సంసారమున బాధపడువారికి నేను తగిన ఆధారమును (చేతి కఱ్ఱను)" అని తెలుపునట్లు శ్రీరంగమందిరముయొక్క గోపురమునకు పైభాగమున ఎల్లప్పుడు నివసించునట్టిది, (కంఠమున క్రింద ఉండు) ఒక భాగమున మానవశరీరక్రమముతో సువాసితమైనది మఱియు, వేఱొకభాగమున (శిరస్సులో) సింహముయొక్క శరీరక్రమముతో పరిమిళితమైనదగు అద్వితీయమైన జ్యోతిస్సు (నృసింహరూపములో) కట్టెదుట ప్రకాశించు చున్నది.

48. ఈ శ్లోకమున ప్రస్తుతింపబడు గురుపరంపర భట్టరుకాలము నాటికి శ్రీరంగ దేవాలయమున ప్రతిష్ఠింపబడలేదు. కాని, శ్రీరామానుజులు నిత్యగ్రంథమున పీఠార్చనావిధానము పిదప గురుపరంపరాసమారాధనమును తెలుపుటనుబట్టి, ఆ క్రమములోనే భట్టరు ఈ శ్లోకమున గురుపరంపరావందనమును చేయుచున్నారు అని చెప్పగును.

సంశోధ్య పావనమనోహరదృష్టిపాతైః
దేవాయ మామపి నివేదయతాం గురూణామ్ ।
సవ్యోత్తరే భగవతోఽస్య కటాక్షవీక్షా -
పంక్తిం ప్రపద్య పరితః పరితో భవేయమ్ ॥

అపవిత్రుడనైన నన్ను కూడ పవిత్రములైన అందమైన కటాక్షములతో పరిశుద్ధుని చేసి భగవానునకు సమర్పించువారు, ఈ భగవానునకు (శ్రీరంగనాథునకు) ఎడమవైపు

ఉత్తర దిక్కున (వేంచేసియున్న) వారైన ఆచార్యుల కంటిచూపుల వరుసను శరణముగా చేసికొని, (ఆ ఆచార్యులకు) మాటి మాటికి ప్రదక్షిణము చేయుదును.

49. చంద్రపుష్కరిణీ తీరమునగల పొన్నచెట్టును భట్టరు ఈ శ్లోకమున స్తుతించుచున్నారు.

శ్రీరంగరాజకర నమ్రితశాఖికాభ్యో లక్ష్మ్యా స్వహస్తకలిత శ్రవణావతంసమ్ ।
పున్నాగతల్లజ మజస్రసహస్రగీతి సేకోత్థదివ్యనిజసౌరభ మామనామః ॥

శ్రీరంగనాథుడు చేతులతో క్రిందకు వంచబడిన శాఖలనుండి శ్రీరంగ నాయకిచే తన చేతులతో త్రుంచబడినవి, ఆమెచే కర్ణభూషణములు చేసికొనబడినవి అగు పుష్పము కల్గినది, ఎల్లప్పుడు వేయి పాశురములు కల్గిన తిరువాయ్‌మొళి దివ్యప్రబంధ సారమునొక్క సేచనముచే (తడపుటచే) పుట్టిన అప్రాకృతమైన సువాసనను కల్గినది అగు గొప్ప పొన్నచెట్టును స్తుతింతుము.

50. ఇందు సేనాధిపతి అగు విష్వక్సేనులు స్తుతింపబడుచున్నారు.

శ్రీరంగచంద్రమస మిందిరయా విహర్తుం విన్యస్య విశ్వచిదచిన్నయనాధికారమ్।
యో నిర్వహత్యనిశ మంగుళిముద్రయైవ సేనాన్య మన్యవిముఖాः తమశిశ్రియామ ॥

చంద్రునివంటి శ్రీరంగనాథుడు లక్ష్మీదేవితో విహరించుటకు వీలుగా ఆ స్వామిని (శేషశయనమున, లేదా, సింహాసనమున) నిలిపి, సమస్తమైన చేతనాచేతనములను పాలించు అధికారమును ఎల్లప్పుడు తన వేలిముద్రతోనే నిర్వహించు ఆ విష్వక్సేనులను వేఱు శరణము లేనివారమై ఆశ్రయింతుము.

51. విష్వక్సేనుల ప్రియపత్ని సూత్రవతి ఇందు కీర్తింపబడుచున్నది.

సైన్యధురీణ ప్రాణసహాయాం సూత్రవతీ మాశిశ్రియ మంబామ్ ।
శ్రీపదలాక్షాలాంఛిత సేవాప్రోతలసద్దోర్వల్లివిలాసామ్ ॥

లక్ష్మీదేవి పాదములకు పూయబడిన లత్తుకచే ముద్రితమైనవి. కైంకర్యము కొఱకై నేయబడినది అగు ప్రోత (నేత) వస్త్రముచే ప్రకాశించునవి. తీగవంటివి అగు బాహువుల యొక్క సౌందర్యమును విష్వక్సేనుల ప్రియ పత్నియు అగు సూత్రవతి కల్గియున్నది. అట్టి ఆ తల్లిని ఆశ్రయించితిని.

52. భగవద్రామానుజులు నిత్యగ్రంథమున విష్వక్సేనులకు ప్రణమిల్లిన పిదప, విష్వక్సేనుల పరిజనమగు గజానన, జయత్సేన, హరివక్త్ర, కాలప్రకృతులను నల్గురకు నమస్కరింపవలెనని పల్కిరి. భట్టరు ఆ క్రమమునుబట్టి ఇందు ఆ నల్గురను ప్రార్థించుచున్నారు.

విదధతు సుఖం విష్వక్సేనస్య తే ప్రథమే భటాः
కరిముఖజయత్సేనౌ కాలాహ్వసింహముఖౌ చ నః ।
జగతి భజతాం తత్తత్ప్రత్యూహతూలదవానలా
దిశిదిశి దివారాత్రం శ్రీరంగపాలనకర్మఠాः ॥

ఈ లోకమున తమను ఆశ్రయించువారికి కల్గు ఆ యా ఆటంకములు అను దూదిపింజలను దహించు దావాగ్నివంటివారు, పగలు, రాత్రి ప్రతి దిక్కులోను శ్రీరంగమును పాలించుటను నిత్యకర్మగా కల్గినవారు, విష్వక్సేనులయొక్క ఆ (ప్రసిద్ధులైన) ముఖ్యులైన సేవకులు, కరిముఖుడు, జయత్సేనుడు, కాలుడు, హరివక్త్రుడను పేర్లను కలవారు - అగు నలుగురు మాకు సుఖమును కలుగజేయుదురు గాక!

53. భట్టరు ఈశ్లోకమున ''పెరియతిరువడి'' అని సంప్రదాయమున వ్యవహరింపబడు గరుత్మంతుని శరణువేడుచున్నారు. శ్రీరంగాలయమున శ్రీరంగనాథుని కెదురుగా అంజలిముద్రతో వేంచేసియుండు గరుత్మంతులీ శ్లోకమున స్తుతింపబడుచున్నారు.

శ్రుతిమయ మతిహర్షప్రశ్రయస్మేరవక్త్రం
మణిముకుర మివాగ్రే మంగళం రంగధామ్నః
శరణ మభిగతా స్స్మో యత్ర రూపస్వరూప -
స్వగుణమహిమదర్శీ మోదతే రంగశాయీ ॥

తనకెదురుగా ఉన్న గరుత్మంతునియందు శ్రీరంగనాథుడు తన దివ్యమంగళ రూపము, దివ్యాత్మ స్వరూపము, తన కల్యాణగుణములు - అను వీని గొప్పతనమును చూచుచు సంతోషించుచున్నాడు. అట్టి శ్రీరంగనాథుని ముందు శుభకరమైన రత్నపుటద్దము వలె ఉన్నవాడు, శ్రీరంగనాథుని దర్శనముచే కల్గిన గొప్ప సంతోషముతో, వినయముతో వికసించిన ముఖమండలమును కలవాడు, వేదస్వరూపుడగు ఆ గరుత్మంతుని శరణముగా పొందినవారమై యున్నాము.

54. గరుత్మంతునకు సుకీర్తి, రుద్ర అను ఇద్దరు భార్యలు కలరని భగవచ్ఛాస్త్రమున చెప్పబడినది. భట్టరు ఆ క్రమమును అనుసరించి, ఈ శ్లోకమున వారిద్దరిని శరణు వేడుచున్నారు.

తార్క్ష్యపక్షతివదస్య వల్లభాం రుద్రయా సహ సుకీర్తి మర్చయే ।
హర్షబాష్ప మపి కీర్తి మర్థినాం యన్ముఖేన కమలా కటాక్షయేత్ ॥

లక్ష్మీదేవి (తనను) ప్రార్థించువారికి ఆనందాశ్రువులను, కీర్తినికూడ గరుడపత్నుల ద్వారా అనుగ్రహించును. గరుత్మంతునకు, అతని రెక్కల మూలమువలె, మిక్కిలి ప్రియురాండ్రైన సుకీర్తిని, రుద్రాదేవిని అర్చింతును.

55. ఈశ్లోకమున భగవానునకు అంతరంగకైంకర్యమును చేయు పంచాయుధములను కని స్తుతించుచున్నారు.

స్వాస్త్రరూపస్ఫురన్మౌళి మాశబ్ద ఇ - త్యుద్ధునానాన్ సురాన్ తర్జనీముద్రయా ।
నాథనిద్రోచితోన్నిద్రతామ్రేక్షణాం సంచరంతీం స్తుమ స్తాం చ పంచాయుధీమ్॥

తమ తమ అస్త్రరూపములు ప్రకాశించు శిరస్సులను కలవారు, దేవతలను సద్దు చేయకుడని తమ చూపుడు వేలును ఎత్తి చూపు బెదరింపు ముద్రతో బెదరినవారినిగా చేయువారు. శ్రీరంగనాథుని నిద్రకు తగినట్లు రక్షణ చేయువారు, రక్షణ కార్యములో తమకు నిద్రలేకుండ ఉండుటచే ఎఱ్ఱనైన కన్నులను కల్గినవారు, ఎల్లప్పుడు తిరుగాడువారు అగు ఆ పంచాయుధరూపులను కూడ స్తుతించెదము.

56. పంచాయుధములలో ప్రధానమగు సుదర్శనచక్రరాజము ఇందు స్తుతింపబడుచున్నది. శ్రీరంగమున శ్రీసుదర్శనమునకు ప్రత్యేకముగా ఆలయముండుట కూడ ఇచట స్మరింపతగినది.

అస్త్రగ్రామాగ్రేసరం నాథవీక్షాసీధు క్షీబోద్వేలనృత్తాభిరామమ్ ।
చక్రం దైత్యచ్ఛేదకల్మాషితాంగమ్ భ్రామ్యజ్జ్వాలామాలభారి ప్రపద్యే ॥

శ్రీరంగనాథుని కటాక్షమనెడి మధుపానమువలన మదమును పొంది, అందువలన చేయు, అలవి కాని నర్తనముచే అందమైనది, అసురుల సంహారముచే కలుషితమైన శరీరమును కల్గినది, సుడులు తిరుగు జ్వాలల సమూహములను కల్గినది, భగవానుని దివ్యాయుధముల సమూహములో ప్రధానమైనదియు అగు సుదర్శనచక్రమును శరణుజొచ్చెదను.

57. భట్టరు ఈ శ్లోకమున హనుమద్విభీషణుల రామభక్తిని కొనియాడుచు, వారితో సంబంధమును కలిగియుండవలెను, వారికి సేవచేయవలెను అను అపేక్షను తెలియజేయుచున్నారు.

హనుభూషవిభీషణయోః స్యాం యతమా విహ మోక్ష ముపేక్ష్య ।
రఘునాయకనిష్క్రయభూతం భువి రంగధనం రమయేతే ॥

హనుమంతుడు, విభీషణుడు మోక్షమునుకూడ కాదని, ఈ భూలోకమున శ్రీరామునకు మూలధనమైన శ్రీరంగనాథుని (కైంకర్యము ద్వారా) సంతోషపెట్టు

చున్నారు. అట్టి హనుమంతునియొక్క, విభీషణునియొక్క సంబంధమును కల్గిన వాడనగుదును.

58. శ్రీరంగనాథుని ఆలయమున గర్భగృహములోని బాహ్యద్వారప్రదేశమున దారికి అడ్డముగా నిలుపబడినది, దేవాలయపాలనకైంకర్యమును నిర్వహించునది అగు వేత్రవరమును (బెత్తమును) భట్టరు ఈ శ్లోకమున ప్రస్తుతించుచున్నారు.

ఇతో బహిః పంచ పరాంచి ఖాని ప్రత్యంచి తాని స్వురితోఽంతరిత్థమ్ ।
ఔపాధికేభ్యో నిరుపాధిభోగ్యే ప్రత్యాహర ద్వేత్రవరం ప్రజామి ॥

"అయిదు ఇంద్రియములు ఈ ప్రదేశమునకు బయట బాహ్యవిషయములందు లగ్నమైనవి అగుగాక. ఆ ఇంద్రియములు ఈ ప్రదేశమునకు లోపల **"ప్రత్యక్"** అగు శ్రీరంగనాథునియందు లగ్నమైనవి అగుగాక" (అని) ఇట్లు సోపాధికములైన లౌకిక విషయములనుండి స్వయంభోగ్యతను కల్గిన శ్రీరంగనాథునియందు మన ఇంద్రియములను మరల్చు నట్టి, శ్రేష్ఠమైన బెత్తమును శరణువేడెదను.

59. వేత్రవరమును దాటి లోనికిపోగానే సాక్షాత్కరించునని, శ్రీరంగ విమానమునకు ఆధారములైయున్నవి అగు స్తంభములను రెండిటిని భట్టరు ఈ శ్లోకమున స్తుతించుచున్నారు.

శేషశయలోచనామృతనదీ రయాకులితలోలమానానామ్ ।
ఆలంబ మివామోదస్తంభద్వయ మంతరంగ మభియామః ॥

ఆదిశేషునిపై పవళించు శ్రీరంగనాథుని కటాక్షము అను అమృతమయమైన, నదియొక్క ప్రవాహవేగముచే మిక్కిలి కదల్చబడినవారై, అందువలన తడబడు భక్తులకు తగిన ఆధారమువలె ఉన్నవి, శ్రీరంగవిమానములోపల నున్నవి అగు ఆమోద స్తంభములను రెండిటిని సమీపింతుము.

60. శ్రీరంగవిమానములోని గర్భాలయ మిందు ప్రస్తుతింపబడుచున్నది.

శ్రీరంగాంతర్మందిరం దీప్రశేషం శ్రీభూమీతద్రమ్యజామాతృగర్భమ్ ।
పశ్యేమ శ్రీదివ్యమాణిక్యభూషా మంజూషాయా స్తుల్య ముస్మీలితాయాః ॥

తలలపై గల మణులచే ప్రకాశించు ఆదిశేషుని కల్గినది, శ్రీదేవి, భూదేవి ఆ శ్రీరంగనాథుడు - అను వీరిని ముగ్గురిని లోపలి భాగమున కల్గినది, తెరువబడినది, గొప్పదైన మణులతో చేయబడిన లక్ష్మీదేవి ఆభరణములను దాచు పేటికతో సమానమైనది అగు శ్రీరంగ విమానములోని గర్భగృహమును కన్నులార సేవింతుము.

61. శ్రీరంగనాథుని పాదసంవాహనముచేయు పరిచారికలను ఇందు కవి స్తుతించుచున్నారు. ఈ శ్లోకమున చెప్పబడిన కైంకర్యవిశేషములన్నియు భగవచ్ఛాస్త్రానుసారమని తెలియనగును.

లీలాలతాకృపాణీభృంగారపత్రహార్పితకరాగ్రాః
ప్రోతావతంసితకుచాః పదాబ్జసంవాహినీ ర్వయం స్తుమహే ॥

తీగ (వంటి) కత్తి, బంగారు గిన్నె, తమ్మపడిగము - అను వీనియందు విలాసముగా పెట్టిన చేతుల చివరి భాగములను కలవారు, ఒత్తుట కొఱకు అగు చేనేత వస్త్రములచే అలంకరింపబడిన స్తనములను కలవారు, శ్రీరంగనాథుని పాదార విందములను సంవాహనము చేయువారగు పరిచారికలను మనము స్తుతింతుము.

62. భగవద్రామానుజులు ''నిత్యగ్రంథమున'' తొమ్మిదిమంది చామర గ్రాహిణులను పేర్కొనిరి. ఆగమములలో కూడ తొమ్మిదిమంది చామరగ్రాహిణులు పేర్కొనబడిరి. భట్టరు ఆ క్రమమును అనుసరించి ఈ శ్లోకమున చామరకైంకర్యమునుచేయు పరిచారికలను స్తుతించుచున్నారు.

ముకులితనళినాః సకౌముదీకా ఇవ సునిశావిమలాదికా నవాపి ।
శిరసి కృతనమస్యదేకహస్తా ఇతరకరోచ్చలచామరా శ్రయేయమ్ ॥

ఒక చేతిని తలపై పెట్టుకొని నమస్కరించుచున్నవారు, వేఱొక చేతితో పైకి చామరములను వీచువారు, కావుననే ముడుచుకొనిన తామరపూవులను కల్గినవి, వెన్నెలతో కూడినవి అగు అందమైన రాత్రులవలె ఉన్నవారగు విమల మొదలగు తొమ్మిదిమంది చామరగ్రాహిణిలను కూడ ఆశ్రయింతును.

63. శ్రీరంగరాజస్తవమున 1వ శ్లోకము నుండి 62వ శ్లోకము వరకు గల భాగము అవతారిక వంటిది. శ్రీరంగనాథుని స్తవము ఈ శ్లోకమునుండి ప్రారంభమగుచున్నది. ఈ స్తుతి పూర్వశతకము చివరివరకు కొనసాగును. 63వ శ్లోకము నుండి 76వ శ్లోకము వరకు ''నమ్బెరుమాళ్'' అను పేరుతో ప్రసిద్ధులగు ఉత్సవమూర్తి 77వ శ్లోకము నుండి చివరివరకు ''పెరియపెరుమాళ్'' అని పిలువబడు మూలమూర్తియు స్తుతింపబడుచున్నారు.

ఉత్ఫుల్లపంకజతటాక మివోపయాని శ్రీరంగరాజ మిహ దక్షిణసవ్యసీమ్నోః ।
లక్ష్మీం విహారరసికా మివ రాజహంసీం ఛాయా మివాభ్యుదయినీ మవనీం చ తస్యాః ॥

ఈ శ్రీరంగమందిర గర్భగృహములో, బాగుగా వికసించిన తామరపూలను కల్గిన సరస్సువలె ప్రకాశించు శ్రీరంగనాథుని ఆశ్రయింతును. అతని కుడివైపు, ఎడమవైపు

శ్రీదేవి, భూదేవి వేంచేసిఉన్నారు. శ్రీరంగనాథుడను ఆ సరస్సులో విహరించుటలో ఆసక్తిని కల రాజహంసి (ఆడురాజహంస) వలె లక్ష్మీదేవి ఉన్నది. ఆ లక్ష్మీదేవియొక్క ఉత్తరోత్తరాభివృద్ధిని కల్గిన నీడవలె భూదేవి ఉన్నది. వారిని అందరిని ఆశ్రయింతును.

64. ముందుశ్లోకమున శ్రీరంగనాథుని కవి పద్మసరస్సుగా అభివర్ణించిరి. ఆ రూపణములోని భోగ్యతాతిశయమువలన వివశులైన భట్టరు మరల ఆ భావమునే భిన్న పదములతో అనుసంధించుచున్నారు.

పిబ నయన! పుర స్తే రంగధుర్యాభిధానం
స్థిత మిహ పరిఫుల్లత్పుండరీకం తటాకమ్ ।
శ్రియ మపి విహరంతీం రాజహంసీ మివాస్మిన్
ప్రతిఫలన మివాస్యాః పశ్య విశ్వంభరాం చ ॥

ఓ నేత్రమా! ఈ గర్భగృహమందు నీ ఎదుట ఉన్నది, బాగుగా వికసించిన తామర పూలను కల్గినది, శ్రీరంగనాథుడను పేరును కల్గినది అగు సరస్సును దర్శించుము. ఈ సరస్సులో విహరించుచున్న ఆడుహంసవలె ఉన్న లక్ష్మీదేవిని, ఈ లక్ష్మీదేవి ప్రతిరూపమువలె ఉన్న భూదేవినికూడ సేవింపుము.

65. ఈ శ్లోకమున కూడ శ్రీరంగనాథుడు పద్మసరస్సుగా రూపింపబడుచున్నాడు.

సౌశీల్యశీతల మవేలకృపాతరంగ -
సంప్లావితాఖిల మకృత్రిమభూమనిమ్నమ్ ।
లక్ష్మ్యా చ వాసిత మభూమ విగాహమానాః
శ్రీరంగరాజమిషపద్మసరః ప్రసన్నమ్ ॥

సౌశీల్యగుణముచే చల్లనిది, అవధి లేని కరుణ అనెడు కెరటములతో పూర్తిగా సమస్తజనమును ఆనందింపచేయునది, సహజమైన గొప్పతనమును కల్గినది (విస్తృతమైనది), లోతైనది (తెలుసుకొనుటకు సాధ్యము కాని స్వరూపరూప గుణవిభూతులను కల్గినది) అయినను, లక్ష్మీదేవిచే పరిమళింపచేయబడినది (నివసింపబడినది), తేటనైనది అగు శ్రీరంగనాథుడను పద్మసరస్సున అవగాహనము చేయువారము (నీరాడువారము) అయితిమి.

66. శ్రీదేవి, భూదేవులతో కలసి సింహాసనమున వేంచేసియుండు శ్రీరంగనాథుని ఉత్సవమూర్తిసన్నివేశమును కవి ఈ శ్లోకమున అనుభవించుచున్నారు.

సింహాసనే కమలయా క్షమయా చ విశ్వ-మేకాతపత్రయితు మస్మదసూన్ నిషణ్ణమ్।
లక్ష్మీస్వయంవర సనాథితయౌవనశ్రీ-సౌందర్యసంపదవలిప్త మివా లిహీయ॥

సమస్త చరాచరప్రపంచమును ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించుటకు (ఒకే గొడుగును కల్గినదిగా చేయుటకు) లక్ష్మీదేవితో భూదేవి తోను సింహాసనమున వేంచేసియున్నవాడు, మాకు ప్రాణమైనవాడు, లక్ష్మీదేవియొక్క స్వయంవరముచే కృతార్థమైన యౌవనశోభతో, సౌందర్య సంపదతో గర్వించినవానివలె ఉన్నవాడగు శ్రీరంగనాథుని ఆస్వాదింతును (దర్శింతును).

67. క్రిందటిశ్లోకమున శ్రీరంగనాథుని పరత్వమును అనుభవించిన భట్టరు, పరత్వ సౌలభ్యములు రెండును ఆశ్రయణమునకు ఆవశ్యకములగుటచే ఆ రెంటిని కలిపి ఈ శ్లోకమున అనుభవించుచున్నారు.

ఆపాదమూలమణిమౌళి సముల్లసంత్యా
స్వాతంత్ర్యసౌహృదతరంగితయా ఽంగభంగ్యా ।
సఖ్యం సమస్తజనచేతసి సందధానం
శ్రీరంగరాజ మనిమేష మనుస్రియాస్మ ॥

పాదములు మొదలు శిరస్సువరకు ప్రకాశించు స్వాతంత్ర్యగుణముచే (పరత్వముచే), సౌహృదగుణముచే (సౌలభ్యగుణముచే) తరంగితమైన (అలలతో కూడుకొనియున్న) అవయవముల సన్నివేశముతో, జనులందరియొక్క మనస్సున స్నేహమును (అనురాగమును, విశ్వాసమును) కలిగించువాడగు శ్రీరంగనాథుని కనురెప్పపాటు లేకుండునట్లు అనుసరింతుము.

68. ఈశ్లోకమున కవి శ్రీరంగనాథుని కల్పవృక్షముతో పోల్చుటద్వారా వర్ణించుచున్నారు.

క్షితికమలనివాసాకల్పవల్లీసలీలో -
ల్లుఠనదశదిశోద్యద్యౌవనారంభజృంభః ।
శ్రమ మపహరతాం మే రంగధామేతి తత్తత్ -
వరమయఫలనమ్రః పత్రలః పారిజాతః ॥

భూదేవి, లక్ష్మీదేవి అను కల్పలతల విలాసముతోకూడిన ఆలింగనములచే (పరివేష్ఠనములచే) పది దిక్కులలోను ప్రకాశించు యౌవనారంభమును కల్గినది, ఆకులతో నిండినది, ఆ యా వరములనెడు ఫలములతో (కొంచెము) వంగినది అగు శ్రీరంగనాథుడను పారిజాతవృక్షము నా శ్రమను పోగొట్టుగాక !

69. శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి సన్నివేశమును ఇందు భట్టరు స్తుతించుచున్నారు. పూర్వశ్లోకమున మాటలాడనేరని కల్పవృక్షముతో రంగనాథునిపోల్చిన కవి ఇందు మాటలాడువృక్షముగా వర్ణించుచున్నారు.

సంభాషమాణ మివ సర్వవశంవదేన
మందస్మితేన మధురేణ చ వీక్షణేన ।
దివ్యాస్త్రపుష్పితచతుర్భుజ మత్యుదారం
రంగాస్పదం మమ శుభాశ్రయ మాశ్రయామి ॥

అందరిని వశము చేసికొను, తీయనైన చిఱునవ్వుతో, చూపుతోను మాటలాడునట్లున్నవాడు, గొప్పవైన (అప్రాకృతములైన) ఆయుధములతో పుష్పించునట్లుండు నాల్గు భుజములను కలవాడు, మిక్కిలి ఉదారుడు, నాకు మంగళకరమైన ఆశ్రయమైనవాడు, శ్రీరంగమును నిలయముగా కలవాడును అగు శ్రీరంగనాథుని ఆశ్రయింతును.

70. దివ్యాయుధములతో, అభయముద్రతో కూడిన శ్రీరంగనాథుని ఉత్సవమూర్తియొక్క సన్నివేశమున భట్టరు ఇందు రమ్యమైన ఉత్ప్రేక్షతో స్తుతించుచున్నారు.

ఏతే శంఖగదాసుదర్శనభృతః క్షేమంకరా బాహవః
పాదద్వంద్వ మిదం శరణ్య మభయం భద్రం చ వో హే జనాః ।
ఇత్యూచుష్యభయంకరే కరతలే స్మేరేణ వక్త్రేణ తత్
వ్యాకుర్వన్నివ నిర్వహే న్మమ ధురం శ్రీరంగసర్వంసహః ॥

"ఓ జనులారా! (పాంచజన్యమను) శంఖము, (కామోదకి అను) గద, సుదర్శన చక్రము - అను ఆయుధములను ధరించు ఈ బాహువులు మీకు క్షేమమును కల్గించునవి. ఈ పాదముల జంట మీకు గొప్ప రక్షకము. భయమును తీర్చునది. మంచిని కల్గించునది కూడ" - అని అభయమును కల్గించు ముద్రతోకూడిన శ్రీరంగనాథుని చేయి పల్కుచున్నది. ఆ విషయమును చిఱునవ్వును కల ముఖముతో వ్యాఖ్యానించువానివలె శ్రీరంగనాథుడు ఉన్నాడు. అతడు నా భారమును నిర్వహించును గాక! (పూర్తిగా వహించునుగాక).

71. శ్రీరంగనాథుని అవయవసన్నివేశమును దర్శించిన కవి నిత్యనూతనమై అలరారు స్వామిని పూర్ణముగా అనుభవించుట సాధ్యము కాదను విషయమును ఇందు ఆశ్చర్యపూర్వకముగా వర్ణించుచున్నారు.

అంగై రహంప్రథమికాచరితాత్మదానైః
ఆమోదమాన నవయౌవనసావలేపైః ।
హై పారిజాత మివ నూతనతాయమాన -
శాఖాశతం కథ మధీమహి రంగధుర్యమ్ ॥

భక్తులకు అనుభవవిషయము అగుటలో "నేను ముందు నేను ముందు" అని ఒకదానికంటే ఇంకొకటి ముందుకు వచ్చునవి, భగవదనుభవమును భక్తులకు అందునట్లు వితరణములను చేయునవి, (కావుననే) పరిమళించునట్టి (మిక్కిలి సంతోషించునట్టి) క్రొత్తదైన యౌవనముచే గర్వముతో కూడినవి అగు తన దివ్యమైన అవయవములతో శ్రీరంగనాథుడు, నిత్యనూతనముగానున్న, పలుశాఖలను కల పారిజాతవృక్షమువలె ఉన్నాడు. ఆ శ్రీరంగనాథుని ఎట్లు అనుభవింపగలము? ఆశ్చర్యము!

72. శ్రీరంగనాథుని శృంగారరసమూర్తిగా రూపించుచు కవి తదనుగుణముగా ఇందు కొన్ని అపూర్వములైన విభావానుభావములను ప్రతిపాదించుచున్నారు.

ఆలోకా హృదయాలవో రసవశాన మీషత్స్మితం
ప్రచ్ఛాయాని వచాంసి పద్మనిలయాచేతఃశరవ్యం వపుః ।
చక్షుష్మంతి గతాగతాని త ఇమే శ్రీరంగశృంగార! తే
భావా యౌవనగంధినః కి మపరం సించంతి చేతాంసి నః ॥

శ్రీరంగమున శృంగారరసము మూర్తీభవించినట్లున్న శ్రీరంగనాథస్వామీ! నీ కటాక్షములు (ఆశ్రితులపట్ల) ప్రేమను కల్గినవి. మందహాసము (చిఱు దరహాసము) ప్రణయరసమువలన అందరిని వశపఱచుకొనునది. పలుకులు (సంసార తాపమును తీర్చు) నీడనిచ్చునవి. దివ్యమంగళ విగ్రహము లక్ష్మీదేవియొక్క మనస్సును లక్ష్యముగా కల్గినది. తిరువీథులలోని రాకపోకలు కన్నుల కింపైనవి. వేఱొకటి ఏమి? ఆ ఈ (ఇట్టి) యౌవనమును సూచించునట్టి నీ విషయములు అన్నియు (దాసులమైన) మాయొక్క మనస్సులను (తడపుచున్నవి) చల్లపఱచుచున్నవి.

73. 65వశ్లోకమున ''ప్రసన్నం శ్రీరంగరాజమిషపద్మసరః విగాహమానాః అభూమ'' అనుచు భగవదనుభవమజ్జనమును ప్రస్తుతించినకవి ఇందు అట్టి మజ్జనమును చేయుటలో సిద్ధహస్తులగు నమ్మాళ్వార్ల రీతిని అనుసరించుచున్నారు.

ఆయత్కిరీట మళికోల్లసదూర్ధ్వపుండ్ర - మాకర్ణలోచన మనంకుశకర్ణపాశమ్ ।
ఉత్ఫుల్లవక్షసు ముదాయుధబాహు మర్హ - న్నీవీం చ రంగపతి మబ్జపదం భజామ॥

ఎత్తైన కిరీటమును కల్గినవాడు, లలాటమున విలసిల్లు ఊర్ధ్వపుండ్రమును కలవాడు, చెవులవరకు విస్తరించిన విశాలములైన నేత్రములను కల్గినవాడు, అడ్డు లేని (పాశమువంటి) గొప్ప కర్ణములను కల్గినవాడు, విశాలమైన వక్షఃస్థలమును కలవాడు, గొప్ప ఆయుధములను (లేక, పైకెత్త బడిన ఆయుధములను) కల

బాహువులను కల్గినవాడు, ప్రకాశించు వస్త్రబంధమును, పద్మములవంటి పాదములను కలవాడును అగు శ్రీరంగనాథుని సేవింతుము.

74. ఈశ్లోకము కూడ పూర్వశ్లోకమువలెనే శ్రీరంగనాథుని దివ్యమంగళరూపమును వర్ణించుచున్నది. కాని ఇందు పాదపీఠాదిముఖపర్యంతవర్ణనము చేయబడినది.

అబ్జన్యస్తపదాబ్జ మంచితకటీసంవాది కౌశేయకమ్
కించిత్తాండవగంధిసంహననకం నిర్వ్యాజమందస్మితమ్ ।
చూదాచుంబిముఖాంబుజం నిజభుజావిశ్రాంతదివ్యాయుధమ్
శ్రీరంగే శరదశ్శతం తత ఇతః పశ్యేమ లక్ష్మీసఖమ్ ॥

ఆసనపద్మమున నిలుపబడిన తామరలవంటి పాదములను కలవాడు, అందమైన నడుముకు తగిన పీతాంబరమును కలవాడు, కొద్దిపాటి నాట్యభంగిమతో ప్రకాశించు దివ్యమంగళ రూపమును కలవాడు, స్వభావసిద్ధమైన చిఱునవ్వును కలవాడు, కరీటమును స్పృశించు పద్మమువంటి ముఖమును కలవాడు, తన బాహువులయందు విశ్రమించిన గొప్ప ఆయుధములను కలవాడగు శ్రీరంగనాథుని శ్రీరంగమున అక్కడ, ఇక్కడ అంతట దర్శింతుము గాక!

75. కవి శ్రీరంగనాథుని ఈ శ్లోకమున అపర్యాప్తామృతముగా (ఆరావముదమ్) స్తుతించుట విశేషము. నమ్మాళ్వార్లు భగవానుని ''ఆరావముదే'' (తి.వా. 5-8-1) అని ప్రస్తుతించుట ఈ రూపణమునకు నిదానమని చెప్పవచ్చును.

అగ్రే తారేక్ష్యణ పశ్చా దహిపతిశయనేనాత్మనా పార్శ్వయో శ్చ
శ్రీభూమిభ్యా మతృప్త్యా నయనచులకనైః సేవ్యమానామృతౌఘమ్ ।
వక్త్రేణావిస్మితేన స్ఫురదభయగదాశంఖచక్రైః భుజాగ్రైః
విశ్వస్మై తిష్ఠమానం శరణ మశరణా రంగరాజం భజామః ॥

ముందు భాగమున గరుత్మంతునిచే, వెనుక భాగమున శేషశయనుడగు తనచే (శ్రీరంగనాథునిచే), మఱియు, రెండువైపుల లక్ష్మీదేవి, భూదేవులచే సంతృప్తి లేకుండుటచే నేత్రములు అను పుడిసిళ్లతో నిత్యము సేవింపబడుచున్న (తన సౌందర్యమనెడి) అమృతప్రవాహ మును కలవాడు, చిఱునవ్వు తొణికిసలాడు ముఖముతో ప్రకాశించు వాడు, అభయహస్తము, గద, శంఖము, చక్రము - అను వీనిని దాల్చిన భుజాగ్రములతో (కరములతో) అందరకు తన మనస్సును తెలియజేయుచు నిలచియున్నవాడగు శ్రీరంగనాథుని వేఱొక దిక్కు లేనివారమై సేవింతుము.

76. ఈ స్తవమున భట్టరు 63వ శ్లోకము మొదలు ముందుశ్లోకమువరకు - అనగా 13శ్లోకములలో శ్రీరంగనాథుని ఉత్సవమూర్తిని ఉపాయముగా స్తుతించిరి. ఇందు ఆ స్వామిని ఉపేయముగా ''అస్మద్ధనం'' అనుచు స్తుతించుచున్నారు.

ఆర్తాపాశ్రయ మర్థికల్పక మసహ్యాగస్కరక్ష్మాతలమ్
సద్యః సంశ్రితకామధేను మభియత్సర్వస్వ మస్మద్ధనమ్ ।
శ్రీరంగేశ్వర మాశ్రయేమ కమలాచక్షు ర్మహీజీవితమ్
శ్రీరంగే స సుఖకరోతు సుచిరం దాస్యం చ ధత్తాం మయి ॥

బాధను పొందినవారికి (గొప్ప) ఆశ్రయము (ఆలంబనము), అర్థించు జనులకు కల్పవృక్షము. సహింపరాని పాపము చేసినవారిపట్ల భూతలము (క్షమను కలవాడు). అపుడే ఆశ్రయించినవారికి కామధేనువు. ఆళ్వార్లవంటి ముముక్షువులకు సర్వస్వము. మాకు సంపద. శ్రీదేవికి నేత్రము. భూదేవికి జీవితము. అట్టి శ్రీరంగనాథుని ఆశ్రయింతుము గాక. ఆ ప్రభువు చిరకాలము శ్రీరంగమున (మమ్ములను) సుఖింప జేయుగాక! నాకు దాస్యవృత్తిని (కైంకర్యవృత్తిని) కూడ అనుగ్రహించునుగాక!

77. ఈశ్లోకము మొదలుకొని శ్రీరంగనాథుని మూలమూర్తి స్తుతింపబడుచున్నాడు.

స్వఫణవితానదీప్రమణి మాలిసుదామరుచి –
ప్రుదిమసుగంధిభోగ సుఖశాయితరంగధనమ్ ।
మదభరమంథరోచ్ఛ్వసితనిశ్శ్వసితోత్తరళమ్
ఫణిపతిదోలికాతళిమ మాశ్వసిమః ప్రణతాః ॥

ఆదిశేషుడను తూగుటయ్యాల మంచము తన పడగలనెడు మేలుకట్టులో ప్రకాశించు మణుల వరుసలను కల్గినది. చక్కని పూలమాలెలయొక్క అందమును, మెత్తనిదనమును, పరిమళమును కల్గిన తన శరీరము నందు సుఖముగా శయనింప జేసిన, శ్రీరంగములో ధనమువంటి వాడైన, శ్రీరంగనాథుని కల్గినది. భగవదనుభవముచే కల్గిన మదముచే మెల్లగా కదలునది, ఉచ్ఛ్వాస నిఃశ్వాసము లచే పైకి కిందకు ఊగునట్టిది. అట్టి గొప్పదైన ఆదిశేషుని రూపములోని తూగుటయ్యలను నమస్కరించు వారమై ఓదార్పునొందితిమి.

78. ఈశ్లోకమునుండి అనంతశాయి అగు శ్రీరంగనాథుని మూలమూర్తి స్తోత్రము ప్రారంభమగుచున్నది.

వటదళదేవకీజఠర వేదశిరఃకమలా –
స్తనశఠకోపవాగ్వపుషి రంగగృహే శయితమ్ ।

వరద ముదారదీర్ఘభుజలోచనసంహననం
పురుష ముపాసిషీయ పరమం ప్రణతార్తిహరమ్ ॥

మఱ్ఱి చిగురుటాకులో దేవకీదేవిగర్భములో, వేదాంతములలో, లక్ష్మీవక్షోజములలో, నమ్మాళ్వార్ల శ్రీసూక్తి అగు తిరువాయ్‌మొళిలో, వారి తిరుమేనిలో, అదేవిధముగా, వీటివలే భోగ్యమైన శ్రీరంగవిమానములో శయనించినవాడు, వరముల నొసగువాడు, గొప్ప పొడవైన భుజములను, కన్నులను కల రూపమును కలవాడు, తనకు నమస్కరించినవారి ఆర్తిని పోగొట్టువాడు, పరమపురుషుడగు శ్రీరంగనాథుని ఉపాసింతును.

79. ఈ శ్లోకమున కవి అర్చామూర్తియొక్క వైభవమును పరోక్షముగా శ్రీరంగనాథుని స్తుతించుటద్వారా వర్ణించుచున్నారు.

ఉదధిపరమవ్యోమ్నోః విస్మృత్య పద్మవనాలయా –
వినిమయమయీం నిద్రాం శ్రీరంగనామని ధామని ।
ఫణిపరిబృఢస్ఫార ప్రశ్వాసనిశ్శ్వసితక్రమ –
స్ఫలితనయనం తన్వన్ మన్వీత నః పరమః పుమాన్ ॥

పాలసముద్రమును, పరమపదమును మఱచి, లక్ష్మీదేవిని కొంచెముసేపు చూచుట, మఱికొంచెము సేపు యోగనిద్రను పొందుట – అను పరివృత్తిని కల నిద్రను శ్రీరంగమను పేరు కల కోవెల యందు పొందువాడు, ఆదిశేషునియొక్క, అధికమైన ఉచ్ఛ్వాసనిశ్శ్వాసముల క్రమముచే (వరుసచే) తొట్రుపాటు పడు నేత్రములను కల్గినవాడు, పరమపురుషుడగు శ్రీరంగనాథుడు మనలను దయతో అనుగ్రహించును గాక!

80. ఈ శ్లోకమున భట్టరు నల్లని శ్రీరంగవిమానమున పరుండియున్న శ్రీరంగనాథుని మూడు అపూర్వములైన ఉపమలతో వర్ణించుచున్నారు.

జలధి మివ నిపీతం నీరదే నాద్రిమగ్ధౌ
నిహితమివ శయానం మంజరం వాఽద్రికుంజే ।
కమలపదకరాక్షం మేచకం ధామ్ని నీలే
ఫణిన మధిశయానం పూరుషం వందిషీయ ॥

నల్లనివాడు, శ్రీరంగవిమానమునందు ఆదిశేషునిపై పరుండియున్నవాడు, కమలములవంటి పాదములను, చేతులను, కన్నులను కలవాడు, మేఘముచే పూర్తిగా పానము చేయబడిన సముద్రమువలె ఉన్నవాడు, సముద్రమున నిలుపబడిన పర్వతమువలె ఉన్నవాడు, పర్వతమునందలి పూపొదరింటిలో పరుండిన ఏనుగువలె ఉన్నవాడు, పరమపురుషుడగు శ్రీరంగనాథుని నమస్కరింతుము గాక!

81. ముందు శ్లోకమున కవి శ్రీరంగనాథుని సముద్రముతో ఉపమించెను. ఈ శ్లోకమున ఆ ఉపమానమునకు మరింత మెఱుగును దిద్దుచు అపూర్వమైన ఉత్ప్రేక్షతో వర్ణించుచున్నారు.

శ్రీరంగేశయ ఇహ శర్మ నిర్మిమీతా మాతామ్రాధర పదపాణివిద్రుమో నః ।
కావేరీలహరికరోపలాల్యమానో గంభీరాద్భుత ఇవ తర్ణకోఽర్ణవస్య ॥

అంతట మిక్కిలి ఎఱ్ఱనివి అయిన కింది పెదవి (అధరము), పాదములు, హస్తములు-అను పగడములను కల్గినవాడు, కావేరీనదియొక్క కెరటములు అను చేతులతో లాలింపబడుచున్నవాడు, గంభీరమైన, ఆశ్చర్యకరమైన సముద్రముయొక్క శిశువువలె ఉన్నవాడగు శ్రీరంగనాథుడు మనకు ఈ లోకమున సౌఖ్యమును కలుగజేయును గాక!

82. ముందుశ్లోకమున భట్టరు శ్రీరంగనాథుని సముద్రపోతముగా వర్ణించిరి. ఈ శ్లోకమున శ్రీరంగనాథుని శీతలకాళమేఘముగా సావయవరూపకముతో వర్ణించుచున్నారు.

సించేదిమం చ జన మిందిరయా తటిత్వాన్ భూషామణిద్యుతిభి రింద్రధనుర్ధధానః ।
శ్రీరంగధామని దయారసనిర్భరత్వాత్ అద్రౌ శయాళు రివ శీతలకాలమేఘః ॥

లక్ష్మీదేవి అను మెఱుపుతీగను కల్గినవాడు, నగలలో పొదగబడిన, అనేక రంగులలోని మణుల కాంతులచే ఇంద్రధనుస్సును కల్గినవాడు, దయ అను నీటితో నిండియుండువాడు, కావుననే శ్రీరంగము అను పర్వతమునందు శయనించునట్టి చల్లని, నల్లని మేఘమువలె ఉన్నవాడగు శ్రీరంగనాథుడు ఈ దాసునికూడ కరుణా రసముతో అభిషేకించును గాక!

83. ఈ శ్లోకమున కవి శ్రీరంగనాథుని అమృత ప్రవాహముగా అభివర్ణించుచున్నారు.

ఆమౌళిరత్నమకరాత్ పునరాచ పద్భ్యామ్ ధామక్రమోన్నమదుదారమనోహరాంగమ్।
శ్రీరంగశేషశయనం నయనైః పిబామ పశ్యన్మనఃప్రవణమోఘ మివామృతస్య ॥

కిరీటమునందు మొసలిరూపములో పొదగబడిన రత్నములనుండి పాదముల వరకు గల తేజస్సుల వరుసచే ఉన్నతములై వర్ధిల్లుచున్నవి, గొప్పవి, మనస్సును ఆకర్షించునవి అగు అవయవములను కలవాడు, శ్రీరంగమున ఆదిశేషుని శయనముగా కలవాడును అగు శ్రీరంగనాథుడు తనను దర్శించువారి మనస్సులో తానే వచ్చి ప్రవహించు అమృతము ప్రవాహము వలె ఉన్నాడు. ఆ స్వామిని కన్నులతో పానము చేయుచున్నాము (అనుభవించుచున్నాము).

84. దేవలోకములో అమృతముతోపాటు నందనవనమును ఉండును కదా! గతశ్లోకమున శ్రీరంగనాథుని అమృతప్రవాహముగా వర్ణించినకవి ఇందు శ్రీరంగనాథుని నందనవనముగా అద్భుతమైన ఉత్ప్రేక్షతో భట్టరు స్తుతించుచున్నారు.

అరవిందిత మంఘ్రిపాణివక్త్రైః అపి తాపింఛిత మంచితాంగకాంత్యా ।
అధరేణ చ బంధుజీవితం శ్రీః నియతం నందనయేత రంగచంద్రమ్ ॥

తామరపూవులవంటి పాదములను, కరములను, ముఖములను కల్గినవాడు, తమాలపుష్పముల కాంతివంటి అందమైన (గొప్పదైన) తన దేహకాంతిని కల్గినవాడు, మంకెన పువ్వువంటి అధరములను కల్గినవాడు, చంద్రునివంటివాడైన శ్రీరంగనాథుని లక్ష్మీదేవి తప్పక నందనవనముగా తలచి ఆనందించును గాక!

85. ఈ శ్లోకమును ''తనకు తగినవి, సాటిలేనివి, చిన్మయములు కావున స్వయం ప్రకాశములు, పరస్పరము కాంతిని ఇనుమడింపచేసికొనునని అగు వనమాల, పీతాంబరము, ఆభరణములతో కూడినవానిని'' అను పౌష్కరసంహితలోని ప్రమాణశ్లోకమును దృష్టిలో నుంచుకొని భట్టరు రచించినట్లు తోచును.

అన్యోన్యరంజకరుచోఽనుపమానశోభాః
దివ్యస్రగంబరపరిష్కరణాంగరాగాః ।
సంస్పర్శతః పులకితా ఇవ చిన్మయత్వాత్
రంగేందుకాంతి మధికా ముపబృంహయంతి ॥

పరస్పరము శోభను కల్గించు కాంతిని కల్గినవి, సాటి లేని శోభను కల్గినవి అగు వనమాల, పీతాంబరము, ఆభరణములు, మైపూతలు - అను ఇవి చైతన్యరూప మును కల్గినవి అగుటచే శ్రీరంగనాథుని దివ్యదేహస్పర్శవలన గగుర్పాటును పొందినవి వలె తోచును, మిక్కుటమైన చంద్రునివంటి శ్రీరంగనాథుని శోభను వృద్ధిపఱచుచున్నవి.

86. పెరియాళ్వార్లు, పేయాళ్వార్లు భగవానునిరూపము మరతకమణిసదృశమని స్తుతించిరి. ఇట్లే మరికొందఱు ఆళ్వార్లును ఇట్టి వర్ణనను చేసిరి. కవి ఆ క్రమమును అనుసరించుచు ఇందు శ్రీరంగనాథుని అపూర్వమైన ఉత్ప్రేక్షద్వారా మరతకమణిరూపిగా వర్ణించుచున్నారు.

ద్రుతకనకజగిరి పరిమిళదుదధి ప్రచలితలహరివ దహమహమికయా ।
స్నపయతి జన మిమ మపహరతి తమః ఫణిశయమరతక మణికిరణగణః ॥

ఆదిశేషునిపై పరుండియుండు శ్రీరంగనాథుడనెడి మరతకమణి నుండివెలువడు కాంతిసమూహము, కఱిగి స్రవించిన మేరుపర్వతముతో కలసియున్న సముద్రము నుండి పైకెగసిన కెరటములవలె, 'నేను ముందు నేను ముందు' అనునట్లుగా ఈ దాసుని స్నానము చేయించుచున్నది (మనస్సులోని) చీకటిని పోగొట్టుచున్నది.

87. ఈ శ్లోకమున కవి శ్రీరంగనాథుని సౌరభ్యగుణమును స్తుతించుచున్నారు.

భోగీంద్రనిశ్శ్వసితసౌరభవర్ధితం శ్రీనిత్యానుషక్తపరమేశ్వరభావగంధి ।
సౌరభ్య మాప్లుతదిశావధి రంగనేతుః ఆనందసంపది నిమజ్జయతే మనాంసి ॥

ఆదిశేషుని నిట్టూర్పుల పరిమళముచే పెంపొందింపబడినది లక్ష్మీదేవియొక్క నిత్యసంశ్లేషముచే ఏర్పడిన సర్వేశ్వర్వముయొక్క సువాసనను కల్గినది దిక్కుల చివరివరకును వ్యాపించినదియు అగు శ్రీరంగనాథునియొక్క తిరుమేనిపరిమళము భక్తుల మనస్సులను ఆనందమనెడి సంపదయందు ఓలలాడించుచున్నది.

88. ముందుశ్లోకమున శ్రీరంగనాథుని సౌగంధ్యమును ప్రస్తావించిన భట్టరు ఇందు స్వామి సౌకుమార్యమును ప్రస్తుతించుచున్నారు.

రంగభర్తు రపి లోచనచర్చాం సాహసావళిషు లేఖయమానమ్ ।
పుష్పహాస ఇతి నామ దుహానం సౌకుమార్య మతివాఙ్మనసం నః ॥

చూచువారి చూపుల లేపనమును(ప్రసరణమును) కూడ సహించనది, "పుష్పహాసః" అను పేరును సార్థకము చేయునది అగు శ్రీరంగనాథుని సౌకుమార్య గుణము మన వాక్కుకు, మనస్సుకు అందనిది.

89. సౌందర్యము అనగా ప్రత్యంగశోభ. లావణ్యము ఆ అంగముల కలయిక వలన ఏర్పడు సముదాయ శోభ. కవి ఇచట చమత్కారముగా తన నేత్రమును సంబోధించుచు, ఈ రెండిటిని వర్ణించుచున్నారు.

ఏకైకస్మిన్ పరమవయవే౽ నన్తసౌందర్యమగ్నం
సర్వం ద్రక్ష్యే కథ మితి ముధా మా మధా మందచక్షుః! ।
త్వాం సౌభ్రాత్రవ్యతికరకరం రంగరాజాంగకానాం
తల్లావణ్యం పరిణమయితా విశ్వపారీణవృత్తి ॥

లావణ్య గుణము అనునది ఒకటి ఉన్నదని తెలియని ఓ మూఢమైన నేత్రమా! శ్రీరంగనాథుని ఒక్క అవయవములోని మిక్కిలి అంతులేని సౌందర్యముననే మునిగిన (నేను) అన్ని అవయవములలోని సౌందర్యమునంతటిని ఎట్లు దర్శింతును? అని వ్యర్థముగా శంకింపకుము. శ్రీరంగనాథుని అవయవములకు మధ్య సౌహార్ద సంబంధమును కల్గించు ఆ లావణ్యము నిన్ను అన్ని అవయవములను పూర్తిగా అనుభవించుదానినిగా నెఱవేర్చును (చేయును).

90. ఈ శ్లోకమున భట్టరు శ్రీరంగనాథుని అలౌకికారుణ్యశోభను రమణీయమైన రూపకము ద్వారా వర్ణించుచున్నారు.

వపు ర్మందారస్య ప్రథమకుసుమోల్లాసమయుః
క్షమాలక్ష్మీభృంగీ సకలకరణోన్మాదనమధు ।
వికాసుః సౌందర్యప్రజి రసికతాశీధుచుళకో
యువత్వం రంగేందోః సురభయతి నిత్యం సుభగతామ్ ॥

చంద్రునివంటి శ్రీరంగనాథుని నిత్యమైన యౌవనము, ఆ స్వామి యొక్క శరీరమనెడి మందారవృక్షము మొదటిగా పూవుయొక్క పుష్పించు సమయము (పరువము). భూదేవి, లక్ష్మీదేవి - అను ఆడుతుమ్మెదల సమస్త ఇంద్రియములకు మిక్కిలి మత్తును కల్గించు మధువు. అందము అను పూమాలలోని వికాసము. రాసిక్యమనెడి మధువునకు పుడిసిలి. అది ఆస్వామికి నిత్యము సౌభాగ్యమును పరిమళింప జేయుచున్నది.

91. ఈ శ్లోకమునుండి శతకము చివరివరకు వరుసగా కిరీటముమొదలు పాదములవరకు గల స్వామి దివ్యరూపమును స్తుతించుచున్నారు.

కిరీటచూడరత్నరాజి రాధిరాజ్యజల్పికా ।
ముఖేందుకాంతి రున్ముఖం తరంగితేవ రంగిణుః ॥

శ్రీరంగనాథుని సర్వేశ్వరత్వమును చాటునట్టి కిరీటము, శిఖాపట్టము - అను వీనియందలి రత్నములయొక్క వరుస - పైదిశలో కెఱటముల రూపమున ప్రసరించిన ముఖచంద్రునియొక్క (కాంతి) శోభ వలె (ఉన్నది).

92. ఈ శ్లోకమున భట్టరు శ్రీరంగనాథుని కిరీటమును రాజ్యలక్ష్మి విహరించు లీలా పర్వతముగా, చూడామణిని ఆ పర్వతముయొక్క నితంబప్రదేశముగా ఉత్ప్రేక్షించు చున్నారు.

శిఖారత్నోద్దీప్రం దిశి దిశి చ మాణిక్యమకరీ -
లసచ్ఛృంగం రంగప్రభుమణికిరీటం మనుమహే ।
సముత్తుంగస్ఫీతం చిదచిదధిరాజశ్రియ ఇవ
ప్రియాక్రీడం చూడామణి మపి నితంబం తమభితుః ॥

అన్ని దిక్కులలోను చూడామణిచే మిక్కిలి ప్రకాశించునది, ఆడుమొసలి రూపములోనున్న మాణిక్యముచే ప్రకాశించుచున్న శిఖరమును (అగ్రభాగమును) కల్గినది అగు శ్రీరంగనాథునియొక్క మణిమయకిరీటమును - చేతనాచేతనములకు నియామకుడైన ఆ భగవానుడు, లక్ష్మీదేవి విహరించు మిక్కిలి ఎత్తైన విశాలమైన (గొప్పదైన), పెద్దదైన, వారికి ప్రియమైన లీలాపర్వతముగా (ఆటవస్తువుగా) తలతుము.

ముఖపట్టమున గల రత్నమును కూడ, ఆ పర్వతముయొక్క నితంబ ప్రదేశముగా (తలంతుము).

93. ఈ శ్లోకమున శ్రీరంగనాథుని ముఖశోభ ప్రస్తుతమగుచున్నది.

విహరతు మయి రంగిణ శ్చూళికా భ్రమరకతిలకోర్ధ్వపుండ్రోజ్జ్వలమ్ ।
ముఖ మమృతతటాకచంద్రాంబుజ స్మయహరశుచిముగ్ధమందస్మితమ్ ॥

శ్రీరంగనాథుని ముఖమండలము – కేశపాశము, నుదుటియందలి ముంగురులు, తిలకము రూపముననున్న ఆభరణము, ఊర్ధ్వపుండ్రము – అను వీనిచే మిక్కిలి ప్రకాశించునది. అది, అమృతమయమైన చెఱువు, చంద్రుడు, పద్మము–అను వీనియొక్క గర్వమును హరించునట్టిది. తెల్లనైనది, అందమైనది అగు చిఱునవ్వును కల్గినది. ఆ ముఖము నా (మనస్సు)లో విహరించుగాక!

94. ఇందు శ్రీరంగనాథుని ముఖమును అరవిందముతో పోల్చుచు భట్టరు వర్ణించుచున్నారు.

ముఖపుండరీక ముపరి త్రికంటకం తిలకాశ్చ కేసరసమాः సమౌక్తికాः ।
ఇహ రంగభర్తు రభియన్మధువ్రతప్రకరశ్రియం భ్రమరకాణి బిభ్రతి ॥

మూడు రేఖలతో కూడిన శ్రీరంగనాథుని ముఖము – అరవిందమువంటిది. దాని పైన గల ముత్యములతో కూడిన తిలకాభరణములు – ఆ పద్మములోని కింజల్కములతో సమానములు. ఆ ముఖములోని ముంగురులు – (ముఖ పుండరీకమునకు) అభిముఖముగా వచ్చుచున్న తుమ్మెదల సమూహమువంటివి.

95. శ్రీరంగనాథుని ఫాలమునగల ఊర్ధ్వపుండ్రతిలకమును భట్టరు ఉత్ప్రేక్షాలంకారముతో ఇందు స్తుతించుచున్నారు.

హృదయం ప్రసాదయతి రంగపతేः మధురోర్ధ్వపుండ్రతిలకం లలితమ్ ।
అళికార్ధచంద్రదళసంవలితా మమృతస్రుతిం యదభిశంకయతే ॥

శ్రీరంగనాథుని ముఖములోని ఊర్ధ్వపుండ్రతిలకము, ఫాలభాగము అను అర్ధచంద్రమండలము నుండి (చంద్రఖండమునుండి) ప్రవహించు అమృతప్రవాహమా? అను శంకను కల్గించుచున్నది. శ్రీరంగనాథునియొక్క ఋజువైన (అందమైన), మిక్కిలి భోగ్యమైన, ఊర్ధ్వపుండ్ర రూపములోనున్న ఆ తిలకము (నా) మనస్సును ప్రసన్నము చేయుచున్నది.

96. ఇందు శ్రీరంగనాథుని భ్రూ సౌందర్యము వర్ణింపబడుచున్నది.

సరసీరుహే సమవనామ్య మదాదుపరి ప్రనృత్యదళిపంక్తినిభే ।
స్ఫురతో భ్రువావుపరి లోచనయో స్సవిలాసలాస్యగతి రంగభృతః ॥

ఎఱ్ఱని తామరపూవులను పోలు శ్రీరంగనాథుని రెండుకన్నులకు పైన నల్లని తుమ్మెదల వరుసలవలెనున్న కనుబొమల రెండిటి కదలికలను చూడగా, కన్నులనెడి తామరపూలలో గల మకరందమును పరిపూర్ణముగా ఆస్వాదించి, అందువలన నిస్సారములగు వానిని అవలీలగా జయించిన మదమువలన విజయనృత్యము చేయుచున్న నల్లని తుమ్మెదల బారువలె ఉన్నవి.

97. ఈ శ్లోకమునందును శ్రీరంగనాథుని భ్రూవిక్షేపసౌందర్యమును వేరొకచక్కని ఉత్ప్రేక్షతో భట్టరు వర్ణించుచున్నారు.

స్మరశరనళినభ్రమా న్నేత్రయోः పరిసరనమదిక్షుచాపచ్ఛవి ।
యుగముదయతి రంగరాజభ్రువోः గురుకులమివ శార్ఙ్గనృత్తశ్రియః ॥

శ్రీరంగనాథుని రెండు నేత్రములు మన్మథుని బాణములగు పద్మముల భ్రమను కల్గించుచున్నవి. ఆ నేత్రముల సమీపమున వంగుచున్న చెఱకువింటియొక్క కాంతివంటి కాంతిని కల్గిన శ్రీరంగనాథునియొక్క కనుబొమల జంట, శార్ఙ్గ నర్తనముయొక్క శోభకు పారమును చెప్పు ఆచార్యకులమువలె ప్రకాశించుచున్నవి.

98. శ్రీరంగనాథుని నేత్రముల వైశాల్యములోని వైలక్షణ్యమును కవి ఈ శ్లోకమున అద్భుతమైన ఉత్ప్రేక్షతో స్తుతించుచున్నారు. నేత్రవర్ణన చేయబడిన మూడుశ్లోకములలో ఇది మొదటిది.

కృపయా పరయా కరిష్యమాణే సకలాంగం కిల సర్వతోఽక్షినేత్రే ।
ప్రథమం శ్రవసీ సమాస్తృణీతే ఇతి దైర్ఘ్యేణ విదంతి రంగనేతుః ॥

గొప్పదైన తన దయతో అన్ని అవయవములలోని అన్నిభాగములను నేత్రమయ ముగా చేయబోవునట్టి శ్రీరంగనాథుని నేత్రద్వయము ముందుగా కర్ణద్వయమును వ్యాపించుచున్నది – అని (ఆ స్వామి నేత్రముల) వైశాల్యముచే (అభియుక్తులు) తెలిసికొను చున్నారు.

99. ఈ శ్లోకమునకూడ శ్రీరంగనాథుని నేత్రసౌందర్యము స్తుతింపబడుచున్నది.

శ్రవోనాసారోధాత్ తదవధికదోలాయితగతే
విశాలస్ఫీతాయద్రుచిర శశిరాతామ్రధవళే ।
మిథే బద్ధస్పర్ధస్ఫురిత శఫరద్వంద్వలలితే
క్రియాస్తాం శ్రీరంగప్రణయినయనాబ్జే మయి దయామ్ ॥

చెవులు ముక్కు - అను ఇవి అడ్డగించుటచే వాటివరకు ఊగిసలాడునవి, విశాలమైనవి, పెద్దవి, దీర్ఘములైనవి, పరస్పరము స్పర్ధించునవి, (కనుకనే) ఎగసిపడు (త్రుళ్ళిపడునవి అగు) శఫరములనెడి చేపల జంటవలె మనోహరములైనవి అగు శ్రీరంగనాథునియొక్క పద్మములవంటి నేత్రములు రెండును నాయందు కరుణను చూపుగాక !

100. శ్రీరంగనాథుని కటాక్షవైలక్షణ్యమును కవి ఇందు చక్కని రూపకముద్వారా స్తుతించుచున్నారు. పూర్వశ్లోకమున శ్రీరంగనాథుని కన్నులను పద్మములుగా, శఫరములుగా రూపించిన కవి ఇందు ప్రసహించు కృపానదులుగా వర్ణించుచున్నారు.

కరుణామృతకూల ముద్వహైషా ప్రణమత్స్వాగతికీ ప్రసన్నశీతా ।
మయి రంగధనోపకర్ణికాక్ష్ణోః సరితో రీక్షణవీచిసంతతిః స్తాత్ ॥

శ్రీరంగమున గొప్ప సంపదవంటి శ్రీరంగనాథా! కరుణ అను అమృతముతో నిండినవి, ప్రణమిల్లువారికి ఆదరముతో స్వాగతమును పల్కునవి, స్వచ్ఛమైనవి, చల్లనివి చెవులవరకు వ్యాపించియున్నది అగు ఈ (నీ) కన్నులు అనెడి రెండు నదుల నుండి ప్రవహించు కటాక్షములనెడు ప్రవాహముల వరుస నాపై (దయనీయుడనగు నాపై) ప్రసరించుగాక.

101. ఈ శ్లోకమున శ్రీరంగనాథుని నాసిక, మందస్మితము, చుబుకము, కపోలములును వర్ణింపబడుచున్నవి.

విలసతి నాసా కల్పకవల్లీ ముగ్ధేవ రంగనిలయస్య ।
స్మిత మపి తన్నవకుసుమం చుబుకకపోలం చ పల్లవోల్లసితమ్ ॥

శ్రీరంగనాథుని నాసిక అందమైన కల్పలతవలె ప్రకాశించుచున్నది. మందహాసముకూడ ఆ కల్పలత పూచిన క్రొత్తదైన పూవువలె ఉన్నది. చుబుకము (గడ్డము), చెక్కిళ్లు - అను ఇవి చిగుళ్ల వికాసమువలె ప్రకాశించుచున్నవి.

102. భుజాగ్రములవరకు తళతళమని మెఱయు శ్రీరంగనాథుని కర్ణాభరణములను కవి మనోహరమైన రూపకాలంకారముతో అభివర్ణించుచున్నారు.

నయనశఫరవిద్ధౌ కర్ణపాశావరుద్ధౌ
రుష ఇవ లుఠతోర్ఛిర్మంజరీ రుద్ధిరంతౌ ।
పరిమిళదళకాళీశైవలా మంసవేలాం
అనుమణిమకరోద్ధౌ రంగధుర్యామృతాబ్ధేః ॥

శ్రీరంగనాథుని ముఖము అమృతసముద్రమువలె ఉన్నది. ఆ ముఖమునకు చుట్టును కదలాడు ముంగురుల సమూహము ఆ సముద్రములోని నాచువలె ఉన్నది. శ్రీరంగనాథుని ముఖమునకు సమీపములగల భుజాగ్రములు ఆ సముద్రముయొక్క తీరమువలె ఉన్నది. ఆస్వామి కన్నులు ఆ సముద్రములోని శఫరములవలె (చేపలవలె) ఉన్నవి. శ్రీరంగనాథుడు తన అందమైన చెవులకు ధరించిన, మణులు పొదిగిన మకర కుండలములు ఆ సముద్రములోని గొప్ప మకరములవలె (మొసళ్ళవలె) ఉన్నవి. ఆ మకర కుండలములు ప్రసరించు గొప్ప కాంతిని చూడగా, స్వామి నేత్రములనెడి చేపలచే తాడనము చేయబడి, గొప్ప పాశములవంటి కర్ణములచే అడ్డగింపబడినవి (బంధింపబడినవి) అగుటచే ఆ కుండలములనెడి మకరములు భుజాగ్రములనెడి తీరమున చేపల వలె పొర్లుచు కోపించినవై తమ కోపమును తేజోరాశుల రూపమున వెడల గ్రక్కునవివలె ఉన్నవి.

103. ఇందు భట్టరు శ్రీరంగనాథుని ముఖమును సరస్సుతో రూపణమును సాంగముగా చేయుచు స్తుతించుచున్నారు.

అధరమధురాంభోజం తత్కర్ణపాశమృణాళికా -
వలయ మభి మా మాస్తాం రంగేందువక్త్రసర శ్చిరమ్ ।
నయనశఫరం నాసాశైవాలవల్లరీ కర్ణికా -
మకర మలకశ్రేణీపర్యంత నీలవనావలి ॥

శ్రీరంగనాథుని తిరుముఖము అను సరస్సు - క్రింది పెదవి అనెడి భోగ్యమైన తామర పూవును కల్గినది; కర్ణపాశములు (చెవి తమ్ములు) అనెడి తామరకాడల సమూహము కల్గినది; నేత్రములనెడి చేపలను కల్గినది; ముక్కు అనెడి నాచు తీగలను కల్గినది; కర్ణభూషణములనెడి సొఅచేపలను కల్గినది; ముంగురుల వరుసలనెడి తీరప్రదేశమున గల నల్లని వనసమూహమును కల్గినది. ఆ సరస్సు చిరకాలము నాకు అభిముఖముగా ఉండుగాక (నన్ను అనుగ్రహించుగాక).

104. ముందు రెండు శ్లోకములలో శ్రీరంగనాథుని అమృతసముద్రముగా, సుధాతటాకముగా అనుభవించిన భట్టరు, సముద్రమున కనుపించు శంఖమును సరస్సునకు సమీపమున కనుపించు పోకచెట్టును శ్రీరంగనాథుని కంఠముతో పోల్చుటద్వారా వర్ణించుచున్నారు.

రమయతు స మాం కంఠః శ్రీరంగనేతు రుదంచిత -
క్రముకతరుణగ్రీవాకంబు ప్రలంబమలిమ్లుచః

ప్రణయవిలగల్లక్ష్మీవిశ్వంభరాకరక కందళీ -
కనకవలయక్రీడా సంక్రాంతరేఖ ఇవోల్లసన్ ॥

శ్రీరంగనాథుని కంఠము - దృఢమైన (గొప్పవైన) పోకచెట్టుయొక్క లేలేత తల, శంఖము - అను వీని అతిశయమును (అందమును) అపహరించినది. అనురాగ ముతో ఆలింగనము చేయునట్టి లక్ష్మీదేవి, భూదేవి-అను వీరియొక్క అరటి బోదెలవంటి చేతులలోని బంగారుగాజుల విలాసముచే ముద్రింపబడిన రేఖలను కల్గినదివలె ప్రకాశించుచున్నది. ఆ (విలక్షణమైన) కంఠము నన్ను ఆనందింప జేయును గాక!

105. ఈ శ్లోకమునుండి భట్టరు ఆరు శ్లోకములలో శ్రీరంగనాథుని బాహువుల రామణీయకమును స్తుతించుచున్నారు.

అధిష్ఠానస్తంభౌ భువనపృథుయంత్రస్య కమలా -
కరేణో రాలానే అరికరిఘటోన్మాథముసలౌ ।
ఫణీంద్రస్ఫీతస్రక్ వ్యతికరితసందిగ్ధవిభవౌ
భుజౌ మే భూయస్తా మభయ మభి రంగప్రణయినః ॥

శ్రీరంగనాథుని భుజములు, లోకమనెడి పెద్ద యంత్రముయొక్క ఆధార స్తంభముల వలె ఉన్నవి. లక్ష్మీదేవి అను ఆడుఏనుగును బంధించు కట్టుస్తంభములుగా నున్నవి. శత్రువులు అను ఏనుగుల సమూహములను పూర్తిగా నశింప చేయుటలో సాధనములైన రోకళ్లవలె ఉన్నవి. ఆదిశేషునియొక్క శరీరమా? అని, పెద్దదైన పూమాలయా? అని - సందేహించునట్టి గొప్పతనమును కల్గినవి. అవి నాకు, అభయము నొసగును గాక!

106. శ్రీరంగనాథుడు ఆదిశేషునిపై పరుండియున్న సన్నివేశమును వర్ణించుటద్వారా ఇందు భట్టరు బాహుద్వయమును పొగడుచున్నారు.

ప్రతిజలధితో వేలాశయ్యాం విభీషణకౌతుకాత్
పున రివ పురస్కర్తుం శ్రీరంగిణః ఫణిపుంగవే ।
సముపదధతః కంచిత్ కంచిత్ ప్రసారయతో భుజ -
ద్వయ మపి సదా దానశ్రద్ధాళు దీర్ఘ ముపాస్మహే ॥

విభీషణునిపట్ల గల కుతూహలము కారణమువలన తిరిగి సముద్రమున కెదురుగా సముద్రతీరమనెడి పడుకను ఆదరించి, అతనిని అనుగ్రహించుట కోసమా? అనునట్లు ఆదిశేషునిపై ఒక భుజమును దిండుగా చేసికొన్నవాడును, వేఱొక భుజమును

చాచుకొని యున్నవాడును అగు శ్రీరంగనాథునియొక్క పొడుగైనవి, ఎల్లప్పుడు దానము చేయుటలో ఆదరమును కల్గినవి అగు రెండు భుజములను ఉపాసింతుము.

107. ఇంతకు ముందు భట్టరు శ్రీరంగనాథుని ''అర్థికల్పకం'' (76) అనుచు కల్పవృక్షముగా స్తుతించిరి. ఇందు ఆ కల్పవృక్షముకూడ స్వామికి సాటిరాదనుచు స్తుతించుచున్నారు.

కుసుమభరాలసౌ స్ఫటికవేదిశయౌ విటపౌ
అమరతరోః పరం పరిహసత్ పృథురంగభుజః ।
బహుమణిముద్రికా కనకకంకణదోర్వలయైః
కిసలయి దోర్వయం ఫణిని నిర్భరసుప్త మిమః ॥

అనేకములైన రత్నపుటుంగరములు, బంగారుతో చేయబడిన ముంజేతి ఆభరణములు, బాహువుల యొక్క భుజకీర్తులు - అను వీనిచే చిగురించినట్లున్నది. ఆదిశేషునిపై నిర్విచారముగా నిద్రించినది, (కావుననే) పూలతో నిండినదగుటచే కొంచెము వంగినది, స్ఫటికమయమైన తిన్నెపై పరుండియున్నది, కావుననే కల్పవృక్షము యొక్క శాఖలను రెండిటిని మిక్కిలి పరిహాసము చేయునట్టి, బలిష్ఠమైన శ్రీరంగనాథుని యొక్క బాహువుల జంటను ఆశ్రయింతుము.

108. ఈ శ్లోకముకూడ శ్రీరంగనాథుని బాహుయుగమును వర్ణించునదే. ఇందు కవి ముఖ్యముగా వలయబంధము, జ్యాకిణములతో కూడిన స్వామిబాహువుల శోభను చక్కని ఉత్ప్రేక్షతో వర్ణించుట విశేషము.

ముద్రక్షాప్రతకౌతుకే సుకటకే విక్రాంతికర్ణేజపే
శార్ఙ్గజ్యాకిణకర్కశిమ్ని సుమనఃప్రక్మోహనే మార్దవే ।
దోర్ద్వంద్వం బహుశః ప్రలోభ్య కమలాలీలోపధానం భవత్
తచ్చిత్రాలకముద్రితం విజయతే శ్రీరంగసంసంగినః ॥

శ్రీరంగనాథుని బాహుయుగ్మము, నన్ను రక్షించుట అను వ్రతమునందు కట్టిన కంకణసూత్రములవంటి చక్కని వలయములను కల్గినవి. పరాక్రమమును సూచించునట్టి శార్ఙ్గమను ధనుస్సుయొక్క అల్లెత్రాడు దెబ్బలచే ఏర్పడిన కాయల (గుర్తుల)తో కాఠిన్యమును కల్గినది. పూమాలయా ఇది! అని భ్రమించునట్టి మృదుత్వమును కల్గినది. లక్ష్మీదేవికి అనేకవిధములుగా ఆశ కల్గునట్లు చేసి, ఆమెకు విలాసార్థమైన దిండుగా అగునట్టిది. ఆ లక్ష్మీదేవియొక్క ఆశ్చర్యకరమైన (మనోహరమైన) ముంగురులచే చిహ్నితమైనది. అట్టి శ్రీరంగనాథుని బాహుయుగ్మము సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నది.

109. భట్టరు ఈ శ్లోకమున శ్రీరంగనాథుడు తలదిండుగా తనతలక్రింద పెట్టుకొనియున్న భుజమును స్తుతించుచున్నారు. చేతిని తలదిండుగా మడచి పెట్టుకొనునపుడు స్వామి ముఖము ఆ చేయిని తాకుచుండుటచే, ఆ సన్నివేశనిశేషమును భట్టరు హృదయంగమములైన ఉత్ప్రేక్షలతో స్తుతించుచున్నారు.

భవార్తానాం వక్త్రామృతసరసి మార్గం దిశదివ
స్వయం వక్త్రేణేదం వరదమితి సందర్శితమివ ।
కరాంభోజం పంకేరుహవనరుషా పాటలమివ
శ్రయామి శ్రీరంగేశయితు రుపధానీకృత మహమ్ ॥

శ్రీరంగనాథుని పద్మమువంటి చేయి, సంసారమునందు తాపమును పొందిన వారికి శ్రీరంగనాథుని ముఖము అను అమృత తటాకమును ప్రవేశించు మార్గమును ఉపదేశించునదివలె ఉన్నది. "ఈ చేయి వరముల నిచ్చునది" - అని నోటితో తానే చూపించునది వలె ఉన్నది. పద్మముల సమూహముపై గల కోపముచే ఎఱ్ఱగా ఉన్నట్లు ఉన్నది. లక్ష్మీదేవికి శోభిల్లునట్టి తలదిండుగా చేయబడిన ఆ బాహువును నేను ఆశ్రయించుచున్నాను.

110. గడచిన అయిదు శ్లోకములతో శ్రీరంగనాథుని బాహుసౌందర్యమును స్తుతించిన భట్టరు, ఇందు సింహావలోకన్యాయమున ఆ వర్ణనను ముగించుచు, స్వామియొక్క రెండుబాహువులను రెండు ఉత్ప్రేక్షలతో ప్రస్తుతించుచున్నారు.

కిరీటం శ్రీరంగేశయితు రుపధానీకృతభుజో
విధీశాధీశత్వాత్ ఘటత ఇతి సంస్పృశ్య వదతి ।
నిహీనానాం ముఖ్యం శరణ మితి బాహు స్తదితరః
స్ఫుటం బ్రూతే పాదాంబుజయుగళ మాజానునిహితః ॥

శ్రీరంగనాథునిచే తలదిండుగా చేసికొనబడిన భుజము, ఆ స్వామి కిరీటమును తాకి, "బ్రహ్మకు, రుద్రునకు నియామకుడగుటవలన స్వామికి ఈ కిరీటము తగును" అని పలుకుచున్నది. మోకాలివరకు చాచిన ఇంకొక భుజము తామరలవంటి పాదముల జంటను తాకి, "ఇది అధములకు (బ్రహ్మాదులకు) ముఖ్యమగు (శరణము) రక్షకము" అని స్పష్టముగా పల్కుచున్నది. (సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నది.)

111. లక్ష్మీదేవి భగవానుని వక్షఃస్థలమును నిత్యవాసముగా కల్గియున్నది. కావున అట్టి వక్షఃస్థలమును లక్ష్మీవిలాసగృహముగా రూపించుచు కవి స్తుతించుచున్నారు.

మలయజశశిలిప్తం మాలతీదామతల్పం
సుమణిసరవితానం కౌస్తుభస్వస్తిదీపమ్ ।
దనుజవృషవిషాణోల్లేఖచిత్రం చ లక్ష్మ్యా -
లలితగృహ ముపాసే రంగసర్వంసహోరః ॥

శ్రీరంగనాథుని వక్షఃస్థలమును లక్ష్మీదేవియొక్క విలాసార్థమైన (గృహముగా) మందిరముగా ఉపాసింతును. అది, చందనము, పచ్చకర్పూరములచే లేపనము చేయబడినది. మొల్లపూవుల పడుకను కల్గినది. గొప్పమణులయొక్క హారములను మేలుకట్టుగా కల్గినది. కౌస్తుభమణి అను మంగళదీపమును కల్గినది. అసురులనెడి ఎద్దులయొక్క కొమ్ముల తాకిడిచే ఏర్పడిన (దెబ్బల గుర్తులు అను) రేఖలతో అందమైన చిత్తరువులను కల్గినది. అట్టి వక్షస్థలమును ఉపాసింతును.

112. శ్రీరంగనాథుని వక్షఃస్థలమును భట్టరు ఇందు మందరపర్వతముచే మథింపబడు క్షీరాబ్ధిగా సావయవరూపకాలంకారముద్వారా స్తుతించుట విశేషము.

హారస్ఫారితఫేన మంశులహరీమాలర్ధి ముక్తాఫల -
శ్రేణీకరదుర్దినం తత ఇతో వ్యాకీర్ణరత్నోత్కరమ్ ।
అవిఃకౌస్తుభలక్ష్మి రంగవసతేః నిస్సీమభూమాద్భుతం
వక్షోమందరమథ్యమానజలధిశ్లాఘం విలోకేమహి ॥

శ్రీరంగనాథుని వక్షఃస్థలము - ముత్యాలహారములు అను విస్తరింపబడిన నుఱుగును కల్గినది. కాంతులు అను కెరటముల వరుసలయొక్క సమృద్ధిని కల్గినది. ముత్యలముల పరంపరలు అను నీటి బిందువులచే దుర్దినమును కల్గినది (నిబిడమైనది). అటు ఇటు (అంతటా) విస్తరించిన రత్నముల సమూహములను కల్గినది. ఆవిర్భవించిన కౌస్తుభమణిని, లక్ష్మీదేవిని కల్గినది. అవధి లేని గొప్పతనముచే ఆశ్చర్యకరమైనది. కావుననే మందరపర్వతముచే చిలుకబడుచున్న సముద్రము యొక్క కీర్తివంటి కీర్తిని కల్గినదానినిగా దానిని సేవింతుముగాక!

113. శ్రీరంగనాథుని ఉరమున ప్రకాశించు పరత్వసూచకములైన లక్ష్మీదేవి, తులసిమాల, కౌస్తుభము, వైజయంతీమాలతో పాటు కృష్ణావతారమునకు సంబంధించిన సౌలభ్యసూచకమగు వేరొక ఆభరణవిశేషమును ఇందు భట్టరు వర్ణించుచున్నారు.

వక్షఃస్థల్యాం తులసికమలాకౌస్తుభై ర్వైజయంతీ
సర్వేశత్వం కథయతి తరాం రంగధామ్నః తదాస్తామ్ ।

కూర్మవ్యాక్రీనఖపరిమిళత్ పంచహేతీ యశోదా -
నద్ధా మౌగ్ధ్యాభరణ మధికం నః సమాధిం ధినోతి ॥

శ్రీరంగనాథుని వక్షఃస్థలమునందు తులసిమాలిక, లక్ష్మీదేవి కౌస్తుభమణి - అను వీనితో పాటు వైజయంతి అను వనమాల అందఱికి ప్రభువై యుండుటను బాగుగా తెలియజేయుచున్నది. ఆ విషయము అటు ఉండుగాక! బాల్యావస్థకు తగిన ఆభరణముగా యశోదాదేవిచే అలంకరింపబడినది, తాబేలుతో ఆడపులియొక్క గోరుతో కూడియున్నది అగు ఆస్వామి ధరించిన పంచాయుధహారము మాయొక్క చిత్తవృత్తిని మిక్కిలి రంజిల్లచేయు చున్నది.

114. ఈ శ్లోకమున పూర్వార్ధమున శ్రీరంగనాథుని నడుము సన్నగా ఉండుటకు గల కారణమును, ఉత్తరార్ధమున నాభీకమలము విస్తరించి యుండుటకు, నవనవోన్మేషముగా నుండుటకుగల కారణమును కవి ఉత్ప్రేక్షించుటద్వారా స్తుతించుచున్నారు.

కియాన్ భరో మమ జగదండమండలీత్యతృప్తితః క్రశిత మివోదరం విభోః ।
రిరక్షిషోచితజగతీపరంపరాం పరా మివ ప్రథయతి నాభిపంకజమ్ ॥

శ్రీరంగనాథుని ఉదరమును చూడగా, అది, "బ్రహ్మాండములయొక్క సమూహము నాకు ఎంతమాత్రము చాలదు" - అను అతృప్తివలన కృశించినదివలె ఉన్నది. నాభీకమలము, రక్షింపవలెనను తన కోరికకు సరిపడు వేఱొక లోకముల వరుసను బయల్పఱచుచున్నదివలె (సృష్టించునట్లు) ప్రకాశించుచున్నది.

115. శ్రీరంగనాథుని ఉదరమునగల వళిత్రయము, నడుమునగల దామోదరత్వ సూచకమగు కిణము, ఉదరబంధమను ఆభరణము అను మూడింటిని కవి చక్కని ఉత్ప్రేక్షలతో వర్ణించుచున్నారు. ఈ శ్లోకము భగవానుని పరత్వసౌలభ్యములను రెండిటిని వర్ణించుచున్నవి.

త్రివిధచిదచిద్బృందం తుందావలంబి వలిత్రయం
విగణయదివైశ్వర్యం వ్యాఖ్యాతి రంగమహేశితుః ।
ప్రణతవశతాం బ్రూతే దామోదరత్వకరః కిణః
తదుభయగుణాకృష్టం పట్టం కిలోదరబంధనమ్ ॥

శ్రీరంగనాథుని ఉదరములోని త్రివళి (మూడు రేఖలు) మూడు విధములైన చేతనాచేతనములయొక్క సమూహమును లెక్కించుచున్నది వలె ఉన్నది. స్వామియొక్క సకల చేతనాచేతనముల నియామకత్వమును ఐశ్వర్యమును వ్యాఖ్యానించుచున్నదివలె ఉన్నది. దామోదరుడను పేరును కల్గించు కణుపు (శరీరమున కాయవలె గట్టిపడిన

భాగము) భక్తులకు అతడు అధీనుడగుటను గూర్చి పల్కుచున్నది, ఉదరబంధమను ఆభరణము ఆ రెండు గుణములను (పరత్వ, సౌలభ్యగుణములను), కలిపి కట్టిన పట్టము వలె ఉన్నది.

116. శ్రీరంగనాథుని నాభీపద్మము ఆ స్వామియొక్క పరత్వమును, బ్రహ్మరుద్రాదుల న్యూనతను తెలియజేయుచున్నదనుటను కవి ఈ శ్లోకముద్వారా తెలియజేయుచున్నారు.

త్రయో దేవా స్తుల్యా స్త్రితయ మిద మద్వైత మధికం
త్రికాదస్మాత్ తత్త్వం పర మితి వితర్కాన్ విఘటయన్ ।
విభోః నాభీపద్మో విధిశివనిదానం భగవతః
తదన్యభ్రూభంగీపరవదితి సిద్ధాంతయతి నః ॥

బ్రహ్మ, విష్ణువు, శివుడు-అను ముగ్గురు దేవతలు సమప్రాధాన్యమును కలవారు (అని), ఈ త్రిమూర్తులు ఒక్కటే (అని), ఈ త్రిమూర్తులకంటె గొప్పదైన తత్వము (మాత్రమే) గొప్పది అని - ఈవిధమైన విప్రతిపత్తులను (ఊహల)ను పోగొట్టుచు, శ్రీరంగనాథుని నాభీకమలము బ్రహ్మకు, రుద్రునకు భగవానుడు మూలకారణ మగుటను, ఆ భగవానుని కంటె వేఱయిన చరాచరప్రపంచమంతయు (ఆ భగవానుని) కనుబొమల కదలికలకు పరతంత్రము అగుటను మనకు సిద్ధాంతీకరించుచున్నది.

117. ఇందు భట్టరు శ్రీరంగనాథుని నాభిని, నాభీకమలమును కలిపి అనుభవించుచున్నారు.

గర్భే కృత్వా గోప్తు మనంతం జగదంతః
మజ్జత్ప్రమ్యా వాంఛతి సామ్యం నను నాభిః ।
ఉత్క్షిప్యైతత్ ప్రేక్షితు ముద్యద్భుమిభూయం
నాభీపద్మో రంహతి రంగాయతనాబ్ధేః ॥

సముద్రమువంటి శ్రీరంగనాథుని బొడ్డు - అంతు లేని లోకములను కడుపున ఉంచుకొని, రక్షించుటకు లోపల మునుగుచున్న సుడితో పోలికను కోరు చున్నది కదా! నాభీపద్మము - ఈ లోకములను పైకి లేవనెత్తి చూచుటకై పైకి వృద్ధిచెందుచున్న సుడివలె ఉన్నది.

118. ప్రస్తుతశ్లోకమున భట్టరు శ్రీరంగనాథుని ఊరుయుగమును వర్ణించుచున్నారు.

మద మివ మధుకైటభస్య రంభాకరభకరీంద్ర కరాభిరూప్యదర్పమ్ ।
స్ఫుట మివ పరిభూయ గర్వగుర్వోః కిముపమిమీమహి రంగకుంజరోర్వోః ॥

మధుకైటభుల మదమును (అణచిన విధము) వలె, అరటిబోదెలు, కరభ ప్రదేశము, గొప్ప ఏనుగు తొండము - అను వీనియొక్క గర్వమును అవమానించి, అందువలన కల్గిన గర్వముచే గొప్పవి అగు కుంజరమువంటి శ్రీరంగనాథునియొక్క తొడలకు ఏ వస్తువును స్పష్టముగా ఉపమానముగా పల్కుదుము? (దేనిని పలుకలేమని భావము).

119. శ్రీరంగనాథుని నడుము, పీతాంబరముల కలయికయొక్క సొబగును గొప్పఉపమద్వారా భట్టరు స్తుతించుట ఈశ్లోకమునందలి ప్రత్యేకత.

కటీకాంతిసంవాది చాతుర్యనీవీలసద్రత్నకాంచీకలాపానులేపమ్ ।
మహాభ్రంలిహన్మేరుమాణిక్య సానూరివాభాతి పీతాంబరం రంగబంధోః ॥

శ్రీరంగనాథుని నడుమున శోభిల్లు పీతాంబరము గొప్ప కాలమేఘమును మధ్యలో కల్గిన మేరుపర్వతసానువువలె ప్రకాశించుచున్నది. ఇచట కాలమేఘము శ్రీరంగనాథుడే. ఆ స్వామి నడుముచుట్టునుకల పీతాంబరము ఆ నల్లని మేఘమును మధ్యన గల మేరు పర్వతసానువు. నీవి అనగా-వస్త్రబంధము (ముడి). స్వామి వస్త్రబంధము నడుము కాంతితో తులతూగు శోభను కల్గినది. ఆ నీవియందు వెలుగొందు రత్నమయమేఖలా భరణముచే (మొలనూలుచే) పీతాంబరము చుట్టబడియున్నది. నీవీబంధము నడుము శోభతో తులతూగుట అనగా ఏమి? అనినచో నీవీబంధము అనునది నిజమునకు లేకున్నను, స్వామి నడుముయొక్క కాంతి నీవీబంధమువలె శోభిల్లుచున్నదని భావము.

120. ఈశ్లోకమునందును భట్టరు శ్రీరంగనాథుని పీతాంబరమును మూడు ఉత్ప్రేక్షలతో వర్ణించుచున్నారు.

భర్మస్థలాంశుపరివేష ఇవాంబురాశేః
సంధ్యాంబువాహనికురుంబ మివాంబరస్య ।
శంపాకదంబక మివాంబుముచో మనో నః
పీతాంబరం పిబతి రంగధురంధరస్య ॥

శ్రీరంగనాథునియొక్క పీతాంబరము (పచ్చని పట్టువస్త్రము) - సముద్రముయొక్క సువర్ణమయమైన ప్రదేశము యొక్క కాంతియొక్క పరిధి వలె ఆకాశముయొక్క సంధ్యాకాలమునందలి మేఘముయొక్క మండలము (సమూహము) వలె మేఘము యొక్క మెఱుపు తీగలయొక్క సమూహము వలె ఉన్నదియై మన మనస్సును పానము చేయుచున్నది.

121. ఇందు శ్రీరంగనాథుని మోకాళ్లను రెండిటిని కవి ఉత్ప్రేక్షించుచున్నారు.

వైభూషణ్యాం కాంతి రాంగీ నిమగ్నా విషగ్భీచీ క్వాపి సోన్మాదవృత్తిః ।
జానే జానుద్వంద్వవార్తావివర్తో జాత శ్రీమద్రంగతుంగాలయస్య ॥

శ్రీరంగమను గొప్ప ఆలయమును కల్గిన శ్రీరంగనాథుని ఆభరణముల కాంతిలో మునిగిన ఆస్వామి అవయవముల శోభ అంతట వ్యాపించినదై, ఒకచోట, ఉన్మాద వ్యాపారముతో కూడినదై (క్షోభమును పొందినదై), రెండు మోకాళ్లు - అను చెప్పు రీతిలో రెండు సుడులుగా అయినది - అని తలంతును.(శ్రీరంగనాథుని మోకాళ్ళు రెండు సుడులవలె ఉన్నవి.)

122. శ్రీరంగనాథుని పిక్కలు (జంఘలు) ఇందు వర్ణింపబడుచున్నవి.

శ్రీరంగేశయజంఘే శ్రీభూమ్యామర్శహర్షకంటకితే ।
తత్కేళినళినమాంసల నాళద్వయలలిత మాచరతః ॥

లక్ష్మీదేవి, భూదేవి చేయు పాదసంవాహనము వలన కల్గిన ఆనందముతో శ్రీరంగనాథుని పిక్కలు గగుర్పాటును పొందినవై, అలక్ష్మీదేవియొక్క, భూదేవి యొక్క విలాసముకొఱకైన రెండుతామరపూల యొక్క బలిసిన రెండు కాడల విలాసమును కలిగి యున్నవి.

123. పాదములు ఎట్టగా ఉండుట సహజము. శ్రీరంగనాథుని పాదములు ఎట్టగా ఉండుటకు ఇందు భట్టరు మనోహరమైన హేతువులను ఉత్ప్రేక్షించుచు, స్తుతించుచున్నారు.

వందారుబృందారకమౌళిమాలా యుంజానచేతఃకమలాకరేభ్యః ।
సంక్రాంతరాగా వివ పాదపద్మౌ శ్రీరంగభర్తుః మనవై నవై చ ॥

నమస్కరించు దేవతల కిరీటముల వరుసలు, యోగుల మనస్సులు, లక్ష్మీదేవి కరములు - అను వీనినుండి సంక్రమించిన (సోకిన) ఎఱ్ఱని రంగును కల్గినవి వలె ప్రకాశించుచున్న శ్రీరంగనాథునియొక్క పద్ములవంటి పాదములను ధ్యానింతును స్తుతింతును కూడ.

124. శ్రీరంగనాథుని పాదద్వంద్వమును శ్లోకద్వంద్వముతో స్తుతింపనెంచిన భట్టరు ఇందు మొదటగా పాదముల మాహాత్మ్యమును ఆఱు గొప్పవిశేషణములతో ప్రతిపాదించుచున్నారు.

యత్ బృందావనపండితం దధిరవైః యత్తాండవం శిక్షితం
యల్లక్ష్మీకరసౌఖ్యసాక్షి జలజప్రస్పర్ధిమానర్ధి యత్ ।

యద్భక్తేష్వజలస్థలజ్ఞ మపి యద్దూత్యప్రసంగోత్సుకం
తద్విష్ణోః పరమం పదం వహతు నః శ్రీరంగిణో మంగళమ్ ॥

శ్రీరంగనాథుడను విష్ణువుయొక్క పాదము బృందావనమున సంచరించుటలో సమర్థమైనది. ఆ పాదము నర్తనవిశేషము (గొల్ల వనితలు) పెరుగు చిలుకునపుడు వచ్చు శబ్దముచే శిక్షింపబడినది. ఆ పాదము లక్ష్మీదేవి చేతులయొక్క (చేతులవలన కల్గిన) సౌఖ్యమునకు సాక్షి అయినది. ఆ పాదము తామరపూవుతో కలహించునట్టి సౌందర్యముయొక్క అతిశయమును కల్గినది. మఱియు, ఆ పాదము భక్తుల విషయమున ఎత్తు పల్లములను (హెచ్చు తగ్గులను) ఎఱుగదు. ఆ పాదము భక్తుల కొరకు దౌత్యమును కొనిపోవు సందర్భమునందు ఆసక్తిని కల్గినది. ఆ గొప్పదైన పాదము మనకు క్షేమమును నిర్వహించునుగాక!

125. ''వజ్రధ్వజాంకుశసుధాకలశ'' (4) ఇత్యాదిగా కూరేశులు అతిమానుషస్తవమున స్తుతించిన రీతిలో భట్టరు ఈశ్లోకమున శ్రీరంగనాథుని పాదపద్మములను స్తుతించుచు, నమస్కరింతుమనుచున్నారు.

శింజానక్రతిశింజినీమణిరవైః వజ్రారవిందధ్వజ -
చ్ఛత్రీకల్పకశంఖచక్రముకురైః తై స్తై శ్చ రేఖామయైః ।
ఐశ్వర్యేణ జయం త్రివిక్రమముఖం ఘుష్యద్భి రామ్రేడితమ్
శ్రీరంగేశయపాదపంకజయుగం వందామహే సుందరమ్ ॥

శ్రీరంగనాథుని నూపురములందున్న మణులు చేయు ధ్వనులు– సర్వేశ్వరత్వముతో మూడు పాదములతో స్వామి లోకములను విక్రమించుట మొదలగు విజయములను పలుమార్లు ఘోషించుచున్న వేదరవములవలె ఉన్నవి, రేఖల రూపములో నున్న ఆయా వజ్రము, పద్మము, పతాకము (ధ్వజము), గొడుగు, కల్పవృక్షము, శంఖము, చక్రము, దర్పణము – అను గుర్తులను కల్గినవి అగు అందమైన శ్రీరంగనాథుని యొక్క పద్మముల వంటి ఆ పాదముల జంటను నమస్కరించుచున్నాము.

126. ఇందు శ్రీరంగనాథుని పాదములను, నఖకాంతులను భట్టరు ఉత్ప్రేక్షించుచున్నారు.

పునాని భువనాన్యహం బహుముఖీతి సర్వాంగుళీ -
ఝలత్ ఝలితజాహ్నవీ లహరిబృందసందేహదాః ।
దివా నిశి చ రంగిణః చరణచారుకల్పద్రుమ -
ప్రవాళనవమంజరీ నఖరుచీ ర్విగాహేమహి ॥

శ్రీరంగనాథుడు ఒక అందమైన కల్పవృక్షము. ఆ స్వామి కాలివేళ్లు చిగుళ్ల వంటివి. ఆ చిగుళ్ళలో పూసిన కొత్త పూలగుత్తుల వలె ఆ గోళ్ల కాంతులున్నవి. వాటిని చూడగా, "నేను పెక్కు ప్రవాహములను కల్గినదాననై లోకములను పావనము చేయుదును" అని స్వామి కాలివ్రేళ్లు అన్నిటినుండి ఝలఝలమని శబ్దముతో ప్రవహించు గంగానది లోని కెరటములయొక్క వరుసలా ఇవి! అనుసందేహమును కల్గించుచున్నవి. అట్టి ఆ కాంతులలో రాత్రింబగళ్ళును నేను అవగాహింతును.

127. భట్టరు ఇంతవరకును ద్వయములోని పూర్వార్ధమునకు వివరణరూపముగా పూర్వశతకమును రచించిరి. గురుంపరావందనముతో ప్రారంభించి ''శ్రీస్తనాభరణం తేజః'' (8) అను శ్లోకమున సంగ్రహముగా భగవదాశ్రయణమొనర్చిన భట్టరు తరువాతి శ్లోకమునుండి క్రమముగా ద్వయమంత్రములోని పూర్వఖండార్ధమును వివరించిరి. చివరిగా ఈశ్లోకమున మరల క్లుప్తముగా పూర్వఖండార్ధమును ప్రతిపాదించుచు శతకపరిసమాప్తిని చేయుచున్నారు.

శ్రీరంగేందోః పదకిసలయే నీలమంజీరమైత్ర్యా
వందే వృంతప్రణయిమధుపవ్రాతరాజీవజైత్రే ।
నిత్యాభ్యర్చానతవిధిముఖ స్తోమసంశయ్యమానైః
హేమాంభోజైః నిబిడనికటే రామసీతోపనీతైః ॥

ఇంద్రనీలరత్నములతో చేయబడిన నూపురములతో, తొడిమయందు చేరినయున్న తుమ్మెదల సమూహమును కల్గిన తామరపూవును జయించినవి, ఎల్లప్పుడు ఆరాధనలో నమస్కరించిన బ్రహ్మయొక్క ముఖముల సమూహమా ఇది? అని సందేహింపబడునవి, శ్రీరామునిచే, సీతాదేవిచే సమర్పింపబడిన బంగారు పద్మములతో సాటివచ్చునవి అగు, చంద్రునివంటి శ్రీరంగనాథుని చిగుళ్లవంటి పాదములను రెండింటిని నమస్కరింతును.

రంగరాజస్తవే పూర్వశతకం వ్యవృణోదిదమ్ ।
దాసః శ్రీశింగరాచార్యః స్వాచార్యకరుణాబలాత్ ॥

శ్రీరంగరాజస్తవము - పూర్వశతకము సంపూర్ణము.

శ్లోక అకారాది సూచిక

శ్లోకము	శ్లోకసంఖ్య
అగణిత గుణావద్యం	23
అగ్రేతార్క్ష్యేణ	71
అంగై రహంప్రథమికా	75
అధరమధురాంభోజం	103
అధిపరమపదం	29
అధిష్ఠానస్తంభౌ	105
అన్యత్రాతద్గుణోక్తిః	19
అనాద్యామ్నాతత్వాత్	44
అన్యోన్యరంజక	85
అపిఫణిపతి	45
అబ్జన్యస్త	74
అమతం మతం	13
అరవిందితం	84
అస్తి వస్తు	9
అస్త్రగ్రామాగ్రేసరం	56
అహ మల మవలంబః	47
అహృతసహజ-	33
ఆధారశక్తిం	42
ఆపాదమూలం	67
ఆమౌళిరత్న-	83
ఆయత్కిరీటం	73
ఆర్తాపాశ్రయం	76
ఆలోకా హృదయాళవః	72
ఇతోబిహిః	58
ఉత్ఫుల్లపంకజ-	63
ఉదధిపరమ-	79
ఋషిం జుషామహే	6
ఏకైకస్మిన్	89
ఏతే శంఖ-	70
కటీకాంతి-	119
కదళవకుళ-	25
కరుణామృత-	100
కావేరీం	20
కింతు ప్రపత్తి-	17
కియాన్ భరో	114
కిరీటచూడ-	91
కిరీటం శ్రీరంగేశయ	110
కుసుమభరాలసా	108
కృపయా పరయా	98
క్షితికమల-	68
గర్భీకృత్వా	117
జనపదసరిత్-	32
జలధి మివ	80
జితబాహ్య-	36
తరళతను-	24
తాపత్రయాం	40
తార్క్ష్య	54
తీర్థం శుంధతి	22
త్రయ్యంత-	27
త్రయో దేవాః	116
త్రివిధ-	115
ద్రుతకనక-	86
దుగ్ధాబ్ధిః	21
నమః శ్రీరంగనాయక్యై	7
నయనశఫర-	102
నాథస్య చ	18
నౌమి నాథమునిం	5
పరేణ నాకం	43
పాతు ప్రణత	12
పిబ నయన	64
పునాని	126
పూర్వేణ తాం	41
ప్రతిజలధితః	106
ప్రాకార	35
భర్మష్ఠలాంశు-	120
భవపద మపి	30
భవార్తానాం	109
భోగీంద్ర-	87
మణిమకర-	31
మద మివ	118
మద్రక్షా-	108
మలయజ-	111
ముకుళిత-	62
ముఖపుండరీకం	94
యద్బృందావన-	124
యది మే	14
యద్విష్ణోః	26
రంగభర్తు రపి	88
రమయతు	104
రామానుజపద-	2
రామానుజమునిః	3
లక్ష్మీకల్పతోత్తుంగ-	10
లీలాలతా-	61
వక్షఃస్థల్యాం	113
వటదళ-	78
వందారు-	123
వపుః మందారస్య	90
విదధతు	52
విధాయ	4
విలసతి	101
విహరతి	39
విహరతు మయి	93
వైభూషణ్యాం	121
వ్యాపి రూప మపి	46
శిఖారత్నోద్దీప్రం	92
శింజానశ్రుతి-	125
శేషశయ-	59
శ్రవో నాసా-	99
శ్రీరంగచంద్రమసం	50
శ్రీరంగదివ్యభవనం	34
శ్రీరంగరాజ-	49
శ్రీరంగాంతర్మందిరం	60
శ్రీరంగేందోః	127
శ్రీరంగేశయ ఇహ	81
శ్రీరంగేశయజంఘే	122
శ్రీవత్సచిహ్న-	1
శ్రీస్తనాభరణం	8

శ్రుతిమయం	53
సంశోధ్య	48
సంభావ్యమాన మివ	69
సింహాసనే	66
సరసీరుహే	96
సర్వాత్మ-	38
సించే దిమం	82
సైన్యధురీణ-	51
సో అంగ	15
సౌశీల్యశీతలం	65
స్ఫురితశఫర-	28
స్మరశరనళిన-	97
స్మేరాననాక్షి-	37
స్వఘణవితాన-	77
స్వం సంస్కృత-	16
స్వస్తి	11
స్వాస్థ్యరూప-	55
హనుభూష-	57
హారస్ఫారిత-	112
హృదయం ప్రసాదయతి	95

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీరంగరాజస్తవం - ఉత్తరశతకం

శ్రీపరాశరభట్టర్ తనియన్

1. శ్రీ పరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవం పూర్వశతకంద్వారా ద్వయ మంత్రంలోని పూర్వఖండార్థాన్ని పూర్వాచార్యపరంపరాపూర్వకంగా ఇంతవరకు అనుసంధించారు. ఇకపై, ఉత్తరశతకంలో, ఉత్తరఖండార్థం అయిన ప్రాప్యత్వాన్ని అనుసంధించగోరి, అది (ప్రాప్యత్వం) సర్వస్మాత్ పరునకుమాత్రమే ఉన్నది కాబట్టి, ఆ పరత్వాన్ని విస్తృతంగా నిరూపించడంకోసం, ఆ పరత్వ నిరూపణం ప్రమాణాధీనం కనుక, ఆ ప్రమాణాన్ని శ్రీరంగనాథుడు నిర్హేతుకకృపతో గొప్ప దీపంవలె ప్రకాశింప జేయగా, దానిచే గొప్ప భాగ్యం కలవారు మంచి చెడ్డలను వివేకించి తెలిసికొని, భగవానుని అనుభవిస్తున్నారు; ఆ వివేకం లేనివారు (దీపంపట్ల) మిడుతలవలె విరుద్ధమైన జ్ఞానాన్ని పొంది నశిస్తున్నారు- అని స్తుతిప్రారంభంలో అంటున్నారు.

హర్తుం తమ స్సదసతీ చ వివేక్తుమీశో మానం ప్రదీపమివ కారుణికో దదాతి।
తేనావలోక్య కృతినః పరిభుజంతే తం తత్రైవ కేఽపి చపలా శ్శలభీభవంతి॥

కరుణాస్వభావుడైన భగవానుడు అజ్ఞానమనే చీకటిని పోగొట్టడంకోసం, సత్, అసత్ -అనే పదాలచే వ్యవహరింపబడే మంచి చెడ్డలను వివేచనచేసి తెలిసికోవడంకోసం గొప్ప దీపంవంటి వేదరూపశాస్త్రప్రమాణాన్ని లోకానికి ఇస్తున్నాడు. భాగ్యశాలురు, ఆ దీపంతో ఆ భగవానుని చూచి తెలిసికొని దర్శించి అనుభవిస్తున్నారు. కొందఱు అవివేకులు మాత్రం తెలిసికోలేక ఆ దీపంలోనే మిడుతలవలె అవుతున్నారు. (పడి నశిస్తున్నారు).

2. "పూర్వం పల్కిన చపలురకు (అవివేకులకు) ప్రమాణాలుగా జైనాది బాహ్యస్మృతులు, వైదికత్వమనే ముసుగు వేసికొన్న కాపిల, కాణాదిస్మృతులు ఉన్నాయికదా!" అని అంటే, "అవి దుష్కర్మలను చేసినవారికి నిన్ను చేరే దారి తెలియకుండా ఉండడంకోసం రచింపబడ్డాయి. **"యద్వై కించ మనురవదత్ తత్ భేషజమ్"** అని కదా వేదంలో చెప్పబడింది; **"యా వేదబాహ్యాః స్మృతయః యాశ్చ**

కాశ్చ కుదృష్టయః, సర్వాస్తాః నిష్ఫలా ప్రేత్య తమోనిష్ఠా హి తాః స్మృతాః" అని స్మృతులలోను చెప్పబడింది"- అని ఇందులో అంటున్నారు.

యా వేదబాహ్యాః స్మృతయోఽర్హదాదేః వేదేషు యాః కాశ్చ కుదృష్టయ స్తాః ।
ఆగస్స్మృతాం రంగనిధే! త్వదధ్వని అన్ధంకరణ్యాః స్మృతవాన్ మనుస్తత్ ॥

ఓ శ్రీరంగంలోని నిధివంటివాడా ! వేదార్థాలకు విరుద్ధాలైన జైనాదులయొక్క ఏయే స్మృతులు ఉన్నాయో, వేదాల విషయంలో కుత్సితాలైన దృష్టులను కల ఏయే స్మృతులు ఉన్నాయో, పాపులైన ఆ వేదబాహ్య- వేదకుదృష్టుల అటువంటి స్మృతులన్నీ నిన్ను పొందే దారి అయిన ఆ వైదికమార్గంలో మోహాన్ని కల్గిస్తాయి- అనే ఆ విషయాన్ని మనువు తన స్మృతిలో పలికాడు.

3. "పూర్వం పల్కిన బాహ్యకుదృష్టిమతాలలో- బాహ్యమతాన్ని ప్రత్యక్ష విరోధంవల్ల, నిర్దోషమైన శ్రుతితో దానికి గల విరోధంవల్ల, అది కుతర్కసిద్ధం కనుక, వక్తృదోషంచేత వేదాంతజ్ఞానవృద్ధులు పూర్తిగా విడిచిపెట్టారు" అని ఇందులో అంటున్నారు.

ప్రత్యక్ష ప్రమథనపశ్యతోహరత్వాత్ నిర్దోషశ్రుతివిమతేశ్చ బాహ్యవర్త్మ ।
దుస్తర్కప్రభవతయా చ వక్తృదోష స్పష్ట్యా ప్రజహతి రంగవింద! వృద్ధాః ॥

శ్రీరంగంలో నివసించే శ్రీరంగనాథా ! వైదికవృద్ధులు వేదబాహ్యుల మార్గాన్ని విడచిపెడుతున్నారు. (ఎందుకు? అని అంటే) కంటితో చూచిన విషయాన్ని లేదని పల్కడమనే చూస్తూ ఉండగానే దొంగతనం వారు చేయడంవల్ల, ఏదోషం లేని ప్రమాణమైన వేదాలకు విరుద్ధంగా ఉన్నందువల్ల, కుతర్కాలద్వారా సిద్ధించినందువల్ల, వక్తలయొక్క భ్రమ- ప్రమాద విప్రలంభాది దోషాల సంబంధంవల్లను (వేదబాహ్యమార్గాన్ని విడచిపెడుతున్నారు)

4. సామాన్యంగా బాహ్యమతం వైదికులకు త్యాజ్యమని పూర్వం పలికారు. ఇందులో- ప్రత్యక్షం మాత్రమే ప్రమాణమని వాదించే చార్వాకమతంలో కూడా- దేహం అవయవి అయినందువల్ల, ఎదురుగా ఉండే విషయీకరించే బాహ్యకరణాలకు అది ప్రకాశిస్తున్నది. (కాని), అవయవి కాని (నిరవయవి అయిన) ఆత్మ, బాహ్యకరణాలకు విషయం కాదు. అహమని ("నేను" అని) అంతఃకరణానికి ప్రకాశిస్తున్నాడు. ఇటువంటి ఆ దేహ-ఆత్మలను, అపృథక్ సిద్ధసంసర్గవిశేషంవల్ల

ఆధార-ఆధేయభావంతో, ప్రకార- ప్రకారిభావంతో గమనించలేని జనులు తెలిసికోలేకపోతున్నారు. అందువల్ల, **"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత"**, **"బ్రహ్మ విదాప్నోతి పరమ్"** ఇత్యాది నీ ఆజ్ఞారూపమైన శాస్త్రం పరలోకగమన యోగ్యతను కల ఆత్మవిషయంలో ప్రమాణం కావడంలో ఏ లోటు లేదు- అని అంటున్నారు.

అవయవితయేదంకుర్వాణై ర్బహిష్కరణైర్వపుః
నిరవయవకోఽహంకారార్హః పుమాన్ కరణాతిగః ।
స్ఫురతి హి జనాః ప్రత్యాసత్తే రిమౌ న వివించతే
తదధికురుతాం శాస్త్రం రంగేశ ! తే పరలోకిని ॥

ఓ శ్రీరంగనాథా! దేహం అవయవాలతో కూడినది కావడంచేత "ఇది" అని విషయీకరించే బాహ్యేంద్రియాలద్వారా (జీవాత్మకు ఆధేయంగాను, ప్రకారంగాను) భాసిస్తున్నది. అవయవరహితుడైన జీవాత్మ బాహ్యేంద్రియాలకు విషయం కానివాడై (స్ఫురించనివాడై), **"అహం"** (నేను) అనే ప్రతీతికి అర్హుడుగా ప్రకాశిస్తున్నాడు. ఈ దేహం, ఆత్మ - అనే రెండు విభాగించడానికి వీలులేనట్లుగా కలసి ఉండడమనే చేరికలోని దార్ఢ్యంవల్ల అవివేకులైన జనులు వానిని ఇదమిత్థంగా విభాగించి తెలిసికోవడంలేదు. అందువల్ల నీ ఆజ్ఞారూపమైన వేదమనేశాస్త్రం, దేహంవలె ఈ లోకంతో పాటు రూపుమాసి పోయేది కాకుండా పరలోకప్రాప్తియోగ్యుడైన జీవాత్మవిషయంలో ప్రమాణమవడంలో లోటులేదు.

5. ఈ రీతిలో, ఆత్మవలె వేదంకూడా శ్రావణ (వినికిడికి) ప్రత్యక్షగోచరంగాను, దాని అర్థజ్ఞానంకూడా మానసప్రత్యక్షగోచరంగాను, పౌరుషత్వాదులైన అనే వేదదోషాలుకూడా ప్రత్యక్షగోచరాలు కాకుండాను, వాటి అర్థాలైన ధర్మాధర్మాదులు ప్రత్యక్షబాధితాలు కాకుండాను ఉండడంవల్ల, యోగాన్ని చేజిక్కించుకున్నవారికి ఆ ధర్మాదులు ప్రత్యక్షం కోవడం సాధ్యం. కనుక, చార్వాకమతరీతిలోకూడా వేదం ప్రత్యక్షంవలె ప్రమాణం కావడంలో లోటు లేదు.- అని ఇందులో అంటున్నారు.

"తదధికురుతాం శాస్త్రం పరలోకిని" అనే గత శ్లోకంలోని సూక్తికి వివరణ రూపమే ప్రకృత శ్లోకం. ప్రత్యక్షమే ప్రమాణమనే వితండవాదాన్ని చేసే చార్వాకుని అతని వాదాన్ని అనుసరిస్తూ అతని నోరు మూయించడం అద్భుతం. వేదప్రామాణ్యాన్ని అతనిచే అంగీకరింపజేస్తే ఇక ఆత్మసత్త, ఈశ్వరసత్త, వేదచోదిత ధర్మాధర్మాలు అన్నీ సిద్ధిస్తాయి కదా !

ప్రత్యక్షా శ్రుతి రర్థధీశ్చ న తథా దోష స్తదర్థః పునఃధర్మాధర్మపరావరేశ్వరముఖః ప్రత్యక్షబాధ్యో న చ ।తచ్చార్వాకమతేఽపి రంగరమణ ! ప్రత్యక్షవత్ సా ప్రమాయోగోన్మీలితధీ స్తదర్థ మథవా ప్రత్యక్షమీక్షేత సః ॥

వేదం (చెవులకు) ప్రత్యక్షమై ఉన్నది. ఆ వేదంయొక్క అర్థజ్ఞానం కూడా అంతఃకరణానికి ప్రత్యక్షమై ఉన్నది. పౌరుషేయత్వమూలంగా కలిగే భ్రమ, విప్రలంభం, ప్రమాదం మొదలైన దోషాలు ఆ విధంగా ప్రత్యక్షాలు కావు. ఆ వేదంయొక్క అర్థమైన ధర్మం, అధర్మం, పరమేశ్వరుడు, అవరేశ్వరులైన బ్రహ్మాదులు- ఇత్యాదులు కూడా ప్రత్యక్షంచేత బాధింపబడేవి కావు. ఓ శ్రీరంగనాథా! అందువల్ల చార్వాకమతంలోకూడా ఆ శ్రుతి, ప్రత్యక్ష ప్రమాణంతో సాటిగా ప్రమాణమే అవుతుంది. లేకపోతే, ఆ చార్వాకుడు యోగంతో వికసించిన బుద్ధిని కలవాడై, పూర్వం పల్కిన ఆ వేదంలోని అర్థాలను ప్రత్యక్షంగానే చూడవచ్చు (దర్శించగలడు).

6. ఈ విధంగా "చార్వాకమతరీతిలోకూడా శ్రుతిప్రామాణ్యానికి కొఱత లేదు" అని పల్కి, ఇందులో- "ప్రతీయమానమైన జగత్తు, ఉత్పత్తి- వినాశాలను కల్గినది కనుక స్వతస్సిద్ధం కాదు; ప్రతీయమానం అవుతున్నందున కుందేటి కొమ్ములవలె స్వతః అసత్తుకూడా కాదు. విరుద్ధాలు కనుక (స్వతస్సిద్ధం, స్వతః అసత్తు -అనేవి పరస్పరం విరుద్ధాలు కనుక) ఉభయరూపము కాదు. అప్రసిద్ధం కనుక, దానికంటే వేఱు కాదు" అని అంటూ జగత్తును నిరధిష్ఠానంగా నిషేధించి శూన్యాన్ని స్థాపించే బుద్ధుడు- **"యథా హి చోరః స తథా హి బుద్ధః"** అనే రీతిలో దండించదగినవాడు- అని అంటున్నారు.

న సదసదుభయం వా నోభయస్మాద్బహిర్వా
జగదితి న కిలైకాం కోటి మాటీకతే తత్ ।
ఇతి నిరుపధి సర్వంసర్వికాతో నిషేధన్
వరద ! సుగతపాశ శ్చోరలావం విలావ్యః ॥

వరాలను ప్రసాదించే ఓ శ్రీరంగనాథా ! (కన్పించే ఈ) జగత్తు సత్తు కాదు; అసత్తు కాదు; రెండు విధాలు అయినది కాదు ;రెండు విధాలకంటే వేఱయినది కూడా కాదు- అని ఈ విధంగా (పూర్వం తెల్పిన నాల్గు ప్రకారాలలో) ఏవిధమైన కోటిని ఆ జగత్తు పొందడం లేదు -అని ఈవిధంగా ఏ అధిష్ఠానం

లేకుండా **"సర్వం నాస్తి, సర్వం నాస్తి"** అని అంటూ నిరవధిష్ఠానంగా సర్వశూన్య వాదాన్ని చేసే కుత్సితుడైన బుద్ధుడు దొంగను ఖండించినట్లు ఖండించదగినవాడు. (అతడు చేసే సర్వశూన్యవాదం ఖండించదగినది).

7. దానివల్ల శ్రుతిప్రామాణ్యానికి ఏమి ప్రయోజనం సిద్ధిస్తున్నది? అనే ఆకాంక్ష కలుగగా, సర్వశూన్యత్వసాధనప్రమితి అభిమతమయితే, సర్వశూన్యత్వవాదం సిద్ధించదు. ఆ ప్రమితి కూడా అనభిమతమైతే, **"సర్వమ్ నాస్తి"** అనే ప్రతీతిరూపమైన నిషేధం కూడా లేనందువల్ల, నిషేధించేవాడు లేడు. అందువల్ల **"ఇక్కడ లేదు, ఇప్పుడు లేదు"** అని నిషేధించి చెప్పాలి తప్ప, **"సర్వం నాస్తి"** అని అధికరణానికి ఉపాధులు లేకుండా ఏ నిషేధం సిద్ధించదు. అధికరణాది ఉపాధిసహితమైన నిషేధాన్ని అంగీకరిస్తే, ఘటత్వాంశలో ఘటత్వం పోయినా, శకలత్వసిద్ధివలె (ఘటం భిన్నమైనా, దాని శకలాలు మిగిలి ఉండేటట్లుగా) **"ఇక్కడ లేదు"** అని అంటే, వేఱొకచోట అది ఉన్నదని సిద్ధిస్తుంది. కనుక, సర్వశూన్యవాదం సిద్ధించదు. కనుక అతని ఖండనప్రకారంకూడా అతడు పల్కిన సర్వశూన్యతసాధనలో ప్రమాణం కాలేదు. కనుక, శ్రుతిప్రామాణ్యానికి లోటు లేదు- అని ఇందులో అంటున్నారు.

ప్రతీతిశ్చేదిష్టా న నిఖిలనిషేధో యది న కో
నిషేద్ధాఽతో నేష్టో నిరుపధినిషేధ స్సదుపధౌ ।
నిషేధేఽన్యస్మిద్ధ్యే ద్వరద ! ఘటభంగే శకలవత్
ప్రమాశూన్యే పక్షే శ్రుతిరపి మతేఽస్మిన్విజయతామ్ ॥

వరాలను ఇచ్చే శ్రీరంగనాథా ! **"సర్వం నాస్తి"** అనే ప్రతీతి ఇష్టమైనది అయితే (నిజమని భావిస్తే) సమస్త వస్తువులకు నిషేధం అనేది సిద్ధించదు. అప్రతీతి సత్యం -అని భావించకపోతే జగత్తును నిరాకరించేవాడెవడు ? (ఎవడూ లేడు). అందువల్ల నిరధిష్ఠాననిషేధం పరిగ్రాహ్యమైనది కాదు. ఒక ఉపాధిని పురస్కరించుకొని నిషేధిస్తే వేఱొక వస్తువు సిద్ధిస్తుంది, (ఏవిధంగా ? అంటే) ఘటం పగిలిపోయినా, దాని ముక్కలు సిద్ధించినట్లుగా (సిద్ధిస్తుంది) ఈ బౌద్ధమతంలో కూడా సర్వశూన్యత్వ ప్రమను కూడా గ్రహించని పక్షంలో వేదమనే ప్రమాణం జయించినట్లే.

8. ఇందులో- బౌద్ధులలో అవాంతరమతానికి చెందిన యోగాచార-సౌత్రాంతిక - వైభాషికులనే ముగ్గురున్నారు. వారిలో యోగాచారుడు- "జగత్తు లేదు; జ్ఞానమే ఉన్నది" అని అంటున్నాడు. సౌతాంత్రికుడు- "జగత్తు ఉన్నది; అది జ్ఞానగతమైన

ఆకారభేదంచేత అనుమేయం'' అని అంటున్నాడు. వైభాషికుడు- "జగత్తు ఉన్నది; అది ప్రత్యక్షం, క్షణికం'' అని అంటున్నాడు. ఈ ముగ్గురు "జ్ఞానమాత్రమే ఆత్మ; అది క్షణికం'' అని అంటున్నారు. వారిని నిరసిస్తున్నాము- అని వారిని నిరసించడంకోసం ప్రతిజ్ఞను చేస్తున్నారు. క్షణికత్వం నిరసింపబడితే ఈ మతాలు నిరసింపబడినట్లే కదా. ఆ మెలకువతో ఈ శ్లోకాన్ని, తరువాతి రెండు శ్లోకాలను భట్టర్ పల్కడం విశేషం.

యోగాచారో జగదపలపత్యత్ర సౌత్రాంతిక స్తత్
ధీవైచిత్ర్యాదనుమితిపదం వక్తి వైభాషికస్తు ।
ప్రత్యక్షం తత్ క్షణికయతి తే రంగనాథ ! త్రయోఽపి
జ్ఞానాత్మత్వక్షణభిదురతే చక్షతే తాన్ క్షిపామః ॥

శ్రీరంగనాథా ! ఈ సౌగతమతవాదులలో, యోగాచారుడు - జగత్తును లేదని అంటున్నాడు. సౌత్రాంతికుడనే ఇంకొక బౌద్ధమతవాది - ఆ జగత్తును పలు రీతులలోని ప్రతీతులు కల్గుతున్నందువల్ల అనుమానగోచరమని అంటున్నాడు. వైభాషికుడనే వేఱొక బౌద్ధమతవాది అయితే- ప్రత్యక్షమైన ఆ జగత్తును క్షణికమని అంటున్నాడు. ఈ విధంగా పూర్వం పల్కిన ముగ్గురు "జ్ఞానమే ఆత్మ'' అని, "అంతా క్షణభంగుర''మని పల్కుతున్నారు. వారిని నిరసిస్తున్నాము.

9. "జగత్తు క్షణికం; దానిని విషయంగా కల్గిన జ్ఞానంకూడా క్షణికం. ఆ జ్ఞానమే ఆత్మ'' - అనే పక్షం సరి కాదు. ఎందుకు ? అంటే- వేఱొక ఆత్మ అనేది లేకుండా, జ్ఞానం, జ్ఞేయం క్షణికాలైతే, జగత్తులో ఏకాలంలో అయినా ఘటాదుల అనుభవం కల్గినపుడు, అది అపుడే నశించిపోవాలి. ఆ అనుభవంవల్ల ఏర్పడే సంస్కారంకూడా క్షణధ్వంసి కనుక, కాలాంతరంలో ఏ హేతువు మిగిలి ఉండనందువల్ల, "అది ఘటం'' అనే స్మరణం, ఒక కాలంలో ఉన్న వస్తువు వేఱొక కాలంలో ఉన్నదని అవగాహించే **"సోఽయమ్"** (అతడే ఇతడు) అనే ప్రత్యభిజ్ఞ కలుగదు కనుక- అని ఈ శ్లోకంలో అంటున్నారు.

జగద్భంగురం భంగురా బుద్ధి రాత్మేతి అసత్ వేత్రభావే తథా వేద్యవిత్త్యోః।
క్షణధ్వంసత శ్చ స్మృతిప్రత్యభిజ్ఞాదరిద్రం జగత్ స్యాదిదం రంగచన్ద్ర! ॥

శ్రీరంగనాథా! జగత్తు క్షణికమైనది; క్షణికమైన జ్ఞానమే ఆత్మ- అనే మతం, అసత్యం. (ఎందుకు? అని అంటే) జ్ఞానంకంటే విలక్షణుడైన జ్ఞాత లేకపోతే ఆ

విధంగానే తెలియబడే పదార్థాలు గాని, జ్ఞానం గాని క్షణికాలవుతాయి. అపుడు ఇక ఈ జగత్తు స్మృతిని, ప్రత్యభిజ్ఞను లేనిది అవుతుంది. (సుమా !)

10. క్షణికత్వపక్షంలో (జగత్తు క్షణికం- అనే పక్షంలో) గల దూషణాలు పూర్వం ప్రస్తావింపబడ్డాయి. ఇందులో, - "నేను దీనిని తెలిసికొంటున్నాను'' అనే దానిలో (జ్ఞానాకారంలో) "నేను'' అనే అహమర్థానికి, "తెలిసికొంటున్నాను'' అనే జ్ఞానానికి భేదం చక్కగా ప్రకాశిస్తూ ఉండగా, ఆ రెండిటికి అభేదాన్ని పల్కితే, **"దీనిని"** అనే ఇదం శబ్దార్థమైన జ్ఞేయంతోకూడా వాటికి అభేదం ప్రసంగిస్తుంది. (చెప్పవలసి వస్తుంది.) "యోగాచారమతంలో జ్ఞేయం మిథ్య కనుక, అది (అభేదం) రాదు'' అని అంటే, "జ్ఞానమనేది- స్వజ్ఞేయమని, పరజ్ఞేయమని రెండు విధాలుగా ఉన్నందున, అది కూడా మిథ్య కావలసి వస్తుంది. అపుడు మాధ్యమికమతాన్ని అంగీకరించి, జ్ఞానానికి మిథ్యాత్వాన్ని ఒప్పుకొంటే, బాధకప్రమాణమనేది ఏదీ లేనందువల్ల, వైదికసిద్ధాంతం చిరంజీవి కావడంలో లోటు లేదు''- అని ఇందులో అంటున్నారు.

అహమిద మభివేద్మీత్యాత్మవిత్త్యో ర్విభేదే
స్ఫురతి యది తదైక్యం బాహ్య మప్యేకమస్తు ।
ప్రమితిరపి మృషా స్యాన్మేయమిథ్యాత్వవాదే
యది తదపి సహేరన్ దీర్ఘ మస్మన్మతాయుః ॥

"నేను దీనిని తెలిసికొంటున్నాను'' అని ఆత్మకు, జ్ఞానానికి మధ్య, విశేషమైన భేదం స్ఫురిస్తూ ఉండగా, వాటికి ఐక్యం చెప్పినట్లయితే, ఆ రెండిటి కంటే భిన్నమయిన, జ్ఞానానికి విషయం అవుతున్న (తెలియబడే) ఘటపటాది బాహ్యపదార్థాలు కూడా, జ్ఞానంకంటే వేఱుగా ఉండకపోవచ్చు కదా ! (ఒకటే కానీ). ప్రమేయం అంతా మిథ్య- అనే పక్షంలో (ప్రమేయమంతా మిథ్య- అనే) ఆ ప్రతీతికూడా అసత్యమే కాగలదు. దానిని కూడా అంగీరించేవారైతే, మా మతంయొక్క ఆయుస్సు దీర్ఘమైనది, (మా మతం ఉజ్జీవిస్తుంది)

11. "ప్రమేయసామాన్యం అంతా మిథ్య- అనే పక్షంలో ప్రమితి కూడా మిథ్య కావలసి వస్తుంది''- అని బౌద్ధమత విషయంలో పల్కిన దూషణం అద్వైత మతంలోను వర్తిస్తుంది. **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"** ఇత్యాది వాక్యాలవల్ల జ్ఞానమాత్ర స్వరూపమైన బ్రహ్మం స్వమాత్ర ప్రకాశమైనా, అవిద్యాదోషంవల్ల జ్ఞాత, జ్ఞేయాలనే భేదాలను అనుభవిస్తున్నది. ఆ అనుభవరూపమైన భ్రాంతిని **"తత్త్వమసి"**

ఇత్యాది శ్రుతివాక్యాలద్వారా ఏర్పడిన అద్వైత విద్యాభ్యాసంతో జీవుడు నశింపజేస్తున్నాడు. "ఏది దృశ్యమో, అది అంతా మిథ్య" అని అంటూ ప్రత్యక్షం మొదలైన ప్రమాణాల రీతిని తెలియకుండా వాదించే ఈ కలికాలంలోని బ్రహ్మమీమాంసకులైన ప్రచ్ఛన్న బౌద్ధ సిద్ధాంతంలో (అద్వైత సిద్ధాంతంలో) కూడా ఆ దూషణం వర్తిస్తుంది- అని అంటున్నారు.

ఏతద్రామాస్త్రం దలయతు కలిబ్రహ్మమీమాంసకాంశ్చ
జ్ఞప్తి ర్బ్రహ్మైతత్ జ్వలదపి నిజావిద్యయా బంభ్రమీతి ।
తస్య భ్రాన్తిం తాం శ్లథయతి జితాద్వైతవిద్యస్తు జీవో
యదృత్ దృశ్యం తద్వితథ మితి యే జ్ఞాపయాంచక్రు రజ్ఞాః ॥

పరబ్రహ్మ అనేది నిర్విశేషచిన్మాత్ర స్వరూపం. ఇటువంటి పరబ్రహ్మం, స్వయంప్రకాశమై ఉన్నా, తన అవిద్యచేత భ్రమిస్తున్నది. జీవుడు అయితే **"తత్త్వమసి"** ఇత్యాది వాక్యాలతో అద్వైతజ్ఞానాన్ని అభ్యసించినవాడై, ఆ పరబ్రహ్మయొక్క ఆ భ్రాంతిని విడివడేటట్లు చేస్తున్నాడు- (పోగొడుతున్నాడు) "ఏది ఏది కంటికి గోచరించగలదో అది అంతా మిథ్య" అని ఈవిధంగా ఏ మూఢులు వ్యక్తం చేశారో, కలిపురుషునితో సమానులై, బ్రహ్మవిచారాన్ని చేసే ఆ వాదులను రామాస్త్రంవలె గురి తప్పని దూషణమైన పూర్వం పల్కిన ప్రసంగం (ప్రమేయ సామాన్యం మిథ్య అయితే, ప్రమితికూడా మిథ్య కాగలదు - అనే ప్రసంగం) ఖండించుగాక!

12. జైనమతస్థులు నీ విభూతి అయిన సర్వజగత్తును **"స్యాదస్తి, స్యాన్నాస్తి, స్యాదస్తి నాస్తి చ, స్యాదస్తీతి వక్తవ్యమ్, స్యాన్నాస్తీతి వక్తమ్, స్యాదస్తి నాస్తీతి వక్తవ్యమ్, సర్వథా వక్తవ్యమ్"** అని చెప్పబడిన సప్తభంగి అనే కుమార్గాన్ని ఆశ్రయించి అనేకాంతంగా పల్కుతున్నారు. వీరివలె - **"నాతల్లి వంధ్య"** అనే రీతిలో "ఈ జగత్తు బ్రహ్మతో భిన్నంగాను, అభిన్నంగాను ఉన్నది" అని పలికే నూతన బ్రహ్మవిజ్ఞాని (భేదాభేదవాది)తో ఈ సదస్యం కాని (సదస్సులో చెప్పదగని) విరుద్ధభాషణాన్ని పలుకాలి- అని ఈ శ్లోకంలో అంటున్నారు.

అంగీకృత్య తు సప్తభంగికుసృతిం స్యాదస్తినాస్త్యాత్మికాం
విశ్వం త్వద్విభవం జగజ్జినమతే నైకాన్త మాచక్షతే ।
భిన్నాభిన్నమిదం తథా జగదుషే వంధ్యా మమామ్బేతివత్
నూత్నబ్రహ్మవిదే రహః పరమిదం రంగేశ్వ తే చక్షతామ్ ॥

ఓ శ్రీరంగనాథా ! **"స్యాదస్తి, స్యాన్నాస్తి"** ఇత్యాది రూపమైన సప్తభంగి అనే దుర్మార్గాన్ని అంగీకరించి నీ విభూతి అయిన సకలజగత్తును జైనమతంలో అనే కాంతంగా పల్కుతున్నారు, ఆ జైనులు. అదే రీతిలో నా తల్లి గొడ్రాలు - అనే రీతిలో (వ్యాహతంగా) ఈ లోకాన్ని (పరబ్రహ్మతో) భిన్నంగా, అభిన్నంగాను పలికే నూతనబ్రహ్మవేత్త అయిన మృషావాదులలో ఏకదేశికి (భేదాభేదవాదికి) ఈ గొప్ప రహస్యార్థాన్ని ఉపదేశించాలి! అంతేతప్ప ఆ వాదాన్ని వినేవారెవ్వరూ లేరు.

13. ఇంతవరకు ఈ విధంగా చార్వాక, బౌద్ధ, జైనమతాలను, వారిని అనుసరించే కుదృష్టిమతాలతో పాటుగా (అద్వైత-భేదాభేదమతాలతోపాటుగా) నిరసించారు. ఇకపై, నైయాయిక, వైశేషికులు- **"సదేవ సామ్యేదమగ్ర ఆసీత్", "ఏకో హ వై నారాయణ ఆసీత్"** ఇత్యాది వేదాంతాలలో నీకే సకలకార్యోపాదానత్వం (అన్ని కార్యాల ఉపాదానత్వం) సమృద్ధిగా, సులభంగా చెప్పబడి ఉండగా, కార్య-కారణ -సాలక్షణ్య- అన్యథానుపత్త్యాది శ్రుతివిరుద్ధతర్కాలతో బిచ్చమెత్తినట్లుగా ఆయా భూతాల ఉపాదానత్వాలను ఆ యా పరమాణువులలో స్వీకరించి, **"ఆత్మన ఆకాశ స్సంభూతః"** ఇత్యాదిగా నీ కార్యజాతంగా చెప్పబడిన ఆకాశాదులను నిత్యాలుగా పల్కుతున్నారు- అని అంటున్నారు.

కణచరచరణాక్షౌ భిక్షమాణౌ కుతర్కైః
శ్రుతిశిరసి సుభిక్షం త్వజ్జగత్కారణత్వమ్ ।
అణుషు విపరిణామ్య వ్యోమపూర్వం చ కార్యం
తవ భవదనపేక్షం రంగభర్తః ! బ్రువాతే ॥

ఓ శ్రీరంగనాథా ! కణాదుడు, గౌతముడు వేదాంతంలో ఏ కొఱత లేకుండా ప్రకాశించే "నీవే అన్నిటికి ఉపాదానకారణం" అనేదానిని కుత్సితాలైన తర్కాలతో బిచ్చమెత్తినవారై, పరమాణువులలో (దానిని) విపరిణమింపజేసి (పర్యవసింపజేసి), నీ కార్యమైన (నీనుండి ఉద్భవించే) ఆకాశాదులను నీ అపేక్షను లేనివానినిగా పల్కుతున్నారు.

14. "తనను నిర్మించే పురుషుడు, అతని బుద్ధిలో గల అశుద్ధి వల్ల ఏర్పడే, భ్రమ-విప్రలిప్సాది దోషాలు- అనేవి ఏవీ లేనందున, సర్వప్రమాణాలలో ప్రబలమైన వేదం శారీరక-ప్రథమాధ్యాయాధికరణన్యాయాలతో నిన్ను ప్రధానప్రతిపాద్యునిగా కల్గినదిగా నిరూపిస్తున్నది. ఆ విధంగా స్వతంత్రప్రమాణమైన వేదాన్ని మూలంగా కల్గినందువల్ల ఇతరాగమాలు ప్రమాణాలు అవుతున్నాయి. కనుక, సాంఖ్యం,

యోగ్యం పాశుపతం మొదలైన ఆగమాలు, ఆ వేదానికి అవిరుద్ధమైన భాగంలోమాత్రం ప్రమాణాలు. పాంచరాత్రాగమంలో ఈ విధంగా విరుద్ధాలైన అంశాలు ఏమీ లేనందువల్ల, అది పూర్తిగా ప్రమాణం. ఈ మాటను పక్షపాతంలో చెప్పడం లేదు. **"భారతః పంచమో వేదః"** అని పంచమ వేదంగా చెప్పబడిన మహాభారతం మోక్షధర్మంలో, ఉపరిచరవసువు ఉపాఖ్యానంలో శ్రీపాంచరాత్రం యొక్క వ్యుత్పత్తిని, దానిలో విధింపబడ్డ అనుష్ఠానం తప్పక ఆచరించదగినది- అని పల్కిన తరువాత- **"ఇదం శతసహస్రాద్ధి భారతాఖ్యానవిస్తరాత్, ఆవిధ్య మతిమంథానం దధ్నో ఘృత మివోద్ధృతమ్, నవనీతం యథో దధ్నో ద్విపదాం బ్రాహ్మణో యథా, ఆరణ్యకం చ వేదేభ్య ఓషధీభ్యో యథాఽమృతమ్, ఇదం మహోపనిషదం చతుర్వేదసమన్వితమ్, సాంఖ్యయోగకృతాంతేషు పంచరాత్రాను శబ్దితమ్, ఇదం శ్రేయ ఇదం బ్రహ్మ ఇదం హిత మనుత్తమమ్, ఋగ్యజుస్సామభిః జుష్టమథర్వాంగిరసైస్సహా, భవిష్యతి ప్రమాణం వా ఏతదేవానుశాసనమ్"** అని విస్తృతంగా తెలపబడినందున తెలిసి పల్కుతున్నాము- అని ఈ శ్లోకంలో అంటున్నారు.

వేదే కర్తృద్యభావాత్ బలవతి హి నయై స్త్వన్ముఖే నీయమానే
తన్మూలత్వేన మానం తదితరదఖిలం జాయ తే రంగధామన్ !।
తస్మాత్ సాంఖ్యం సయోగం న పశుపతి మతం కుత్రచిత్ పాంచరాత్రం
సర్వత్రైవ ప్రమాణం తదిదమవగతం పంచమాదేవ వేదాత్ ॥

శ్రీరంగాన్ని నివాసంగా కల్గిన శ్రీరంగనాథా! తనకు కర్త మొదలైనవి లేనందువల్ల వేదం ప్రబలప్రమాణం. అది న్యాయాలతో నీ పరంగా అన్వయింప బడినది కాగా, ఆ వేదం కాకుండా మిగిలిన శాస్త్రాలు అన్నీ ఆ వేదాన్ని మూలంగా కల్గినవి అనే కారణంచేత ప్రమాణాలు అవుతున్నవి. అందువల్ల యోగశాస్త్రంతో కూడిన, పశుపతి మతంలో కూడిన సాంఖ్యమతం కొంచెం ఒకచోట (అంశతః) ప్రమాణం అవుతున్నది. శ్రీపాంచరాత్రం అయితే అంతా పూర్తిగా ప్రమాణమే- అనే ఈ విషయం అయిదవ వేదమైన మహాభారతాన్ని బట్టియే తెలుస్తున్నది.

15. సాంఖ్య-యోగ్య-పాశుపతాలకు శ్రుతిలో ఏ అంశంలో వైరుధ్యం ఉన్నది? అనే శంక కలుగగా, సాంఖ్యుడు, నిన్ను చేతనవర్గంలోకి చేర్చి, **"పతిం విశ్వస్య"** అని చెప్పబడిన ఈశ్వరత్వాన్ని అంగీకరించలేదు. కపిలుడు ఎక్కడ చెప్పినా (అది) ప్రకృతి-ఆత్మవివేకంలో ఇదంపరమే కనుక, అందులో (ఈశ్వరత్వంలో) తాత్పర్యం

లేదు. యోగశాస్త్ర ప్రవర్తకుడైన పతంజలికూడా యోగాభ్యాసంలో ప్రవేశించినవానికి అతిశయాన్ని పల్కడంలో గల తాత్పర్యంతో కర్మవినిర్ముక్తుడైన పురుషుని విషయంలో ఐశ్వర్యాన్ని ప్రతిఫలనంవలె పలికాడు. శైవుడు, పక్షపాతంతో **"పిణ్డియూర్"** ఇత్యాది రీతిలో భిక్షువైన రుద్రుని విషయంలో ఐశ్వర్యాన్ని అంగీకరిస్తున్నాడు. నీవు **"పంచరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణః స్వయమ్"** అనేరీతిలో పాంచరాత్రశాస్త్రాన్ని అంతటిని ఉపదేశించావు. అందులో నిన్ను పర-వ్యూహ-విభవాదులతో, స్వరూప-రూప-గుణవిభూతులతో సంపన్నుడవని పలికావు- అని స్థాలీపులాకన్యాయంలో సాంఖ్యాదులకు అంశతః విరోధాన్ని, పాంచరాత్రానికి అన్ని అంశలలోను అవిరోధాన్ని తెల్పుతున్నారు.

సఖ్చష్టే నేశ్వరం త్వాం పురుషపరిషది న్యస్య యద్వాఽన్యపర్యాత్
సాఙ్ఖ్యో యోగీ చ కాక్వా ప్రతిఫలనమివైశ్వర్య మూచే కయాచిత్ ।
భిక్షౌ శైవ స్సురాజమ్భవ మభిమనుతే రంగరాజాతిరాగాత్
త్వాం త్వామేవాభ్యధా స్థం నను పరవిభవవ్యూహనాధ్యమ్భవిష్ణుమ్ ॥

శ్రీరంగనాథా! సాంఖ్యుడు, నిన్ను జీవాత్మగోష్ఠిలో ఉంచి, ఈశ్వరునిగా పలుకడం లేదు. లేక, వేఱొక తాత్పర్యవిశేషం చేత (ఈశ్వరునిగా పల్కడం లేదు). యోగి అయితే పర్యాయవిశేషం చేత (సురాజత్వాన్ని) ఈశ్వరత్వాన్ని ప్రతిఫలనంవలె ఔపాధికంగా పలికాడు. పాశుపతుడు బిచ్చమెత్తి జీవించే ఈశ్వరుని విషయంలోని పక్షపాతాతిశయంచేత ఈశ్వరత్వాన్ని అభిమానిస్తున్నాడు. (పాంచరాత్రవక్తవు అయిన) నీవు పరవ్యూహ విభవరూపాలతో సంపన్నుడవైన నిన్ను యథాతథంగా (స్వరూప రూపాదులలో ఏవిధమైన మార్పు లేకుండా) పలికావు కదా !

సాంఖ్య- యోగ-పాశుపతాలు ఇంచుమించుగా వేదంతో విరుద్ధమైన అర్థాలను తెల్పుతున్నవి- అని, శ్రీపాంచరాత్రం పూర్ణంగా వేదానికి అనుగుణంగా ఉన్నదని గడచిన శ్లోకంలో పల్కిన విషయాన్ని భట్టర్ స్థాలీపులాకన్యాయంతో ఉదాహరిస్తూ పల్కుతున్నారు- ఇందులో. సాంఖ్యులు, యోగులు ప్రధాన కారణవాదులు కనుక, సంసార, మోక్షాల విషయంలో వీరికి భేదం లేదు. అందువల్ల వీరిద్దరి మతాలను ఒకేసారి కలిపి ప్రస్తావించారు

16. ఈ విధంగా, **"కళ్ళవేడతై క్కొణ్డు పోయ్"** అనే రీతిలో నీవు బుద్ధావతారాన్ని ఎత్తి, మోహింపజేసే క్రమంలో, నీచే నిర్మింపబడిన బాహ్యమతాన్నే తృణసమానంగా

మేము భావించినపుడు, వైదికత్వవేషధారి అయిన అధ్వైతుల మార్గాన్ని లెక్కిస్తామా?- అని అంటున్నారు.

ఇతి మోహనవర్ష్మణా త్వయాఽపి గ్రథితం బాహ్యమతం తృణాయ మన్యే।
అథ వైదికవర్మవర్మితానాం మనితామహే కుదృశాం కిమీశ వర్త్మ ॥

ఓ స్వామీ ! ఈ విధంగా (ఇతరులను) వంచించే రీతితో (మాయావేషాన్ని దాల్చిన) నీచేతనే చెప్పబడినది అయినా, వేదబాహ్యమతాన్ని తృణ (సమానం)గా భావిస్తాను. ఇక, వైదికులనే వేషాన్ని వేసికొన్న కుదృష్టులయొక్క దారిని మనస్సులో అయినా భావిస్తానా ఏమి !

17. పూర్వం **"మానం ప్రదీపమివ కారుణికో దదాతి"** అని పల్కిన ప్రమాణ ప్రదానం ఏవిధంగా చేయబడింది? వేదం స్వతంత్రప్రమాణం ఏవిధంగా అవుతున్నది? అని ప్రశ్నిస్తే- ప్రళయకాలాలలో అధ్యేతలైన బ్రహ్మాదులు లేనందువల్ల, వేదాలను సంస్కారరూపాలుగా నీవద్ద ఉంచుకొంటావు. సృష్టి కాలం రాగానే, ఆ సంస్కారంతో స్మృతాలైన దేవాది సంస్థానాలను, వాటికి వాచకాలైన నామాలను, వాటికి యోగ్యాలైన మహత్తు మొదలు పృథివివరకు గల అచేతనాలలోను, బ్రహ్మాది స్తంబపర్యంతాలైన చేతనాలలోను **"సర్వాణి రూపాణి విచిత్య ధీరః, నామాని కృత్వా", "నామ రూపం చ భూతానాం కృత్యానాం చ ప్రపంచనమ్, వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాం చకార సః"** అని శ్రుతిస్మృతులు పలికే క్రమంలో సృష్టిస్తావు. నిద్రించి లేచినవారుగా ఉండే, బ్రహ్మాదులకు **"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై"** అనే రీతిలో అధ్యాపనం చేస్తావు. దానివల్ల **"సదసతీతి వివేక్తుమ్"** అనే రీతిలో విధినిషేధాదిరూపమైన హితాన్ని అనుశాసనం చేస్తున్నావు. ఈ విధంగా అజ్ఞాత కర్తృకాలైన వేదాలను నీవు వహిస్తున్నందున, వేదాలు స్వతఃప్రమాణాలు కావడంలో ఏ కొఱత లేదు- అని అంటున్నారు.

సంస్కారం ప్రతిసంచరేషు నిదధత్సర్గేషు తత్స్మారితం
రూపం నామ చ తత్తదర్థనివహే వ్యాకృత్య రంగాస్పద ! ।
సుప్తోద్బుద్ధవిరించిపూర్వజనతా మధ్యాప్య తత్తద్ధితం
శాసన్మస్మృత కర్తృకాన్ వహసి యద్వేదాః ప్రమాణం తతః ॥

శ్రీరంగాన్ని నివాసస్థానంగా కల ఓ శ్రీరంగనాథా! ప్రళయకాలంలో (వేదాలను) సంస్కారరూపంగా (తనలో) ఉంచుకొంటావు. సృష్టికాలంలో ఆ యా

సంస్కారాలచేత స్మరింపజేయబడిన (ఆ వస్తువుల) రూపాలను, నామాలను వాటి వాటికి తగిన వస్తుసమూహంలో ఏర్పఱుస్తావు. (వ్యాకరించి), నిద్రించి మేల్కొన్న వారివంటి బ్రహ్మమొదలైన జనసమూహానికి (ఆ వేదాన్ని) అధ్యాపనం చేస్తావు. వారివారియొక్క హితాన్ని నియమించేవాడవై, కర్త ఇతడు- అని తెలియలేని వేదాలను నిర్వహిస్తున్నావు. అందువల్ల ఆ వేదాలు స్వతః ప్రమాణాలు అవుతున్నది.

18. ఈ విధంగా స్వతఃప్రమాణమైన వేదాలు, **"అంగాని వేదా శ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః, పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతా శ్చతుర్దశ"** అని వేదోపబృంహణాలైన విద్యాస్థానాలతోను, **"శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం జ్యోతిషాం గతిః, ఛందోవిచితి రిత్యేతైః షడంగో వేద ఉచ్యతే"** అని పల్కిన ఆఱు అంగాలతోను, న్యాయమీమాంసాలతోను, స్మృతిపురాణాలతోను కూడినవై, నిన్నే పరతత్త్వంగా విచారించి నిష్కర్షిస్తున్నవి- అని ఆయా ఉపయోగ (సహకార) విశేషకథనపూర్వకంగా పల్కుతున్నారు.

శిక్షాయాం వర్ణశిక్షా పదసమధిగమో వ్యాక్రియానిర్వచోభ్యాం
ఛంద శ్ఛందశ్చితౌ స్యాద్గమయతి సమయం జ్యోతిషం రంగనాథ!।
కల్పోఽనుష్ఠానముక్తం హ్యుచితగమితయో ర్న్యాయమీమాంసయో స్స్యాత్
అర్థవ్యక్తిః పురాణస్మృతిషు తదనుగా స్త్వాం విచిన్వంతి వేదాః ॥

ఓ శ్రీరంగనాథా ! శిక్షా అనబడే వేదాంగంలో -అక్షరాల ఉచ్చారణ క్రమాదుల శిక్ష (చేయబడింది). వ్యాకరణం అనే వేదాంగం చేత పదాల ప్రకృతిప్రత్యయవిభాగం, అర్థశిక్ష మొదలైవని చేయబడుతున్నాయి. ఛందఃశాస్త్రంలో- గాయత్రి మొదలైన ఛందస్సులను గూర్చి చెప్పబడుతున్నది. జ్యోతిష శాస్త్రం- వైదికకర్మల అనుష్ఠానానికి తగిన కాలాన్ని తెలుపుతున్నది. కల్పసూత్రంలో- వైదిక కర్మలు అనుష్ఠించవలసిన క్రమం తెలుపబడింది. వైదికసిద్ధాంతానికి అనుగుణంగా తెలుపబడిన న్యాయమీమాంసాశాస్త్రాలలోను, (ఇతిహాస) పురాణాలలోను, స్మృతులలోను, అర్థవివేచనం కల్గుతుంది. పూర్వం తెల్పిన శిక్షా మొదలైనవానితో కూడిన వేదాలు నిన్ను అన్వేషిస్తున్నాయి (విచారిస్తున్నాయి)

గత శ్లోకంలో భట్టర్ **"వేదాః ప్రమాణం తతః"** అని వేదప్రామాణ్యాన్ని నిష్కర్షించారు. ఆ వేదం శిక్షా, వ్యాకరణం, నిరుక్తం, ఛందోవిచితి, కల్పసూత్రం, జ్యోతిశ్శాస్త్రం - అనే ఆఱు అంగాలతో కూడి ఉంటుంది- అని, ఆ అంగాలతో,

మీమాంస, న్యాయం, ఇతిహాసపురాణాలు, ధర్మశాస్త్రాలు అనే వీటితో ఉపబృంహణం చేయబడిన వేదం సమస్తం భగవానునిగూర్చి తెలుపుతున్నది- అని ఈ శ్లోకంలో పలికారు.

19. ఈ రీతిలో ఉపకారవిశేషాలను చేసే శిక్షాదులతో కలసి వేదాలు సామాన్యంగా నిన్ను ప్రతిపాదిస్తున్నవి -అని పూర్వశ్లోకంలో చెప్పబడింది. ఇందులో- "వేదాలు మూలప్రమాణం. ఇతిహాసపురాణమీమాంసాన్యాయాలతో కూడిన స్మృతి వాటికి ఉపకరిస్తున్నది. ఆ వేదాలలో, కర్మప్రతిపాదకమైన పూర్వభాగం- స్మృతి విశేష పూర్వమైన పూర్వమీమాంసతో కలసి నీ ఆరాధనవిధిలో పర్యవసానాన్ని పొందుతున్నది. ఉత్తరభాగమైన ఉపనిషత్తులు- ఇతిహాస, పురాణ, బ్రహ్మమీమాంసాలతో కలసి నీ స్వరూపరూపగుణవిభూతి లీలలను తెలిపి, నీ శ్రీచరణాల చెంత చేరడంలోని భక్తిలో పర్యవసిస్తున్నవి. ఈ అర్థాన్ని భగవద్గీతలో నీవే **"వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః"** అని వ్యక్తం చేశావు" - అని ఇందులో అంటున్నారు.

ఆదౌ వేదాः ప్రమాణం స్మృతి రుపకురుతే సేతిహాసైः పురాణైः
న్యాయై స్సార్ధం త్వదర్చావిధి ముపరి పరిక్షీయతే పూర్వభాగः ।
ఊర్ధ్వో భాగ స్త్వదీహాగుణవిభవపరిజ్ఞాపనై స్తత్పదాప్తౌ
వేద్యో వేదైశ్చ సర్వై రహ మితి భగవన్ ! స్వేన చ వ్యాచకర్థ ॥

గుణషట్కపూర్ణుడవైన ఓ స్వామీ! శ్రీరంగనాథా! వేదాలు మొదట (వేఱొక ప్రమాణాన్ని దేనినీ అపేక్షించకుండా స్వయంగానే) ప్రమాణాలు అవుతున్నవి. మన్వాది స్మృతులు ఇతిహాసాలతో కూడిన పురాణాలతో, పూర్వోత్తర మీమాంసలతో కలసి ఆ వేదాలకు అర్థవివరణం చేయడమనే ఉపకారాన్ని చేస్తున్నవి. (ఆ వేదంలో) కర్మకాండమనబడే పూర్వభాగం- నీ ఆరాధన క్రమాన్ని తెలిపే రీతిలో ముగుస్తున్నది (పర్యవసిస్తున్నది). బ్రహ్మకాండమనబడే ఉపనిషద్భాగం అయితే - నీ లీలలు, గుణాలు, విభూతులు - అనే వీటిని స్పష్టంగా తెలుపడంచేత నీ (స్థానాన్ని) శ్రీచరణాలను పొందడంలో పర్యవసిస్తున్నది. ఈ రీతిలో "కర్మకాండ-బ్రహ్మకాండ" రూపాలైన సకలవేదాలతో "నేనే, తెలియదగినవాడను" అని నీచేతనే చెప్పబడింది కూడా కదా!

20. ఈ విధంగా ఉపబృహణాలతో కూడిన వేదాలు పూర్వోత్తరభాగాలతో నీ ఆరాధనలను, ఆరాధ్యుడవైన నిన్ను ప్రతిపాదిస్తున్నవి- అని (గతశ్లోకంలో) తెలుపబడింది. ఇక, ఈ శ్లోకంలో, భాట్టుడనే మీమాంసకుడు ఈ విధంగా

గ్రహించకుండా, **"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత"** ఇత్యాది విధుల బలంవల్ల యాగాదులు కాని, వాటి శక్తిగాని, కాలాంతరంలో సంభవించే స్వర్గాదులను అనుగ్రహిస్తాయి- అని, ప్రభాకరుడనే ఇంకొక మీమాంసకుడు - యాగాదులవల్ల పుట్టే అనిర్వచనీయమైన ఒక అపూర్వం ఆవిధంగా ఫలాన్ని అనుగ్రహిస్తుంది - అని, నవీనమీమాంసకులు, పితృదేవతలయొక్క, దేవతలయొక్క ప్రసాదమే అటువంటిది అని- వీరు (నీ) ఆరాధన-ఆరాధ్యస్వరూపాన్ని తెలియనందువల్ల పల్కుతున్నారు. ఋగ్యజుస్సామాలను బాగా గ్రహించినవారై, **"ఫలమత ఉపపత్తేः"**, **"శ్రుతిः స్మృతిः మమైవాజ్ఞా"**, **"యో యో యాం యాం యథా భక్తः శ్రద్ధయార్చితు మిచ్ఛతి, తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్, స తయా శ్రద్ధయా యుక్తः తస్యారాధన మీహతే, లభతే చ తతः కామాన్ మయైవ విహితాన్ హితాన్"**, **"యే యజంతి పితౄన్ దేవాన్ బ్రాహ్మణాన్ సహుతాశనాన్, సర్వభూతాంతరాత్మానం విష్ణుమేవ యజంతి తే"** అనే ప్రమాణాలను శరణంగా కల జ్ఞానవృద్ధులు, జ్యోతిష్టోమాది యజ్ఞయాగాలు, తటాకనిర్మాణాది రూపాలైన ఘూతాలు, నీ ఆరాధనఫలాలు అన్నీ నీ ప్రసాదానికి అధీనాలు. **"యజేత"** ఇత్యాది వేదవిధులుకూడా నీ ఆజ్ఞారూపాలు- అని అంటారు"- అని పల్కుతున్నారు.

క్రియా తచ్ఛక్తిర్వా కిమపి తదపూర్వం పితృసుర-
ప్రసాదో వా కర్తుः ఫలద ఇతి రంగేశ ! కుదృశः ।
త్వదర్చేష్టాపూర్తే ఫలమపి భవత్ప్రీతిజ మితి
త్రయీపృచ్ఛా స్తత్తద్విధిరపి భవత్ప్రేరణమితి ॥

ఓ శ్రీరంగనాథా! యాగాది కర్మలుగాని, (లేక) ఆ కర్మలయొక్క శక్తి గాని, (లేక) అనిర్వచనీయమైన ఆ కర్మలవల్ల పుట్టే అపూర్వంగాని, (లేక) పితృదేవతల యొక్క, దేవతలయొక్క అనుగ్రహంగాని- ఆ యా కర్మలను అనుష్ఠించేవానికి ఫలాన్ని ఇస్తున్నది" అని కుదృష్టిని కలవారు పల్కుతున్నారు. వైదికవృద్ధులు అయితే, జప, హోమ, దానాదులనే ఇష్టాలు, బావులను త్రవ్వించడం మొదలైన పూర్తాలు -అనే ఇవి నీ ఆరాధనయే (అని), పైన పల్కిన ఇష్టాపూర్తాలవల్ల కలిగే ఫలంకూడా నీ ప్రీతివల్ల పుట్టేది- అని, ఆ యా కర్మల విధికూడా (నీవు విధించిన) ఆజ్ఞ అని పల్కుతున్నారు.

21. **"తత్తద్విధిరపి భవత్ప్రేరణమ్"** అని పూర్వం పల్కిన విధులు ఎన్ని విధాలు? వాటికి ప్రయోజనాలు ఏమి? బంధకాలైన స్వర్గాదిసాధనాలైన జ్యోతిష్టోమాది

విధులను, నరకాదుల సాధనాలైన శత్రువధసాధన శ్యేనాదులను ఉపదేశించడం సర్వరక్షకుడైన భగవానునకు ఏ విధంగా తగును? అనే శంకలు కలుగగా, "విధి- నిత్యమని, నైమిత్తికమని, కామ్యమని మూడు విధాలుగా ఉంటుంది. వాటిలో నిత్యవిధులు- సంధ్యావందనాది విధిరూపమై, రాజాజ్ఞవలె చేయకపోతే ప్రత్యవాయాన్ని కల్గిస్తున్నవై, ప్రత్యవాయం కలుగకుండా ఉండడంకోసం చేయవలసినవై ఉంటాయి. నైమిత్తిక విధులు- హోమాదివిధిరూపాలై, అనుష్ఠించనపుడు ప్రత్యవాయస్థితిజ్ఞాపకాలై, ఆ ప్రత్యవాయనివృత్తిని ఫలంగా కల్గినవై ఉంటాయి. జ్యోతిష్టోమాది విధులుకూడా, స్వర్గకామాదులను విడువకుండా, కృపతో వాటి సాధనాలను తెలిపి, పరంపరయా మోక్షరుచిని కల్గించడం ఫలంగా కల్గినవై ఉంటాయి. శ్యేనాదివిధులు సైతం శాస్త్రవిశ్వాసం లేకుండా పరహింసను చేస్తూ సంచరించేవారికికూడా, (వారిని సైతం విడువకుండా), వాటి (శ్యేనాదియాగాల) సాధనాలను తెలిపి, తద్ద్వారా శాస్త్రంలో విశ్వాసాన్ని కల్గించడాన్ని ప్రయోజనంగా కల్గినవై ఉంటాయి. అందువల్ల ఈ విధంగా అందఱికి హితపరుడవై నియమించే నీ రక్షణవిశేషరూప తాత్పర్యార్థాలను తెలుపుతున్నదై, వేదం, నీ నిత్యశాసనమై ఉన్నది- అని పల్కి, దీనికి అధికారితారతమ్యాన్ని చూడకుండా రుచికి అనుగుణంగా శాస్త్రప్రవర్తనకు మూలమైన భగవానుని నిర్హేతుకకృపను అనుసంధించి, **"ఏత్తిఱమ్"** అని ఆశ్చర్యపడుతున్నారు.

ఆజ్ఞా తే సనిమిత్తనిత్యవిధయ స్స్వర్గాదికామ్యద్విధిః
సోఽనుజ్ఞా శఠచిత్తశాస్త్రవశతోపాయోఽభిచారశ్రుతిః ।
సర్వీయస్య సమస్తశాసితు రహో! శ్రీరంగసర్వస్వ! తే
రక్షాకూతనివేదినీ శ్రుతిరసా త్వన్నిత్యశాస్తి స్తుతః ॥

ఓ శ్రీరంగంలో వేంచేసి ఉండే శ్రీరంగనాథా! నైమిత్తిక కర్మలను, నిత్యకర్మలనుగూర్చిన విధులు- నీయొక్క, అతిక్రమించరాని ఆజ్ఞ. అటువంటి ((ప్రసిద్ధమైన) స్వర్గం మొదలైనఫలాలను కోరేవారినిగూర్చి ఏర్పడిన విధి - అపేక్ష ఉన్నట్లయితే అనుష్ఠించవచ్చు- అని అనుమతించడమనే అనుజ్ఞ. శత్రువులను వధించడానికి సాధనమైన కార్యవిశేషాన్ని విధించే వేదభాగం- వంచనాబుద్ధిని కలవారిని శాస్త్రవశ్యులనుగా - అంటే- ఆస్తికులనుగా చేయడంకోసమైన ఉపాయం. అందువల్ల, సర్వలోకహితుడవై సర్వనియామకుడవై ఉండే నీయొక్క జగద్రక్షణలోని అభిలాషను తెలిపే ఈ వేదం అంతా నీయొక్క శాశ్వతమైన ఆజ్ఞ.

22. ఈవిధంగా ప్రవృత్తి-నివృత్తులను ప్రయోజనాలుగా కల **"యజేత"** ఇత్యాది విధివాక్యాలకు **"గామానయ"** ఇత్యాది వాక్యాలవలె కార్యపరతద్వారా ప్రామాణ్యం ఉన్నా, సిద్ధవస్తువును బోధించే **"సత్యం జ్ఞానమనంతమ్", "ఆనందో బ్రహ్మ", "రసో వై సః", "యః సర్వజ్ఞః సర్వవిత్"; "పరాఽస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే", "సత్యకామ స్సత్యసంకల్పః", "య ఏషోఽంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే... హిరణ్యశ్మశ్రుః హిరణ్యకేశః ఆప్రణభాత్ సర్వ ఏవ సువర్ణః, తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ", "ప్రజాపతి రకామయత ప్రజాః సృజేయేతి, తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్", "అజాయమానో బహుధా విజాయతే"** ఇత్యాది వాక్యాలు **"నిధి ఉన్నది", "నీ తండ్రి సుఖంగా ఉన్నాడు", "నీకు పుత్రుడు పుట్టాడు"** ఇత్యాది స్వరూపపరాలైన వాక్యాలవలె నిరతిశయపురుషార్థరూపుడవైన నీ స్వరూపాన్ని, గుణాలను, విగ్రహాన్ని, లీలలను ప్రతిపాదించి, సిద్ధపరాలు అయినా, నీకు చెందిన ఉపాసనను, దాని ఫలాన్ని తెలిపే వాక్యాలతో సమానమై, వాటికి శేషం కాకుండా, స్వతః ప్రమాణాలే అవుతున్నాయి- అని అంటున్నారు.

అత్రాఽస్తే నిధిరితివత్పుమర్థభూతే సిద్ధార్థా అపి గుణరూపవృత్తవాదాః ।
రంగేశ ! త్వయి సకలా స్సమన్వయన్తే నోపాసాఫలవిధిభి ర్విశేష ఏషామ్ ॥

ఓ శ్రీరంగనాథా ! సమస్తమైన నీ కల్యాణగుణాలు, దివ్యాత్మ స్వరూపం, దివ్యచరిత్రలు- అనే వీటిని తెలిపే ఉపనిషద్భాగాలు (కార్యపరాలు కాకుండా) సిద్ధపరాలు అయినా, పరమపురుషార్థరూపుడవై ఉండే నీ విషయంలో **"ఇక్కడ నిధి ఉన్నది"**- అని పలికే సిద్ధపరవాక్యంవలె చక్కగా పొసగుతున్నవి. పూర్వం పల్కిన గుణరూప వృత్తవాదాలకు, ఉపాసనను, ఫలాన్ని ప్రతిపాదించే వాక్యాలతో ఏ విశేషం లేదు.

23. (గతశ్లోకంలో) **"గుణరూపవృత్తవాదా స్సమన్వయంతే"** అని సగుణ శ్రుత్యాదులుకూడా భగవద్విషయంలో గుణాదులను తెలిపి, సమన్వయాన్ని పొందుతున్నది-అని అన్నారు. ఈ విధంగా అయితే, **"ఏక మేవాద్వితీయమ్"** అనే అద్వితీయ శ్రుతిని నిర్వహించే తీరు ఏ విధంగా? అని అంటే, ఏవిధంగా దేవదత్తాది శరీరాలు - శరీరిపట్ల, ఘటపటాదివికారాలు- వాటి కారణంలోను, గోత్వాదిజాతులు, శుక్లాదిగుణాలు, గమనాది క్రియలు- ద్రవ్యంలోను అపృథక్ సిద్ధసంబంధంతో కలసి ఉండే తమయొక్క ఆకారం- మతి- వ్యవహారాలను కల్గి ఉంటాయో, అదే రీతిలో ఈ సమస్తజగత్తు నీలో అపృథక్ సిద్ధమై, నీకు విశేషణం

కావడమనే ఆకారాన్ని, దాని జ్ఞానాన్ని, దాని వ్యవహారాన్ని కల్గి ఉండేటట్లుగా నీవు సంకల్పించావు. చేతనా చేతన రూపాలలోని ప్రకారాలకు నీవే ప్రకారివి. ఇటువంటి ప్రకారి ఇంకొకటి లేనందువల్ల కనుక, అద్వితీయమని వేదంలో అధ్యయనం చేయబడ్డావు. కాబట్టి అద్వితీయ శ్రుతినిర్వాహానికి అర్థమైన పరబ్రహ్మకు, శాంకరపక్షంలో- మాయాసంబంధాన్ని, భాస్కరమతంలో- ఉపాధిసంబంధాన్ని, యాదప్రకాశమతంలో వికారసంబంధాన్ని (ఉన్నదని) పల్కడం ఎందుకోసం? (వ్యర్థం కదా!) అని అంటున్నారు.

దేహో దేహిని కారణే వికృతయో జాతిర్గుణాః కర్మ చ
ద్రవ్యే నిష్ఠితరూపబుద్ధివచనాః తాత్స్థ్యాత్ తథేదం జగత్ ।
విశ్వం త్వయ్యభిమన్యసే జగదిషే తేనాద్వితీయ స్తతో
మాయోపాధివికారసంకరకథా కా నామ రంగేశ్వర! ॥

ఓ శ్రీరంగనాథా ! శరీరం- ఆత్మవిషయంలోను, కార్యరూపమైన వికారాలు- తమ కారణవస్తువులోను, జాతి, గుణాలు, కర్మలు కూడా- ద్రవ్యంలోను ఎల్లప్పుడు విడచి ఉండని విశేషణమనే (అపృథక్ సిద్ధసంబంధరూప విశేషణమనే) కారణంచేత, రూపం, అనుభవం, వ్యవహారం- అనే ఇవి స్థిరంగా నిలచి ఉంటాయి, ఆ రీతిలోనే ఈ, సమస్తజగత్తు నీలో (నిష్ఠితరూపబుద్ధివచనం అయే రీతిలో) సంకల్పిస్తున్నావు. అందుచేత అద్వితీయుడవుగా చెప్పబడుతున్నావు అందువల్ల పరబ్రహ్మకు మాయ, ఉపాధి, వికారం - అనే వీటి సంబంధం ఉన్నదనే ప్రసంగం అక్కరలేదు.

24. ఈ విధంగా అద్వితీయశ్రుతి నిర్వహింపబడినా, **"సర్వం ఖల్విదం బ్రహ్మ", "ఐతదాత్మ్యమిదం సర్వమ్", "తత్త్వమసి శ్వేతకేతో !"** ఇత్యాది శ్రుతులలోను, **"సకల మిద మహం చ వాసుదేవః"** ఇత్యాదులైన ఉపబృంహణవాక్యాలలోను, (చేయబడిన) బ్రహ్మకు- జగత్తుకు మధ్య చేయబడే సామానాధికరణ్య నిర్దేశాలకు ఏవిధంగా అర్థనిర్వాహాన్ని చేయాలి? అనే సందేహం రాగా, సమస్తప్రపంచం సృష్ట్యాది వ్యాపారాలతో నీకు శేషమై, శరీరమై ఉన్నది. శరీరవాచకశబ్దాలు శరీరిపర్యంతం బోధించడం లోకసిద్ధం కనుక, నియంతవై అన్నిటిలో వ్యాపించి, అన్నిటికి ఆత్మవై ఉండే నిన్ను నిర్దేశించే (శరీరివాచి) శబ్దాలతో ప్రపంచవాచి (శరీరభూత) శబ్దాలకు సామానాధికరణ్యనిర్దేశం ఉపపన్నం అవుతున్నది- అని పూర్వాచార్యులు (అర్థాన్ని) నిర్వహించారు- అని అంటున్నారు.

స్థిత్యుత్పత్తిప్రవృత్తి గ్రసననియమనవ్యాపనై రాత్మన స్తే
శేషోఽశేషః ప్రపంచో వపురితి భవత స్తస్య చాభేదవాదాః ।
సర్వం ఖల్వేతదాత్మ్యం సకల మిద మహం తత్త్వమస్యేవ మాద్యా
వ్యాఖ్యాతా రఙ్గధామప్రవణ! విజయిభి ర్వైదికై స్సార్వభౌమైః ॥

శ్రీరంగదివ్యాలయంలో ప్రావణ్యాన్ని కల్గిన స్వామీ! రక్షణవల్ల, సృష్టించడం వల్ల, (కార్యాలలో) ప్రవర్తనం చేయడంవల్ల, (ప్రళయ సమయంలో) ఉదరంలోనికి గ్రహించడంవల్ల, ఒక్కొక్క వస్తువు లోపల ప్రవేశించి నియమించడంవల్ల సర్వాత్మవై ఉండే నీకు శేషమైన, సమస్తమైన విశ్వం నీకు శరీరం అవుతున్నది- అనే కారణంచేత నీకు, ఆ లోకానికి అభేదాన్ని పలికే వాక్యాలైన **"సర్వం ఖల్విదం బ్రహ్మ", "ఐతదాత్మ్యమిదం సర్వమ్", "సకలమిద మహం చ వాసుదేవః", "తత్త్వమసి శ్వేతకేతో"** అనే మొదలైన ప్రమాణాలు జయశాలురైన వైదికశ్రేష్ఠులచేత పొగడేటట్లుగా, యుక్తంగా వ్యాఖ్యానింపబడ్డాయి.

25. **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** ఇత్యాది సామానాధికరణ్యనిర్దేశం శరీరాత్మభావం వల్ల చేయబడినది- అని పూర్వశ్లోకంలో తెలుపబడింది. ఈ శ్లోకంలో- నైయాయికుడు, జగత్తు - నిమిత్తకారణమాత్రభూతుడైన ఈశ్వరునితో కూడినదని, పూర్వమీమాంసకుడు, అది నిరీశ్వరమని, త్రిమూర్తిసామ్యవాది, బ్రహ్మ-విష్ణు-రుద్రులనే ఈశ్వరులతో కూడినదని పల్కడం అంతా శ్రుతిస్వారస్యాన్ని తెలియనందువల్లనే. **"ఏకో హ వై నారాయణ ఆసీన్న బ్రహ్మ నేశానః"** అనే శ్రుతి "జగత్తు స్వతంత్రమైనపుడు దేవమనుష్యాది వైచిత్రి, జ్ఞానశక్తులలో తారతమ్యం కూడదు" అనే అనుకూల తర్కాన్ని కల్గినదై, "చిదచిద్రూపమైన జగత్తు- నిత్యంగా నీవు అనే గొప్ప రాజును కల్గినది- అని శ్రోతలకు శ్రవణమధురంగా తెల్పుతున్నది"- అని అంటున్నారు.

సరాజక మరాజకం పున రనేకరాజం తథా
యథాభిమతరాజకం జగదిదం జజల్పు ర్జడాః ।
జగా వవశచిత్రతాతరతమత్వతర్కాంగికా
శ్రుతి శ్చిదచితీ త్వయా వరద ! నిత్యరాజన్వతీ ॥

వరాలను అనుగ్రహించే ఓ శ్రీరంగనాథా! మూఢులు, ఈలోకం (అనుమానంతో సిద్ధించే) ఈశ్వరునితో కూడినది- అని, ఈశ్వరుని లేనిది- అని, పలు ఈశ్వరులను కల్గినది -అని ఈవిధంగా వారి వారి అభిమానానికి తగినట్లు

కల్పిస్తూ ఈశ్వరునిగూర్చి పలురీతులలో వదఱుతున్నారు. పరతంత్రులకే ఉండదగిన విచిత్రస్వభావం, తారతమ్యాలను పొందిన స్వభావం - వీటిని గూర్చిన అనుకూలతర్కాన్ని సహాయంగా చేసికొన్న వేదం "చేతనాచేతనాలు నీవు అనే గొప్ప ఈశ్వరుని ఎల్లప్పుడు కల్గినది" అని పలికారు.

26. **"యథాభిమతరాజకమ్"** అని పూర్వం పల్కిన హైరణ్యగర్భులకు, శైవులకు కూడా **"హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే", "ఏక ఏవ రుద్రః"** ఇత్యాదిశ్రుతులు ఉన్నాయికదా ! అనే సందేహం రాగా, బ్రహ్మాదులు **"యో బ్రహ్మాణం విదధాతి పూర్వమ్", "బ్రహ్మణః పుత్రాయ జ్యేష్ఠాయ"** ఇత్యాదులలో సృష్టింపబడినవారుగా, భగవచ్ఛాసనాన్ని అనువర్తించేవారుగా స్పష్టం చేయబడ్డారు. అవతారప్రకరణాలలో, వారు నీ అవతారరూపాలుగా కూడా చెప్పబడలేదు. ఈ విధంగా నీ అవతారాలు కానందువల్ల వారు నీవు కాదు. సృష్టింపబడినవారే కనుక, నీతో సమానులు కారు. **"సహస్రశీర్షా పురుషః", "వేదాహ మేతం పురుషం మహాంతమ్", "హ్రీ శ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ", "శ్రద్ధయా దేవో దేవత్వమశ్నుతే", "మాతరం పద్మమాలినీమ్", "రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేష్వప్యవతారేషు విష్ణోరేషానపాయినీ", "అనన్యా హి మయా సీతా"** ఇత్యాది శ్రుతిస్మృతివచనాలతో శ్రియఃపతి అయిన నీవే సర్వేశ్వరుడవని పల్కుతాము, (ఆమాటలవల్ల) పరాజితులై, ప్రేతసమానులైన ప్రతివాదులకు ఉచితంగా జలతర్పణం చేస్తున్నాము"- అని చమత్కారంగా అంటున్నారు.

బ్రహ్మాద్యా స్సృజ్యవర్గే భ్రుకుటితయోద్ఘాటితా నావతార-
ప్రస్తావే, తేన న త్వం న చ తవ సదృశా విశ్వమేకాతపత్రమ్ ।
లక్ష్మీనేత్రా త్వయేతి శ్రుతిమునివచనై స్తృప్తయై స్తర్పయామః
శ్రీరంగామ్భోధిచన్ద్రోదయ ! జల ముచితం వాదికౌతస్కుతేభ్యః ॥

శ్రీరంగమనే సముద్రానికి చంద్రోదయంవలె సమృద్ధిని కల్గించే శ్రీరంగనాథా! బ్రహ్మ మొదలైన దేవతలు (నీయొక్క) కనుబొమల కదలికలకు చేతులు కట్టుకొని ఉండేవారు. కనుక, సృష్టింపబడేవారి వర్గంలో స్పష్టంగా తెలుపబడ్డారు. (రామకృష్ణాది) అవతారాలు సంభవించే సమయంలో వారు (ఆవిధంగా) వ్యక్తం కాలేదు. ఆ కారణంచేత వారు నీవు కాదు. నీతో పోలినవారుకూడా కారు. లక్ష్మీనాథుడవైన నీచే ఈ లోకం అంతా అద్వితీయుడైన నాథుని కల్గినది -అని నిన్నే విషయంగా కల్గిన వేదాలతో, మహర్షివచనాలతో శైవహైరణ్యగర్భాదులను జయిస్తాము. మృతప్రాయులైన ఆ కుతర్కవాదుల కొఱకు వారికి తగిన తర్పణజలాన్ని ఉచితంగా ఇస్తున్నాము.

27. ఈ విధంగా, **"హర్తుం తమః"** అని ప్రారంభించి ఇంతవరకు బాహ్యకుదృష్టి మతనిరసనకు అనుగుణంగా ఉపబృంహణాలతోకూడిన శ్రుతియొక్క ప్రామాణ్యాన్ని ప్రతిపాదించడంతోపాటుగా, లక్ష్మీవిశిష్టుడైన శ్రీరంగనాథునకే చిదచిదాత్మకమైన జగత్తు పట్ల కారణత్వం, ఈశ్వరత్వం ఉన్నదని సమర్థించి (జగత్తుకు కారణభూతుడు, ఈశ్వరుడు శ్రీమన్నారాయణుడేనని సమర్థించి), **"లక్ష్మీనేత్రా"** అని అంటూ ద్వయంలోని ఉత్తరఖండంలోగల శ్రీమచ్ఛబ్దంయొక్క అర్థాన్ని అనుసంధించారు. ఇందులో, భగవంతుని కారణత్వనిర్వాహకత్వాలను మనస్సులో పెట్టుకొని, "నారశబ్దార్థాలు కనుక నిర్దుష్టాలై, నిరుపాధికాలై, నిరవధికాలై, నిస్సమాభ్యధికాలై, నిస్సంఖ్యాలై, మంగళాలై ఉండే దయాదిగుణాలకు మూలభూతాలైనవి, భగవచ్ఛబ్దార్థాలుగా ప్రసిద్ధి పొందినవైన జ్ఞానాదిషడ్గుణాలు, రత్నాన్ని కాంతులవలె, నిన్ను అలంకరిస్తున్నాయి- అని అంటున్నారు.

దోషోపధావధిసమాతిశయానసంఖ్యానిర్లేపమంగళ గుణౌఘదుఘా ష్టడేతాః।
జ్ఞానైశ్వరీశకనవీర్యబలార్చిష స్త్వాం రంగేశ! భాస ఇవ రత్న మనర్ఘయన్తి ॥

ఓ శ్రీరంగనాథా! దోషాలు, ఉపాధి, పరిమితి, సదృశవస్తువు, మించిన వస్తువు, సంఖ్య - అనే వీటి సంబంధం లేని నీ కల్యాణగుణాల సమూహాన్ని అంతటిని స్రవిస్తున్న ఈ, జ్ఞానం, ఐశ్వర్యం, శక్తి, వీర్యం, బలం, తేజస్సు- అనే ఆఱు ప్రధాన గుణాలు నీకు, రత్నానికి కాంతులు అతిశయాన్ని కల్గించేట్లు, గొప్పతనాన్ని కల్గిస్తున్నాయి.

28. **"జ్ఞానైశ్వరీ"** అని ముందుగా ప్రస్తావించిన జ్ఞానగుణం అంటే ఏమి?- అనే జిజ్ఞాస కలుగగా, చక్షుస్సు మొదలైన ఇంద్రియాలద్వారా గాని, ధర్మభూత-జ్ఞానంతో గాని, ఇంద్రియాలలోకూడా, ఆ యా ఇంద్రియాలకు సంబంధించిన ఆ యా విషయాలను, ఇతరేంద్రియ విషయాలను - ఈ విధంగా అన్నిటిని ఒకే సమయంలో కరతలామలకంగా నిత్యంగా నీవు సాక్షాత్కరించుకొనే సాక్షాత్కారాన్ని- స్వప్రకాశమై, ఆవరణరహితమై, యథార్థమైన జ్ఞానమని ఉపనిషత్తులు తెల్పుతున్నవి- అని అంటున్నారు.

యుగపదనిశ మక్షైః స్వైర స్సతో వాఽక్షకార్యే
నియమ మనియమం వా ప్రాప్య రంగాధిరాజ !।

కరతలవదశేషం పశ్యసి స్వప్రకాశం
తదవరణ మమోఘం జ్ఞాన మామ్నాసిషు స్తే ॥

ఓ శ్రీరంగనాథా! నీ ఇంద్రియాలతో గాని, (ఇంద్రియాల ఆవశ్యకత లేకుండానే) స్వయంగానే గాని, నేత్రం మొదలైన ఇంద్రియాల కార్యాలైన దర్శనాదులలో (ఒక) వ్యవస్థ ఉండేటట్లు గాని, ఆ విధంగా వ్యవస్థ ఏమీ లేకుండా గాని పొంది, ఎల్లప్పుడు (ఉభయవిభూతులలోకి చేరిన) అంతటిని ఏకకాలంలో అరచేతిలోవలె సాక్షాత్కరించుకొంటున్నావు. స్వయంగానే ప్రకాశించేది, ఆవరణం లేనిది, యథార్థమైనది అయిన నీ ఆ సాక్షాత్కారాన్ని నీ జ్ఞానగుణంగా (ఉపనిషత్తులు) పలికాయి.

29. **"అనియమం వా ప్రాప్య"** అని పల్కిన అనియమం అంటే ఏమి? అది ఘటించే తీరు ఏది? అనే జిజ్ఞాస ఏర్పడగా, "నీవు చెవితో చూడగలవు, కన్నులతో వినగలవు- అనే ఈ విధంగా కరణాలతో యథేష్టకారివి అయిన నీకు **"సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్"**, **"విశ్వత చక్షురుత విశ్వతో ముఖో... విశ్వతస్పాత్"**, **"యస్సర్వజ్ఞ స్సర్వవిత్"**, **"పరాఽస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియా చ"** ఇత్యాది శ్రుతులలో లోకవిలక్షణాలైన కరణజ్ఞానశక్త్యాదులు ప్రతిపాదింపబడ్డాయి. కనుక, సర్వపథీనమైన నీ సాక్షాత్కారంలో (అన్ని దారులలోను కలిగే నీ సాక్షాత్కారంలో) ఏకొఱత లేదు- అని అంటున్నారు.

నయనశ్రవణో దృశా శృణోషి అథ తే రంగపతే! మహేశితుః ।
కరణైరపి కామకారిణః ఘటతే సర్వపథీన మీక్షణమ్ ॥

ఓ శ్రీరంగనాథా! కన్నులు అవుతున్న శ్రవణాలను కలవాడవై కన్నులతో, వింటున్నావు. మఱియు మిగిలిన ఇంద్రియాలతోను ఇష్టం వచ్చినట్లు చేస్తున్న, విలక్షణుడవైన ఈశ్వరుడవగు నీకు సర్వతోముఖమైన సాక్షాత్కారం ఘటిస్తున్నది. (కుదురుతున్నది.)

30. "ఈ విధంగా, సర్వజ్ఞుడవైన నీ మూలంగానే జగత్తు ఉన్నది"- అని సిద్ధించినందువల్ల, "ఈ జగత్తు, అచేతనమైన ప్రధానాన్ని (ప్రకృతిని) మూలంగా కల్గినది" - అనే సాంఖ్యులు, "నిర్విశేషం కనుక అజ్ఞమైన బ్రహ్మమూలం ఈ జగత్తు"- అని వాదించే శాంకరాదులు (జ్ఞానగుణంద్వారా) నిరసింపబడ్డారు. ఐశ్వర్యగుణమనేది -వేఱొక ప్రేరకుడు లేకుండా స్వతంత్రుడై, ఏ అడ్డు లేకుండా,

పుణ్యపాపరూపమైన కర్మవైచిత్రితో విచిత్రమైన సమస్తజగత్తును తన సంకల్పలేశంతో ఒకే కాలంలో ఒక వస్తువుగా లెక్కించకుండా అవలీలగా నీవు సృష్టించడమే- అని, ఆ ఐశ్వర్యం, కారణభూతుడవైన నిన్ను, సాంఖ్యమతంలో చెప్పబడ్డ సాక్షిమాత్రుడైన పురుషునినుండి వేఱు చేస్తున్నది- అని అంటున్నారు.

సార్వజ్ఞ్యేనాజ్ఞమూలం జగదభిదధతో వారితా స్సాక్షిమాత్రాత్
సాఙ్ఖ్యోక్తాత్కారణం త్వాం పరయతి భగవన్నైశ్వరీ రంగశాయిన్!।
అప్రేర్యోఽన్యైః స్వతన్త్రో ప్రతిహతి సదసత్కర్మవైత్ర్యా విచిత్రం
యత్రేచ్ఛాలేశత స్త్వం యుగపదగణయన్ విశ్వ మావిశ్చకర్థ ॥

ఓ శ్రీరంగనాథభగవన్! ఈ లోకం అచేతనంచేత సృష్టింపబడినదని చెప్పేవారు, నీ సర్వజ్ఞత్వ గుణంచేత నిరసింపబడ్డారు. ఐశ్వర్యగుణం కలవాడవైన నీవు ఇతరులచే ప్రేరేపింపబడనివాడవై, స్వాధీనుడవై పుణ్యపాపరూప కర్మల విచిత్రరీతిచేత, పలు రీతులలోని సకల జగత్తును సంకల్పంతోనే అవలీలగా తలచేవాడవై ఏకకాలంలో ఏ ఆటంకం లేకుండా ఆవిష్కరిస్తావు. అటువంటి నీ ఐశ్వర్యమనే గుణం (జగత్తుకు ఉపాదానకారణమై ఉండే) నిన్ను సాంఖ్యులచే చెప్పబడ్డ సాక్షిమాత్రమైన పురుషుని కంటె వేఱు చేస్తున్నది.

31. పూర్వం పల్కిన శకనశబ్దవివక్షితమైన శక్తి అనేగుణం- హేత్వంతర నిరపేక్షమైన (వేఱొక హేతువును అపేక్షించని) నీ సంకల్పరూపమైనది. "ఇది శక్యం, ఇది అశక్యం" అనే అవధిని దాటి ఎంతటి గొప్ప కార్యవిషయంలో అయినా అది ఎల్లప్పుడు ప్రసరిస్తున్నది. అంతటి అవధిలో గల సంబంధకార్యంలోను, నీవు చిదచిదాత్మకమైన నీ శరీరంద్వారా ఉపాదానకారణంగా అవుతున్నావని **"తదైక్షత బహుస్యాం ప్రజాయేయ"**, **"యతో వా"** ఇత్యాది శ్రుతులు పల్కుతున్నాయి. ఆ విధంగా నీవు ఉపాదాన కారణం అయే రీతిలో సుకర-దుష్కరవిభాగం లేకుండా సంకల్పవిషయమైన నీ సమస్త కార్యనిర్వహణసామర్థ్యమైన ఆ శక్తియే పశుపతికంటే నీకు జగన్నిర్మాణరూపమైన అతిశయాన్ని కల్గించగల్గినది. అటువంటి శక్తి -తన శరీరంలో తంతుజాలాన్ని ఉత్పత్తి చేసి, తిరిగి లోపలకు గ్రసించే సాలెపురుగులో కన్పిస్తుంది- అని అంటున్నారు.

కార్యేఽనన్తే స్వతనుముఖత స్త్వా ముపాదాన మాహుః
సా తే శక్తి స్సుకర మితరచ్చేతి వేలాం విలంఘ్య ।

ఇచ్ఛా యావద్విహరతి సదా రంగరాజానపేక్షా
సైవైశానాదతిశయకరీ సోర్ణనాభౌ విభావ్యా ॥

ఓ శ్రీరంగనాథా ! నీ సంకల్పం "ఇది చేయదగినది, ఇది చేయలేనిది"- అనే ఒక కట్టడిని అతిక్రమించి ఎల్లప్పుడు అంతట విహరిస్తున్నది. అటువంటి సంకల్పమే శక్తి అనే నీ గుణం. (ఇటువంటి శక్తి నీకు ఉన్నందువల్ల) అంతు లేని చిదచిత్తులరూపంలోని కార్యవర్గాలలో నీకు శరీరమైన చేతనాచేతనాల ద్వారా నిన్ను ఉపాదానకారణంగా (వైదికులు) పల్కుతున్నారు. ఆ శక్తియే పశుపతి కంటే నీకు అతిశయాన్ని (వ్యావృత్తిని) కల్గిస్తున్నది. ఆ శక్తిని సాలె పురుగులో లేశతః చూడవచ్చు.

32. **"జ్ఞానశక్తిబలైశ్వర్య"** అనే సూక్తిలో శక్తికి పిమ్మట ప్రస్తావింపబడ్డ బలం అనే గుణం- **"స్వే మహిమ్ని ప్రతిష్ఠితః"** అనే శ్రుతి రీతిలో- తన మాహాత్మ్యంలోనే అనేక వ్యాపారాలను చేసినప్పటికీ శ్రమ లేకుండా సకలజగత్తును నీ తిరుమేనినివలె ధరించే గుణం. దీనికి ఫలం- అన్యాధిష్ఠితమై ఉంటూ కారణమవుతున్న లోకంలోని విషయంకంటే నిన్ను వ్యావర్తింపజేయడం- అని అంటున్నారు.

స్వమహిమస్థితిరీశ భూశక్రియోఽప్యకలితశ్రమ ఏవ బిభర్షి యత్ ।
వపురివ స్వ మశేష మిదం బలం తవ పరాశ్రితకారణవారణమ్॥

ఓ స్వామీ! నీయొక్క మహిమలో స్థిరంగా ఉండే నీవు అపరిమితమైన చేష్టితాలను కలవాడవై ఉన్నా ఆయాసం పొందనివాడవుగానే సకల జగత్తును నీ శరీరాన్నివలె ధరిస్తున్నావు- అనే గుణం నీయొక్క బలమనే గుణం. ఈ గుణం అన్యాధిష్ఠితంగా ఉంటూ కారణం అవుతున్నవారినుండి నిన్ను వ్యావర్తింపజేస్తున్నది.

33. వీర్యమంటే- కస్తూరికాగంధం తన సన్నిదిమాత్రంతో తాను ఏవికారం పొంద కుండా ఉంటూ, సమీపంలో ఉండేవారి మనస్సులకు వికారాన్ని కల్గించినట్లుగా, నీవు కూడా ఆ విధంగానే సలకపదార్థాలకు వికారాన్ని కల్గిస్తున్నావు- అని అంటున్నారు; అందువల్ల వికారాలతో కూడిన లౌకికకారణం నీకంటే వ్యావర్తింప బడుతున్నది- అని ఈ శ్లోకంలో పల్కుతున్నారు.

మృగనాభిగన్ధ ఇవ యత్సకలార్థాన్ నిజసన్నిధే రవికృతో వికృణోషి ।
ప్రియరంగ ! వీర్యమితి తత్తు వదన్తే సవికారకారణ మితో వినివార్యమ్ ॥

శ్రీరంగాన్ని (నీ) ప్రేమకు విషయంగా కల స్వామీ! (శ్రీరంగం విషయంలో ప్రేమను కల స్వామీ) కస్తూరీపరిమళం వలె నీవు వికారాన్ని పొందనివాడవై, నీ సాన్నిధ్యమాత్రంవల్లనే సమస్తపదార్థాలను వికారాన్ని పొందిస్తున్నావు- అనే గుణం ఏది కలదో, దానిని నీ వీర్యగుణమని (వైదికులు) పల్కుతున్నారు. దీనివల్ల వికారాన్ని కల్గినదై ఉంటూ కారణమవుతున్నదానిని నీనుండి వ్యావర్తింపజేయడం సాధ్యం అయినది.

34. తేజస్సు అనేది- సహకారిసాపేక్షమైన (లౌకిక) కారణం కంటే వేఱయినది, సహకారి నిరపేక్షమైన కర్తృత్వరూపమని చెప్పబడినది, ఆశ్రితుల తాపత్రయాన్ని, ఆశ్రితవిరోధులను నిరసిస్తూ ఉండే ఈ గుణం ఈ ఱెండు గుణాలలో ఉత్కృష్టమైనది- అని ఇందులో అంటున్నారు.

సహకార్యపేక్షమపి హాతు మిహ తదనపేక్షకృతా ।
రంగధన! జయతి తేజ ఇతి ప్రణతార్తిజిత్ప్రతిభటాభిభావుకమ్॥

ఓ శ్రీరంగనాథా! సహకారికారణాలను అపేక్షిస్తున్న లోకంలోని కారణత్వాన్ని వ్యవచ్ఛేదించడంకోసం వేఱు (చేయడం కోసం) ఆ సహకారి కారణాన్ని ఎదురుచూడని కారణత్వం అనేది ఏది ఉన్నదో, అదే నీ తేజోగుణంగా ప్రకాశిస్తున్నది. (ఇది) నీ ఆశ్రితుల ఆర్తిని హరించేది; శత్రువులను తిరస్కరించ గల్గినది.

35. ఈ విధంగా ఇంతవరకు కారణత్వానికి ఉపయుక్తాలైన జ్ఞానాదిషడ్గుణాల స్వరూపం, దానివల్ల మతాంతరులచే అంగీకరింపబడిన కారణాల కంటే వ్యావృత్తి తెలుపబడింది. ఇక ఈ శ్లోకంలో ఆనందవల్లి అనే నీ తైత్తిరీయోపనిషత్తు (అనుకూలవిషయాలను లక్ష్యంగా కల్గిన) నీ జ్ఞానరూపమైన ఆనందాది గుణగణాన్ని మనుష్యులనుండి ఆరంభించి చతుర్ముఖునివరకు లెక్కించి, ఆ పైన **"యువా స్యాత్"** ఇత్యాదిగా ఉద్భావించి విచారించాలని వేదం ప్రయత్నించి, తాను పొందదలచిన గుణపరిచ్ఛేదరూపమైన లాభాన్ని పొందలేక, మధ్య దారిలోనే అలసిపోయి, మూగవానివలె నోరు తెఱవలేక పోయింది. (వేదపురుషుని స్థితియే) ఈ విధంగా ఉంటే, నీ కల్యాణగుణాల పరిచ్ఛేదంలోను, సంఖ్యలోను అల్పశక్తిని కల ఇతరుల మనోవాక్కులకు ప్రసక్తి ఉన్నదా? ఇదేమి ఆశ్చర్యం!" అని అంటున్నారు.

35. మర్త్యోత్థాయం విరించావధిక ముపరి చోత్ప్రేక్ష్య మీమాంసమానా
రంగేన్ద్రానన్దవల్లీ తవ గుణనివహం యౌవనానన్దపూర్వమ్ ।
న స్వార్థం స్పష్టు మీష్టే స్ఖలతి పధిపరం మూకలాయం నిలిల్యే
హంతైవం త్వద్గుణానా మవధిగణనయోః కా కథా చిత్తవాచోః ॥

ఓ శ్రీరంగనాథా! (తైత్తిరీయోపనిషత్‌లో గల) ఆనందవల్లి అనే పేరును గల భాగం మనుష్యుని నుండి మొదలుకొని బ్రహ్మాచివరివరకు, ఇంకా పైపైన అధికంగా దశలను సంభావించి పెంచి పల్కుతూ పోయి, నీ యౌవనం, ఆనందం మొదలైన గుణసమూహాన్ని విచారించాలని ప్రయత్నించింది. కాని, తనయొక్క ఉద్దేశ్యాన్ని స్పృశించడానికి కూడా అది సమర్థం కావడం లేదు. దారిలోనే తొట్రుపడుతున్నది, మూగవానివలె నోరుమూసికొన్నది. వేదమే ఈ విధంగా ఉండగా, నీ కల్యాణగుణాలయొక్క అవధిలోను (పరిమితిలోను), సంఖ్యలోను మిగిలినవారి మనస్సు, వాక్కులకు ఏమి ప్రసక్తి? అయ్యో!

36. ఈ విధంగా వేదాంతాలచేకూడా కొలువడానికి అరుదైన వాటిలోని నిధుల వలె పరమరహస్యాలైన మార్దవం మొదలైన ఆత్మగుణాలు, సౌందర్యాది విగ్రహగుణాలు, శ్రీరంగాలయంలో పండిత పామరభేదం లేకుండా అందటికి తాము సాక్షాత్కరించి ఇతరులకు ఉపదేశించే రీతిలో (నీలో) ప్రకాశిస్తున్నవి- అని అంటున్నారు.

న్యధాయిషత యే గుణా నిధినిధాయ మారణ్యకేషు
అమీ మ్రదిమచాతురీప్రణతచాపలక్షాన్తయః ।
దయావిజయసౌన్దరీప్రభృతయోఽపి రత్నౌఘవత్
జగద్వ్యవహృతిక్షమా వరద ! రంగరత్నాపణే ॥

వరాలను అనుగ్రహించే ఓ రంగనాథస్వామీ ! ఉపనిషత్తులలో నీ కల్యాణగుణాలు నిధివలె (రహస్యంగా) ప్రతిపాదింపబడి ఉన్నవి. ఈ సౌకుమార్యం, అఘటితఘటనా శక్తి, ఆశ్రిత ప్రావణ్యం, క్షాంతి- అనే ఇవి, దయ, విజయం, సౌందర్యం మొదలైన నీ కల్యాణ గుణాలు రత్నాల రాసులవలె శ్రీరంగంలోని గర్భగృహమనే రత్నాల అంగడిలో లోకంలోనివారికి అందటికి వ్యవహార యోగ్యాలుగా ఉన్నాయి సుమా !

37. భగవానునకు నిత్యోదితదశ - అని, శాంతోదిత దశ -అని రెండు దశలున్నాయి. వీటిలో ఒకటి పరత్వంలోను, ఇంకొకటి వ్యూహావాసుదేవదశలోను ఉన్నాయి. **"అతిపతితావధిస్వమహిమానుభవప్రభవత్ సుఖకృతనిస్తరంగ జలధీయితనిత్యదశమ్"** అని కూరేశులు అనుగ్రహించినందువల్ల ఈ రెండిటిలోను రెండిటి వ్యవహారం ఉన్నది. వీటిలో ఒకటి- నిరవధికకల్యాణగుణ విశిష్టుడైన తనయొక్క అనుభవంచేత కల్గిన ఆనందంచేత కెఱటాలు లేని సముద్రంవలె శాంతంగా ఉండే దశ. మిగిలినది- విభూత్యనుభవదశ. ఈ శ్లోకంలో పరత్వంలో నిస్తరంగార్ణవదశను శాంతోదితదశగా వివక్షించి, పూర్వం పల్కిన జ్ఞానాదిగుణాలు ఈ స్వరూపాన్ని ఆశ్రయించి, **"యే గుణాః సత్యజ్ఞానప్రభృతయ ఉత త్వద్గతతయా శుభీభూయం యాతాః"** అనే కూరేశప్రోక్త రీతిలో, ఉదరపోషణను చేసికొనేవారు ఉదారుని ఆశ్రయించేటట్లుగా, ప్రకాశాన్ని పొందుతున్నాయి. అటువంటి స్వరూపాన్ని కల నీవే నిరవధికమై, స్వసంవేద్యమై, నిరంతరజ్ఞానాదివిశిష్టమైన స్వానుభవరూప శాంతోదిత దశను కలవాడవై, స్వానుభవవిషయమై, విభువైన నీస్వరూప పరిమాణాన్ని కల్గినదై, అపరిచ్ఛిన్నమైన ఆనందంతో నిండి, తరంగాలు లేని సముద్రంవలె ఉండే నీ స్వరూపాన్ని అనుభవిస్తున్నావు- అని అంటున్నారు.

యమాశ్రిత్యైవాత్మమ్భరయ ఇవ తే సద్గుణగణా
ప్రథన్తే సోఽనన్త స్స్వవశఘనశాన్తోదితదశః ।
త్వమేవ త్వాం వేత్థ స్తిమితవితరఙ్గం వరద భోః !
స్వసంవేద్యస్వాత్మద్వ్యసబహుళానన్దభరితమ్ ॥

వరాలను ఇచ్చే ఓ శ్రీరంగనాథా ! అటువంటి కల్యాణగుణ గణాలు పొట్టను నింపుకొనేవారివలె ఏ నిన్ను అవలంబించియే (ఆశ్రయించియే) ప్రసిద్ధిని పొందుతున్నవి. అటువంటి, నిరవధికమైన, నీకే అనుభావ్యమై, నిరంతరమైన, శాంతోదితదశను పొందేవాడవైన నీవే, స్తిమితమైన, అలలు ఉపశమించిన సముద్రంవలె నీకే అనుభవించదగినదై, నీతో సాటి అయిన వైశాల్యాన్ని కల్గినదై, ఎల్లలేనిది అయిన ఆనందంతో నిండిన నీ స్వరూపాన్ని అనుభవిస్తున్నావు.

38. ఈ విధంగా జ్ఞానాదివిశిష్టుడవైన నీకు గల ఈశ్వరత్వంలోని లేశాన్ని మాత్రమే కల్గిన ఇంద్రాదులు తమను ఈశ్వరులని దురభిమానించి, గర్వాన్ని పొందుతున్నారు. నీవు నీ నిరవధికమైన అతిశయాన్నిసైతం అనాదరించి, ఏమాత్రం గర్వాన్ని పొందడం లేదు. ఈ విషయంలో మేము ఆశ్చర్యపోవడం లేదు. నీవు, నీ

మహిమ- అనే రెండు గొప్పతనంచేత ఒకదానికి ఇంకొకటి సదృశం కనుక, నీకు ఏది తగదు? - అని అంటున్నారు.

ఆఘ్రాయైశ్వరగన్ధ మీశసదృశంమన్యా స్తవేన్ద్రాదయో
ముహ్యన్తి త్వమనావిలో నిరవధే ర్బ్రహ్మ్నః కణేహత్య యత్ ।
చిత్రీయేమహి నాత్ర రంగరసిక ! త్వం త్వన్మహిమ్నః పరో
వైపుల్యాన్మహితస్స్వభావ ఇతి వా కిన్నామ సాత్మ్యం న తే ॥

శ్రీరంగనగరవాసంలో అభిలాషను (రాసిక్యాన్ని) కల స్వామీ!ఇంద్రుడు మొదలైన దేవతలు ఐశ్వర్యంలోని లవలేశాన్ని పొంది, సర్వేశ్వరుడవైన నీతో సమానులుగా తమను భావించేవారై, మోహాన్ని పొందుతున్నారు. (గర్వాన్ని పొందుతున్నారు- అని భావం), నీవు అయితే అంతు లేనిది అయిన నీ గొప్పతనాన్ని ఒక వస్తువుగా గ్రహించకుండా కలత చెందకుండా ఉన్నావు, (గర్వాన్ని పొందకుండా ఉన్నావు) ఈ విషయంలో మేము ఆశ్చర్యపోవడం లేదు (ఎందుకు ? అని అంటే) నీ స్వరూపం నీ గొప్పతనం కంటే ఉత్కృష్టమైనదని చెప్పవచ్చునా?(లేక) (నీ) స్వభావం (పూర్వం పల్కిన) స్వరూపవైభవంకంటే గొప్పది అని చెప్పవచ్చునా? (ఏవిధంగా అయినా చెప్పే రీతిలో ఉన్నందున) (వీటిలో నీకు) ఏమి పొసగదు కనుక? (ఏదయినా పొసగుతుంది).

39. ఈ విధంగా శాంతోదితదశావిశిష్టమైన శ్రీరంగనాథుని పరత్వాన్ని అనుసంధించిన తరువాత, **"గుణై ష్షడ్భి స్త్రీవైతైః ప్రథమతరమూర్తిః తవ బభౌ... అభుః"** అనే రీతిలో నీవు సాధుపరిత్రాణంకోసం వాసుదేవ-సంకర్షణ- ప్రద్యుమ్న - అనిరుద్ధరూపమైన చతుర్విధ వ్యూహరూపివై అవతరిస్తున్నావు. అందులో, వాసుదేవరూపివి అయిన నీవు పరత్వంతో సాటిగా షాడ్గుణ్యపూర్ణుడవై, నిత్యముక్తానుభావ్యుడవై ఉంటావు, సంకర్షణుడవై, జ్ఞానబలాలతోకూడి శాస్త్ర ప్రదాన-సంహారాలను చేస్తావు. ప్రద్యుమ్నుడవై, ఐశ్వర్య- వీర్యాలను కల్గి ఉండి సృష్టిని, ధర్మప్రవర్తనను చేస్తావు. అనిరుద్ధుడవై, శక్తి- తేజస్సులతో కూడి ఉండి రక్షణను, మోక్షహేతువైన సత్త్వప్రవర్తనను చేస్తున్నావు- అని అంటున్నారు.

షాడ్గుణ్యాద్వాసుదేవః పర ఇతి స భవాన్ ముక్తభోగ్యో బలాద్ధ్యాత్
బోధాత్సఙ్కర్షణ స్త్వం హరసి వితనుషే శాస్త్ర మైశ్వర్యవీర్యాత్ ।
ప్రద్యుమ్న స్స్వర్గధర్మౌ నయసి చ భగవన్ ! శక్తితేజోఽ నిరుద్ధో
బిభ్రాణః పాసి తత్త్వం గమయసి చ తథా వ్యూహ్య రంగాధిరాజ!॥

భగవానుడవైన ఓ శ్రీరంగనాథా! పూజ్యుడవైన నీవు వాసుదేవాది వ్యూహ రూపాలలో అవతరించి, (జ్ఞానం మొదలైన) ఆఱు గుణాలవల్ల పరవాసుదేవుడవని వ్యవహరింపబడేవాడవై, ముక్తులకు అనుభావ్యుడవై ఉన్నావు. బలంతో కూడిన జ్ఞానంతో (కూడి) - జ్ఞానం, బలం - అనే రెండు గుణాలను కలవాడవై, సంకర్షణ మూర్తివై సంహారకృత్యాన్ని నిర్వహిస్తున్నావు, శాస్త్రార్థాన్ని అనుగ్రహిస్తున్నావు. ఐశ్వర్యవీర్యాలతో కూడి ప్రద్యుమ్నమూర్తివై సృష్టిని చేసి, ధర్మాన్ని ప్రవర్తింప జేస్తున్నావు. శక్తి, తేజస్సు- అనేరెండు గుణాలను కలవాడవై అనిరుద్ధమూర్తివై రక్షణకార్యం నిర్వహిస్తున్నావు. తత్త్వజ్ఞాన ప్రదానాన్ని చేస్తున్నావు.

40. ఈ విధంగా వాసుదేవాది నాల్గు వ్యూహాల రూపంలో అవతరించి, నీవు జాగ్రదాది తురీయక్రమచతుష్టయ విశిష్టతత్తదుపాసనానుగుణంగా ఆ యా మూర్తులకు అనుగుణమైన పరికరవిశేషంతో కూడినవాడవైనందున నాల్గు వ్యూహాలు ప్రత్యేకంగా నాల్గు నాల్గు వ్యూహాలుగా (మొత్తం పదహాఱు) అవుతున్నవి- అని అంటున్నారు.

జాగ్రత్స్వప్నాత్యలసతురీయప్రాయధ్యాత్క్రమవదుపాస్యః ।
స్వామిం స్తత్తత్సహపరిబర్హైః చాతుర్వ్యూహం వహసి చతుర్ధా॥

స్వామీ! శ్రీరంగనాథా! మేల్కొని ఉన్నవారు, నిద్రిస్తున్నవారు, సుషుప్తిలో ఉన్నవారు, మూర్ఛాదశలో ఉన్నవారు- అనే ధ్యానం చేసే వారి రీతిని కల అధికారులచే ఉపాసించదగినవాడవై, తగిన ఆయా చిహ్నాలను (పరిచ్ఛదాలను) కలవాడవై, నాల్గు రీతులలో వ్యూహ చతుష్టయాన్ని వహిస్తున్నావు.

41. పూర్వశ్లోకంలో- **"సర్గధర్మౌ"** అని ప్రస్తుతించిన సృష్టియొక్క క్రమం ఏవిధమైనది? అని జిజ్ఞాస కలుగగా, నీవు ప్రళయకాలంలో అచేతనసమానులై, భోగమోక్షశూన్యులైన చేతనులను గమనించి, "అయ్యో!" అని జాలిపడి, వారికి కరణకళేబర ప్రదానం చేయదలచి అనన్యాధీనుడవై (స్వతంత్రుడవై) సంకల్పించి, మూలప్రకృతిని, మహదహంకార తన్మాత్ర భూతపంచక -ఏకాదశేంద్రియాలుగా మొగ్గ తొడిగేటట్లు చేస్తున్నావు- అని అంటున్నారు.

అచిదవిశేషితాన్ ప్రళయసీమని సంసరతః
కరణకళేబరైర్ఘటయితుం దయమానమనాః ।

వరద ! నిజేచ్ఛయైవ పరవానకరోఃప్రకృతిం
మహదభిమానభూతకరణావళికోరకిణీమ్ ॥

వరాలను అనుగ్రహించే స్వామీ! ప్రళయకాలంలో అచేతనంకంటే తేడా ఏమీ లేనివారై, సంసారంలో తల్లడిల్లే జీవరాసులను ఇంద్రియాలతోను, శరీరాలతోను చేర్చాలని మనస్సులో దయను పొందినవాడవై, నీ సంకల్పానికి పరాధీనుడవై, మూలప్రకృతిని మహాన్ -అహంకారం పంచభూతాలు- ఇంద్రియాలు - అనే వరుస అనే మొగ్గలను కల్గినది అయేటట్లుగా చేశావు.

42. గతశ్లోకంలో **"దయమానమనాఃఽ"** అని దయతో జగత్తు సృష్టింపబడినదని చెప్పబడింది. ఆ విధంగా అయితే, జగత్తును దేవమనుష్యతిర్యక్ స్థావరాత్మక విషయంగాను, వ్యాధి మొదలైనవానితో బాధపడేటట్లు దయనీయంగాను సృష్టించడం, **"సుహృదం సర్వభూతానామ్"**, **"సమోఽహం సర్వభూతేషు"** అని అనుగ్రహించిన (భగవానుని) పక్షపాత రాహిత్యానికి, **"స ఏకాకీ న రమేత"**, **"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితఃఽ"** అని పల్కిన పరదుఃఖా సహిష్ణుతకు తగునా? అని అంటే, చేతనకర్మానుగుణంగా భగవంతుడు సృష్టించడంవల్ల ఆ రెండు (దోషాలు) ఆస్వామికిఇ రావు- అని, **"వైషమ్యనైర్ఘృణ్యే న, సాపేక్షత్వాత్"** ఇత్యాది శారీరకన్యాయంతోకూడిన **"రమణీయచరణా రమణీయాం యోనిమాపద్యేరన్, కపూయచరణాఃకుత్సితాం యోనిమ్"** ఇత్యాది శ్రుతులు తెల్పుతున్నవి- అని అంటున్నారు.

నిమ్నోన్నతం చ కరుణం చ జగద్విచిత్రం
కర్మ వ్యపేక్ష్య సృజత స్తవ రంగశేషిన్! ।
వైషమ్యనిర్ఘృణతయో ర్న ఖలు ప్రసక్తిః
తద్బ్రహ్మసూత్రసచివా శ్రుతయో గృణన్తి ॥

ఓ శ్రీరంగనాథా! (చేతనులు చేసిన) పలు రీతులలోని కర్మలను అనుసరించి, లోకాన్ని హెచ్చు తగ్గులను కల్గినదానినిగాను, దయ చూపవలసినదానినిగాను సృష్టించే నీకు పక్షపాతం, నిర్దయత్వం - అనే వీటి యొక్క అవకాశం లేనే లేదు కదా! ఆవిషయాన్ని బ్రహ్మసూత్రాలను సహకారంగా కల్గిన ఉపనిషత్తులు పల్కుతున్నవి.

43. ఈ విధంగా **"కర్మ వ్యపేక్ష్య"** అని కర్మానుగుణంగా విషమసృష్టి చేయబడుతున్నది - అని అంటే భగవానుని నిరపేక్షకర్తృత్వం జీవించడం ఏ విధంగా? అనే జిజ్ఞాస కలుగగా, స్వాధీనమైన మృత్తు, తంతువులు మొదలైన సహకారి సమవదానంతో (గ్రహణంతో) ఘటపటాదులను నిర్మించేవానికి ఆ సహకారి సమవదానంవలె, స్వస్థశరీరం కలవానికి విషయభోగంలో శరీరస్వాస్థ్యంవలె, నియామకుడైన ప్రభువు భృత్యులు మొదలైనవారు చేసిన అపరాధాలనుబట్టి శిక్షావిధానాలను చేసేటట్లు, ఉదారుడు అర్థిజనవిషయంలో (వారు చేసే) ప్రార్థనకు అనుగుణంగా వారిని కటాక్షించేటట్లు, నీవు స్వాధీనమైన, చేతనుల కర్మల విపాకాన్నిబట్టి చేసే విషమసృష్టికూడా స్వాతంత్ర్యానికి భంజకం కాదు, అది నీ స్వాతంత్ర్యానికి అనుగుణం కావడంలో లోటు లేదు- అని అంటున్నారు.

స్వాధీనే సహకారికారణగణే కర్తు శ్చరీరేఽథవా
భోక్తు స్స్వానువిధాపరాధవిధయోఃరాజ్ఞో యథా శాసితుః ।
దాతు ర్వార్థిజనే కటాక్షణమివ శ్రీరంగసర్వస్వ ! తే
ప్రేష్ణుఃసృజ్యదశావ్యపేక్షణ మపి స్వాతన్త్ర్యమేవావహేత్ ॥

శ్రీరంగాన్నే సర్వస్వంగా కల్గిన స్వామీ ! సృష్టికర్త అయిన నీవు, సృష్టింపబడే ఆత్మల కర్మవిపాకదశను ఎదురు చూడడంకూడా నీ స్వాతంత్ర్యాన్నే స్థిరపరుస్తుంది. (ఏ విధంగా? అని అంటే) (ఘటపటాది కార్యవస్తువులను) నిర్మించేవాడైన కుమ్మరిమొదలైన కర్త తనకు స్వాధీనమైన (మన్ను, నీరు, దండం, చక్రం మొదలైన) సహకారి కారణవస్తువులను కుండనిర్మాణంకోసం ఎదురు చూడడం వలె, భోగాలను అనుభవించే జీవుడు తనకు స్వాధీనమైన శరీరాన్ని ఎదురుచూడడంవలె, నియామకుడైన ప్రభువు సేవకుల విషయంలో వారు తనను అనుసరించి ఉండడం, తన విషయంలో తప్పు చేయడం - అనే కార్యాలను వారు ఎదురుచూడడంవలె, ఉదారుడైన ప్రభువు యాచకుని విషయంలో అతని ప్రార్థనను ఎదురుచూడడంవలె, (నీ స్వాతంత్ర్యాన్నే బలపఱుస్తుంది - నిలుపుతుంది)

44. పూర్వం, **"నిజేచ్ఛయైవ పరవానకరోఃప్రకృతిమహదభిమాన భూత కరణావళి కోరకిణీమ్"** అని పల్కిన నిమిత్తకారణత్వమేకాక, **"తదైక్షత బహుస్యాం ప్రజాయేయ"**, **"యతో వా ఇమాని భూతాని జాయంతే"**, **"విష్ణో స్సకాశాదుద్భూతమ్"**, **"జన్మాద్యస్య యతఃఽ"**, **"ప్రకృతిశ్చ ప్రతిజ్ఞే"** త్యాది శ్రుతిస్మృతిసూత్రాలతో ఉపాదానకారణత్వం కూడా నీకు ఉన్నందువల్ల, ప్రళయంలో నామరూపవిభాగశూన్యమై, చేతనా

చేతనశబ్దవాచ్యమైన నీయొక్క శరీరంలోని ఏకదేశాన్ని నీవు స్వేచ్ఛతోనే విస్తరింప జేస్తూ, మగ నెమలి తన పింఛాన్ని విస్తరింపజేసి, తన ఆడు నెమలి (పెంటినెమలి) ముందు ఆడేటట్లుగా, నీవుకూడా లక్ష్మీదేవి ముందు ఆమె ముఖవికాసంకోసం క్రీడిస్తున్నావు- అని ఇందులో అంటున్నారు.

ప్రళయసమయసుప్తం స్వం శరీరైకదేశం
వరద ! చిదచిదాఖ్యం స్వేచ్ఛయా విస్తృణానః ।
ఖచిత మివ కలాపం చిత్ర మాతత్య ధూన్వన్
అనుశిఖిని శిఖీవ క్రీడసి శ్రీసమక్షమ్ ॥

వరాలను ఇచ్చే ఓ రంగనాథ స్వామీ! ప్రళయకాలంలో నీలో నిద్రించిన (నీలో సంకోచాన్ని పొందిన) చేతనాచేతనాత్మకమైన, నీ తిరుమేనిలోని ఏకదేశాన్ని (ఒక భాగాన్ని), నీ సంకల్పంతో వివిధ విచిత్రజగద్రూపంగా విస్తరింపజేస్తూ ఉన్నవాడవై, ఆడునెమలి ఎదురుగా నానావర్ణాలను కల (తన) పింఛాన్ని, ఆకాశంలో వ్యాపింపచేసినట్లుగా, విస్తరించి కదలిస్తూ ఉండే మగ నెమలివలె, లక్ష్మీసమక్షంలో నీవు క్రీడిస్తున్నావు.

45. **"కరణకళేబరై ర్ఘటయితుం దయమానమనాః"** అని, **"మానం ప్రదీప మివ కారుణికో దదాతి"** అని పరదుఃఖాన్ని సహించలేని స్వభావంవల్ల భగవానుడు కరణకళేబరప్రదానాన్ని, శాస్త్రప్రదానాన్ని చేతనులకు హితంగా మాటి మాటికి చేసినా, వారు ఆ శాస్త్రోక్తమార్గంలో ప్రవర్తించకుండా, శాస్త్రనిషిద్ధాలైన, తమకు హితాలు కాని కార్యాలను చేస్తూ ఉన్నప్పటికీ, వారు సన్మార్గానికి వస్తారేమో! అనే దురాశతో, తన చంటిబిడ్డ రోగపీడితుడు కాగా, అతని ఆరోగ్యంకోసం తాను ఔషధసేవను చేసే తల్లివలె, నీవు రామకృష్ణాది అవతారాలను ఎత్తుతున్నావు. వాటిలో **"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః, స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే"**, **"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన, నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి"**, **"పితు ర్వచననిర్దేశాత్"** ఇత్యాది రీతిలో ఆ యా వర్ణాశ్రమవిధులకు పరతంత్రుడవై క్లేశాన్ని పొందుతున్నావు కదా! - అని ఇందులో అంటున్నారు.

భూయోభూయ స్త్వయి హితపరేఽ ప్యుత్ప్రథానాత్మనీన-
స్రోతోమగ్నానపి పథి నయం స్త్వం దురాశావశేన ।
రుగ్ణే తోకే స్వ ఇవ జననీ తత్కషాయం పిబన్తీ
తత్తద్వర్ణాశ్రమవిధివశః క్లిశ్యపేరంగరాజ ॥

ఓ శ్రీరంగనాథా! నీవు మాటిమాటికి చేతనులకు కావలసిన హితాలను చేయడంలోనే దృష్టిని కలవాడవై ఉన్నా, దారిని మీటిన, ఆత్మకు దుఃఖాన్ని కల్గించే దుష్కర్మప్రవాహంలో మునిగి ఉన్నవారిని ఏదో దురాశద్వారా మంచి దారిలో ప్రవర్తింపజేయ గోరినవాడవై, తన బిడ్డ వ్యాధిగ్రస్తుడైనపుడు ఆ బిడ్డ తాగవలసిన కషాయాన్ని తాను తాగే తల్లివలె, పలు అవతారాలను ఎత్తి, ఆయా వర్ణాశ్రమాచారాలను నియమించే శాస్త్రాలకు వశుడవై (నీవుకూడా పలు పలు కార్యాలను అనుష్ఠిస్తూ) క్లేశపడుతున్నావు.

46. **"దురాశావశేన తత్తద్వర్ణాశ్రమవిధివశః క్లిశ్యసే"** అని అవతారకాలంలో పడే క్లేశమే కాక, (భగవానుడు చేసే) సృష్టిమొదలైన అన్ని వ్యాపారాలు చేతనుల ఉజ్జీవనంలోని దురాశవల్లనే చేసినవి- అనే విషయాన్ని ఇందులో తెలుపగోరుతున్నారు. **"స్వత్వ మాత్మని సంజాతం స్వామిత్వం బ్రహ్మణి స్థితమ్"** అనే రీతిలో నీవు సర్వస్వామివి కనుక, నీ సకలవ్యాపారాలు ఎల్లప్పుడు దురాశవల్లనే కాకపోతే, నాస్తికప్రచురమైన లోకంయొక్క సృష్ట్యాదివ్యాపారాలలో వసంతాది ఋతువులలో ఆ యా ఋతువులకు చెందిన పుష్పఫలాదిసూచనలు (ధర్మాలు) ప్రవాహరూపంగా ఉద్భవించేటట్లుగా, **"శోమ్బతే పల్లురువి యెల్లామ్ పడర్ విత్తా"** అనే రీతిలో సోమరితనం లేకుండా ఎల్లప్పుడు నియమంగా ప్రవర్తించడం సంభవించదు కదా!- అని అంటున్నారు.

సార్వ ! త్వత్కం సకలచరితం రంగధామన్ ! దురాశా-
పాశేభ్య స్స్వా న్న యది జగతాం జాతు మూర్ఖోత్తరాణామ్ ।
నిస్తన్ద్రాళో స్తవ నియమతో నర్తులింగప్రవాహా
సర్గస్థేమప్రభృతిషు సదా జాగరా జాఘటీతి ॥

అందఱికీ హితపరుడవైన శ్రీరంగనిలయా! నీకు చెందిన (సృష్ట్యాది) సకలవ్యాపారాలు దురాశాకారణంవల్లనే సంభవిస్తున్నాయి. లేకపోతే, మూర్ఖులతో నిండిన లోకాలయొక్క సృష్టి, స్థితి మొదలైన కార్యాలలో సోమరితనం లేకుండా నియమంగా, ఋతులింగప్రవాహాన్ని కల్గినదై వర్తించే నిత్యసంకల్పం ఏనాడూ సంగతం కాబోదు.

47. ఈ విధంగా నీ సృష్టిస్థిత్యాది సకలవ్యాపారాలు చేతనుల బాగుపడాలనే దురాశతో చేసే కార్యాలు కనుక నీవు సర్వసుహృత్తువు. అయితే, కొందటిని నీవు దండించడం తగునా? అనే జిజ్ఞాస కలుగగా, లోకంలో స్నేహితుడు ఉన్మాదాన్ని పొందిన తన స్నేహితుని సంకెళ్ళు మొదలైనవానితో బంధించి, అతనికి, ఇతరులకు బాధలేకుండా రక్షించినట్లుగా, నీవుకూడా, పరహింసను చేస్తూ సంచరించేవానిని, నరకశత్రుశస్త్రాదులలో దండించి, అతనికి హింసారుచి లేకుండా చేసి ఇతరులవల్ల, ఘాతకుడైన వానివల్ల కలిగే హింసనుండి అతనిని రక్షించడం సుహృత్కార్యమే కనుక, భోగమోక్షప్రదానంకూడా సుహృత్కార్యమే అవుతున్నది - అనే విషయం, "అపూపాన్ని (అప్పాన్ని) చేయడంలో సాధనమైన దండాన్ని ఎలుక తిన్నది - అని అంటే, అప్పాలను కూడా భక్షించింది అని చెప్పనక్కరలేదు" - అనే రీతిలో కైముతిక న్యాయసిద్ధం- అని ఇందులో అంటున్నారు.

47. సుహృదివ నిగళాద్యై రున్మదిష్ణుం నృశంసం
త్వమపి నిరయపూర్వై ర్దణ్డయన్ రంగనేతః! ।
తదితరమపి బాధా త్రాయసే భోగమోక్ష -
ప్రదిరపి తవ దండాపూపికాత స్సుహృత్త్వమ్ ॥

ఓ శ్రీరంగనాథా! మిక్కిలిగా పిచ్చిపట్టినవానిని సంకెళ్ళలో బంధించడం మొదలైన పనులతో శిక్షిస్తున్న స్నేహితునివలె, నీవు కూడా దుర్మార్గులను, నరకంలోకి తోసివేయడం మొదలైనవాటితో దండిస్తున్నావు. అతనిని, మిగిలిన సాధుజనాన్ని నరకపాతంనుండి రక్షిస్తున్నావు. అందువల్ల, భోగమోక్షాలను అనుగ్రహించడంకూడా దండాపూపికా (కైముతిక) న్యాయంతో నీయొక్క సౌహార్దకార్యమే అవుతున్నది.

48. ఇక, **"తత్తద్వర్ణాశ్రమవిధివశః క్లిశ్యసే"** అనేచోట (45వ శ్లోకంలో) ప్రసక్తాలైన విభవావతారాల గుణచేష్టితాలను శ్రీరంగనాథుని విషయంలో అనుభవించాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో (ఈశ్లోకంలో), **"భూయో భూయ స్త్వయి హితపరోఽపి"** ఇత్యాది క్రమంలో నీవు చేసే ధారణ - నియమన- సంకల్పాలతోను, శాస్త్రప్రదానాదులతోను సంస్కరింపబడనివారిని దృష్టిలో పెట్టుకొని ఆ సంసారులను దృష్టిలో పెట్టుకొని, **"అజోఽపి సన్నవ్యయాత్మా"** అనే రీతిలో నీవు కర్మకృతమైన జన్మ లేకుండా ప్రకాశిస్తూ ఉండగా, నీ సంకల్పంతో దేవమనుష్యాది జాతీయుడవై ఎందుకు అవతరిస్తున్నావు? అని హార్దంగా అంటున్నారు.

ధృతినియమనరక్షావీక్షణై శ్శాస్త్రదాన-
ప్రభృతిభి రచికిత్స్యాన్ ప్రాణినః ప్రేక్ష్య భూయః ।
సురమనుజతిరశ్చాం సర్వథా తుల్యధర్మా
త్వమవతరసి దేవోఽజోఽపి సన్నవ్యయాత్మా ॥

అన్నిటిని ధరించడం, వాటి లోపల ప్రవేశించి నియమించడం, రక్షించడం- అనే వీటియొక్క సంకల్పాలతోను, శాస్త్రాలను అనుగ్రహించడం మొదలైనవానితోను చికిత్సను చేయడం సాధ్యం కాని (సంస్కరించడం సాధ్యం కాని) సంసారులను చూచి, నీవు, జన్మ మరణాలను లేని దైవమై ఉన్నా, దేవమనుష్యతిర్యక్ జాతులకు తగినట్లు అన్ని రీతులలోను ఆయా స్వభావాన్ని కలవాడవై, మాటి మాటికి నీవు విభవావతారాలలో అవతరిస్తున్నావు.

49. శ్రీరంగనాథుని అవతారాలు అన్నిటిలోను శ్రీరంగనాయకికూడా **"దేవత్వే దేవదేహోయం మనుష్యత్వే చ మానుషీ, విష్ణో ర్దేహానురూపాం వై కరోత్యేషాత్మన స్తనుమ్, రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేష్వప్యవతారేషు విష్ణోరేషాఽనపాయినీ"** అనే రీతిలో ఆయా అవతారాలకు అనుగుణమైన విగ్రహవ్యాపారాలను కల్గినదై, నిన్ను సంశ్లేషించకపోతే, ఆ నీ అవతారలీల రసవంతం కాకుండా పోవడమేకాక, నిశ్చయంగా పురుషకారరహితం అయినందువల్ల ఆశ్రితరక్షణాసిద్ధిరూపమైన అనిష్టసాధికకూడా కాగలదు - అని ఇందులో అంటున్నారు. **"యది మనుజతిరశ్చామ్"** ఇత్యాది శ్రీగుణరత్నకోశ శ్లోకం భావ్యం.

అనుజను రనురూపరూపచేష్టా న యది సమాగమ మిన్దిరాఽకరిష్యత్ ।
అసరస మధవాఽప్రియమ్భవిష్ణు ధ్రువ మకరిష్యత రంగరాజ! నర్మ ॥

శ్రీరంగనాథా ! లక్ష్మీదేవి, నీ అవతారాలు అన్నిటిలోను నీకు తగిన రూపాన్ని, లీలలను కల్గినదై, నీతోపాటు అవతరాలను చేసి ఉండకపోతే, నీ లీలాచేష్ట సరసం కానిదిగానో, లేక, గర్హించదగినదిగానో (అప్రియమైనదిగానో) అయి ఉండేది. ఇది నిశ్చయం.

50. ఈ రీతిలో నీ అవతారలీలలకు **"స ఉ శ్రేయాన్ భవతి జాయమానః"** అనే శ్రుతిసిద్ధమైన గొప్పతనాన్ని **"తస్య ధీరాః పరిజానంతి యోనిమ్"** అనే రీతిలో, **"మయర్షఉ మది నలమ్"** పొందిన బుద్ధిమంతులలో అగ్రేసరులు (ఆళ్వార్లు) తెలిసి అభినివేశాన్ని పొందుతున్నారు. తమ కర్మచేత సంకుచితమైన జ్ఞానాన్ని

కలవారుమాత్రం మనుష్యాది లక్షణమైన నీ పరత్వస్వభావాన్ని గ్రహించలేక, నీవు చేసే సంసారనివర్తకాలైన అవతారచేష్టితాలను ఇతరసజాతీయాలుగానే (మానవులకు తగిన కృత్యాలుగానే) భావిస్తున్నారు- అని అంటున్నారు.

గరీయ స్త్వాం పరిజానన్తి ధీరాः పరం భావం మనుజత్వాదిభూష్ణుమ్ ।
అజానన్త స్త్వవజానన్తి మూఢాः జనిష్ణుం తే భగవన్! జన్మ కర్మ ॥

ఓ శ్రీరంగనాథా! భక్తిరూపంగా పండిన జ్ఞానాన్ని కల దివ్యసూరులవంటివారు నీ పరత్వాన్ని చక్కగా తెలిసికొంటున్నారు. మూర్ఖులైన సంసారులు అయితే మనుష్యయోని మొదలైన అన్ని యోనులలోను నీవు జన్మించడానికి తగిన నీ పరత్వాన్ని తెలియలేనివారై, సంసారనివర్తకమైన నీ అవతారాన్ని, దివ్యచేష్టితాన్ని తక్కువగా భావిస్తున్నారు.

51. ఈ విధంగా నీవు అనేకంగా అవతరించేటపుడు, ముందుగా నీవు బ్రహ్మరుద్రుల మధ్యలో అవతరించి, వారితో సామ్యాపత్తిని పొందడం అనేది **"తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్", "నారాయణः పరం బ్రహ్మ తత్త్వమ్"** ఇత్యాదులలో పల్కిన పరత్వస్వరూపాన్ని మఱుగుపరచడంకోసమే. కాకపోతే, నీ పరత్వాన్ని సుస్పష్టంగా ప్రకటించగల **"యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై"** అనే శాస్త్రోపదేశరూపంగాను, **"ఇమం వివస్వతే యోగమ్"** ఇత్యాదులలో పల్కిన యోగోపదేశరూపంగాను ఉండే **"మహాన్ ప్రభుర్వైపురుష స్సత్త్వస్యేష ప్రవర్తకः"** అని పల్కిన నీ సత్త్వప్రవర్తనవల్ల, నీ పరదుఃఖసహిష్ణుతవల్ల, **"వేదాపహారే"** త్యాదిగా చెప్పబడిన నీ రక్షణాదువల్ల నీకు ఏమి ప్రయోజనం ఉన్నది ? లేకపోవడమేకాక, విరోధమే కదా !- అని ఇందులో అంటున్నారు.

మధ్యే విరిఞ్చగిరిశం ప్రథమావతారः
తత్సామ్యతः స్థగయితుం తవ చేత్ స్వరూపమ్ ।
కిం తే పరత్వపిశునై రిహ రంగధామన్ !
సత్త్వప్రవర్తనకృపా పరిపాలనాద్యైः ॥

ఓ శ్రీరంగనాథా ! బ్రహ్మరుద్రుల నడుమ నీవు చేసిన, విష్ణురూపంలోని, మొదటి అవతారం ఆ బ్రహ్మరుద్రులతో సాదృశ్యనీతిని చూపి నీ పరత్వస్వరూపాన్ని కప్పి పుచ్చుకోవడంకోసం అయితే, నీయొక్క పరత్వాన్ని ప్రకటించే వేదోపదేశ-యోగోపదేశ రూపమైన సత్త్వప్రవర్తనం, కృపతో రక్షణచేయడం ఇత్యాది కార్యాలను మఱినీవు ఎందుకుచేశావు? చెప్పు.

52. నీవు శాస్త్రోపదేశరూపమైన, పూర్వం పల్కిన సత్త్వప్రవర్తనాన్ని చేయడంకోసం, ఆ వేదశాస్త్రాపహారులైన మధుకైటభులను నీవు ఒక (హయగ్రీవ) రూపాన్ని పరిగ్రహించి, నిరసించావు. సృష్టించాలని ప్రయత్నించే బ్రహ్మకు ఋగ్యజుస్సామ రూపవేదాలనే గొప్ప నేత్రాన్ని ఇచ్చి, సమస్తమైన జగత్తును నిర్హేతుక కృపతో ఉజ్జీవింపజేశావు. ఆ సంగతి గుర్తున్నదా ! అని ఇందులో అంటున్నారు.

52. **మధుः కైటభ శ్చేతి రోధం విధూయ త్రయీదివ్యచక్షు ర్విధాతు ర్విధాయ।**
స్మరస్యంగ! రంగిం స్తురంగావతారः సమస్తం జగజ్జీవయిష్యస్యకస్మాత్ ॥

ఓ శ్రీరంగనాథా ! హయగ్రీవ రూపాన్ని ధరించి, మధువు అని, కైటభుడని చెప్పబడే ఆటంకాన్ని విదల్చివేసి, బ్రహ్మకు వేదాలనే గొప్ప నేత్రాన్ని అనుగ్రహించి, నిర్హేతుకకృపతో లోకాన్ని అంతటిని ఉద్ధరించావు. ఆ సంగతి నీకు గుర్తున్నదా?

53. కొన్ని పురాణాలలోను, **"వశైయిల్ నాన్మఱై"** అనే పాశురంలోను బ్రహ్మకు హయగ్రీవావతారాన్ని ఎత్తి వేదప్రదానాన్ని చేసినట్లు ఉన్నందువల్ల, దానినిగూర్చి పూర్వం పలికారు. ఇందులో హంసరూపియై వేదప్రదానాన్ని చేసినట్లు పల్కిన పురాణాలకు అనుగుణంగాను, **"మున్నివ్వెఱిల్ కుణర్"** అనే పాశురక్రమంలోను, నీవు **"జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతే మాముపాసతే", "తస్యైవం విదుషः"** ఇత్యాదులలో పల్కిన జ్ఞానమయమైన యజ్ఞమనే అమృతంతో అభివృద్ధమైన, అంధకారనివర్తకమైన, చల్లని, స్వచ్ఛమైన హంసరూపాన్ని కలవాడవై, ఉదయించిన చంద్రునివలె, వేదాలనే కిరణాలతో వేదాపహారంవల్ల ఆర్తుడై, చేతనసమష్టిరూపుడైన బ్రహ్మను అనుగ్రహించావు- అని అంటున్నారు.

రంగధే ! తిమిరఘుస్మరశీత స్వచ్ఛహంసతనురిందురివోద్యన్ ।
వేదభాభి రనుజగ్రహిథార్తాన్ జ్ఞానయజ్ఞసుధయైవ సమృద్ధ్యన్ ॥

ఓ శ్రీరంగనాథా ! జ్ఞానయజ్ఞమనే అమృతంతో పరిపూర్ణుడవై, చంద్రునివలె అజ్ఞానాంధకారాన్ని కబళీకరించే చల్లని, నిర్మలమైన, హంసయొక్క రూపాన్ని కలవాడవై అవతరించి, ఆర్తిని కలవారిని వేదప్రభలతో అనుగ్రహించావు.

54. సత్త్వప్రవర్తనకు అనుగుణమైన అవతారద్వయాన్నిగూర్చి పూర్వం అనుభవించి, ఇక, కృపాపరిపాలనకు అనుకూలాలైన అవతారాలను అనుభవించాలని ప్రయత్నిస్తున్నారు. మొదట, "నీవు ఒక సముద్రశిశువు పరుండినట్లుగా లేతమట్టి ఆకుపై పరుండి, శ్రీచరణపద్మాన్ని నీ ముఖంలో పెట్టుకోవడం నీ ఉదరం లోపల

ఉండే జగత్తులను కొలువడంకోసమా! లేక, శ్రీవైష్ణవులకు భోగ్యమైన ఆకారం కల్గి ఉన్నందువల్ల, దానిని (శ్రీపాదాన్ని) పొందడంలో ఉండే అపేక్షవల్లనా?'' అని ప్రశ్నిస్తున్నారు.

వటదళ మధిశయ్య రంగధామన్ ! శయిత ఇవార్ణవతర్ణకః పదాబ్జమ్ ।
అధిముఖ ముదరే జగన్తి మాతుం నిదధిథ వైష్ణవభోగ్యలిప్సయా వా ॥

ఓ శ్రీరంగనాథా ! శయనించిన సముద్రపు కుట్టి (చిన్నసముద్రం) వలె, మట్టి ఆకులో పరుండి, ముఖంలో (నోటిలో) పాదారవిందాన్ని పెట్టుకొన్నావు. (ఇది), ఉదరంలో లోకాలను కొలువడం కోసమా ?(లేక) శ్రీవైష్ణవులకు భోగ్యమైన నీ మధువును (శ్రీచరణంనుండి) పొందాలనే ఇచ్ఛతోనా? చెప్పు.

55. తరువాత, సముద్రమథనవేళలో మందరపర్వతాన్ని సమూలంగా పెకలించి తీసికొనివచ్చి, దానిని బంధనానికి యోగ్యమైన వాసుకితో చుట్టి బంధించి, అల్లల్లాడే పూమాలికలను కల నీ బాహువులతో మహత్తత్త్వమైన క్షీరసముద్రాన్ని, పెరుగు బానలో పెరుగును చిలికినట్లుగా, చిలికావు. దానినుండి చంద్రుని, కౌస్తుభాన్ని, అమృతం మొదలైనవానిని గ్రహించావు. ఈ విధంగా ప్రయోజనాంతరపరులకోసం నీవు ప్రయత్నించినందువల్ల పడిన నీ శ్రమ అంతా, **"అకలకిల్లేన్ ఇత్తైయుమ్"** అని భావించే పిరాట్టి స్వయంవరంవల్ల, **"పశ్యతాం సర్వదేవానామ్"**, **"అముదిల్ వరుమ్ పెణ్ణముదు"** అనే రీతిలో వారు (దేవతలు) అందఱు చూస్తూ ఉండగా ఆమె నిన్ను ఆశ్రయించినందువల్ల అపుడు వ్యక్తమైన పరత్వాన్ని తెలిసి, అనన్యప్రయోజనులైన భక్తులు అభినివేశాన్ని పొందినందువల్ల సఫలమైనది- అని అంటున్నారు.

55. **ఉన్మూల్యాహర సున్దరాద్రిమహినా తం సమ్బధానామునా**
దోర్భి శ్చంచలమాలికైశ్చ దధినిర్మాథం మథానాంబుధిమ్ ।
శ్రీరంగేశ్వర ! చన్ద్రకౌస్తుభసుధాపూర్వం గృహీతేతి తే
కుర్వాణస్య ఫలేగ్రహిర్హి కమలాలాభేన సర్వః శ్రమః ॥

ఓ శ్రీరంగనాథా ! మందరపర్వతాన్ని పెళ్ళగించి తీసికొని వచ్చావు; ఆ పర్వతాన్ని ప్రసిద్ధమైన (వాసుకి అనే) సర్పంతో బంధించావు పూమాలికలు చలించే, బాహువులతో సముద్రాన్ని పెఱుగును చిలికినట్లు చిలికావు; చంద్రుడు, కౌస్తుభమణి, అమృతం మొదలైనవానిని గ్రహించావు- అని ఈ విధంగా కార్యాలను

చేసే నీయొక్క శ్రమ అంతా నీవు లక్ష్మిని పొందడం చేత సార్థకం అయినది కదా!

56. తరువాత, **"గజ ఆకర్షతే తీరే గ్రాహ ఆకర్షతే జలే"** అని ప్రారంభించి, **"ఆత్మయత్నే ప్రతిహతే కృత్యాకృత్యవిమూఢధీః, పరమాపదరూపన్నో మనసాఽచింతయద్ధరిమ్"**, **"స తు నాగవరః శ్రీమాన్"** ఇత్యాది రీతిలో భగవానుని శ్రీచరణాలలో సమర్పించాలని తామరపూలను వెదకుతూ తిరిగి, ఒక తామర కొలనులో దిగి, అందులోని బలిష్ఠమైన ఒక మొసలివల్ల స్వప్రయత్ననివృత్తి పొందిన గజేంద్రాళ్వాన్ ఆక్రందించినపుడు, శ్రీచరణాలను సంవాహనం చేస్తున్న దేవేరుల చేతులనుండి వాటిని బలాత్కారంగా విడిపించుకొని, అనంతుని తిరుమేని అనే పడుకను అపుడే వదలి పెట్టి, కన్నులను బాగా పెద్దవి చేసి చూచి, లక్ష్మీదేవి స్తనతటంలోకి కుంకుమపంకంనుండి తన వక్షఃస్థలాన్ని వేఱుచేసికొని- ఈ విధంగా వ్యాకులాన్ని పొందిన శ్రీరంగనాథుని రూపం ఆపన్నులైన మాముందు నిత్యంగా సాక్షాత్కరించాలి- అని అంటున్నారు.

దేవీహస్తామ్బుజేభ్య శ్చరణకిసలయే సంవహద్భ్యోఽపహృత్య
ప్రత్యస్యానన్తభోగం ద్రుటితి చలపుటే చక్షుషీ విస్ఫురానః ।
ఆక్షిప్యోరశ్చ లక్ష్మ్యాః స్తనకలశశకనత్కుంకుమస్తోమపఙ్కాత్
దేవ శ్రీరంగధామా గజపతి ఘుషితే వ్యాకులఃస్తాత్ పురో నఃll

గజేంద్రాళ్వాన్ ఆక్రందించినపుడు శ్రీచరణాలను సంవాహనం చేస్తున్న దేవేరుల తామరలవంటి హస్తాలనుండి చిగురుటాకువంటి శ్రీచరణాలను బలవంతంగా విడిపించుకొని, ఆదిశేషుని తిరుమేనిని తటాలున తొలగదోసి, లక్ష్మీదేవి యొక్క కలశాలవంటి స్తనాలలో ప్రకాశిస్తున్న కుంకుమపంకంనుండి వక్షఃస్థలాన్ని విశ్లేషింప జేసికొని, చలించే కనురెప్పలను కల నేత్రాలను పెద్దవిగా చేస్తున్నవాడై, వ్యాకులాన్ని చెందిన శ్రీరంగనాథుని రూపం మన కంటిముందు ప్రత్యక్షం కావాలి.

57. **"నారాయణా! ఓ మణివణ్ణా! నాకణైయాయ్! వారాయ్! ఎన్నారిడరై నీక్కాయ్"** అని శ్రీగజేంద్రాళ్వాన్ ఎలుగెత్తి పిలచినపుడు, శ్రీసేనైముదలియార్ కైదండను (హస్తావలంబాన్ని) ఇచ్చినా, దానిని గ్రహించకుండా, అంతఃపురంలోనివారు "ఇదేమి ! వ్యాకులత !" అని చేతులు మర్దించుకొంటూ ఉండగా,

గరుడుని పైకి ఎక్కి, త్వరగా వేంచేసే శ్రీరంగనాథుని ఆ గొప్ప త్వరకు (నమస్కారం) పరాజితులమైనాము- ఈ శ్లోకంలో అని అంటున్నారు.

57. అతన్త్రితచమూపతిప్రహితహస్త మస్వీకృత-
ప్రణీతమణిపాదుకం కిమితి చాకులాస్తఃపురమ్ ।
అవాహనపరిష్క్రియం పతగరాజ మారోహతః
కరిప్రవరబృంహితే భగవత స్త్వరాయై నమః ॥

గజేంద్రాళ్వాన్ చేసిన ఆక్రందన చెవి సోకినపుడు, సేనాధిపతి అందించిన కైదండను లెక్కించని రీతిలో, సన్నద్ధం చేయబడిన రత్నపాదుకలను స్వీకరించని రీతిలో, ఇదేమి ! ఇదేమి ! అని దివ్యదేవేరులు తికమకపడే రీతిలో, వాహనాలంకారాన్ని దేనినీ చేసికోకుండా గరుడునిపై అధిరోహించే రీతిలోని భగవానుని సంభ్రమానికి నమస్కారం.

58. గజేంద్రరక్షణార్థం వచ్చేటపుడు గరుడుని వేగాన్ని నిరూపించి (గమనించి), అది, నీ సమస్తజగన్నిర్వాహకమైన సంకల్పరూపజ్ఞానాన్నికూడా తక్కువ వేగాన్ని కల్గిన దానినిగా చేస్తున్నదని చూచినా, (అంతగొప్ప వేగమైనా) గజేంద్రాళ్వాన్‌యొక్క ఆక్రందన ఎక్కువ కాగా, అటువంటి గరుడుని వేగంకూడా చాలకపోవడంవల్ల, అతనిని కూడా హుంకారాలతో, చేతులతో, కాళ్ళతోను ప్రహరించడం మొదలైన పనులద్వారా వేగంగా పొమ్మని ప్రేరేపించి, తరువాత ఆ వేగం కూడా చాలనందువల్ల, ఆ గరుడుని కూడా పైకెత్తుకొని నీవే మోస్తూ నీవు వేంచేపు చేశావు. అటువంటి, ఆశ్రితరక్షణవిషయంలో నీకు కల్గిన అవస్థ భయపడి పరుగెత్తేవాని అవస్థ అయినదికదా- అని ఇందులో అంటున్నారు.

యం పశ్యన్విశ్వధుర్యాం ధియ మసకృదధో మన్దరాం మన్యమానో
హుంకారాస్ఫాలనాంఘ్రిప్రహతిభిరపి తం తార్క్ష్య మధ్యక్షిప స్త్వమ్।
కిఞ్చోదఞ్చన్నుదస్థా స్తమథ గజపతే ర్బృంహితే జృమ్భమాణే
దేవ శ్రీరంగబన్ధో ! ప్రణమతి హి జనే కాందిశీకీ దశా తే ॥

దేవా! శ్రీరంగనాథా! గజేంద్రాళ్వాన్‌యొక్క ఆక్రందన విజృంభించినది కాగా (మిక్కిలి వేగాన్ని కల), గరుడుని చూచి, అది నిరంతరంగా లోకాలను అన్నిటిని నిర్వహిస్తున్న (నీ) సంకల్పరూపజ్ఞానాన్ని కూడా మించినదని తలచేవాడైనా (గరుడుని అటువంటి వేగంకూడా చాలదని తలచి), నీవు అతనిని చూచి

హుంకరించడం, చేతితో గట్టిగా చఱచడం, కాళ్ళతో తన్నడం- అనే వీటితో ఆ గరుడుని బెదరించి, అదిలించి నడిపావు. ఆవేగం కూడా చాలక, ఆ గరుడుని ఎత్తి నీపై పెట్టుకొని మోసికొంటూ బయలుదేరావు. (ఈ నీ చేష్టను గమనించి నపుడు) ఆశ్రితజనవిషయంలో నీదశ భయపడి పరుగెత్తేవాని దశవలె ఉన్నది కదా!

59. గజేంద్రుడు ఆక్రందించిన తరువాత, గొప్ప గాలిలో తామర కొలనువలె నీవు ప్రకాశిస్తూ, మాలికలను, ఆభరణాలను, పీతాంబరాలను వ్యత్యస్తంగా ధరించినవాడవై, "అయ్యో ! రక్షణలో వెనుకబడ్డానే ! ఆలస్యం చేశానే !" అని నిన్ను గర్హించుకొంటూ వేంచేసిన నీవే నాకు రక్షకుడవు- అని ఇందులో అంటున్నారు.

శ్రీరంగేశయ! శరణం మమాసి వాత్యా వ్యాలోలత్కమలతటాకతాండవేన।
ప్రగ్భాషామ్బర మయథాయథం దధానో ధిఙ్మామిత్యనుగజగర్జ మాజగంథ ॥

ఓ శ్రీరంగనాథా ! (నీవు) గజేంద్రుని ఆక్రందన చెవిలో పడగానే "అయ్యో! ఆశ్రితరక్షణలో నేను ఎంత వెనుక బడ్డాను ! ఛీ" అని నిన్ను వెఱచి పల్కుతూ పూమాలికలు, ఆభరణం, వస్త్రాలు- అనే వీటిని క్రమం లేకుండా ధరిస్తున్నవాడవై, గొప్ప గాలిలో మిక్కిలిగా కదలాడే తామర సరస్సుయొక్క విలాసంతో వేంచేశావు (ఇటువంటి ఆశ్రిత పక్షపాతివి అయిన నీవు) నాకు శరణమై ఉన్నావు.

60. తరువాత, మీనావతారవిషయాలైన రెండు శ్లోకాలను పల్కుతున్నారు. వాటిలో మొదటి శ్లోకంలో- "నీవు మత్స్యావతారుడవై, ఒక నావలో మనువును, అతని సమీపంలో స్థావరజంగమ రూపమైన పరిజనాన్ని స్థాపించి, వేదాలతో సాటి వచ్చే లీలావచనాలతో ప్రళయభయలేశంకూడా లేకుండా ఈస్థావర జంగమాలను మోశావు" -అని అంటున్నారు.

మీనతను ష్ఠం నావి నిధాయ స్థిరచరపరికర మనుమను భగవన్! ।
వేదసనాభిస్పోక్తివినోదై రకలితలయభయలవ మము మవహాः ॥

స్వామీ ! మీనరూపాన్ని ధరించిన నీవు ఒక నావలో మనుమహర్షి సమీపంలో స్థావరజంగమాత్మక సకలపదార్థాలను ఉంచి, వేదరూపాలైన నీ వినోదవచనాలతో ప్రళయకాలాన్ని గూర్చిన భయలేశంకూడా, లేకుండా పూర్వం తెల్పిన చరాచరపదార్థరూప పరికరాన్ని వహించావు.

61. మత్స్యావతారవిశేషంలో, లక్ష్మీదేవియొక్క నేత్రపద్మంవలె కాంతిని కల్గినదైన, దీర్ఘమైన, విశాలమైన, సుందరమైన, స్వచ్ఛమైన, చల్లని తిరుమేనిని కల నీవు నీ తెక్కల వేగంతో ముంచబడ్డ సముద్రంలోని స్థలంలోను, ఉద్గీర్ణమైన (వెలువడిన) సముద్రంలోని జలంలోను క్రీడించడంలో ఆసక్తిని కలవాడవై సంచరించావు- అని ఇందులో అంటున్నారు.

శ్రీనయనాభోద్భాసుర దీర్ఘప్రవిపులసురుచిరశుచిశిశిరవపుః ।
పక్షనిగీర్ణోద్గీర్ణ మహాబ్ధిస్థలజలవిహరణరతగతి రచరః ॥

ఓ స్వామీ! లక్ష్మీదేవి నేత్రాలవలె వెలుగుతున్నది, పొడుగైనది, చాలా విపులమైనది, మిక్కిలి అందమైనది, నిర్మలమైనది, చల్లనిదైన దేహాన్ని (నీవు) కలవాడవై, తెక్కలతో గ్రహింపబడి, వెలువరింపబడిన గొప్ప సముద్రాన్ని కలవాడవై, నేలపై, నీటిలో క్రీడించడంలో ఆసక్తమైన గమనాన్ని కల్గినవాడవై సంచరించావు.

62. కూర్మావతార విషయమైన ఈ శ్లోకంలో, నీవు సకలజగత్తుకు ఆధారమైన కూర్మరూపివై ధర్మాలను అనుగ్రహించి, తరువాత అమృతమథనంలో మందర పర్వతాన్ని ధరించిన కూర్మరూపివై, మరకతమణిమయమైన, అద్వితీయమైన ఆసనమైన సముద్రంలో అవతరించిన లక్ష్మీదేవియొక్క చిగురువంటి శ్రీచరణాలకు అతిశయాన్ని పొందావు- అని అంటున్నారు.

చకర్థ శ్రీరంగిన్ ! నిఖిల జగదాధారకమతో
భవన్ ధర్మాన్ కూర్మః పునరమృతమన్థాచలధరః ।
జగన్థ శ్రేయ స్వం మరతకశిలాపీఠలలితో
జలాదుద్యల్లక్ష్మీపదకిసలయ న్యాససులభమ్ ॥

ఓ శ్రీరంగనాథా ! నీవు అన్ని లోకాలకు ఆధారమైన కూర్మరూపివై, ధర్మాలను వ్యాఖ్యానించావు. మఱియు అమృతం కోసం సముద్రాన్ని చిలినపుడు మందరపర్వతాన్ని ధరించే కూర్మమైనావు. అపుడు నీవు మరకత శిలామయమైన ఆసనంవలె అందంగా ఉన్నావు. (సముద్ర) జలాలనుండి అవతరించిన లక్ష్మీదేవియొక్క చిగురువంటి శ్రీచరణాలను ఉంచడానికి తగినపీఠమైనావు.

63. ఆదివరాహవిషయకమైన ఈ శ్లోకంలో- "నీవు ఆదివరాహరూపివై, ఆశ్రితవిరోధి అయిన హిరణ్యాక్షుని పట్ల గల ఆగ్రహాతిశయంతో అతనిని

కోరదంతంతో చీల్చావు. ఆ దేవశత్రువుయొక్క హృదయాన్ని గొప్ప పల్లంగా చేసి, అందులో ప్రళయార్ణవ జలాన్ని ప్రవహింపజేసి, అతనికి గొప్పభయాన్ని కల్గించావు. అతని రక్తమనే కుంకుమపంకంతో వీరపత్ని అయిన భూదేవియొక్క స్తనతటాన్ని అలంకరించావు. అపుడు బ్రహ్మలోకపర్యంతం పెరిగిన నీ రోమాల కదలికలతో భీతుడైన బ్రహ్మ చేసిన స్తోత్రానికి అభిముఖుడవై, అనునయరూపమైన గర్జనను చేశావు. ఈ విధంగా విరోధినిరసనాన్ని- ఆశ్రితరక్షణాన్ని చేసిన నీవు వేఱు ఏ రక్షణ లేని నాకు అనిష్టనివృత్తిని, ఇష్టప్రాప్తిని కల్గించాలి"- అని అంటున్నారు.

హృది సురరిపోః దిప్తోత్థాతే క్షిపన్ ప్రళయార్ణవం
క్షితికుచతటీ మర్చన్ దైత్యాస్ర కుంకుమచర్చయా ।
స్ఫుటధుతసటాభ్రామ్య ద్బభ్రూస్తవోన్ముఖబృంహితః
శరణ మసి మే రంగిం స్తవం మూలకోలతను ర్భవన్ ॥

ఓ శ్రీరంగనాథా ! ఆదివరాహరూపివి అయిన నీవు నీ కోరపళ్ళచే పగులగొట్టబడిన హిరణ్యాక్షాసురుని ఎదలో ప్రళయసముద్రాన్ని తీసికొనివచ్చి పడవేశావు. ఆ అసురుని రక్తమనే కుంకుమసంకాన్ని పూయడంచేత భూదేవియొక్క కుచతటాన్ని అలంకరించినవాడవయ్యావు. స్పష్టంగా విదలించబడిన నీ జూలును చూచి భయపడి పరుగుతీసే చతుర్ముఖుడు చేసిన స్తోత్రాలకు ఎదురుగా (బదులుగా) గర్జనను చేశావు. ఇటువంటి నీవు ఈ దాసునకు శరణమై ఉన్నావు.

64. ఇక, శ్రీనృసింహావతార విషయంలోని మూడు శ్లోకాలలోని ఈ మొదటి శ్లోకంలో, లోకంలోని జనిధర్మాన్ని (పుట్టే స్వభావాన్ని) కల్గినవారంతా నరసింహావతారంలో నరత్వ-సింహత్వావస్థలను కల, ఉత్పత్తిచే సిద్ధమైన, విచిత్రమైన నర, సింహరూపాల కలయికను అనుభవించి (దర్శించి) తరువాత, ప్రత్యేకంగా నరునిగాని, సింహాన్ని గాని చూచి వెగటును (భయాన్ని) పొందుతున్నారు- అనే రీతిలో పాలు-కండచక్కెరలు కలసినట్లుగా, ఘటింపచేయబడిన అంగాలను కలవాడై, స్పష్టమైన సటలను, పెద్ద కోరదంతాలను కల్గిన శ్రీరంగనాథుడనే సింహాన్ని, ఆ సన్నివేశానికి జితులమై, ఆ రూపాన్ని ఎల్లప్పుడు అనుభవిస్తున్నాము- అని ఈ శ్లోకంలో అంటున్నారు.

నృహరిదశయోః పశ్యన్నౌత్పత్తికం ఘటనాద్భుతం
నరముత హరిం దృష్ట్వైకైకం సముద్విజతే జనః ।

ఇతి కిల సితాక్షీరన్యాయేన సఙ్గమితాఙ్గకం
స్ఫుటసటమహాదంష్ట్రం రఙ్గేంద్రసింహ ముపాస్మహే ॥

మనుష్యత్వ- సింహత్వాలయొక్క సహజమైన కలయికలోని అందాన్ని సేవించే వ్యక్తి మానవ జాతినిగాని లేక, సింహజాతిని గాని ప్రత్యేకంగా చూచి, వెగటును పొందుతున్నాడు- అనే రీతిలో చక్కెర, పాలు కలసిన రీతిలో నరరూప, సింహరూపాలనే రెండు రూపాలు (భోగ్యంగా) కలుపబడ్డవాడై, అందమైన సింహపు జూలును, పెద్ద కోఱపళ్ళను కల్గినవాడైన నృసింహమూర్తి అవతారాన్ని ఎత్తిన శ్రీరంగనాథుని ఉపాసిస్తున్నాము.

65. ఆశ్రితుడైన ప్రహ్లాదుని విషయంలో ద్వేషించిన హిరణ్యకశిపుని పట్ల గల కోపంతో అవతరించిన నృసింహస్వామి మూడు నేత్రాలనుండి పుట్టిన అగ్నిని ఆర్పడంలో తొందరను కల్గిన లక్ష్మీదేవి తన పగడపు మోవితో మద్యాన్ని దానిపై పుక్కిలించినట్లుగా- ఎఱ్ఱని రంగును కల్గిన, గోళ్ళతో బ్రద్దలు చేయబడిన, శత్రువైన హిరణ్యకశిపుని రక్తసమూహాలు భాసిస్తున్నాయి. తడుపబడిన సటాపటలాన్ని కల సుందరనృసింహుడు అనే రంగనాథుడు ఈ సంసారంలో నాకు విరోధి అయిన పాపాన్ని ఇపుడే అడ్డగించాలి- అని ఇందులో అంటున్నారు.

65. ద్విషాణద్వేషోద్యన్నయన వనవహ్నిప్రశమన-
భ్రమల్లక్ష్మీవక్త్రప్రహిత మధుగండూషసుషమైః ।
నఖక్షుణ్ణారాతిక్షతజపటలై రాప్లుతసటా-
చ్ఛటాస్కంధో రున్ధే దురిత మిహ పుంస్ఫుచ్ఛవదనః ॥

ఆశ్రిత శత్రువైన హిరణ్యకశిపునిపట్ల గల పగతో పైకి లేచిన (కల్గిన) నృసింహుని నేత్రాలలోని దావాగ్నిని ఆర్పడంకోసం వేగమైన ప్రయత్నాన్ని కల శ్రీమహాలక్ష్మియొక్క ముఖంనుండి వెలువరింపబడిన తాంబూల గండూషంవలె గోళ్ళతో బ్రద్దలు చేయబడ్డ ఆ శత్రువుయొక్క రక్తధారలున్నాయి. వాటితో వాటితో తడుపబడిన సటల సమూహంతో కూడిన బాహువులను కల నరసింహమూర్తి ఈ శ్రీరంగంలో మన పాపాలను పోగొడుతున్నాడు.

66. ప్రహ్లాద రక్షణరూపకార్యపరత్వంచేత పరస్పరవిరుద్ధాలైన నరత్వ-సింహత్వాలు - ఒకే చోట పొసగేటట్లుగా చేరిన రూపాన్నిగల నీ నఖాగ్రాలతో "మహనీయుడవైన నీ విషయంలో ప్రీతిని కల ప్రహ్లాదుని పట్ల ద్రోహానికి ఒడిగట్టి, అతనిని ద్వేషించిన

హిరణ్యకశిపుడు బద్దలు చేయబడ్డాడు. అపుడు నీకు కల్గిన రోషాతిశయంచేత వ్యాపకత్వ రూపమైన నీ విష్ణుత్వం కంటే రెట్టించిన వైశాల్యాన్ని కల్గినదిగా వృద్ధి చెందిన తిరుమేనిని కలవాడవై, జగత్తును, నిరీశ్వరం కాకుండా, సారజ్ఞులు అభినివేశాన్ని పొందేటట్లుగా నిర్వహించావు" అని ఇందులో అంటున్నారు.

నఖాగ్రగ్రస్తేఽపి ద్విషతి నిజభక్తద్రుహి రుషః
ప్రకర్షాద్విష్ణుత్వద్విగుణపరిణాహోత్కటతనుః ।
విరుద్ధే వైయగ్రీసుఘటితసమానాధికరణే
నృసింహత్వే బిభ్రద్వరద! బిభరామాసిథ జగత్ ॥

వరాన్ని ఇచ్చే స్వామీ! పరస్పరం ఏమీ పొసగనివై ఉన్నా, (ఆశ్రితవిరోధిని నిరసించాలనే) ఊనికతో చాలా పొందికగా ఉండే సామానాధికరణ్యాన్ని కల నరత్వసింహత్వాలను కలవాడవై నీవు ఆశ్రితవిరోధి అయిన హిరణ్యకశిపుని నఖాగ్రంతో నిరసించావు. అయినా నీరోషం తగ్గలేదు. ఆ రోషంయొక్క ఆధిక్యంచేత విష్ణుత్వంకంటే రెండింతలైన పరిమితిని కల్గినది, భయంకరమైనది అయిన తిరుమేనిని కలవాడవై లోకాన్ని నిర్వహించావు.

67. వామనవిషయమైన ఈ శ్లోకంలో- మహాబలి, ఇంద్రుని రాజ్యాన్ని అపహరించి **"అస్యే స్వబుద్ధిః"** (తన సొత్తు కానిదానిపట్ల తన సొత్తు అనే బుద్ధి) కల్గినవాడైనా, ఔదార్యమనే ఒక గుణం అతనితో ఉన్నందువల్ల, దానిని, ఇంద్రుని ప్రార్థనను (యాచనను) చూచి, దానిని వ్యర్థం చేయకూడదని తలచి, అవికారివి అయినా నిన్ను పరిమాణానికి గురిచేసికొని, నీ **"అలమ్ పురిన్ద నెడుమ్ తడక్కై"** ఉదారమైన చేతిని చాచి గ్రహించి మహాబలిదగ్గర యాచకుడవయ్యావు. అతడు దానజలాన్ని పోయగానే, ఆ హర్షంవల్ల ఇంద్రుడు అర్థించిన రాజ్యం పరిమితిలో పర్యవసించకుండా, బ్రహ్మలోకపర్యంతం పెరిగిన నీ శ్రీచరణాన్ని ముల్లోకాలు ధూళిధూసరితంగా చేసి లయించాయి. అపుడు (నీ) తిరునాభీకమలం, ఇంకా కొలువడానికి యోగ్యమైన వేఱు లోకాలను సృష్టించాలని భావిస్తున్నట్లుగా తోచింది. ఈ విధంగా ఉండే నీ త్రివిక్రమావదానాన్ని **"అతో దేవా అవంతు నో యతో విష్ణుర్విచక్రమే"** ఇత్యాదిగా వేదం **"జయ జయ"** అని చాటింపు వేసే వాద్యవిశేషం (డిండిమం) వలె అయినది - అని అంటున్నారు.

దైత్యోదార్యేష్టయాచ్ఞావిహతి మపనయన్ వామనోఽర్థీ త్వ మాసీః
విక్రాన్తే పాదపద్మే త్రిజగదణుసమం పాంసులీకృత్య లిల్యే ।

నాభీపద్మశ్చ మానక్షమమివ భువనగ్రామ మన్యం సిసృక్షుః
తస్థౌ రంగేన్ద్ర వృత్తే తవ జయముఖరో డిండిమ స్తత్ర వేదః ॥

ఓ శ్రీరంగనాథా! వామనుడవైన నీవు అసురుడైన బలియొక్క ఔదార్యం, ఇంద్రుని యాచన - అనే ఈ రెండిటియొక్క నిష్ఫలత్వాన్ని పోగొట్టేవాడవై, (రెండిటిని సఫలం చేయడంకోసం) (బలివద్ద) యాచకుడవు అయినావు. (దానికి పిమ్మట) నీవు త్రివిక్రమ రూపివైనపుడు ముల్లోకం పరమాణుప్రాయమై (తనను) కొలువడానికి సమకట్టిన నీ శ్రీచరణపద్మాలను దుమ్ము ధూళి కల్గినవానినిగా చేసి లయాన్ని పొందింది. నీ తిరునాభీకమలంకూడా కొలువడానికి సమర్థమైన ఇంకొక లోకసమూహాన్ని సృష్టించగోరినదానివలె ఉన్నది. నీ ఆ త్రివిక్రమ వృత్తాంతంలో వేదం విజయఘోషతో నిండిన పెద్ద డప్పు అయినది.

68. శ్రీపరశురామవిషయమైన ఈ శ్లోకంలో - "మాతృవధను చేసి, అనేక క్షత్రియులను వధించిన దోషం, ఆశ్రితుల దోషాలను గమనించడమనే దోషం అంటకుండా నీవు భృగుకులంలో **"వడివాయ్ మழுవే పడైయాక"** అనేటట్లు పరశువు అనే ఆయుధంతో అలంకృతుడవైన శ్రీరాముడవై అవతరించావు. ఆసురప్రకృతిని కల రాజులను ఇరవై ఒక్కమార్లు నిరసించావు. వారి రక్తంతో **"దేవవాయ్ మన్నర్ కురుతికొణ్డు తిరుక్కులత్తిల్ ఇరున్దోర్ క్కురుత్తిరుత్తి శెయ్తు"** అనే రీతిలో పితృకులానికి తర్పణం చేసి భూభారనిరసనాన్ని చేశావు. ఈ విధంగా (నీవు) శత్రువులకు భయంకరుడవైనా, ఆశ్రితుడనైన నా దోషాన్ని లెక్కించకుండా రక్షించు!"- అని అంటున్నారు.

భవాన్రామో భూత్వా పరశుపరికర్మా భృగుకులాత్
అలావీ ద్భూపాలాన్ పితృగణమతార్ప్సీత్ తదసృజా ।
భువో భారాక్రాన్తం లఘుతల ముపాచీక్లృపదితి
ద్విషా ముగ్రంపశ్యోఽపనఘ! మమ మాజీగణదఘమ్ ॥

దోషరహితుడవైన ఓ స్వామీ ! నీవు భృగుకులంనుండి గొడ్డలిని ఆభరణంగా అలంకరించుకొన్న (పరశు) రాముడవై (పరశురామావతారాన్ని ఎత్తి) (దుష్ట) క్షత్రియులను ఖండించావు. వారి రక్తంతో నీ పితృకులానికి తర్పణం చేశావు. బరువు నిండిన భూతలాన్ని బరువు తీరి తేలిక అయేటట్లుగా చేశావు. ఈ విధంగా, శత్రువులకు భయంకరమైనవాడవు అయినా నా పాపాన్ని లెక్కించవద్దు.

69. శ్రీరామచంద్రుని విషయమైన ఈశ్లోకంలో- **"ఆత్మానం మానుషం మన్యే"** అనే రీతిలో ''మనుష్యసజాతీయుడనై అవతరించాలి'' అని సంకల్పించి లక్ష్మీసహితుడవై అవతరించినపుడు, ఆమె అశోకవనంలో ఆమె అంతర్ధానలీలను స్వీకరిస్తే, నీవు మానుషభావాభినయానికి విరోధంగా అమానుషవ్యాపారమైన సేతుబంధనాన్ని చేసి, బ్రహ్మవద్ద ఎవరివల్ల చావు రాని వరాన్ని, రుద్రునివద్ద ఖండింపబడ్డ శిరస్సు తిరిగి మొలిచేటట్లు వరాలను పొందినందువల్ల గర్వించిన వాడు, **"రావణో లోకరావణః"** అనేటట్లుగా విరోధి అయిన రావణుని కాకభోజనమైన రీతిలో నశింపచేయడం ఎందుకోసమో? చెప్పు'' అని అంటున్నారు.

మనుజసమయం కృత్వా నాథావతేరిథ పద్మయా
క్వచన విపినే సా చేదన్తంతర్ధినర్మ వినిర్మమే ।
కిమథ జలధిం బధ్వా రక్షో విధీశవరోద్ధతం
బలిముఖకులోచ్ఛిష్టం కుర్వన్ రిపుం నిరపత్రయుః ॥

ఓ స్వామీ! మనుష్యావతారానుకూలమైన సంకల్పాన్ని చేసి, నీవు లక్ష్మితోపాటు అవతరించావు. ఆ సీతాదేవి (అపుడు) అశోకవనమనే ఒక పొదలో దాగుకోవడమనే ఒక లీలను చేసినది. అపుడు ఆమెకోసం సముద్రాన్ని వారధి కట్టి బంధించి, బ్రహ్మరుద్రులు ఇచ్చిన వరాలతో గర్వించిన రాక్షసుడైన శత్రువును కాకుల గుంపులు తినిన ఉచ్ఛిష్టంగా చేస్తూ వధించావు. ఇదేమి?

70. బలరాముని విషయమైన ఈ శ్లోకంలో- బలరాముడు కళింగదేశ ప్రభువుతో పలుమార్లు ద్యూతమాడి జయించాడు. తరువాత, ఒక ఆవృత్తిలో మోసంతో ఆ కళింగరాజు తాను జయించానని పల్కగా, కపోలతాడనంతో అతని దంతాలను ఊడగొట్టి, దంతసంఖ్యతో తాను అతనిని జయించినదానిని లెక్కించాడు. బలరాముడు లేనపుడు శ్రీకృష్ణుడు **"కడు విడముడైయ"** ఇత్యాదిగా కాళియుని మడుగులో దూకగా, అభిముఖంగా వచ్చిన కాళియుని తలపై అతడు అలసిపోయేటట్లు చేసిన విచిత్రనర్తనంతో కోలాహలం ఏర్పడినది. ఆ బలరాముని సామవచనాలవల్ల గోపస్త్రీలు కృష్ణాపరాధాలను మఱచిపోయారు. ఆ విధంగా, అందటి క్షేమంకోసం కృషిచేస్తూ, **"ఒత్త క్కుழైయుమ్ నాళ్జిలుమ్"** ఇత్యాది రీతిలో నాగలిని ధరించిన ఆ బలరామ దేవుని మా ప్రీతిరూపాపన్నజ్ఞానానికి విషయంగా చేసికొంటాము- అని అంటున్నారు.

70. యద్ద్యూతే విజయాపదానగణనా కాళింగదన్తాంకురైః
యద్విశ్లేషలవోఽపి కాళియభువే కోలాహలాయాభవత్ ।
దూత్యేనాపి చ యస్య గోపవనితాః కృష్ణాగసాం వ్యస్మరన్
తం త్వాం క్షేమకృషీవలం హలధరం రంగేశ ! భక్తాస్మహే ॥

ఓ శ్రీరంగనాథా ! బలరాముడవైన నీవు కళింగప్రభువుతో ఆడిన ద్యూతంలో ఇన్నిమార్లు క్రీడను జయించావు- అనే లెక్కింపును, ఆ కళింగదేశపురాజుయొక్క దంతాల అగ్రాలతో చేశావు. నీవు క్షణకాలం శ్రీకృష్ణునకు దూరంకాగా, అది కాళియసర్పంవల్ల సంభవించిన కోలాహలానికి (కారణం) అయినది. అంతేకాక, బలరాముడవైన నీ దూత్యంచేత గొల్లకన్నియలు శ్రీకృష్ణుని దోషాలను మఱచిపోయారు. అటువంటి, ఆశ్రితుల క్షేమంకోసం కృషిచేసేవాడవు, నాగలిని ధరించినవాడవైన నిన్ను మేము ఆశ్రయిస్తున్నాము.

71. శ్రీకృష్ణుని విషయంలో పల్కిన రెండు శ్లోకాలలోని మొదటి శ్లోకం ఇది. ఇందులో- కంఠంవరకు నీటిని తాగిన మేఘంయొక్క స్వభావాన్ని కల్గినదై, పరభాగమైన పీతాంబరాన్ని, చల్లగా కటాక్షించే తామరలవంటి నేత్రాలను, అనుభవ విరోధినిరసనకు పరికరమైన శంఖచక్రాలను కల్గినదై, స్వరూపగుణాలతో నిరతిశయ బృహత్తు అయిన శిశువుగా నీవు తనకు కుమారుడవై పుట్టాలని దేవకి కోరింది. ఈ విధంగా సర్వరక్షక రూపంతో నీవు కుమారుడుగా పుట్టాలని ప్రార్థించేవారు వేఱెవ్వరు లేరు కదా- అని అంటున్నారు.

ఆకంఠవారిభరమన్థరమేఘదేశ్యం
పీతామ్బరం కమలలోచనపంచహేతి ।
బ్రహ్మాస్తనంధయ మయాచత దేవకీ త్వాం
శ్రీరంగకాన్త! సుతకామ్యతి కా పరేవమ్ ॥

ఓ శ్రీరంగనాథా! కంఠంవరకు జలభారాన్ని కల్గి, మెల్లగా సంచరించే మేఘంలో పోలిన, పీతాంబరాన్ని కల్గిన, తామరలవంటి కన్నులను కల్గిన, అయిదు దివ్యాయుధాలను కల్గిన, పరబ్రహ్మమైన నిన్ను, పుత్రునిగా దేవకి కోరింది. ఈమె కంటే వేఱెవ్వరు ఈ విధంగా పుత్రకామనను చేయగలదు? (దేవకి ఒక్కతె మాత్రమే ఈ విలక్షణ వరాన్ని కోరింది- అని భావం)

72. "నీవు వేణుగానాన్ని చేసి, జగత్తుకు చిత్తవిభ్రమాన్ని కల్గించే కాలంలో కఠినమైన పర్వతం సైతం ద్రవించింది, వేడిమిని కల్గిన నిప్పు చల్లబడింది. భగవద్విషయంలో ఏకాగ్రచిత్తులైన ఋషులు ఆ ఏకాగ్రతను కోల్పోయారు. జ్ఞానశూన్యాలైన వృక్షాలు, తత్త్వాయులైన గొల్లలు ప్రాజ్ఞులయ్యారు. దృష్టివిషాన్ని కల్గిన గొప్ప సర్పాలు సైతం అమృతమయుడైన చంద్రునివలె దర్శనీయాలు అయినవి. పరస్పరవిరోధులైన గోవ్యాఘ్రాదులు సహజ విరోధాన్ని వీడి తోబుట్టువులవలె అయినవి. **"కిం బహునా ?"** చెప్పినవి, చెప్పనివి అన్నీ వేణుగానరసగ్రహణం వల్ల తమకు విరోధియైన ఆకారాన్ని పరిత్యజించాయి. ఇంత ఎందుకు ? నీవుకూడా వాటిలో ఒకడవు అయినావు" అని ఇందులో అంటున్నారు.

శైలోఽగ్నిశ్చ జలాంబభూవ మునయో మూఢాంబభూవు ర్జడాః
ప్రాజ్ఞామాసురగా స్సగోప మమృతామాసు ర్మహోశీనిషాః ।
గోవ్యాఘ్రా స్సహజాంబభూవు రపరే ! త్వన్మాంబభూవుః ప్రభో!
త్వం తేష్వన్యతమాంబభూవిథ భవద్వేణుక్వణోన్మాదనే ॥

శ్రీరంగనాథా! నీ వేణుగానంతో సంభవించిన ఉన్మాదంలో పర్వతం, నిప్పుకూడా నీటిబుడగలయ్యాయి. మునులు మూఢులయ్యారు. జడాలైన వృక్షాలు గోపాలురతోపాటు మహాజ్ఞానులయ్యాయి. మహాసర్పాలు అమృతమయాలు అయినవి. గోవులు, పులులు తోబుట్టువులు అయినవి. ఇంకా పలు పదార్థాలు(ఈవిధంగా) వేఱు వేఱు విధంగా అయినవి. (ఈ విధంగా పలు మాటలు పల్కి ఏమి ?) నీవు కూడా వేఱు విధంగా అయిన వారిలో ఒకడవు అయినావు.

73. తరువాత, కల్క్యవతారవిషయమైన ఈ శ్లోకంలో- "నీవు ఇకపై దుష్టజన సమూహాలను సహించలేనిదై ఉండే భూమిని భారం లేకుండా లఘువుగా చేయాలని తలచి, కల్క్యవతారాన్ని ఎత్తి, కలిదోషకలుషితులను సమూలంగా నశింపజేస్తావు. ఇపుడుకూడా అటువంటి మర్మస్పర్శి అయిన సంప్రదాయ విరోధులను నిశ్శేషంగా పునఃపునః ఛేదించాలి- అని అంటున్నారు.

కల్కితనుర్ధరణీం లఘయిష్యన్ కలికలుషాన్ విలునాపి పురా త్వమ్ ।
రంగనికేత ! లునీహి లునీహితి అఖిలమరుంతుద మద్య లునీహి ॥

శ్రీరంగాన్ని నివాసంగా కల శ్రీరంగనాథా ! కల్కిరూపివి అయిన నీవు, భూమిని భారం తొలగి తేలిక అయేటట్లు చేయబోయేవాడవై, కలికాలంలోని

పాపులను సమూలంగా ఛేదించబోతున్నావు, (ఆ విధంగా అంత ఆలస్యం చేయకుండా), ఇపుడే "క్రూరమైన ప్రాణివర్గాన్ని అంతటిని ఖండించాను, ఖండించాను" - అని పల్కుతూ ఖండించాలి.

74. అర్చావతారపరమైన ఈ శ్లోకంలో- "నీ జ్ఞానశక్త్యాది కల్యాణగుణాలవలె, వాటికి ప్రకాశకాలైన వ్యూహ-విభవావతారాలుకూడా అసంఖ్యాకాలు. అయినందుల్ల వాటినిగూర్చి పూర్తిగా పల్కడం సాధ్యం కాదు. అది అట్లుండనీ. నీవు భూమిలో ఉండే కోవెలలలో, మునుల ఆశ్రమాలలో అజ్ఞ-అభిజ్ఞ, వర్ణాశ్రమ విభాగం లేకుండా అందఱిచేత **"వైదికం తాంత్రికం చైవ తథా వైదికతాంత్రికమ్, త్రివిధం కర్మ సంప్రోక్తం పాంచరాత్రామృతార్ణవే"** అనే శ్రీపాంచరాత్ర విధిని అనుసంధించి ఆరాధనీయుడవై, మధ్యే సంభావితాలైన అపరాధాలను సహించి, నీ ఆసనభోజనశయనాదులు వారి అధీనాలుగా, వారు సమర్పించినవానిని గ్రహించి తృప్తుడవు అవుతున్నావు. అటువంటి అనన్యాదృశుడవైన, అర్చారూపివి అయిన నీకు చెందిన గుణాలతో సహృదయులందఱు అభినివేశాన్ని పొందుతున్నారు- అని అంటున్నారు.

ఆస్తాం తే గుణరాశివద్గుణపరీవాహాత్మనాం జన్మనాం
సంఖ్యా భౌమనికేతనేష్వపి కుటీకుంజేషు రంగేశ్వర !।
అర్చ్య స్సర్వసహిష్ణు రర్చకపరాధీనాఖిలాత్మస్థితిః
ప్రీణీషే హృదయాళుభి స్తవ తత శ్శీలాజ్జడీభూయతే ॥

శ్రీరంగనాథా ! నీ గుణసమూహాలవలె ఆ గుణాల పరీవాహ రూపాలైన అవతారాల సంఖ్య కూడా అపరిమితం. ఆ విషయం అట్లుండనీ. ఈ భూమండలంలో ఉండే ఆలయాలలోను, గృహాలలోను ఆరాధింపదగినవాడవు, దేనినైనా సహించేవాడవు, అర్చకులకు పరాధీనుడవైన సకలస్థితులను కలవాడవై నీవు అందఱిని సంతోషింపజేస్తున్నావు. అటువంటి నీ శీలగుణంతో సహృదయులు మోహాన్ని పొందుతున్నారు సుమా!

75. ఈ విధంగా అర్చావతార సామాన్యమైన సౌశీల్యాన్ని శ్రీరంగనాథునిలో ఉపసంహరిస్తూ, నీవు **"తదక్షరే పరమే వ్యోమన్"** అని చెప్పబడే పరమాకాశం (పరమపదం) వాఙ్మనసాపరిచ్ఛేద్యమైనది కనుక, దేశవిప్రకృష్టమైనందువల్ల, రామకృష్ణాద్యవతారాలు కాదాచిత్కాలు కనుక, ఇది (అర్చావతారం) అందఱికి

హితమని భావించి, కోవెలలో సంసారతాపార్తులై వచ్చినవారిని **"స్వాగతం"** అని పలికేటట్లున్నవి, నిర్హేతుకకృపతో గుణాగుణనిరూపణాన్ని చేయనివైన నీ కటాక్షాలతో చల్లబరుస్తూ, నిద్రావ్యాజంతో అందఱియొక్క రక్షణోపాయచింతను చేస్తున్నావు- అని ఇందులో అంటున్నారు.

శ్రీమద్వ్యోమ న సీమ వాఙ్మనసయో స్సర్వేఽవతారాः క్వచిత్
కాలే విశ్వజనీనమేతదితి ధీ శ్శ్రీరంగధామన్యథ ।
ఆర్తస్వాగతికైः కృపాకలుషితై రాలోకితై రార్థయన్
విశ్వత్రాణవిమర్శనస్థలితయా నిద్రాసి జాగర్యయా ॥

పరమపదం- వాక్కుకు, మనస్సుకు అందనిది; విభవావతారాలు- అన్నీ ఏదో ఒక సమయంలో (ప్రవర్తించినవి). ఈ అర్చావతార స్థితి సకలజనహితమైనది- అనే భావాన్ని కలవాడవై, శ్రీరంగదివ్యాలయంలో ఆర్తులను ఉద్దేశించి కుశలప్రశ్నలను చేసేవి, కృపతో ఎట్టబడినవి, చేతనుల గుణదోషవిచారాన్ని చేయనివి అయిన నీ కటాక్షాలతో (తాపత్రయాతురులైనవారిని) చల్లబఱచేవాడవైన నీవు జగద్రక్షణ చింతనతో కూడిన జాగరణతో నిద్రిస్తున్నావు.

76. తరువాత, మూడు శ్లోకాలతో శ్రీరంగనాథుని సౌశీల్యాతిశయాన్ని ప్రకాశింపజేయగోరుతున్నారు. అందులో, ఈ మొదటి శ్లోకంలో, సత్యలోకంలో బ్రహ్మ, తన కమండలం నుండి ప్రవహించిన గంగలో స్నానం చేసి, మాటిమాటికీ సృష్టి చేసినందువల్ల ఏర్పడిన వికాసాన్ని కల్గిన బుద్ధితో, ఆదిశేషునిపై శయనించిన నిన్ను, అనేకకల్పాలలో ఉపాసిస్తూ, సహధర్మచారిణి అయిన సరస్వతితో కలసి స్వాధీనాలైన పురుషసూక్తాదులతో సంకీర్తనం చేసి, తాను అన్వేషించి సంపాదించిన తామరలవలె ఉండే తన ముఖాలతోను, అంజలులతోను, కన్నులతోను ప్రణామం చేసి, నమస్కరించి, దర్శించి, అనుభవించి, నిన్ను ఆనందింపజేశాడు- అని ఇందులో అంటున్నారు.

సర్గాభ్యాసవిశాలయా నిజధియా జానన్ననన్తేశయం
భారత్యా సహధర్మచారరతయా స్వాధీనసంకీర్తనः ।
కల్పానేవ బహూన్ కమండలుగళద్గఙ్గాప్లుతోఽపూజయత్
బ్రహ్మే త్వాం ముఖలోచనాంజలిపుటైः పద్మైరివావర్జితైः ॥

శ్రీరంగనాథా ! తన కమండలంనుండి జాలువారే గంగలో స్నానం చేసిన చతుర్ముఖుడు శేషశాయివి అయిన నిన్ను, అనేక కల్పాలలో సృష్టి చేయడంలోని అభ్యాసంవల్ల వికాసాన్ని పొందిన తనయొక్క బుద్ధితో ధ్యానిస్తూ, సహధర్మచారిణి అయిన సరస్వతీదేవితో కలసి చేసిన స్వాధీనమైన సంకీర్తనాన్ని కలవాడై, తామరపూవువలె ఉండే తన ముఖాలతో, కన్నులతో, అంజలిపుటాలతో నిన్ను పూజించాడు.

77. సత్యలోకంలోనుండి ఇక్ష్వాకుమహారాజు ప్రార్థనవల్ల అయోధ్యకు వచ్చిచేరావు. అక్కడ నీవు, మనువంశంలోని రాజులచేత సేవింపబడ్డావు. తరువాత, నీవే శ్రీరాముడవై అవతరించి, **"సహ పత్న్యా విశాలాక్ష్యా"** అనే రీతిలో ఆ శ్రీరాముని ద్వారా సాక్షాత్తుగా ఆరాధనాగృహంలో నీకు ఉచితమైన ఆరాధనలను అర్చకపరాధీనత లేకుండా పొందినవాడవయ్యావు- ఇందులో అని అంటున్నారు.

మనుకులమహీపాల వ్యానమ్రమౌళిపరంపరా-
మణిమకరికారోచి ర్నీరాజితాంఘ్రిసరోరుహాః ।
స్వయ మథవిభో ! స్వేన శ్రీరఙ్గధామని మైథిలీ
రమణవపుషా స్వార్హాణ్యారాధనాన్యసి లమ్భితః ॥

ఓ స్వామీ ! మనుకులానికి చెందినవారైన చక్రవర్తులు నిన్ను నమస్కరించగా, వారి కిరీటపంక్తులలో గల ఆడు మొసలి రూపంలోని రత్నాల కాంతులతో హారతి ఇవ్వబడిన పాదపద్మాలను కల్గినవాడవయ్యావు. తరువాతకూడా, శ్రీరామమూర్తివిగా అవతరించిన నీవు శ్రీరంగవిమానంలో నీకు తగిన ఆరాధనలను స్వయంగానే గ్రహించావు.

78. ఈ విధంగా జ్ఞానాధికుడైన బ్రహ్మ, అటువంటి మనువంశపు ప్రభువులు నీ సంబంధంతో ధన్యులైన తరువాత, ఆ బ్రహ్మకు ప్రపౌత్రుడై, శ్రీరాముని శరణు వేడి, ఆ స్వామిచే **"ఆఖ్యాహి మమ తత్త్వేన రాక్షసానాం బలాబలమ్"** అని ఇక్ష్వాకువంశ్యుడుగా అభిమానింపబడినందువల్ల పురస్కారాన్ని పొందిన విభీషణాళ్వాన్‌ను అనుగ్రహించడంకోసం రెండు నదుల మధ్యభాగంలో నిద్రిస్తున్నావు. **"మద్భక్తజనవాత్సల్యమ్"** ఇత్యాదులలో పల్కిన మంచి గుణాలలో ఒక్కటికూడా లేకుండా ఉండే నావంటివారినికూడా స్వామిత్వసంబంధంతో దివ్యమంగళవిగ్రహ సౌందర్యాదులను అనుభవింపజేసి, ధన్యులను చేస్తున్నావు- అని ఇందులో అంటున్నారు.

మన్వన్వయే ద్రుహిణే చ ధన్యే విభీషణేనైవ పురస్కృతేన ।
గుణై ర్దరిద్రాణ మిమం జనం త్వం మధ్యేసరిన్నాథ ! సుఖాకరోషి॥

ఓ శ్రీరంగనాథా ! మనుకులం, కృతార్థుడైన బ్రహ్మ (ఉన్నప్పటికీ), (వారిని వీడి), శ్రీరామచంద్రునిచే బహుమానాన్ని పొందిన విభీషణుని కారణంచేతనే కావేరీనదీ మధ్యప్రదేశంలో (వేంచేసి ఉండి), ఏ గుణాలు లేని దరిద్రుడైన నావంటివారిని ఆనందింపజేస్తున్నావు.

79. తరువాత, గాయత్ర్యాదిశ్రుతిప్రతిపాద్యుడు శ్రీరంగనాథుడే- అని అధ్యవసించి, శ్రీరంగనాథుని విషయంలో శ్రుతివిహితానుష్ఠానాలను చూపే నాల్గు శ్లోకాలలోని ఈ మొదటి శ్లోకంలో- **"నారాయణ పరో జ్యోతిః"** ఇత్యాదిశ్రుతుల చేత, **"ధ్యేయః సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః"** అనే ఉపబృంహణం చేత నిరవధికతేజోరూపత్వ- సవితృమండలాంతర్వర్తిత్వ- ధ్యేయత్వాలు నీకు సిద్ధించడంవల్ల, గాయత్రిలోని **"భర్గ"** శబ్దం తేజోవాచి, వరేణ్యపదం ఉపాస్యవాచికాగా, గాయత్రీ పదాలు నిన్ను శ్రుతిప్రసిద్ధమైన తేజోరూపిగా, సవితృమండలాంతర్వర్తిగా, ఉపాస్యునిగా తెలుపుతున్నవి. ఆ విధంగా **"య ఏషోఽంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే, హిరణ్యశ్మశ్రుః హిరణ్యకేశః ఆప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః, తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ"** ఇత్యాది అంతరాదిత్యవిద్యావచనాలుకూడా నిన్నే నిరతిశయతేజస్సుతో ఆపాదచూడం సువర్ణమయవిగ్రహునిగాను, పుండరీకాక్షునిగాను ప్రతిపాదిస్తున్నాయి. ఈ రీతిలో గాయత్ర్యాదిప్రతిపాద్యతయా పరుడవై ఉన్నా, ఆశ్రితసులభత్వంకోసం శ్రీరంగంలో పరుండి ఉండే నిన్ను అనన్యసాధనత్వంతో గాయత్రిలో తెలుపబడినట్లుగానే ప్రాప్యంగా మేము ఉపాసిస్తున్నాము- అని అంటున్నారు.

తేజః పరం తత్సవితుర్వరేణ్యం ధామ్నా పరేణాప్రణఖాత్సువర్ణమ్।
త్వాం పుండరీకేక్షణమామనంతి శ్రీరంగనాథం తమువాసిషీయ॥

స్వామీ! నిన్ను సూర్యునియొక్క, ప్రసిద్ధమైన, ఉపాస్యమై ఉండే గొప్ప తేజస్సుగా (గాయత్రిలోని పదాలు) పల్కుతున్నవి. (అంతేకాక) గొప్ప తేజస్సుతో (కిరీటం నుండి) నఖాలవరకు స్వర్ణమయుడవని, పుండరీకాక్షుడవని (కొన్ని శ్రుతులు నిన్ను) తెల్పుతున్నాయి. అటువంటి, శ్రీరంగనాథుడవైన నిన్ను ఉపాసిస్తాను.

80. **"సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ"** అని, **"చక్షుర్మిత్రస్య వరుణస్యాగ్నేః"** అని, **"పశ్యేమ శరద శ్శతమ్"**అని అధ్యయనం చేయబడే శ్రుతిరీతిలో, కన్పించే స్థావరజంగమాలకు అంతర్యామిగాను, సూర్యాదులకు నేత్రంగాను నీవు ఉన్నావు. అందువల్ల లక్ష్మీదేవితో నిత్యసంశ్లిష్టుడవైన నిన్ను నూటేండ్లు కోవెలలో (శ్రీరంగంలో) కళ్ళార దర్శించి, అనుభవిస్తాను- అని ఇందులో అంటున్నారు.

ఆత్మాఽస్య గస్తుః పరితస్థుషశ్చ మిత్రస్య చక్షు ర్వరుణస్య చాగ్నేః।
లక్ష్మ్యా సహాత్పత్తికగాఢబన్ధం పశ్యేమ రంగే శరదశ్శతం త్వామ్॥

కంటికి కన్పించే జంగమవస్తుసమూహాలకు స్థావర వస్తుసమూహాలకు ఆత్మవై ఉన్నావు. సూర్యునకు, వరుణునకు, అగ్నికి నేత్రమై ఉన్నావు. లక్ష్మితో పాటు స్వభావసిద్ధమైన దృఢసంబంధాన్ని కల్గిన నిన్ను శ్రీరంగంలో నూఱు ఏండ్లు నేను దర్శించాలి.

81. **"యస్యాస్మి న తమంతరేమి"**, **"యోఽహ మస్మి స సన్ యజే"** అనే శ్రుతుల రీతిలో ఏస్వామికి నేను సొత్తు అవుతున్నానో, అటువంటి శ్రీరంగనాథుని తప్ప వేఱెవ్వరిని ఆశ్రయించను. ఎవరిపట్ల నేను స్వాభావికమైన దాస్యాన్ని కల్గి ఉన్నానో, ఆ శ్రీరంగనాథుని జ్ఞానయజ్ఞాలతో యజనం చేసి సంతోషాన్ని కల్గిస్తాను- అని ఇందులో అంటున్నారు.

యస్యాస్మి పత్యుర్న త మన్తరేమి శ్రీరఙ్గతుఙ్గాయతనే శయానమ్।
స్వభావదాస్యేన చ యోఽహ మస్మి స సన్యజే జ్ఞానమయైః మఖైస్తమ్॥

ఏ స్వామికి శేషభూతుడనై ఉన్నానో, శ్రీరంగమనే గొప్ప ఆలయంలో శయనించి ఉండే ఆ శ్రీరంగనాథుని విడిచిపోను. నేను సహజమైన దాస్యంచేత ఎవడనై ఉన్నానో, అతడినై (శేషమై) ఉంటూ, ఆశ్రీరంగనాథుని జ్ఞానరూపాలైన యాగాలతో ఆరాధిస్తున్నాను.

82. **"అమృతం దేవానా మాయుః ప్రజానామ్"** ఇత్యాది శ్రుతిరీతిలో, **"బ్రహ్మణే త్వా మహస ఓమిత్యాత్మానం యుంజీత"** అనే శ్రుతిరీతిలో జనిధర్మాన్ని కల్గినవారైన సంసారులకు ముక్త్యుపాయభూతుడవై, నివృత్తసంసారులకు, (జీవన్ముక్తులకు) తత్ప్రాయులకు నిరతిశయభోగ్యభూతుడవై, సులభుడవై శ్రీరంగానికి నియామకుడవై ఉండే నిన్ను శరణు పొందుతున్నాను. **"నారాయణం పరం బ్రహ్మ, నారాయణ పరో జ్యోతిః"** అనే రీతిలో పరబ్రహ్మశబ్దవాచ్యుడవై, జ్యోతిశ్శబ్దవాచ్యుడవై,

కైంకర్యోద్దేశ్యభూతుడవై శ్రీరంగంలో శయనించి ఉండే శ్రీరంగనాథుడవైన నిన్నుగూర్చి **"నేను"** అనే ఈ ప్రత్యగాత్మను (నన్ను) కింకరునిగా వినియోగిస్తాను- అని ఇందులో అంటున్నారు.

ఆయుః ప్రజానా మమృతం సురాణాం రంగేశ్వరం త్వాం శరణం ప్రపద్యే।
మాం బ్రహ్మణేఽన్మై మహసే తదర్థం ప్రత్యఞ్చ మేనం యునజై పరస్మై ॥

శ్రీరంగనాథా! ప్రజలకు రక్షకుడవై, దేవతలకు భోగ్యుడవై, శ్రీరంగానికి ప్రభువైన నిన్ను, శరణు పొందుతున్నాను. పరబ్రహ్మస్వరూపియై, తేజఃస్వరూపి అయిన ఈ భగవానుని కొఱకు శేషభూతుడైన ప్రత్యగాత్మను అయిన ఈ దాసుని వినియోగిస్తాను.

83. తరువాత, "ఏదైనా ప్రయోజనాన్ని తననుండి గ్రహించడం శ్రీరంగనాథునకు మిక్కిలి ఉద్దేశ్యం''- అని తెలుపడంకోసం **"చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున !, ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ"**, **"ఉదారా స్సర్వ ఏవైతే"** అనే గీతావచనంలో- ఐశ్వర్యభంశంచేత కల్గిన ఆర్తి తీరాలని ఆశను కల ఆర్తుడు, తనకు ఇంతకుముందు లేని సంపద కావాలనే ఆశను కల అపూర్వైశ్వర్యకాముడు, ప్రకృతి విముక్తాత్మ స్వరూపాన్ని పొందడంలో ఆశను కల కేవలుడు, స్వరూపయాథాత్మ్యజ్ఞానాన్ని కల భగచ్చరణార్థి - అనే వీరు ఆయా ప్రయోజనాల కోసం తనను ఆశ్రయించడమే (వారు తనకు చేసిన) ఉపకారంగా భావించి, నిధిని ఇచ్చేవారిని ప్రతిగ్రహీతలు ఉదారులుగా భావించినట్లు, అత్యుదారులుగా నీవు భావించడం ఏమి ఆశ్చర్యం !- అని అంటున్నారు.

ఆర్తిం తితీర్షు రథ రంగపతే ! ధనాయన్
ఆత్మమ్భరి ర్వివిదిషు ర్నిజదాస్యకామ్యన్ ।
జ్ఞానీత్యమూ స్సమమథా స్సమ మత్యుదారాన్
గీతాసు దేవ ! భవదాశ్రయణోపకారాన్ ॥

ఓ శ్రీరంగనాథా! నిన్ను ఆశ్రయించడమే ఉపకారంగా కల్గిన నశ్వైశ్వర్య కాముడు, అపూర్వైశ్వర్యకాముడు, కైవల్యకాముడు, స్వస్వరూపమైన శేషవృత్తినికోరే జ్ఞాని- అనే వీరిని అందఱిని సమానంగా గొప్ప ఉదారులుగా భగవద్గీతలో భావించావు.

84. పూర్వం **"నిజదాస్యకామ్యన్"** అని పల్కిన భగవచ్చరణార్థులు (ప్రపన్నులు), **"మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా, నిరాశీ: నిర్మమో భూత్వా"** అని పలికే రీతిలో భగవదధీన స్వకర్తృత్వాధ్యవసాయాలతో నిత్యనైమిత్తిక కామ్యకర్మలను స్వతంత్రకర్తవు భోక్తవు అయిన నీపట్ల సమర్పించి, స్వాధీనకర్తృత్వ బుద్ధిరహితులై, ఫలాభిసంధిరహితులై, **"కార్యమిత్యేవ యత్ కర్మ నియతం క్రియతే"** అనే రీతిలో విహితమని అనుష్ఠిస్తున్నారు. వారు, **"సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగ స్సాత్త్వికో మత:"** అనే రీతిలో కర్మలను విడిచినవారుకూడా అవుతున్నారు - అని ఇందులో అంటున్నారు.

నిత్యం కామ్యం పరమపి కతిచిత్ త్వయ్యధ్యాత్మస్వమతిభి రమమాఃl
న్యస్యాసంగా విదధతి విహితం శ్రీరంగేందో! విదధతి న చ తే ॥

ఓ శ్రీరంగనాథా ! కొందరు అధికారులు ఆత్మవిషయాలైన తమ జ్ఞానాలతో, మమకారాన్ని లేనివారై, ఫలసంగాన్ని లేనివారై, కర్మారాధ్యుడవైన నీలో కర్తృత్వాన్ని అనుసంధించి, నిత్యకర్మల రూపంగాను, కామ్యకర్మల రూపంగాను, నైమిత్తిక కర్మలరూపంగాను ఉండే శాస్త్రాలచే విధింపబడ్డ కర్మలను అచరిస్తున్నారువారు, అనుష్ఠించనివారు కూడా అవుతున్నారు.

85. పూర్వం పల్కిన **"వివిదిషువు"** అయిన కేవలునకు, జ్ఞానికి, ప్రకృతి వియుక్తాత్మస్వరూపజ్ఞానం ఆవశ్యకమని పల్కడంకోసం స్వస్మై భాసమానమైన తనను, ప్రకృతి-మహదహంకార తన్మాత్ర భూతేంద్రియరూపాలైన ఇరవై నాల్గు అచిత్ తత్త్వాలకు మించి **"పంచవింశోఽయమాత్మా"** అని ఇరవై అయిదవ తత్త్వంగా పల్కుతూ, పరస్మై భాసమానాలైన ఆ అచేతన తత్త్వాలకంటే విలక్షణునిగా అధ్యవసించి, ఉపాసించే కేవలులు ఆ ఆత్మను పొందుతున్నారు; ఆ విధంగా ప్రకృత్యాత్మవివేకం కల్గి, తదంతర్యామివి అయిన నిన్ను ఉపాసించే జ్ఞానులు నిన్ను పొందుతున్నారు''- అని ఇందులో అంటున్నారు. లేక, ''ప్రకృతివిలక్షణుడైన ఆత్మను భగవదాత్మకంగా ఉపాసించేవారు, భగవదాత్మకమైన ఆత్మను పొందుతున్నారు. ఆత్మశరీరకంగా నిన్ను ఉపాసించేవారు ఆ విధంగా నిన్ను పొందుతున్నారు''- అని అంటున్నారనికూడా చెప్పవచ్చు.

ప్రత్యఞ్చం స్వం పఞ్చవింశం పరాచ: సంచక్షాణా స్తత్త్వరాశే ర్విచిత్య ।
యుంజానా శ్చర్తమ్భరాయాం స్వబుద్ధౌ స్వం వా త్వాం వా రంగనాథాప్నువన్తి ॥

ఓ శ్రీరంగనాథా! తనకు తానే ప్రకాశించేవాడైన తమ ఆత్మను ఇరవై అయిదవ వానినిగా పలికేవారై, ఇతరులకే ప్రకాశించే అచిత్ తత్త్వాల సమూహం నుండి వివేకించి తెలిసి, సంశయ- విపర్యయజ్ఞానాలు ఏవీ లేకుండా, సమాధికాలంలో యథార్థజ్ఞానాన్ని కల్గిన తమ బుద్ధిలో తమ ఆత్మను ధ్యానించేవారు స్వాత్మానుభవాన్ని పొందుతున్నారు; నిన్ను ధ్యానించేవారు నిన్ను పొందుతున్నారు.

86. తరువాత, జ్ఞానులపట్ల శ్రీరంగనాథునకు కల పారతంత్ర్యాన్ని తెలుపడం కోసం పూర్వం పల్కిన అధికారిచతుష్టయంలో ఒక విధమైన అధికారులైన జ్ఞానులు, సాత్త్వికత్యాగయుక్తకర్మానుష్ఠానంతో **"ధర్మేణ పాపమపనుదతి"**, **"అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా మృతమశ్నుతే"**, **"కషాయే కర్మభి: పక్వే"** అనే రీతిలో భక్త్యుత్పత్తివిరోధి అయిన పాపం తీరగానే, **"దాసభూతా స్స్వత:"** అనే రీతిలో స్వాభావికమైన దాస్యంలో త్వరను కల్గి, అపుడే, ప్రేమాధిక్యంవల్ల శిథిలాంతఃకరణులై, **"సతతం కీర్తయంతఃశ్చ"**, **"నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే"** అనే రీతిలో కీర్తన- ధ్యాన- ప్రణామాలను చేసేవారై, ఆ విధంగా భక్తిపరశులై, **"సోఽధ్వనఃపారమాప్నోతి"** అనే రీతిలో సంసారధ్వపారభూతుడవై, పరమప్రాప్యుడవైన నిన్ను పొందుతున్నారుకదా! అటువంటి జ్ఞానులు **"మయి తే"** అనే రీతిలో నీ అధీనంలో స్వరూపసిద్ధ్యాదులను కల్గి ఉండడంకదా యుక్తం. **"తేషు చాప్యహమ్"**, **"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"** అని స్వాధీనుడవైన నీవు తదధీనస్వరూపాదులను కలవాడవు కావడం నీ ఆశ్రిత వాత్సల్యకార్యం. ఎంత అత్యాశ్చర్యకరం- అని ఇందులో అంటున్నారు.

అథ మృదితకషాయాఃl కేచిదాజానదాస్య-
త్వరితశిథిలచిత్తాఃl కీర్తిచిన్తానమస్యాఃl
విదధతి ననుపారం భక్తినిఘ్నా లభన్తే
త్వయి కిల తతమే త్వం తేషు రఙ్గేంద్ర! కిం తత్ ॥

ఓ శ్రీరంగనాథా ! పాపాలు తొలగినవారై, సహజమైన దాస్యంలో త్వరను కలవారై ఉండే కొందఱు అధికారులు సంకీర్తనం, చింతనం, నమస్కారం - అనే వీటిని చేస్తున్నారు. భక్తిపరవశులై, పరమప్రాప్యమైన నిన్ను పొందుతున్నారు. అటువంటివారు నీయందే కదా (నమ్మికను) కల్గి ఉన్నారు, (ఇది యుక్తం). కానీ, నీవు, వారిపట్ల (ఆదరాన్ని కల్గి ఉన్నావే) అది ఏమి? (చెప్పు)

87. భక్త్యాదిరూపసాధనాంతరాలలో ప్రవేశించేవారికి శ్రీరంగనాథుడు ప్రాప్య భూతుడు కావడమే కాకుండా, **"అకించనోఽనన్యగతిః"** అని ఉండే అనన్య సాధనులకుకూడా శ్రీరంగనాథుడు ఉపాయోపేయాలు రెండు తానే అయిన రీతిని, తాము అనన్యసాధనులనే విషయాన్ని ఇందులో తెలుపగోరుతున్నారు **"హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ"** అనే రీతిలో శ్రియఃపతి చేతనాచేతనాలను **"యతో వా ఇమాని భూతాని జాయంతే"**, **"అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్"** ఇత్యాది రీతిలో సత్తాస్థితినియమనసంహార మోక్షప్రదానాదులతో **"పతిం విశ్వస్య"** అనే రీతిలో సర్వశేషి అయిన తనకోసం స్వీకరిస్తున్నాడు - అని పూర్వం పల్కిన శ్రుతివాక్యం తెల్పుతున్నది. అందువల్ల ఉపాయత్వం, ఉపేయత్వం- అనేవి నీకు జ్ఞానానందా మలత్వాదులవలె స్వరూప నిరూపకాలు. జ్ఞానశక్త్యాదులవలె నిరూపితస్వరూపానికి చెందిన గుణాలు కావు. కనుక, శ్రీరంగంలో శయనించి ఉండి, సులభుడవైన నిన్ను అనన్యసాధన ప్రయోజనుడనై నేను శరణు పొందుతున్నాను- అని ఇందులో అంటున్నారు.

ఉపాదత్తే సత్తాస్థితినియమనాద్యై శ్చిదచితౌ
స్వముద్దిశ్య శ్రీమానితి వదతి వాగౌపనిషదీ ।
ఉపాయోపేయత్వే తదిహ తవ తత్త్వం న తు గుణౌ
అత స్త్వాం శ్రీరఙ్గేశయ ! శరణ మవ్యాజ మభజమ్ ॥

శ్రీరంగంలో శయనించి ఉండే స్వామీ ! ఉపనిషత్తులలోని వాక్కు, (ఏమి పల్కుతున్నది? అని అంటే) శ్రియఃపతి తనను ఫలభాగిగా తలచి చేతనా-చేతనాలను సృష్టి స్థితినియమనం మొదలైన వ్యాపారాలతో స్వీకరిస్తున్నాడు- అని పల్కుతున్నది. అందువల్ల ఉపాయంగాను, ఉపేయంగాను ఉండడం అనేవి నీకు స్వరూపం. గుణాలు కావు. ఉపాయత్వాన్ని, ఉపేయత్వాన్ని నీవు స్వరూపంగా కల్గినవాడవై ఉన్నందువల్ల నిన్ను ఏ వ్యాజం లేకుండానే (సహజంగానే) శరణు పొందాను.

88. భగవానునకు ఉపాయత్వం సహజ స్వరూపమైనపుడు, సర్వముక్తి ప్రసంగం ఏర్పడి, లీలావిభూతికి ఉచ్ఛేదం కలుగదా ? అనే శంక ఏర్పడగా, దానికి సమాధానంగా భగవంతుని నిరంకుశస్వాతంత్ర్యంవల్ల అది రాదు- అనే పరిహారాన్ని తెలుప గోరి, సమర్థుడు, స్వతంత్రుడైన ఒక రాజు తన రాజ్యంలో ఒక చిల్లి గవ్వను స్వల్పపరిమాణాన్ని కల్గిన ఒక సువర్ణం స్థానంలో పెట్టి, దానితో కొన్ని దినాలు

క్రయ-విక్రయ రూపకార్యాలు జరిపించినట్లు, తరువాత కొంత కాలమైన పిమ్మట, దానినే సువర్ణకోటిస్థానంలో పెట్టి వ్యవహారాన్ని జరిపించినట్లుగా, నీవు స్వతంత్రుడవై, ఒక చేతనుని **"ఏష ఏవ సాధు కర్మ కారయతి, తం యమున్నినీషతి"** అనే రీతిలో కర్మజ్ఞానభక్తి ప్రపత్త్యాచార్యాభిమానాలనే వ్యాజాలను కల్పించి, ముక్తుడు అయేటట్లు చేస్తున్నావు. కనుక, నన్నుకూడా నీవే ప్రపత్తివ్యాజాన్ని కల్గించి **"ప్రహర్షయిష్యామి"** లో (కైంకర్యంలో) అన్వయించేటట్లు చేసి అనుగ్రహించాలి- అని ఇందులో అంటున్నారు.

పటునైకవరాటికేవ క్లృప్తా స్థలయోః కాకణికాసువర్ణకోట్యోఃl
భవమోక్షణయో స్త్వయైవ జన్తుఃక్రియతే రఙ్గనిధే ! త్వ మేవ పాహిll

శ్రీరంగనాథా ! సమర్థుడైనవానిచేత ఒక పైసా, ఒక సువర్ణనాణెం విలువ గల గడులలోని స్థానాలలో ఉంచబడిన ఒక గులకరాయివలె, నీచేతనే చేతనుడు సంసారంలోను, ముక్తిలోను, నిలుపబడుతున్నాడు (అందువల్ల) నీవే రక్షించాలి.

89. తరువాత, **"త్వయైవ క్రియతే"** అనేటట్లు నేను స్వతంత్రుడనని, పల్కినా, **"కర్తా శాస్త్రార్థవత్వాత్"**, **"శాస్త్రఫలం ప్రయోక్తరి"** అని ఉన్నది కదా. మీరు కూడా **"ఇదం కురు"** అనే శాస్త్రవిహితాన్ని చేసి, **"మా కార్షీః"** అనే నిషేధాన్ని వదలిపెట్టాలి- అనేది శ్రీరంగనాథుని అభిప్రాయంగా తలచి, **"సర్వం కర్మాఖిలం పార్థ ! జ్ఞానే"** అని, **"కర్మణైవ హి సంసిద్ధిమ్"** అని, **"భక్త్యా త్వనన్యయా"** అని నీవు చూపిన కర్మయోగాదులలో నాకు అన్వయం లేకపోవడమేకాక, తరువాత వాటిలో అన్వయం కల్గడానికి ఆవశ్యకమైన ముముక్షుత్వం, **"కుళిత్తి"** ఇత్యాది పాశురంలో పల్కిన బ్రాహ్మణ్యాదులు, అనుష్ఠానానౌపయిక జ్ఞానశక్తులు, అనుతాపం- అనే ఇవి ఉన్నాయనే విషయంలో కూడా నాకు వ్యుత్పత్తి లేదు. ఈ విధంగా విహితాలలో నాకు ఏవీ లేని రీతిలోనే, నిషిద్ధాలలో నాకు లేనిది అంటూ ఏదీ లేదు. ఈ రీతిలో ముముక్షుత్వాదులు లేకుండా, అపాయబాహుళ్యాన్ని కల్గినవాడనై, మనస్సులో విషయప్రావణ్యాన్ని కల్గినవాడనై ఉండగా, స్వాధికారాన్ని తెలియకుండా, **"కడల్ వణ్ణా ! కదఱుకిన్ఱేన్"** అనే రీతిలో **"శరణం భవ"** అని ప్రకటంగా విడువకుండా పల్కి, "ఇంతటి ఆనుకూల్యాన్నికలవారిని రక్షించలేదే !"- అని నీకుకూడా అవద్యాన్ని కల్గించేవాడనై, శ్రీరంగాలయంలోని సాన్నిధ్యాన్నికూడా (నీకు) అకించిత్కరంగా చేశాను- అని అంటున్నారు.

జ్ఞానక్రియాభజనసమ్పదకిఞ్చనోఽహమ్ ఇచ్ఛాధికారశకనానుశయానభిజ్ఞః।
రంగేశ! పూర్ణపృజిన శ్శరణం భవేతి మౌర్ఖ్యాద్బ్రువీమి మనసా విషయాకులేన॥

శ్రీరంగనాథా! జ్ఞానయోగ - కర్మయోగ - భక్తియోగాలనే సంపదను (అధికారాన్ని) లేనివాడను అయిన నేను ముముక్షుత్వం- ఆకించన్యం - అనన్యశక్తిత్వాలనే అధికారాలను, శక్తి, అనుతాపం - అనే వీటిని తెలియనివాడనై గాను, నిండిన పాపాలను నిండినవాడను కలవాడనై, మూర్ఖత్వంతో విషయాలలో కలత చెందిన మనస్సుతో "(నీవు నాకు) శరణు కావాలి" అని అంటున్నాను.

90. **"మనసా విషయాకులేన"** అని మీ మనస్సుకు ఈ విషయప్రావణ్యం విలక్షణమైన ఉపాయోపేయ దౌర్లభ్యంవల్ల ఏర్పడినది. శిష్టులు (మీకు) తెలిపి వారు గర్హించి భయాన్ని కల్గించినందువల్ల గాని ఉపదేశించినందువల్లగాని అదికూడా నివృత్తం కాగలదు లెండి" అనేది శ్రీరంగనాథుని మనోగతమని భావించి- "నీ అభిప్రాయం అదా! **"ఆదరమ్ పెరుక వైత్త అళగన్"** అని, **"ఐయపాయప్పాడఱత్తు త్తోన్ఱుమ్ అళగన్"** అని నాకు ఉపాయోపేయ భూతుడవైన నీవు శ్రీరంగంలో సన్నిహితుడవై ఉన్నప్పటికీ (నిన్ను) అనాదరించి, విధివశంచేత ఆత్మనాశాన్ని పొందాను. **"యత్తదగ్రేఽమృతమివ"** అనే రీతిలో పైన తీయగా భాసించే దుర్విషయాలను ఆశించడం వల్ల, అదికూడా ప్రచ్ఛన్నం అయినందువల్ల, **"శరణం భవ"** అనే ఉక్తిని పల్కి, పామరులవలె శిష్టులుకూడా అహంకారిని అయిన నన్ను చూచి **"జ్ఞానీ త్వాత్మైవ"**, **"అనన్యాః"** అని నీవు నీ ఆత్మతో తుల్యునిగాను, అభిన్నునిగాను పల్కిన జ్ఞానినిగా, తన ఉపదేశంతో ఇతరులను జ్ఞానులనుగా చేయగల్గినవానినిగా భ్రమించేటట్లుగా ఉండడమే (నా) జీవనయాత్రగా ఉన్నది. అందువల్ల నేను (శిష్టుల) ఉపదేశాదులకుకూడా లక్ష్యభూతుడను కాను సుమా- అని ఇందులో అంటున్నారు.

త్వయి సతి పురుషార్థే మత్పరే చాహ మాత్మ-
క్షయకరకుహనార్థాన్ శ్రద్దధద్రజ్జచష్ట !।
జన మఖిలమహంయు ర్వంచయామి త్వదాత్మ-
ప్రతిమభవదనన్యజ్ఞానివద్దేశికస్సన్ ॥

ఓ శ్రీరంగనాథా ! పరమపురుషార్థభూతుడవు, నా విషయంలో తత్పరతను కలవాడవు అయిన నీవు వేంచేసి ఉండగా, నేను ఆత్మనాశాన్ని కల్గించే

ఆభాసవిషయాలను కోరేవాడనై, అహంకారినై ఉన్నాను. నీకంటే వేఱుగాని జ్ఞానివలె గురువునై, సమస్తజనులను మోసగిస్తున్నాను.

91. సమర్థుడైన వైద్యునివద్ద రోగి తన అపథ్యాన్ని వ్యక్తం చేసినట్లుగా, వీరు (భట్టర్) కూడా, **"మరుత్తువనాయ్ నిన్ఱ మామణివణ్ణన్"** అయిన శ్రీరంగనాథుని వద్ద పూర్వ పల్కిన- **"పూర్ణపృజినః"** అనేదానిని ఇందులో వివరించగోరుతున్నారు. ప్రవృత్తి నివృత్తి రూపమై, **"శ్రుతిః స్మృతిర్మమైవాజ్ఞా"** అని నీ ఆజ్ఞారూపమైన **"సత్యం వద"**, **"న కలంజం భక్షయేత్"** ఇత్యాది శ్రుతిస్మృత్యాదులను లజ్జాభయాలతో పరిత్యజించాను. నర్వభూతసుహృత్తువు అయిన నిన్నుగూర్చి **"మద్భక్తజనవాత్సల్యమ్"** ఇత్యాది అష్టవిధభక్తులతో కూడినవాడనై, సదార్శనంకోసం పరమపదానికి పోనక్కరలేకుండానే **"సదా ద్రష్టవ్య స్సర్వదేహిభిః"** అని సదాదర్శనాది యోగ్యుడైన భాగవతుల విషయంలో కరణత్రయంతోను, బుద్ధిపూర్వకంగాను, అబుద్ధిపూర్వకంగాను, కాదాచిత్కంగా కాకుండా సంబంధసంబంధులవరకు భయం లేకుండా ద్రోహం చేసి, సర్వసహిష్ణువు అయిన నీవు కూడా సహించలేని అపరాధాలను చేసి సంతోషిస్తున్నాను. ఈ విధంగా అకృత్యకరణ-కృత్యాకరణ-భగవదపచార- భాగవతాపచార- అసహ్యాపచారాలను చేస్తున్న నేనుకూడా, **"సహిష్ణుః"** అని కీర్తింపబడే నీ సహిష్ణుత్వం కారణంగా, నిర్దోష రక్షణమే అయితే, దానిని నీవు పరమపదంలోనే ఉండి చేయగలవు కనుక, సదోషరక్షణార్థంగా దానికి తగిన చోటు అయిన శ్రీరంగానికి అత్యంతప్రావణ్యంతో వచ్చిన కారణంగా నీకు దుర్భరుడను కావడం దగదు - అని ఇందులో అంటున్నారు.

అతిక్రామన్నాజ్ఞాం తవ విధినిషేధేషు భవతేఽపి
అభిద్రుహ్యన్ వాగ్దీక్ఞతిభిరపి భక్తాయ సతతమ్ ।
అజానన్ జానన్వా భవదసహనీయాగసి రతః
సహిష్ణుత్వాత్ రంగప్రవణ ! తవ మా భూవ మభరః ॥

శ్రీరంగనివాసంలో ప్రావణ్యాన్ని కల్గిన శ్రీరంగనాథా ! ఎల్లప్పుడు నీయొక్క విధి నిషేధ రూపాలలోని ఆజ్ఞను అతిక్రమిస్తూ ఉన్నవాడనై, వాక్కుతో, మనస్సుతో, చేతలతోను నీవిషయంలో, భాగవతుల విషయంలోను అపచారాలను చేస్తున్నవాడనై, తెలిసిగాని, తెలియకగాని, నీకు అసహ్యాలైన అపచారాలలో ఆసక్తుడనై ఉండే నేను నీ సర్వసహిష్ణుత్వంవల్ల కూడా నీకు అనుగ్రహించదగినవాడను కానే కాను.

92. అనంతరం, **"త్వయి సతి పురుషార్థే"** అనే శ్లోకంలోని పల్కిన పురుషార్థాన్ని, కుహనార్థాలను సదృష్టాంతంగా వివరించగోరి, **"కల్పకక్కావన నల్పల తోళ్"** అని, **"వాసుదేవతరుచ్ఛాయా"**, **"బాహుచ్ఛాయా మవష్టబ్ధో యస్య లోకః"** అని పలికే రీతిలో ఆశ్రితరక్షణపరిమితిలో కాకుండా అంతకంటే అతిశయించినది, తాపార్తులకు తాపం తీరేటట్లుగాను, తాపం తీరినవారికి నిరంతరానుభావ్యంగాను, అనేకం కాకుండా ఒక్కటిగాను ఉండేది అయిన ప్రాప్తశేషివైన నీ బాహువనే కల్పవృక్షంయొక్క చ్ఛాయను మేము అన్వేషించ నక్కర లేకుండా, మేము (దానికి) ధారకంగా, మాకు అది ధారకంగాను శ్రీరంగంలో సన్నిహితంగా ఉన్నది. దానిని అనాదరించి, చాలా కోపించిన సర్పంయొక్క పడగ నీడవలె, లోపల భయంకరమై, బయటకు ఆపాతతః అందంగా తోచి ఆకర్షకమై, ఉత్తరక్షణంలో అనర్థకరమై, ఒకటికాక అనేకమై, బయటకు పోనివ్వకుండా బంధకమై ఉండే విషయాంతరాల నీడను, అసేవ్యమని చూడనీయని ఆపదను కల్గిన నేను, నిరంతరం వానిని సేవిస్తున్నాను- అని అంటున్నారు.

ప్రకుపితభుజగఫణానా మివ విషయాణా మహం ఛాయామ్ ।
సతి తవ భుజసురవిటపిప్రచ్ఛాయే రఙ్గజీవిత ! భజామి ॥

శ్రీరంగవిమానాన్ని జీవితంగా (ప్రాణంగా కల) శ్రీరంగనాథా! నీ భుజాలనే కల్పవృక్షంయొక్క గొప్ప ఛాయ ఉన్నా కోపించిన సర్పం యొక్క పడగలవంటి దుర్విషయాలయొక్క నీడను నేను పొందుతున్నాను.

93. "అదేమి! నేను సర్వశక్తినికదా! మీ విషయప్రావణ్యాన్ని తీర్చడంలో నాకు శక్తిలేదా!" అని, శ్రీరంగనాథుడు అనగా, "నేను నీకు శక్తి లేదని అంటున్నానా? నావంటి క్షుద్రజంతువుల (జీవుల) శక్తి నీయొక్క సర్వశక్తికి కూడా మించినది- ఏ విధంగా? అంటే, దయకల్గిన చోట కదా నీ శక్తికి ప్రసక్తి. ఆ దయ తన విషయంలో ప్రసరింపనీయకుండా సంసారులు, దుఃఖంలో సుఖత్వభ్రాంతిని పొందుతున్నారు. కోశకారమనే ఒక పురుగు (పట్టుపురుగు) తన నోటిలోని దారాలతో గూడును కట్టుకొని, దానినుండి బయటపడే దారి లేక, ఆ గూడులోనే ఉండి నశించిపోయేటట్లుగా, జీవిస్తూ ఉండగానే నశించిపోతున్నారు. కనుక, ఇదేమి భయంకరమైన నాశం! అయ్యో!" - ఇందులో అని అంటున్నారు.

93. **త్వత్సర్వశక్తేరధికాస్మదాదేః కీటస్య శక్తిర్భవ! రఙ్గబన్ధో! ।**
యత్తత్కృపా మప్యతికోశకారన్యాయాదసా నశ్యతి జీవనాశమ్ ॥

శ్రీరంగనాథా! నావంటి పురుగుయొక్క శక్తి సర్వశక్తివై ఉండే నీ కంటే, గొప్పది. ఎందుకు? అంటే ఈకీటకం (నేను) నీ కృపనుకూడా దాటి, ఒక పురుగు చేసే పనివలె, తనకు తానే నశిస్తున్నది అయ్యో !,

94. "నా దయను మాత్రమేకదా మీరు అతిక్రమించారు. నాకు ఇంకా క్షమావాత్సల్యాద్యనంతకల్యాణగుణాలున్నాయి కదా!" అని శ్రీరంగనాథుని అభిప్రాయంగా తలచి, "నీ గుణాలు అనంతాలు అయినట్లే, నా దోషాలుకూడా నీవల్ల లెక్కకట్టడం సాధ్యం కాదు. అందువల్లనేకదా ప్రవాహంలో బ్రహ్మరక్షస్సు మొదలైనవి తమ దాహశాంతిని కల్గించుకోలేనట్లు, దాసుడుకూడా, ఆశపడినవారి ఆశ పర్యంతం వర్షించే నీ క్షమాది గుణాలకు విషయభూతుడను కాలేకున్నాను" అని ఇందులో అంటున్నారు.

శ్రీరంగేశ ! త్వద్గుణానా మివాస్మద్దోషాణాం
కః పారదృశ్వా యతోఽహమ్ ।
ఓఘే మోఘోదన్యవత్త్వద్గుణానాం
తృష్ణాపూరం వర్షతాం నాస్మి పాత్రమ్ ॥

శ్రీరంగనాథా! నీ కల్యాణగుణాలకువలె, నా దోషాలకు అంతాన్ని చూచినవాడు ఎవడు ? ఎందువల్ల ? అంటే గొప్ప ప్రవాహంలో పిశాచాలు దాహం తీరేటట్లు తాగలేనట్లుగా, ఆశ తీరేటట్లు వర్షిస్తున్న నీ కల్యాణగుణాలకు అర్హుడను కాలేకున్నాను.

95. **"తృష్ణాపూరం వర్షతాం చాస్మి పాత్రమ్"** అని మీరు పలికే రీతిలో నా దయాదిగుణాలు ఎక్కడ ప్రసరించాయి?- అని అంటే, రామకృష్ణాది రూపాలతోను, కోవెలలలోను అవతరించి, కోసల గోకుల చరాచరాలను, ఆళ్వార్లు మొదలైనవారిని పుణ్యపాపాలతో అభిభవం లేకుండా, **"అపి వృక్షాः పరిమ్లానాः"**, **"అకాలఫలినో వృక్షాः"** ఇత్యాది రూపంలో త్వత్సంశ్లేషవిశ్లేషాలతో సుఖదుఃఖాలను కలిగినవారు అయేటట్లు చేయలేదా ! అపుడు నేను దానికి పాత్రుడను కాని రీతిలో కదా నా దోషభూయస్త్వం ఉన్నది- అని భావించి, "నీవు మనుష్యాదిజన్మలలో అవతరించి, ఆయా జన్మలలో కర్మఫలాన్ని, సాధువుల (సత్పురుషుల) పట్ల అనుగ్రహంతో అనుభవించినట్లయితే, మేము పుణ్యపాపాలవల్ల తిరిగి ఎందుచేత పరిభవింప బడుతున్నాము ?" అని ఇందులో అంటున్నారు.

95. త్వం చేన్మనుష్యాదిషు జాయమానః తత్కర్మపాకం కృపయోపభుఙ్క్షే ।
శ్రీరఙ్గశాయిన్! కుశలేతరాభ్యాం భూయోఽభిభూయేమహి కస్య హేతోః॥

శ్రీరంగంలో శయనించి ఉండే స్వామీ ! నీవు మనుష్యాది జాతులలో, అవతరిస్తున్నవాడవై, ఆ జన్మలకు తగిన కర్మపరీపాకాన్ని కృపాకారణంగా అనుభవిస్తున్నట్లయితే, మేము సుఖదుఃఖాలతో మాటిమాటికి ఏ కారణంవల్ల క్లేశాన్ని పొందుతున్నాము?

96. "ఈ విధంగా, పాపప్రాచుర్యం కల్గి, **"అనుశయానభిజ్ఞః"** అనే రీతిలో అనుతాపం కూడా లేకుండాపోతే, ఇక నేను క్షమించడం ఏవిధంగా? అనుతాపం కల్గిన చోట కలిగే క్షమ అనే ఒక నియమాన్ని మీరు పాడుచేయవచ్చునా?" అనే అభిప్రాయం భగవానునకు కలుగగా, "ఆ విధంగా నియమం పాడు కాకుండా క్షమిస్తే నీవు పరమపదంలోనే ఉంటే చాలదా ? ఆ నియమాన్ని దాటి క్షమించడం కోసమే కదా కోవెలలోని నీ సాన్నిధ్యం! అందువల్ల నా అనుతాపశూన్యతనుకూడా నీవు క్షమించాలి"- అని ఇందులో అంటున్నారు.

క్షమా సాపరాధేఽనుతాపిన్యుపేయా కథం సాపరాధేఽపి దృప్తే మయి స్యాత్ ।
తథాఽప్యత్ర రంగాధినాథానుతాప్యవ్యపాయం క్షమేతాతివేలా క్షమా తే॥

ఓ శ్రీరంగనాథా! ఓర్పు అనేది అపరాధాతిశయాన్ని చేసినవాడైనా అతడు పశ్చాత్తాపాన్ని కల్గి ఉంటే వానిపట్ల చూపించదగిన గుణం. (ఆ విధంగా ఉండగా)అపరాధిని అయినా, (పశ్చాత్తాపం లేకుండా) గర్వించి ఉండే నా విషయంలో (ఆ క్షమ అనేది) ఏవిధంగా సంభవిస్తుంది ? అయినా తీరాన్ని దాటిన నీ క్షమాగుణం ఈ దాసుని విషయంలో అనుతాపాన్ని పొందకపోవడాన్ని కూడా క్షమిస్తుంది సుమా!

97. అన్ని విధాలుగాను తమకు గుణం లేకపోవడమే నిరవధికమహిమను కల్గిన భగవానుని క్షమయొక్క అసంకుచితప్రవృత్తికి హేతువు- అని భావించి, **"శిఖుకాక్కై ముళై తీణ్డ"** అన్నట్లు అంతఃపురవిషయంలోను, స్వవిషయంలోను వాచామ గోచరమైన అపరాధాన్ని చేసిన కాకాసురుని విషయంలో **"త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః"** అని పిత్రాది పరిత్యాగంవల్ల, వేఱు ఆశ్రయం లేక వచ్చి వాలడం వల్ల, శిశుపాలుని విషయంలో ఒక్కొక్క నిందలోను చేసిన కృష్ణ నామోచ్చారణమనే గుణలేశం కల్గినందువల్ల సంకుచితప్రవృత్తిని కల్గినదైన, స్వతఃసహిష్ణువు అయిన నీ క్షమ గుణలేశవృత్తాంతవిచారం లేకుండా ఉండే నా విషయంలో ఎల్లప్పుడు నిరంకుశంగా క్రీడించాలి- అని ఇందులో హార్దంగా అంటున్నారు.

బలిభుజి శిశుపాలే తాదృగాగస్కరే వా
గుణలవసహవాసాత్ త్వత్క్షమా సఙ్కుచన్తీ ।
మయి గుణపరమాణూదన్తచిన్తానభిజ్ఞే
విహరతు వరదాసా సర్వదా సార్వభౌమీ ॥

వరాలను ఇచ్చే స్వామీ! వాచామగోచరం అయిన అపరాధాలను చేసిన కాకాసురుని విషయంలో, శిశుపాలుని విషయంలో వారికి స్వల్పగుణం ఉన్నందువల్ల, సంకోచాన్ని పొందినదైన ఈ నీ క్షమాగుణం, సద్గుణ లవలేశం అయినా ఉండే ప్రసక్తి లేని నా పట్ల ఎల్లప్పుడు తన ఆజ్ఞను చెల్లుబాటు చేసికొంటూ విహరించుగాక!

98. "శ్రీరంగనాథుని క్షమాగుణంవలె, దయకూడా ఉద్వేలమై, గుణలేశం లేని వారివిషయంలో అసంకుచితప్రవృత్తిని కల్గినదని భావించి, "నాకు సంసారాను భవం ప్రతికూలజ్ఞానంగా కాకుండా అనుకూలజ్ఞానంగా ఉన్నది. కనుక నేను నీ దయను అతిక్రమించాను. అందువల్ల (దానిని) దుఃఖమని భావించి దాసునికూడా దయచూపి అనుగ్రహించాలి" అని ఇందులో అంటున్నారు.

దయా పరవ్యసనహరా భవవ్యథా
సుఖాయతే మమ తదహం దయాతిగః ।
తథాఽప్యసౌ సుఖయతి దుఃఖ మిత్యతో
దయస్వ మాం గుణమయ ! రఙ్గమన్దిర !॥

కల్యాణగుణాలే మూర్తీభవించినవాడా ! శ్రీరంగనాథా ! (నీ)దయాగుణం, ఇతరుల దుఃఖాలను తీర్చగల్గినది. నాకు సాంసారిక్లేశం (దుఃఖంగా కాకుండా), సుఖంగా ఉన్నది. అందువల్ల నేను దయకు లక్ష్యభూతుడను కావడానికి తగనివాడనే అయ్యాను. అయినా, ఇతడు దుఃఖాన్ని సుఖంగా భావిస్తున్నాడు- అని భావించి, అయ్యో! అని నాపై దయచూపు.

99. **"భవవ్యథా"** అనేసూక్తిని, **"గుణమయ"** అనేసూక్తిని వివరించి అనుసంధిస్తూ, **"తామ్ దయస్వ"** అనే తమ మాటను కూడా అపచారకోటిలో భావించి, జననం-జరామరణాలు, అవిద్య- అస్మిత-రాగ-ద్వేష- అభినివేశరూపాలైన పంచక్లేశాలు, పుణ్యపాపరూపకర్మ - అనే ఈ అలలను పొందిన నేను, **"రాఘవోఽర్హతి వైదేహీమ్"** అనే పెరియపిరాట్టియార్‌కు (శ్రీరంగనాయకికి) అర్హుడనైన నిన్ను, దేవతలకు అర్హమైన మంత్రపూతపురోడాశాన్ని కుక్క ఆశపడినట్లే ఆశపడ్డానే!" ఎంత అన్యాయం అని ఇందులో అంటున్నారు.

గర్భజన్మజరామృతి క్లేశకర్మషడూర్మిగః ।
శ్వేవ దేవవష్కట్కృతం త్వాం శ్రియోఽర్హ మకామయే ॥

ఓ శ్రీరంగనాథా! మాతృగర్భవాసం, జన్మ, వార్ధక్యం, మృత్యువు మొదలుగా షడ్భావవికారాలనే అలలలో కొట్టుమిట్టాడే నేను, దేవతలకు సమర్పింపబడిన హవిస్సును శునకంవలె, లక్ష్మీదేవికి అర్హుడవైన నిన్ను అభిలషించానే! అయ్యో!

100. **"త్వాం శ్రియోఽర్హ మకామయే"** అనే రీతిలో ఉత్తుంగవిషయాన్ని ఆశపడడమే కాకుండా, **"నీశనేన్"** ఇత్యాదిరూపాలైన పూర్వపురుషుల వినయోక్తులను **"జ్ఞానక్రియా"** ఇత్యాదిరూపేణ తాము అనుకరించడం అపరాధమని భావించి, పరాంకుశాదులైన పూర్వపురుషులను అనుసరించి, ఆంతరమైన వినయం ఏమీ లేకుండా ఉండగా, సర్వజ్ఞుడవైన నిన్ను వంచించేటట్లు నేను పల్కిన ఈ వినయభాషణల మూలంగా, గోవు నిజమైన దూడపట్ల చూపే వాత్సల్యాన్ని మాయావత్సంపట్ల చూపేటట్లుగా, నీవు **"తమ్మైయేయొక్క అరుళ్ శెయ్వర్"** అనే రీతిలో అనుగ్రహించే పరమసామ్యాపత్తికంటే, అత్యంత హేయగుణాలను కల నాకు, కర్మానురూపంగా నీవు ఇచ్చిన ఇహలోక సమృద్ధ్యనుభవమే మేలు కదా !- అని అంటున్నారు.

అనుకృత్య పూర్వపుంసో రంగనిధే ! వినయుడమ్భతోఽముష్మాత్ ।
శున ఇవ మమ వరమృద్ధేః ఉపభోగ స్త్వద్వితీర్ణయాః ॥

శ్రీరంగనాథా ! పూర్వులను అనుసరించి, (చేయబడే) ఈ మోసపు వినయం తప్ప వేరేమీలేని కుక్కవంటి నాకు నీచే అనుగ్రహింపబడే సమృద్ధియొక్క అనుభవం మంచిది.

101. "ఈవిధంగా అపరాధ భూయస్త్వం మీకు ఉన్నదని అంటున్నారు. వీటికి (అపరాధాలకు) భయపడనక్కరలేనట్లుగా కదా మీరు **"శరణ మహమవ్యామభజమ్"** అని నన్ను శరణు పొందారు. నేను **"సకృదేవ"** ఇత్యాది రీతిలో ఒక్క పర్యాయం. "నీకు నేను దాసుడను. నా కార్యానికి నీవు బాధ్యుడవు" అని అధ్యవసించినవానికి సకల భయాలను తీర్చడంలో దీక్షతను కల్గినవాడనై ఉండగా, ఇక ఏమి కొఱత?"- అని శ్రీరంగనాథుని మనస్సులో భావంగా తలచి, "నీపట్ల ఉపాయాధ్యవసాయం, శేషిత్వజ్ఞానం నాకు కల్గితే మంచిదే ? కాని, అది లేనందువల్లనే స్వరూపోపాయాలలో స్వతంత్రుడనై చెడిపోతున్నాను" అని అంటున్నారు.

సకృత్ప్రపన్నాయ తవాహ మస్మీతి ఆయాచతే చాభయదీక్షమాణమ్ ।
త్వామప్యపాస్యాహ మహం భవామి రంగేశ! విస్రమ్భవివేకరేకాత్ ॥

శ్రీరంగనాథా! ఒకసారి నిన్ను శరణు పొందినవానికి, **"అహం తవ అస్మి ఇతి ఆయాచతే చ"** (దాసుడనైన నేను నీకు శేషభూతుడను కావాలి) అని కోరేవానికి అభయాన్ని అనుగ్రహించడంలో దీక్షను పొందిన నిన్నుకూడా విడచిపెట్టి నమ్మికను, వివేకాన్ని లేనందువల్ల నేను అహంభావాన్ని పొందుతున్నాను.

102. "ఈ విధంగా నాకు అధ్యవసాయజ్ఞానం లేకపోయినా, స్వసంబంధి పర్యంతోజ్జీవనకాములై, పరమధార్మికులైన మన ఆచార్యులచే తమ ప్రపత్తిబలంతో అకించనుడనై, అనన్యగతికుడనైన నేను సర్వశరణ్యుడవైన నీకు భరణీయుడను అయేటట్లు చేయబడ్డాను. దాసుడుకూడా వారి సూక్తి అయిన శరణమనే మాటను అనుసరించినందువల్ల, దానిని ప్రమాణంగా గ్రహించి, ఇపుడు నీవు దాసుని కూడ భరణీయునిగా అంగీకరించాలి"- అని ఇందులో అంటున్నారు.

తవ భరోఽహమకారిషి ధార్మికైః శరణమిత్యవాచ ముదైరిరమ్।
ఇతి ససాక్షికయన్నిద మద్య మాం కురు భరం తవ రంగధురన్ధర!॥

ఓ శ్రీరంగనాథా! నేను ధర్మనిష్ఠులైన ఆచార్యులచే నీకు రక్ష్యవస్తువుగా చేయబడ్డాను. శరణమనే వాక్కును కూడా నోరు తెరచి పలికాను- అనే దీనిని ప్రమాణంగా గ్రహించి ఈనాడు నన్ను నీకు భారంగా (నీచే రక్షింపబడవలసిన వానినిగా) చేయాలి.

103. **"మాం కురు భరం తవ"** అని తాము ప్రార్థించిన తమ రక్షణకు ఆవశ్యకాలైన శ్రీరంగనాథుని దయా-క్షాంతి-ఔదార్యాలు, **"సదేవ"**, **"బహుస్యామ్"**, **"ఐతదాత్మ్యమ్"**, **"యస్యాత్మా శరీరమ్"** అనే ప్రమాణాలచేత తెలియబడిన శరీరత్వంతోను, **"వత్సరో వత్సలో వత్సీ"**, **"అవిజ్ఞాతా హి భక్తానా మాగస్సు"**, **"అవిజ్ఞా సహస్రాంశుః"** ఇత్యాది ప్రమాణసిద్ధమైన అపరాధ- అదర్శనహేతు స్నేహవిశేషరూపవాత్సల్యంతోను, **"ఉదారా స్సర్వ ఏవైతే"**, **"భక్తానాం త్వం ప్రకాశసే"** ఇత్యాదిసిద్ధమైన "తమ సొత్తు అర్థులకోసం"- అని సంకల్పించిన శ్రీరంగనాథుని సంకల్పంతోను కూడినవై, ఆశ్రితుల విషయంలో అతిస్వరస వాహికలు అయినందువల్ల, లౌకికులకు ఉండే దయాదులవలె కాకుండా, అతివిలక్షణాలు- అని వ్యక్తం చేయాలని తలచి, "అనన్యులు అయినందువల్ల దయ లేదు, దోషాదర్శనంవల్ల క్షమ లేదు, ఆశ్రితుల సొత్తు అయినందువల్ల ఔదార్యం లేదు" అని, పుణ్యం

కల్గినవారితో, పాపిష్ఠులతో భేదం లేకుండా, తనలో స్నానం చేసేవారిని స్వర్గాన్ని పొందించే గంగకు కల మాహాత్మ్యాన్ని వర్ణించాలని ప్రయత్నించి, **"కః స్వర్ధుని! వివేకస్తే నయసే పాపినో దివమ్"** అని నిందించేటట్లుగా ఇందులో నిందాస్తుతిని చేస్తున్నారు.

దయాఽన్యేషాం దుఃఖాప్రసహన మనన్యోఽసి సకలైః
దయాళు స్త్వం నాతః ప్రణమదపరాధానవిదుషః ।
క్షమా తే రంగేందో ! భవతి న తరాం నాథ ! న తమాం
తవౌదార్యం యస్మా త్తవ విభవ మర్థిస్వ మమధాః ॥

శ్రీరంగచంద్రా ! దయ అనేది ఇతరులయొక్క దుఃఖాన్ని సహించలేని స్వభావం. నీవు అందంతో వేఱు కానివాడవై ఉన్నావు. అందువల్ల దయను లేనివాడవై ఉన్నావు. భక్తుల అపరాధాలను తెలియకుండా ఉండే నీకు క్షమ (ఓర్పు) ఉండే ప్రసక్తి లేనేలేదు. నీయొక్క సంపదను యాచకులైన భక్తుల సొత్తుగా తలచావు. (అందువల్ల) నీకు ఉదారత్వం ఉండే అవకాశం కొంచెం కూడా లేదు.

104. "ఈ విధంగా దయాదిగుణపూర్తికి, ఈశ్వరత్వానికి నీకు పరమావధి లేనట్లుగానే, గుణహీనతకు, తక్కువదనానికి నాకంటే పరమావధి లేనందువల్ల, ఈ విధినిర్మితమైన మనిద్దరిమధ్య గల అన్వయాన్ని విడచిపెట్టకు. నన్ను నీవు రక్షించి పరిపాలించాలి. లోకంలో దయను కలవాడైన ఈశ్వరునకు గల ఈశ్వరత్వ మనేది దయనీయుని అపేక్షను పూరణం చేయడమే కదా" అని అంటున్నారు.

గుణతుంగతయా తవ రంగపతే! భృశనిమ్న మిమం జన మున్నమయ ।
యదపేక్ష్య మపేక్షితు రస్య హి తత్పరిపూరణ మీశితు రీశ్వరతా ॥

శ్రీరంగనాథా! చాలా పల్లమైన ఈ వ్యక్తిని (నన్ను) నీ యొక్క కల్యాణ గుణాల యొక్క మెఱుక (మిట్ట)తో (ఔన్నత్యంతో) ఉన్నతంగా చేయాలి యాచకుడైన ఈ దాసునకు ఏది కోరదగినదో దానిని నెఱవేర్చడమే కదా! ప్రభువుయొక్క ఈశ్వరత్వం.

శ్రీపరాశరభట్టార్య ప్రోక్తే శ్రీరంగరాట్స్తవే ।
వ్యవృణోత్ శింగరాచార్యో భక్త్యా శతకముత్తరమ్ ॥

శ్లోకానుక్రమణిక

అంగీకృత్య	- 12	గరీయస్త్వాం	- 50
అచిదవిశేషితాన్	- 41	గుణతుంగ	- 104
అతంద్రిత	- 57	చకర్ధ	- 62
అతిక్రామన్	- 91	జగద్భంగురం	- 9
అత్రాస్తే	- 22	జాగ్రత్స్వప్నా	- 40
అథమృదిత	- 86	జ్ఞానక్రియా	- 89
అనుకృత్య	- 100	తవభరోహం	- 102
అనుజను	- 49	తేజఃపరం	- 79
అవయవితయా	- 4	త్వత్సర్వశక్తేః	- 93
అహమిదమ్	- 10	త్వం చేత్	- 95
ఆకంఠవారి	- 71	త్వం మీన	- 105
ఆజ్ఞా తే	- 21	త్వయి సతి	- 90
ఆఘ్రాయ	- 38	దయాన్యేషాం	- 103
ఆత్మాస్య	- 80	దయా పరవ్యసన	- 98
ఆదౌ వేదాః	- 19	దేవీహస్తాంబు	- 56
ఆయుఃప్రజానామ్	- 82	దేహో దేహిని	- 23
ఆస్తాం తే	- 74	దోషోపధావధి	- 27
ఆర్తిమ్	- 83	దైత్యేదార్యేంద్ర	- 67
ఇతిమోహన	- 16	ద్విషాణ	- 65
ఉపాదత్తే	- 87	ధృతినియమన	- 48
ఉన్మాల్య	- 55	నఖాగ్ర	- 66
ఏతద్రామాస్తం	- 11	నసదసదుభయం	- 6
కణచర	- 13	నయనశ్రవణో	- 29
కల్కితనుః	- 73	నిత్యం కామ్యం	- 84
క్షమా సాపరాధే	- 96	నిమ్నోన్నతంచ	- 42
కార్యేనంతే	- 31	నృహరి	- 64
క్రియా తచ్ఛక్తిర్వా	- 20	న్యధాయిషత	- 36
గర్భజన్మ	- 99	పటునైవ	- 88

ప్రత్యంచం	- 85	రంగధే	- 53
ప్రత్యక్షప్రమథన	- 3	వటదళమ్	- 54
ప్రత్యక్షా శ్రుతి	- 5	వేదే	- 14
ప్రతీతిశ్చేత్	- 7	శిక్షాయాం	- 18
ప్రళయసమయ	- 44	శైలోగ్నిశ్చ	- 72
ప్రకుపిత	- 92	శ్రీనయనాభో	- 61
బలిభుజి	- 97	శ్రీమద్వ్యోమ	- 75
బ్రహ్మాద్యాః	- 26	శ్రీరంగేశయ	- 59
భవాన్ రామో	- 68	శ్రీరంగేశ	- 94
భూయోభూయః	- 45	షాడ్గుణ్యాత్	- 39
మనుకుల	- 77	సకృత్ప్రపన్నాయ	- 101
మధుః	- 52	సరాజకం	- 25
మధ్యే విరించి	- 51	సర్గాభ్యాస	- 76
మన్వన్వవాయే	- 78	సహకార్యపేక్ష	- 34
మనుజసమయ	- 69	సంస్కారం	- 17
మర్త్యోత్థాయం	- 35	సంచష్టే	- 15
మీనతనుః	- 60	సార్వజ్ఞేన	- 30
మృగనాభి	- 33	సార్వ త్వత్కం	- 46
యద్ద్యుతే	- 70	స్థిత్యుత్పత్తి	- 24
యంపశ్యన్	- 58	సుహృదివ	- 47
యమాశ్రిత్యైవ	- 37	స్వమహిమ	- 32
యస్యాస్మి	- 81	స్వాధీనే	- 43
యా వేద	- 2	హర్తుం తమః	- 1
యుగపదనిశమ్	- 28	హృది సురరిపోః	- 63
యోగాచారో	- 8		